నలోపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

డా॥ నందూరి రామకృష్ణమాచార్య

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2019

NALOPAKHYANAM
with Commentary

Commentary by
Dr. N. Ramakrishnamacharya

T.T.D. Religious Publications Series No. 1365
© All Rights Reserved

First Print : 2019

Copies : 2000

Published by :
Sri Anil Kumar Singhal, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

D.T.P.
Publications Division
T.T.D., Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **“మహాభారతం”** అయ్యింది.

“యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్”

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు –అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధపరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలువ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **నలోపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి

పీఠిక
వన్నెతరగని స్ఫూర్తి - నలోపాఖ్యానం

"కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ,
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనమ్ కలినాశనమ్".

కర్కోటకుణ్ణి, నలదమయంతుల్ని, ఋతుపర్ణుణ్ణి కీర్తిస్తే కలినాశనం కలుగుతుందని జగత్ప్రసిద్ధి. ఈ నలదమయంతులతోపాటు ఋతుపర్ణుడు, కర్కోటకుడు నలోపాఖ్యానంలో కీలక పాత్రధారులు. నలుడు షట్చక్రవర్తుల్లో ఒకడు, నలునిగానీ, మరొకరినిగానీ కేవలం స్మరించినంత మాత్రంతోనే కలినాశనం కలుగుతుందంటే అది ఆస్తికుల నమ్మకమవుతుంది. మరి ఆ పురాణ పాత్రలు అందించే అద్యతన స్ఫూర్తి ఏమిటి? ఆయా పాత్రల విశిష్టతను, అందించే స్ఫూర్తిని గురించి ముచ్చటించుకునే ముందు స్థూలంగా నలోపాఖ్యాన కథను గమనిద్దాం.

నలుడు నిషధరాజైన వీరసేనుని కుమారుడు. దమయంతి విదర్భరాజైన భీముని కుమార్తె. ఇద్దరు అతిశయరూపలావణ్యాలు గలవారే. ఒకరిగూర్చి మరొకరు విని పరస్పరం అనురాగబద్ధులయ్యారు. నలదమయంతుల సంగమ కారణదూతయైన హంసవలన వారి అనురాగం ప్రేమబంధంగా పరిణమించింది. దమయంతి మనసు తెలిసిన తండ్రి, దమయంతీ స్వయంవరాన్ని ప్రకటిస్తాడు. ఇంద్రాది దిక్పతులు ఆ స్వయంవరానికి వస్తూ దారిలో తారసపడిన నలుణ్ణి చూచి, తాము దమయంతి పట్ల అనురక్తులమని, ఆమె మనసు మాపట్ల లగ్నమయ్యేలా రాయబారం చేయమని నలుణ్ణి ఒప్పించి, దమయంతి వద్దకు పంపారు. నలుడు దీనిని దేవకార్యంగా భావించి నిష్కపటంగా విదర్భకు వెళ్ళి, దిక్పతుల కోరికను దమయంతికి తెలియజేశాడు. దమయంతి నిర్ద్వందంగా దేవతల సమక్షంలోనే నలుని వరిస్తానని తెలియజేస్తుంది. నలుడు చేసేదేమీలేక తిరిగివచ్చి విషయాన్ని దిక్పతులకు వివరిస్తాడు. నలుని నిష్కల్మష హృదయాన్ని దేవతలు మెచ్చుకుంటారు.

స్వయంవర మంటపంలోనికి వరమాలతో ప్రవేశించిన దమయంతికి నలుని రూపంలో పెక్కుమంది నలులు కనిపించారు. నలుని రూపంలోవున్న

ఇంద్రాదుల్ని ప్రార్థించి, నలుణ్ణి గుర్తించి వరిస్తుంది. దమయంతి నిశ్చల ప్రేమకు దేవతలు సంతోషిస్తారు. నలునిపట్ల ఈర్ష్యాళువు అయిన కలి నలదమయంతులకు వియోగం కల్పించేందుకై పుష్కరుడనే రాజును ప్రేరేపించి, నలునిచే జూదమాడించి, రాజ్యభ్రష్టుణ్ణి చేస్తాడు. రాజ్యవిహీనుడైన నలుడు దమయంతితో సహా అడవులకు పోయి, కష్టాల పాలవుతాడు. నిద్రిస్తున్న భార్యను విడిచి నలుడు, అడవిలో కర్కోటకుడిని రక్షించి, అతని కాటుకు బలియై వికృత రూపాన్ని పొందుతాడు. బాహుకుడనే పేరుతో ఋతుపర్ణుని వద్ద పాచకునిగా, అశ్వశిక్షకునిగా అజ్ఞాతంగా కాలాన్ని గడుపుకోసాగాడు. ఒంటరియైన దమయంతి అడవులలో బహుకష్టాలుపడి ఛేదిపురానికి చేరుకొని, రాజమాతను ఆశ్రయించి సైరంధ్రిగా జీవితాన్ని గడుపుతున్న సమయంలో ఆ రాజమాత తన తల్లికి సోదరి అని తెలుసుకొని, తండ్రి పంపిన దూతయైన సుదేవుని ద్వారా విదర్భకు చేరుతుంది. దమయంతి నలుని వెతకటానికి పంపినవారిలో పర్ణాదుడనేవాడు కోసలదేశానికి పోయి అక్కడ దమయంతి చెప్పి పంపిన ప్రశ్నకు సమాధానం చెప్పిన బాహుకుని వృత్తాంతాన్ని తెలుపగా, అతడే నలుడని అనుమానించి ద్వితీయ స్వయంవరపు మిషతో ఋతుపర్ణునికి వార్తను సుదేవుని ద్వారా పంపించింది. వ్యవధి తక్కువగా ఉండటంతో విదర్భకు రథచోదకునిగా రమ్మని ఋతుపర్ణుడు నలుని కోరగా, నలుడంగీకరించి ఒక పూటలో విదర్భకు తీసుకువచ్చాడు. దారిలో ఋతుపర్ణుని వలన పొందిన అక్షవిద్య వలన కలి నలుని వదలి వెళ్ళిపోయాడు. దమయంతి బాహుకుణ్ణి నలునిగా గుర్తించి తన ప్రేమను తెలియజేస్తుంది. నలుడు దమయంతితో కలిసి నిషధకుపోయి పోయిన రాజ్యాన్ని మళ్ళీ పుష్కరునితో జూదమాడి పొందుతాడు. ఇది స్థూలంగా నలదమయంతుల కథ.

నలదమయంతుల కథను వనవాసంలో ఉన్న ధర్మరాజుకు బృహదశ్వుడు వినిపిస్తాడు. అడవులలో మృగాలతో కలసి జీవిస్తూ తమలాగే కష్టాలననుభవించిన వాళ్లు ఉన్నారా? అని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మహర్షి నీకంటే ఎక్కువ కష్టాలననుభవించిన వాళ్లు ఉన్నారని చెప్పటానికి ఈ నలకథను చెపుతాడు. లోకంలో తనలాగే కష్టాలననుభవించిన వాళ్లు

ఉన్నారంటే వాళ్లతో పోల్చుకొని ఊరట చెందటం లోకసహజం. అంతవరకూ తానొక్కడే కష్టచరితుడనని భావించే ధర్మజునకిదొక ఓదార్పు. జాలిగొలిపే నలకథతో పాండవులకథ సంవదించినప్పటికీ, దమయంతి బాధ ద్రౌపది వ్యథను మించింది. అరణ్య అజ్ఞాతవాసాలలో ద్రౌపదికి భర్తలు అండగా ఉన్నారు. దమయంతిని అడవిలో నలుడు విడిచివెళతాడు. దమయంతి వ్యూహరచనే నలదమయంతుల పునఃసమాగమానికి దోహదం చేసింది.

దాంపత్య ధర్మమంటే హక్కుల పోరాటం కాదు. భార్యాభర్తల అన్యోన్యతతో కూడిన హృదయధర్మం. ఒకరి ఆత్మను మరొకరు పెనవేసుకున్న బ్రహ్మముడి. ఒకరి నొకరు తెలిసికొని, కలసిమెలసి సర్దుబాటుతో చేసుకునే సామాజిక బాధ్యత. ఆ బాధ్యతే దాంపత్య ధర్మానికి పునాది. నలోపాఖ్యానం వివరించే ధర్మసూక్ష్మం కూడా అదే.

రామాయణాన్ని సీతాయనమని వాల్మీకి అన్నట్లే నలోపాఖ్యానాన్ని కూడా దమయంత్యుపాఖ్యానమని అనవచ్చు. కథకు కేంద్రకం దమయంతి. కలిపురుషుని అసూయాద్వేషాలకు బలి అయిన నలదమయంతుల పచ్చని కాపురం మళ్లీ ఒక రేవుకు చేరింది దమయంతీదేవి చొరవవల్లనే. ఏ వ్యక్తి ప్రణయంకోసం దేవతల్ని సైతం తిరస్కరించి దమయంతి తహతహలాడిందో, ఆ వ్యక్తే అవమానభారంతో కానలలో ఒంటరిగా వదలివెళ్లిపోతే ఆమెస్థితి ఏమిటి? బేలగా ఆక్రందించి ఆత్మాహుతితో కనుమరుగైపోవటమేనా? దారిఏది? ఇక్కడే దమయంతి జీవితం అందించే సందేశం నేటికాలానికీ ఉపయోగపడుతుంది. విద్యాఉద్యోగరంగాలలో ఎంతో ధైర్యంగా ప్రవేశించే యువతులు అక్కడి సంక్లిష్ట వాతావరణాన్ని ఎదుర్కొనటంలో కాని, ప్రేమ వివాహాలతో జీవితాన్ని పండించుకోవాలని పెండ్లాడి, తద్భిన్నమైన పరిస్థితుల్ని ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు కాని దమయంతి చూపి స్థైర్యం, చాకచక్యం ఈనాటి యువతీ లోకానికి ఉపాస్యమనటంలో అతిశయోక్తి లేదు.

అభిమానధనుడైన భర్త తాను కష్టాలుపడటం చూడలేక వీడివెళ్లాడని, అతని మనసెరిగి అతనికోసమే వ్యూహరచన చేసి భర్తను తిరిగి పొందిన సతీమతల్లి దమయంతి. ఉదయం వివాహమై, మధ్యాహ్నం పొరపొచ్చాలు

ప్రారంభమై సాయంకాలానికి నువ్వెంత? అంటే నువ్వెంత? అనుకొని తెల్లారే విడాకుల కోసం క్యూకట్టే ఆధునికులతో పోలిస్తే దమయంతి భర్తకు ఎన్నిసార్లు విడాకులివ్వాలో ఆలోచించండి? సరియైన ఒక బంధాన్ని కాపాడుకోవడటంలో ఉన్న భద్రత, గొప్పతనం, భవితవ్యం ఆ బంధాన్ని తెంచుకోవటంలో లేదు. అందుకు కావలసింది సహనం, విచక్షణత, వివేకం. ఇది దమయంతి పాత్రలో నిండుగా కనిపిస్తాయి.

ఎంత గొప్ప వాళ్లయినా చేసిన చిన్న తప్పుకు యుగాలు పొగిలిపోవలసి వస్తుంది. నలుడుకూడా కలి ప్రవేశ సందర్భంలో శౌచవిధి పట్ల చూపిన చిన్న ఏమరుపాటువల్ల పచ్చనికాపురం బుగ్గిపాలయింది. జీవితంలో కూడా చేసే చిన్న చిన్న పొరపాట్లే కొంపల్ని ముంచుతాయి. ఆ జాగరూకతను గురించి నలుని పాత్ర తెలియజెపుతుంది. నలుని సత్యసంధత, నిర్మలత, నిజాయితీని గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. తాను ప్రేమించి, ప్రేమించబడిన యువతి యొక్క స్వయంవరం కోసం వెళుతుంటే మధ్యలో తారసపడిన వ్యక్తులు, తమకు ఆయువతితో పరిణయం జరిగేలా రాయబారం నెరపమంటే ఎంతకష్టం? అలా చేసే వ్యక్తులు ఉంటారా? ఉన్నా అంత నిజాయితీగా చేస్తారా? నలుని కోసమే ఏర్పాటు చేసిన దమయంతీ స్వయంవరానికి విచ్చేస్తున్న నలుడిని, దిక్పతులు దమయంతిని వలచామని, తమకోసం రాయబారం చేయమంటే నిష్కల్మష హృదయంతో చేసిన ప్రయత్నం విఫలమైనప్పటికీ దేవతల మన్ననకు పాత్రమైంది. అటువంటి నిజాయితీని చేసే ప్రతిపనిలో మనిషి సముపార్జించుకోవాలి. ఆఖరికి దమయంతీ ద్వితీయ స్వయంవరానికి వెళ్లటానికి ఋతుపర్ణుడు రమ్మన్నప్పుడు కూడా అదే నిష్కల్మష హృదయంతో బయలుదేరి, రథాన్ని అనుకున్న సమయానికి విదర్భకు చేర్చిన నిజాయితీ నలునిది. ఈ నిజాయితీయే నలుని భావికి వరప్రసాది అయింది.

లోకంలో ఎవరైనా చేయకూడని పనిని చేసినప్పుడువాడు కర్కోటకుడంటూ తిరస్కరిస్తాం. నమ్మించి గొంతుకోసే వ్యక్తులు లోకంలో ఎప్పుడూ ఉంటారు. తిన్న ఇంటికి కన్నం వేయటమే కొందరి పని. రక్షించమని అర్థించి రక్షణ పొంది, ఆ వ్యక్తికే అపకారం చేయటమేమిటని కర్కోటకుని విషయంలో

అనుకోవచ్చు. పైకి అపకారంగా కనిపించినప్పటికీ అదే నలునికి పరోక్ష వరమైంది. మారినరూపం నలుడని ఎవరూ గుర్తించటానికి వీలుకాకుండ దోహదం చేసింది. అందుకే శాపాలన్నీ పరోక్షవరాలంటారు. అందువలనే కర్కోటకుడు నలునితోపాటు స్మరణార్హుడైనాడు.

'భార్యాంక్షీణేషు విత్తేషు' – అని అనుభవజ్ఞులంటారు. భార్య గొప్పదనం భర్త పేదరికంతోనే బయటపడుతుంది. భర్త సంపన్నుడని ప్రేమించి పెళ్లి చేసుకొని, ఆ సంపద ఏ కారణంగానో మాయమయితే ఛీ! ఈ దరిద్రునితో కాపురం చేయవలసివచ్చిందని చింతించేవాళ్లు సమాజంలో కొల్లలు! దమయంతి నలుని ఆ దృష్ట్యా చూస్తే ఇంత ప్రయత్నం అవసరం లేదు. ఆదర్శాలెప్పుడూ అంగట్లో రెడీమేడ్‌గా దొరికేవి కావు! అవి ఆచరణతో, ఆత్మనిష్ఠతో, ఓర్పుతో అందుకొనేవి. ద్యూతంలో రాజ్యాన్ని కోల్పోయి, నగరాన్ని వదలి బయట మూడు రాత్రుళ్లు ఉన్నప్పుడు దమయంతి 'తన పుట్టింటికి పోదామ'ని చెపితే, నలుడు చెడి అత్తవారింటికి రానేరనని తిరస్కరిస్తాడు. ఆ సందర్భంలో భార్య గొప్పదనాన్ని గురించి చెపుతూ –

"అధిక దుఃఖ రోగార్తున కౌషధంబు
సురుచిరంబుగ భార్యయ చూవె యెందు
నొనర భార్యాసమేతుడై యున్నవాని
కెంతలయ్యును నాపద లెఱుకపడవు"

"అలసి నెడ, దస్సినెడ, నా
కలిదప్పియు నైన యెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని
మ్ముల భార్యయ పాచుఁజిత్తమున దుఃఖంబుల్" (72,73)

అని భర్తకు అనువ్రతగా, అనుజీవితగా ఉండటమే కాదు భార్యవలన కలిగే లాభం ఏమిటో చెపుతుంది? భార్య విలువ ఎలాంటిదో తెలిసేలా వివరిస్తుంది.

దమయంతి తనతో ఇడుములు పడటం చూడలేకనే నలుడు దమయంతిని వీడివెళ్లాడు. అలా వదలివెళితే తన పుట్టింటికి చేరి సుఖపడుతుందని నలుడి ఆశ. మరి భార్యను వీడి తాను పొందిన సుఖమేదైనా

ఉన్నదా! అంటే మిగిలింది విచారము, పశ్చాత్తాపతప్తమైన మనస్సే. అది కూడ ఒక విధమైన తపస్సే. దమయంతిని ఇటువంటి పశ్చాత్తాప విశుద్ధ భావంతో తిరిగి సంపాదించుకోవటంలోనే నలుని గొప్పతనం కనిపిస్తుంది.

యౌవనోద్రిక్త భావావేశలబ్ధయైన దమయంతి, ఏకాగ్ర వినిర్మల భావనతో ఇప్పుడు అగ్నితప్తయైన కాంచనంలా నలుని చేరుకోవటంతో పూజనీయయైంది.

ఈ కథలో కనిపించే హంస, నలదమయంతుల సంగమ కారణదూత. హంస నలుని వద్దకు రావటంగానీ, దమయంతి వద్దకు వెళ్లటంగానీ వారిని కలపటానికే. హంసదూత్యం వల్లనే వారి కలయిక సాధ్యమయింది. నల, దమయంతుల కలయిక కార్యమైతే హంసదూత్యం కారణం. సృష్టిలో కారణజన్ములు, కర్మజన్ములని రెండు రకాలుగా ప్రాణులు జన్మిస్తారు. ఏదైనా ఒక మహాకార్యం సాధనార్థం జన్మించినవారు కార్యజన్ములు. పూర్వజన్మలలో చేసిన పాపపుణ్యాలను అనుభవించటానికి పుట్టినవారు కర్మజన్ములు. ఈ కథలోని హంస పంచతంత్రాది కథాకావ్యాలలో కనిపించే పక్షుల వంటిది కాదు. ఈ హంస నలదమయంతుల కలయిక కొరకే భూమ్మీదకు దిగివచ్చిన శివస్వరూపం. నలదమయంతుల సంగమం కోసమే దూత అయ్యాడు కాబట్టి కారణదూత అని నన్నయగారు సూచనప్రాయంగా చెప్పారు. నల, దమయంతుల పూర్వజన్మ పుణ్య విశేషంలో శివుడే వారికి హంస రూపంలో దూత్యం నడిపినట్లు శివపురాణంలో కనిపిస్తుంది. ఇలా ఒక మహావ్యక్తికి, ఒక సజ్జనునకు సమస్త ప్రకృతి జీవన సాఫల్యానికి దోహదపడుతుందనటానికి హంస దూత్యమే ఒక ఉదాహరణ.

ఇలా నలోపాఖ్యానాన్ని భావనచేసే కొద్దీ ఎన్నో విషయాలు స్ఫురిస్తాయి. ఈ నలోపాఖ్యానాన్ని చదివి పాఠకులు జీవితాన్ని దిద్దుకోవాలని ఆశిస్తూ....

– ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు
తెలుగు శాఖాధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
అనంతపురం-515 002

నలోపాఖ్యానం

క. 'పుడమియు రాజ్యము బంధుల ।
విడిచి మృగావలులఁ గలసి విపినంబులలోఁ
గడుకొని మా య ట్లిడుమలఁ ।
బడిన నృపులు గలరె యొరులు పరమమునీంద్రా!' 1

ప్రతిపదార్థం: పరమ, ముని+ఇంద్రా= గొప్ప ఋషి శ్రేష్ఠుడా!; పుడమియు= భూమియు (అంటే నివాసభూమిని); రాజ్యము= ఏలుకొంటున్న రాజ్యాన్ని; బంధుల= చుట్టాలను; విడిచి= వదలిపెట్టి; మృగ+ఆవలులన్+కలసి= జంతు సముదాయంతోపాటు; విపినంబు లలోన్= అడవులలో; కడుకొని= పూని; మా+అట్లు= మావలె; ఇడుమలన్+పడిన= ఇక్కట్లపాలైన; నృపులు= రాజులు; ఒరులు= ఇతరులు; కలరె= ఉన్నారా?

తాత్పర్యం: 'నివాసస్థలాన్ని, రాజ్యాన్ని, చుట్టాలను విడిచిపెట్టి మృగాలతోపాటు అరణ్యాలలో మా వలె ఈవిధంగా ఇక్కట్ల పాలైన ఇతరరాజులు ఎవరైనా ఉన్నారా? ఓ పరమఋషిశ్రేష్ఠుడా! దయచేసి తెలుపండి'.

వ. అనిన నయ్యుధిష్ఠిరునకు బృహదశ్వుం డిట్లనియె. 2

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆ+యుధిష్ఠిరునకున్= ఆ ధర్మరాజుకు; బృహదశ్వుండు= బృహదశ్వుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా బదులు పలికాడు.

తాత్పర్యం: అని ప్రశ్నించిన ధర్మరాజుకు బృహదశ్వుడు ఈ విధంగా బదులు పలికాడు.

క. 'దేవసములైన యనుజుల ।
తో విప్రులతో రథాలితో వచ్చి యర
ణ్యావాసము సేసెదు ధర ।
ణీవల్లభ! నీవు ధర్మనిష్ఠితబుద్ధిన్. 3

ప్రతిపదార్థం: ధరణీ, వల్లభ!= (భూభర్తవైన) మహారాజా!; దేవ, సములు+ఐన= దేవతలతో సమానులైన; అనుజులతోన్= తమ్ములతో; విప్రులతోన్= బ్రాహ్మణులతో; రథ+ ఆలితోన్= రథసమూహంతో; వచ్చి= ఏతెంచి; అరణ్య+ఆవాసము= అడవిలో నివసించటం; నీవు; ధర్మ, నిష్ఠిత, బుద్ధిన్= ధర్మంపై లగ్నమైన బుద్ధితో; చేసెదు= చేస్తున్నావు.

తాత్పర్యం: నీవు ఇడుమలు పడుతూ అడవిలో నివసిస్తున్న మాట నిజమే. కాని, నీకు తోడుగా దేవతలతో సమానులైన తమ్ములు ఉన్నారు. నీకు విజ్ఞానబోధ చేస్తున్న విప్రులు నీతో కలిసి జీవిస్తున్నారు. నీకు రథాలు ఉన్నాయి. పరివారవర్గం ఉన్నది. ఈ విధంగా నీవు అరణ్యనివాసం చేయటం ధర్మలగ్నమైన నీమనస్సును తెలుపుతున్నది.

విశేషం: మహర్షి అయిన బృహదశ్వుడి దృష్టి వేరు. యుధిష్ఠిరుడి దృష్టి వేరు. అడవిలో ఇడుమలు పడుతున్న పాండవులకు లేనివి రాజ్యసుఖాలు మాత్రమే. విజ్ఞాననిధులైన విప్రుల సాహచర్యం ఈ అడవిని ఒక విశ్వవిద్యాలయంగా మార్చిందని బృహదశ్వుడికి తెలుసు. అంతఃపురాలలో, రాజసభలలో హంసతూలికాతల్పాలపై సుఖించే రాజులు మహర్షులదృష్టిలో బంగారు పంజరాలలోని పక్షులు. ఆపదలే శీలానికి వన్నెగూర్చే సదవకాశాలు. అగ్నిలో పడి బంగారం వన్నె హెచ్చి వెలుగొందుతుంది. మట్టి అయితే మాడిపోతుంది. మహనీయులు కష్టాలను అనుభవించటంచేతనే చిరస్మరణీయమైన మహిమను ఆర్జిస్తారు. సానబట్టితేగాని వజ్రం శోభించదు. పాండవులు రాజ్యాన్ని కోలుపోయి అడవులలో ఇడుమలుపడి ఆధ్యాత్మిక విశ్వకళా పరిషత్తులో పట్టభద్రులయ్యారు. అందుచేత మహానుభావుడైన బృహదశ్వుడు అడవిలో ఉండే ధర్మరాజును అభినందించాడే కాని ఓదార్పుమాటలతో జాలి చూపలేదు. పాండవులకంటెకూడ ఎక్కువ బాధలు పడినట్టివారు లేకపోలే దని నలోపాఖ్యానాన్ని చెప్పాడు.

క. నరనుతుఁడు దొల్లి నలుఁ డను।
ధరణీశుఁడు జూద మాడి తన విభవము పు
ష్కరుచేత నోటువడి యొ।
క్కరుఁడ కరం బిడుమఁ బడఁడె కాననసీమన్. 4

ప్రతిపదార్థం: తొల్లి= పూర్వకాలంలో; నర, నుతుఁడు= ప్రజలచేత ప్రస్తుతించబడిన వాడు; నలుఁడు+అను= నలుడనే; ధరణీ+ఈశుఁడు= రాజు (భూమికి పాలకుడు); జూదము+ఆడి; తన, విభవము= తన సంపద; పుష్కరు, చేతన్= పుష్కరుడనే రాజుచేత; ఓటువడి= ఓడిపోయి; ఒక్కరుఁడు+అ= ఒంటరిగా; కానన, సీమన్= అడవిప్రాంతంలో; కరంబు= మిక్కిలి; ఇడుమన్+పడఁడు+ఎ= కష్టాలుఅనుభవించలేదా!

తాత్పర్యం: పూర్వకాలంలో నలుడనే మహారాజు, ప్రజానురంజకుడై రాజ్యాన్ని ఏలినవాడు జూదమాడి పుష్కరుడిచేత తన సంపదనంతా ఓడిపోయి ఒంటరిగా అడవులలో తిరిగి మిక్కిలి కష్టాలను అనుభవించలేదా!'

విశేషం: ఆరణ్యపర్వం మహాభారతంలోని పదునెనిమిది పర్వాలలోని పెద్దపర్వాలలో ఒకటి. ఇందులోని కథ పెద్దది కాదు. ఆరణ్యపర్వం పెరగటానికి కారణం అందులోని పెక్కు ఉపాఖ్యానాలు. ఎందరో ఋషులు పాండవులను చూడటానికి అరణ్యానికి వచ్చేవారు. వారిని ధర్మరాజు ప్రశ్నించేవాడు. వారు తమకు తోచిన ఉపాఖ్యానాలు చెపుతూ ఉండేవారు. అందుచేత ఆరణ్యపర్వం బృహత్ గ్రంథమైనది. మహాభారతంలోని ఉపాఖ్యానాలన్నింటిలో నలోపాఖ్యానం పెద్దది. సంస్కృత భారతంలో ఎన్నో ఉపాఖ్యానాలు చోటుచేసికొన్నాయి. అవి అన్నీ ప్రాచీనాలే అయినా. కొన్ని ప్రాచీనతరాలు, మరికొన్ని ప్రాచీనతమాలు- అని విద్వాంసుల అభిప్రాయం. అందులో నలోపాఖ్యానం మిక్కిలి ప్రాచీనతమమైనదని కొందరు పరిశోధకుల అభిప్రాయం. పాశ్చాత్యుల దృష్టిలో విషాదాత్మక కృతులకు విలువ అధికం. భారతీయ వాఙ్మయంలో విషాదవృత్తాలైన రచనలు లేవని కొందరు అధిక్షేపించటం కద్దు. విషాదాత్మక రచనలవలన

సహృదయులకు భావిత అంతఃకరణ ప్రవృత్తి ఏర్పడి వారి హృదయాలు రసక్షాళితాలు అవుతాయని పాశ్చాత్య ఆలంకారికుల అభిప్రాయం. నలోపాఖ్యానం విషాదాంతగాథ కాదు కాని, విషాదాత్మక కృతి అని చెప్పవచ్చును. భావితాంతఃకరణ ప్రవృత్తి, సద్యఃపర నిర్వృతి కావ్యానికి అంతరాత్మ అయితే నలోపాఖ్యానం ప్రపంచ వాఙ్మయంలో 'నిరుపమానమైన రసవత్కావ్యం' - 'సాటిలేని విషాదాత్మక కృతి'- అని చెప్పవచ్చును. మిక్కిలి పురాతనకాలంలో మహాభారతం 'జయం' రచించబడటానికి చాలాకాలం పూర్వమే నలచక్రవర్తిగాథ భారతదేశంలో యుగ యుగాంతరాలలో బహుళవ్యాప్తిని పొందినట్లు, తదుపరి ప్రాచీనతమమైన ఇతిహాసం మహాభారతంలో లీనమైనట్లు ఊహించటం సత్యదూరం అనలేం. ఇంకొక విశేషం: భారతంలోని ధర్మరాజుకు నలోపాఖ్యానంలోని కథానాయకుడైన నలుడికి గల సామాన్యవ్యసనం జూదం. ఇక, బృహదశ్వుడు ప్రస్ఫుటంగా వచించినట్లు ధర్మరాజుకంటె కూడ విషాదాత్మక నాయకుడుగా నలుడు నిర్వహించిన భూమిక ఎక్కువ హృదయవిదారకమైనది. అందుచేత నలోపాఖ్యానం చదివిన వారికి దుఃఖభూయిష్ఠమైన కలియుగబాధనుంచి నిష్కృతి లభిస్తుందన్న పెద్దల ప్రవచనంలో అంతరార్థం ఉన్నదని అంగీకరించవచ్చును.

ధర్మరాజునకు బృహదశ్వుండు నలోపాఖ్యానంబు సెప్పుట (సం. 3-50-1)

వ. అనిన 'నది యె?' ట్లని ధర్మనందనుం డడిగిన బృహదశ్వుం డిట్లనియె; నిషధేశ్వరుండయిన వీరసేనుని కొడుకు నలుం డనువాఁ డనేకాక్షౌహిణీపతి యనవరతాక్షప్రియుం డజేయంబైన తన తేజంబున నెల్లరాజుల జయించి బ్రహ్మణ్యుండయి బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజాపాలనంబు సేయుచుండ. 5

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; అది+ఎట్లు+అని= అది ఏవిధంగా జరిగిందని; ధర్మనందనుండు+అడిగిన= ధర్మరాజు ప్రశ్నించగా; బృహదశ్వుండు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు; నిషధ+ఈశ్వరుండు+అయిన= నిషధదేశానికి పరిపాలకుడయిన; వీరసేనుని, కొడుకు= వీరసేన మహారాజుయొక్క పుత్రుడు; నలుండు+అనువాఁడు= నలుడనే పేరుకలవాడు;

అనేక+అక్షౌహిణీ, పతి= పెక్కు అక్షౌహిణులకు అధినేత; అనవరత+అక్ష, ప్రియుండు= ఎల్లప్పుడును పాచికలపై ప్రీతికలవాడు, అంటే జూదమాడటంలో మిక్కిలి అనురక్తి కలవాడు; అజేయుంబు+ఐన= జయించటానికి వీలులేని; తన తేజంబునన్= తన పరాక్రమంచేత; ఎల్ల, రాజులన్= అందరు రాజులను; జయించి= గెలిచి; బ్రహ్మణ్యుండు+అయి= బ్రాహ్మణులకు హితం ఆచరించేవాడై; బ్రహ్మ+ఉత్తరంబుగాన్= బ్రాహ్మణులకు ఆధిక్యం పొసగేటట్లుగా; ప్రజా, పాలనంబు= ప్రజలను పాలించటం; చేయుచు+ఉండన్= చేస్తుండగా.

తాత్పర్యం: తొల్లి నలుడు అడవులలో ఇడుమలు పడినాడని బృహదశ్వుడు చెప్పగా, అదెట్లా? అని ధర్మరాజు ప్రశ్నించగా బృహదశ్వుడు ఇట్లా చెప్పాడు: నిషధేశ్వరుడైన వీరసేనుడి కొడుకు నలుడు. అతడు మహాతేజస్వి. ఎన్నో అక్షౌహిణులసేనలకు అధినేత. కాని, అతడు జూదంలో మిక్కిలి ప్రీతికలవాడు. అతడు తన పరాక్రమంచేత రాజులందరిని జయించి సార్వభౌముడై ప్రజానురంజకుడై రాజ్యపరిపాలన చేస్తున్నాడు. అతడు బ్రాహ్మణులకు సంప్రీతి ఘటించే పరిపాలన కొనసాగించాడు.

విశేషం: (1) అక్షౌహిణి= సేనాసమూహం. 21870 రథాలు, అన్నే ఏనుగులు, 65610 గుఱ్ఱాలు, 109350 కాల్బలంగల సేనకు అక్షౌహిణి అని పేరు. (2) 'బ్రహ్మోత్తరంబుగా'- అనే పదానికి అర్థం చెప్పటంలో విద్వాంసులలో బహుళ చర్చ జరిగింది. ధృతరాష్ట్రపరంగా నన్నయభట్టు ఈమాటను ఇంకొకచోట ప్రయోగించాడు. ఆర్యసంఘం- బ్రహ్మక్షత్రియ వైశ్య శూద్ర సంఘటితం. బ్రహ్మోత్తరంగా పరిపాలించటం అంటే బ్రాహ్మణులకు ప్రాధాన్య మిచ్చి పరిపాలించటం, బ్రాహ్మణులకు ఆధిక్యం ఇవ్వటం అనే అర్థం సందర్భశుద్ధితో అన్వయిస్తుంది. ఇచట 'బ్రహ్మణ్యుండయి' అనే ప్రయోగంకూడ పై అర్థానికి బలం చేకూర్చేదే. ఆదిపర్వంలో నన్నయభట్టు ధృతరాష్ట్రుడు 'బ్రహ్మోత్తరంబుగాఁ బ్రజావృద్ధియు, సస్యవృద్ధియు నగుచుండ' (ఆది. 5.5.) రాజ్యం చేసినట్లు వ్రాశాడు.

సీ. అట విదర్భాధిపుఁడైన భీముం డను ।
వాఁ డనపత్యుఁడై వ్రతము లోలి
సలుపుచు దమనుఁ డ న్సన్మునిఁ బత్నియుఁ ।
దాను నుపాసించి, తద్వరమున
దమయంతి యను కూఁతు దమ దాంత దమను ల ।
న్సుతులను బడసె విశ్రుతగుణాఢ్యుఁ;
డందుఁ గన్యారత్న మగు దమయంతి దా ।
నత్యంతకాంతి రూపాభిజాత్య

ఆ. విమల గుణ సమృద్ధి వెలుఁగుచు సురసిద్ధ ।
సాధ్య కన్యలట్టి సఖులు నూర్వు
రొలసి తన్నుఁ గొలుచుచుండఁగ మహి నొప్పు ।
చుండె నధికవిభవ యుక్తితోడ. **6**

ప్రతిపదార్థం: అట= వేరొకదేశంలో; విదర్భ+అధిపుఁడు+ఐన= విదర్భ దేశానికి రాజైన; భీముండు+అనువాఁడు= భీముడనే వాడు; న+అపత్యుఁడు+ఐ= అపత్యం-అంటే సంతానం లేనివాడై; వ్రతములు= నోములు; ఓలి= వరుసగా; సలుపుచున్= చేస్తూ; దమనుఁడు+అన్, సత్+మునిన్= దమనుడు అనే పేరుగల మంచి ఋషిని; పత్నియున్, తానున్= భార్యయు, తానున్నూ; ఉపాసించి= ఆరాధించి; తద్+వరమునన్= ఆతడు అనుగ్రహించిన వరంచేత; దమయంతి, అను, కూఁతున్= దమయంతి అనే పుత్రికను; దమ, దాంత, దమనులు+అన్, సుతులను= దముడు, దాంతుడు, దమనుడు అనే కొడుకులను; విశ్రుత, గుణ+ఆఢ్యుఁడు= పేరుకెక్కిన మంచి గుణాలతో కూడినట్టివాడు, అంటే భీముడు; పడసెన్= పొందాడు; అందున్= ఆ సంతానంలో; కన్యారత్నము+అగు= పడచులలో మిన్నఅయిన, (కన్యలలో రత్నమైన); దమయంతి; తాన్+అత్యంత, కాంతి, రూప+ఆభిజాత్య, విమల,

గుణ సమృద్ధిన్= తాను మిక్కుటమైన లావణ్యంతో, శరీర సౌష్ఠవంతో, మంచి వంశంలో జన్మించిన గౌరవంతో, నిర్మలమైన మంచి గుణాల పొందికతో; వెలుఁగుచున్= ప్రకాశిస్తూ; సుర, సిద్ధ, సాధ్య, కన్యలు+అట్టి= దేవతలలోని, సిద్ధులలోని, సాధ్యులలోని ఆడపడుచులను పోలినట్టి; సఖులు= చెలికత్తెలు; నూర్వురు= వందమంది; ఒలసి= కలిసి; తన్నున్= తనను; కొలుచుచుండఁగ= సేవిస్తుండగా; అధిక, విభవ, యుక్తితోడన్= గొప్పవైభవంతో; మహిన్= భూమిపై; ఒప్పుచు+ఉండెన్= విలసిల్లుతున్నది.

తాత్పర్యం: అక్కడ విదర్భలో రాజైన భీముడు సంతానహీనుడు. అతడు, అతనిభార్య దమనుడనే గొప్పఋషిని ఆరాధించారు. వారికి దమయంతి అనే కూతురు, దముడు, దాంతుడు, దమనుడు అనే ముగ్గురు కొడుకులు పుట్టారు. కన్యకామణి అయిన దమయంతి, విశేషరూపలావణ్యవతి అయి, సద్వంశంలో పుట్టిన గౌరవం ఒప్పగా, సద్గుణాలతో విరాజిల్లుతూ ఉన్నది. నూరుగురు చెలికత్తెలు, సురసిద్ధసాధ్య కన్యకలతో సాటివచ్చేవారు ఆమెను సేవిస్తూ ఉన్నారు. దమయంతి అత్యధికవైభవంతో తులతూగుతున్నది.

విశేషం: సురలు, సిద్ధులు, సాధ్యులు దేవతలలోని అంతర్వర్గాలకు చెందినవారు.

వ. అంత. **7**

తాత్పర్యం: అట్లా కొంతకాలం జరిగిన తరువాత.

క. నలుగుణములు దమయంతికి ।
నలునకు దమయంతి గుణగణంబులు జనులి
మ్ములఁ బొగడుట నిరువురకును ।
వెలసె మనోభవ వికార విభ్రమ మెదలన్. **8**

ప్రతిపదార్థం: నలు, గుణములు= నలుడిలోని మంచి లక్షణాలు; దమయంతికి; దమయంతి, గుణ, గణంబులు= దమయంతిలోని

మంచిగుణాల సముదాయాలు; నలునకు; జనులు= ప్రజలు; ఇమ్ములన్= ప్రీతితో; పొగడుటన్= ప్రశంసించటం చేత; ఇరువురకును= ఇద్దరికిని, అంటే నలదమయంతులు ఇద్దరికిని; ఎదలన్= హృదయాలలో; మనస్+భవ, వికార, విభ్రమము= మన్మథుడికి చెందిన మారుపాటువలన ఏర్పడిన వేగిరపాటు, అంటే శృంగార భావోదయం; వెలసెన్= విలసిల్లింది.

తాత్పర్యం: నలుడి సద్గుణాలను దమయంతికి, దమయంతి గుణగణాలను నలుడికి ప్రజలు అభివర్ణించి, ప్రశంసించి, చెప్పటంచేత ఇరువురిలో శృంగారభావాలు వెల్లివిరిశాయి.

వ. ఒక్కనాఁడు నలుఁడు దమయంతీ గుణబద్ధ చేతస్కుండై మదనానలంబు సహింప నోపక ప్రమదవనంబున నుండునంత నంతరిక్షకాంతాహారావళి యుంబోలె హంసావళి యవనీతలంబున కవతరించిన. 9

ప్రతిపదార్థం: ఒక్కనాఁడు= ఒకానొకరోజున; నలుఁడు; దమయంతీ, గుణ, బద్ధ, చేతస్కుండు+ఐ= దమయంతియొక్క మంచిగుణాలచేత కట్టి వేయబడిన మనస్సు కలవాడై; మదన+అనలంబు= మన్మథుడియొక్క(అగ్నిని) తాపాన్ని; సహింపన్+ఓపక= తాళలేక; ప్రమదవనంబునన్= ఉద్యానవనంలో; ఉండు+అంతన్= ఉన్నప్పుడు; అంతరిక్ష, కాంతా, హార+ఆవళియున్+పోలె= ఆకాశమనే వనితయొక్క (కంఠంలోని) దండలను పోలుతూ; హంస+ఆవళి= అంచలగుంపు; అవనీ, తలంబునకు= నేలపైకి; అవతరించినన్= దిగగా.

తాత్పర్యం: ఒకానొకనాడు, దమయంతియొక్క మంచిగుణాలచేత ఆకర్షించబడిన మనస్సు కలవాడై నలుడు మదనతాపం తాళలేక ఉద్యానవనంలో విహరిస్తూఉన్నాడు. అప్పుడు ఆకాశమనే సుందరియొక్క మెడలోని దండలను పోలిన హంసలగుంపు భూమిమీద వ్రాలింది.

విశేషం: అలం: ఉపమ. అంచలగుంపు ఆకాశమనే సుందరికి కంఠహారాలుగా భాసిల్లినాయనటం హృదయంగమమైన ఉపమాలంకారం.

ఆ. వీరసేనసుతుఁడు వీరుండు హంసల।
నడ బెడంగుఁ జూచి నగుచు వాని
నెగిచి యెగిచి యందు నెగయకుండఁగ నొక్క।
హంసఁ బట్టుకొనియె నతిరయమున. 10

ప్రతిపదార్థం: వీరసేన, సుతుఁడు= వీరసేనుడి కొడుకు- నలుడు; వీరుండు= పరాక్రమం కలవాడు; హంసల, నడ, వెడంగున్+చూచి= అంచలనడల సొగసు చూచి; నగుచున్= నవ్వుతూ; వానిన్= ఆ హంసలను; ఎగిచి+ఎగిచి= వెంబడించి వెంబడించి; అందున్= వాటిలో; ఒక్క హంసన్= ఒక అంచను; ఎగయకుండఁగన్= ఎగిరిపోకుండా; (ఎగయక+ ఉండన్= ఎగిరిపోకుండా ఉండగా అనికూడా చెప్పవచ్చు;) అతిరయమునన్= మిక్కిలి వేగంగా; పట్టుకొనియెన్= పట్టుకొన్నాడు.

తాత్పర్యం: వీరసేనుడి పుత్రుడు, పరాక్రమవంతుడు ఐన నలుడు ఆ హంసల నడకల సొగసు చూచి మురిసిపోయి లోలోపల నవ్వుకొంటూ, తాను వాటిని తరిమి తరిమి, అందులో ఒక హంసను ఎగిరిపోకుండా (ఒక హంస ఎగిరిపోకుండా ఉండగా) మిగులవేగంగా పట్టుకొనగలిగాడు.

విశేషం: నలుడు ఒక హంసను పట్టుకొన్నాడు. ఎట్లా పట్టుకొన్నాడు? 'ఎగయకుండఁగ' - అంటే 'ఎగురకుండ' - అని సమాధానం. అంటే ఇక్కడి ధాతువు 'ఎగయు' - అన్నమాట. అంటే పైకి పోకుండగా నలుడు హంసను పట్టుకొన్నాడు. ఇక, ముందు ప్రయోగించబడిన 'ఎగిచి' - అనేది 'ఎగుచు' ధాతువు నుండి ఏర్పడింది. 'ఎగుచు' అనేది 'ఏగు' ధాతువు యొక్క ప్రేరణార్థకం. కనుక 'ఎగయు' 'ఎగుచు' - వేరు వేరు ధాతువులు. నలుడు హంసలను వేగంగా వెంబడించాడు (ఎగిచాడు). అలా వెంట తరమటంలో ఒక హంసను

ఎగిరిపోకుండ శీఘ్రంగా పట్టుకోగలిగాడు. నలుడు హంసలను తరుముతూ ఎగురగొడుతూ ఉన్నా ఆ అంచలగుంపులోని ఒక హంస ఎగిరిపోకుండా ఉండగా నలుడు దానిని ఒడుపుగా వేగంగా పట్టుకొన్నాడని కొందరు వ్యాఖ్యాతలు చెప్పారు. ఆ హంస మిగిలిన హంసలతో పాటు ఎగిరిపోకుండా కొంత జాగు చేయటానికి కథలో ఒక పరమార్థం ఉంది. శివుడే ఆ రూపంలో వచ్చి నలదమయంతులకు వివాహం చేసే యత్నం చేశాడని, కాబట్టి ఆ హంస కారణజన్మురాలని కవిసమ్రాట్ విశ్వనాథసత్యనారాయణగారు వివరించారు. వివరాలకు చూడండి పీఠిక. (సంపా.) ఈ పద్యంలోని మూడవపాదంలో కొన్ని ప్రతుల్లో "నెగచి యెగచి" - అనే పాఠభేదం కనిపిస్తున్నది.

ఆ. దాని విడిచి పోవఁగా నోప కఱచుచు।
నంతరిక్షమునను హంసలెల్లఁ
బిండుగట్టి తిరుగుచుండె వాతోద్ధూత।
శారదాభ్ర శకల చయముఁ బోలె. 11

ప్రతిపదార్థం: దానిన్= ఆ హంసను; విడిచిపోవగాన్+ఓపక= వీడి వెళ్ళిపోలేక; అఱచుచున్= అరుస్తూ; అంతరిక్షమునను= ఆకాశంలో; హంసలు+ఎల్లన్= హంసలన్నీ; పిండుకట్టి= గుమిగూడి; వాత+ఉద్ధూత, శారద+అభ్ర, శకల, చయమున్, పోలెన్= గాలిచేత చెదరగొట్టబడిన శరత్కాలంలోని మేఘాల ముక్కల సముదాయంవలె; తిరుగుచు+ఉండెన్= పరిభ్రమిస్తూ ఉన్నాయి.

తాత్పర్యం: నలుడికి చిక్కిన అంచ(హంస)ను విడిచిపెట్టి వెళ్లిపోజాలక తక్కిన హంసలు అరుస్తూ ఆకాశంలో తిరుగాడజొచ్చాయి. అప్పుడు ఆ హంసలు, గాలిచేత చెదరగొట్టబడిన శరత్కాలంలోని మబ్బుల తునకలసమూహంవలె ఉన్నాయి.

విశేషం: హంసలు తెలుపు. శరదృతువులో మేఘాలు తెల్లగా ఉంటాయి. నేలపై వ్రాలటానికి ముందు హంసలు ఆకాశసుందరి కంఠంలోని వజ్రహారాలవలె

ఉన్నాయి. ఇప్పుడు అవి చెదరి ఆకాశంలో తిరుగాడుతున్నాయి. శరత్కాలంలో గాలికి చెదరిన మబ్బు తునకలవలె ఉన్నాయి. రెండు ఉపమానాలున్నూ మనోహరమైనవే. అలంకారం: ఉపమ.

వ. అదియును దన కమ్మనుజేశ్వరుఁ డపాయంబు సేయుంగా వగచి మనుష్య వాక్యంబుల నిట్లనియె: 'నయ్యా! యేను నీకుం బ్రియంబు సేసెద; నీ హృదయేశ్వరియైన దమయంతి పాలికిం బోయి నీ గుణంబులు దానికి వర్ణించి యక్కన్య యన్యుల నపేక్షింపక నీయంద బద్ధానురాగ యగునట్లుగాఁ జేసెద.' 12

ప్రతిపదార్థం: అదియును= ఆ హంసయున్నూ; తనకు; ఆ+మనుజ+ ఈశ్వరుఁడు= మనుజులకు పరిపాలకుడైన ఆ రాజు; అపాయంబు= కీడు; చేయుంగా, వగచి= చేస్తాడని తలచి; మనుష్య, వాక్యంబులన్= మనుజులు మాట్లాడే భాషలో; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా పలికింది; అయ్యా!= ఓ మహానుభావా!; ఏను= నేను; నీకున్+ప్రియంబు+చేసెదన్= నేను నీకు ఇష్టమైన మేలు చేస్తాను; నీ, హృదయ+ ఈశ్వరి+ఐన= నీ హృదయానికి ఈశ్వరి అయిన, అంటే నీవు ప్రేమించిన; దమయంతి, పాలికిన్+పోయి= దమయంతి కడకు వెళ్ళి; నీ, గుణంబులు= నీలోని మంచిలక్షణాలు; దానికిన్= ఆమెకు (ఆ దమయంతికి); వర్ణించి= ఉగ్గడించి; ఆ+కన్య= ఆ అమ్మాయి; అన్యులన్= ఇతరులను; అపేక్షింపక= కోరుకొనక; నీ యందు+అ= నీ పైననే; బద్ధ+ అనురాగ= బంధించబడిన అనురాగం కలది, అంటే నిన్ను వలచినట్టిది; అగునట్లుగాన్; చేసెదన్= చేయగలను.

తాత్పర్యం: ఆ హంస తనకు ఆ రాజు కీడు చేస్తాడని శంకించి, మనుజసంభాషణలతో ఇట్లా పలికింది. 'మహానుభావా! నేను నీకు ప్రియమైన ఉపకారం చేస్తాను. నీ హృదయేశ్వరి అయిన దమయంతి దగ్గరకు వెళ్ళి, ఆమెకు నీ మహనీయ గుణగణాలు ఉగ్గడించి చెప్పి, ఆ కన్యకామణి నీమీదే వలపు నిలిపేటట్లు చేస్తాను'.

క. అనిన విని హంస పలుకులు ।
దన హృదయంబునకు నమృతధారాపాతం
బునుబోలె నైన నృపనం ।
దనుఁ డనురక్తుఁ డయి విడిచెఁ దడయక దానిన్. 13

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; హంస, పలుకులు= అంచమాటలు; తన, హృదయంబునకున్= తన ఎదకు; అమృత, ధారా, పాతంబును, పోలెన్+ఐన= ఎడతెగకుండ అమృతపువాన కురిసినట్లుకాగా; నృప, నందనుఁడు= రాజకుమారుడు (నలుడు); అనురక్తుఁడు+అయి= ప్రేమ కలవాడయి; తడయక= వెనువెంటనే (ఆలస్యంచేయక); దానిన్= ఆ హంసను; విడిచెన్= విడిచిపెట్టాడు.

తాత్పర్యం: ఆ హంస చెప్పినమాటలు నలుడి హృదయానికి కుంభవృష్టిగా అమృతం కురిసినట్లు అనిపించింది. అందుచేత ఆ రాజపుత్రుడుఅనురాగంతో ఆ హంసను వెనువెంటనే విడిచిపెట్టాడు.

వ. అంచపిండుతో నదియును విదర్భనగరంబునకుం బఱచి, యం దుపవనంబున సఖీజనపరివృతయై యున్న దమయంతి యంతికంబునకు వచ్చి విహరించుచుండె; నంత వానిం జూచి పరమకౌతుకమ్మున. 14

ప్రతిపదార్థం: అంచ, పిండుతోన్= హంసలగుంపుతో; అదియును= ఆ హంసకూడా; విదర్భ, నగరంబునకున్+పఱచి= విదర్భ పట్టణానికి పారి, అంటే ఆకాశమార్గంలో ఎగిరివెళ్ళి; అందు+ఉపవనంబున= అక్కడి ఉద్యానవనంలో; సఖీ, జన, పరివృత+ఐ= చెలికత్తెలతో చుట్టుకొనబడిందై; ఉన్న= ఉన్నట్టి; దమయంతి+అంతికంబునకు, వచ్చి= దమయంతి సమీపానికి చేరి; విహరించుచు+ఉండెన్= తిరుగాడుతూ ఉండింది; అంత= అటుపిమ్మట; వానిన్+చూచి= ఆ హంసలను చూచి; పరమకౌతుకమ్మునన్= మిక్కుటమైన సంతోషంతో.

తాత్పర్యం: అంచపిండుతో కలిసి ఆ హంసకూడా విదర్భ రాజధానికి ఎగిరివెళ్ళి, అక్కడ ఉద్యానవనంలో చెలికత్తెలతో కలిసి విహరిస్తున్న దమయంతి సమీపానికి వచ్చి నడయాడుతూ ఉన్నది. దమయంతి ఆ హంసలను చూచి మిక్కుటమైన సంతోషాన్ని పొందింది.

తే. ఒండొరులఁ గడవంగ నయ్యువిద లెల్లఁ ।
బఱచి యొక్కొక్క కలహంసఁబట్టికొనఁగఁ
జెలువముగ నందు దమయంతిచేతఁ బట్టు ।
వడియె నలుచేత విడువంగఁబడిన హంస. 15

ప్రతిపదార్థం: ఆ+ఉవిదలు+ఎల్లన్= ఆ అంగనలందరు; ఒండొరులన్+ కడవంగన్= ఒకొరినొకరు మీరి; పఱచి= పరుగెత్తి; ఒక్కొక్క= ఒకరు ఒక; కలహంసన్= రాజహంసను; పట్టి కొనఁగన్= పట్టుకోగా; అందున్= ఆ హంసలలో; నలుచేత= నలుడిచేత; విడువంగన్+పడిన హంస= వదలి పెట్టబడిన అంచ; దమయంతిచేతన్; చెలువముగన్= అందంగా; పట్టు+పడియెన్= పట్టువడింది.

తాత్పర్యం: ఆ వనితలందరు ఒకరినొకరు మీరి, పరుగెత్తి ఒక్కొక్కరు ఒక్కొక్క రాజహంసను పట్టుకొన్నారు. అందులో మున్ను నలుడిచేత విడువబడిన హంస దమయంతిచేతనే అందంగా పట్టువడింది.

క. దమయంతికి నలునకు సం ।
గమకారణ దూతయైన కలహంస మనో
జ్ఞమనుష్య వాక్యముల న ।
ద్దమయంతికి హర్ష మెసఁగఁ దా ని ట్లనియెన్. 16

ప్రతిపదార్థం: దమయంతికి; నలునకున్; సంగమ, కారణ, దూత+ఐన= సంయోగానికి (కలయికకు విధిచే నిర్ణయించబడిన దూత అయిన; (దూత= ఉభయపక్షాలకు సంధి చేయటానికి నియుక్తుడైనవాడు); కలహంస= ఉత్తమ

జాతిహంస (రాజహంస); మనోజ్ఞ, మనుష్య, వాక్యములన్= సుందరమైన మనుజ భాషలో; ఆ+దమయంతికి; హర్షము+ఎసఁగన్= సంతోషం అతిశయించగా; తాన్= ఆ హంస; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: దమయంతికి నలుడికి సంయోగం సమకూర్చటానికై విధిచే నిర్ణయించ బడిన దూత అయిన ఆ రాజహంస మనోహరమైన మనుజభాషలో దమయంతికి సంతోషం అతిశయించేటట్లు ఈ విధంగా పలికింది.

విశేషం: ఈ పద్యంలో 'కారణదూత' అనే ప్రయోగానికి విద్వాంసులు విశేషార్థాన్ని వివరిస్తున్నారు. ఈ ప్రయోగం హంసకు విశేషణంగా వాడబడింది. 'సంగమకారణదూత'- సంయోగానికి కారణమైన దూత అని స్థూలంగా అర్థం చెప్పవచ్చు. అసలు- నలదమయంతులు విధాతచేత ఒకరికొకరు సృష్టించబడిన వారు. అందు 'హంస' నిర్వహించవలసిన భూమిక విధి నిర్ణీతం. 'ఆ హంస నలదమయంతుల సమాగమం కూర్చటంకోసమే జన్మించింది'- అనే అర్థస్ఫూర్తి 'కారణదూత' ప్రయోగంలో కలదని పండితోత్తముల అభిప్రాయం. "కారణజన్ముఁడై కవినికాయము మెచ్చఁగఁ గావ్యకర్తయై''- అనే ప్రయోగం ఇచట స్మరించతగింది. కవినికాయం మెచ్చేటట్లు కావ్యకర్త అవటానికే రచయిత జన్మించాడని ఇందులోని అంతరార్థం. నలుడిచేత విడువబడిన హంసయే దమయంతి చేతికి పట్టువడటం ఇందులోని స్వారస్యం.

వ. 'నీ హృదయేశ్వరుండైన నలునొద్దనుండి వచ్చితి; నపార పారావార పర్యం తానంత మహీతలంబునందు నా చూడని రాజు లెవ్వరు లేరు; సర్వగుణ సౌందర్యంబుల నెవ్వరు నలుం బోలరు. 17

ప్రతిపదార్థం: నీ, హృదయ+ఈశ్వరుండు+ఐన= నీ హృదయానికి నాథుడైన- అంటే నీవు వలచినటువంటి; నలు+ఒద్ద, నుండి= నలుడి దగ్గరనుండి; వచ్చితిన్= అరుదెంచాను; అపార, పారావార, పర్యంత+అనంత, మహీతలంబునందు= ఒడ్డులేని సముద్రంవరకు అంతంలేకుండ విస్తరించిన భూమండలంలో; నా, చూడని= నేను చూడనట్టి; రాజులు+ఎవ్వరు= ప్రభువులు

ఎవ్వరున్నూ; లేరు; సర్వ, గుణ, సౌందర్యంబులన్= అన్ని మంచిగుణాలలోను, అందంలోను; ఎవ్వరు= ఏ రాజులున్నూ; నలున్= నలుడితో; పోలరు= సమానులు కారు.

తాత్పర్యం: 'నేను నీ హృదయేశ్వరుడైన నలుడిదగ్గరనుండి వచ్చాను; అంతం, దరి లేని సముద్రంవరకు విస్తరించి ఉన్న ఈ అపార భూమండలంలో రాజులెవ్వరూ సౌందర్యసౌశీల్యాలలో నలుడికి సాటిరారు.

తే. నీవు నలునకుఁ బేర్మితో దేవివైనఁ।
గాక నీ సముజ్జ్వల రూప కాంతి విభవ
నిత్య సౌభాగ్య భాగ్యాభిజాత్య భద్ర।
లక్షణావలు లవి సఫలంబు లగునె? 18

ప్రతిపదార్థం: నీవు; నలునకున్= నలుడనే వరుడికి; పేర్మితోన్= గౌరవంతో; దేవివి= దేవేరివి; ఐనన్, కాక= అయితే తప్ప; నీ, సముజ్జ్వల, రూప, కాంతి, విభవ, నిత్య, సౌభాగ్య, భాగ్య+అభిజాత్య, భద్ర, లక్షణ+ఆవలులు= మిక్కిలి వెలుగొందే నీ సౌందర్యం, నీ లావణ్య సంపద, నీ ఎడతెగని ఐశ్వర్యం, నీ అదృష్టం, గొప్పవంశంలో జననమందిన నీ గౌరవం, శుభప్రదమైన నీకు గల సద్గుణాలు; అవి= అవన్నీ; సఫలంబులు+అగునె?= ఫలప్రదాలు అవుతాయా? అంటే రాణిస్తాయా? (రాణించవని భావం).

తాత్పర్యం: ఓ దమయంతీ! నీవు నలుడికి దేవేరివి అయితే తప్ప నీకు గల గొప్పలక్షణాలు- సౌందర్యం, లావణ్య సంపద, ఐశ్వర్యం, నిత్య సౌభాగ్యం, అదృష్టం, వంశగౌరవం మున్నగునవి రాణించవు.

వ. నీవు నారీరత్నంబ, వాతండు పురుషరత్నంబు; గావున మీ యిద్దఱ సమాగమం బన్యోన్యశోభాకరంబగు' ననిన విని సంప్రాప్త హృదయ సమ్మదయై దమయంతి దాని కిట్లనియె. 19

ప్రతిపదార్థం: నీవు, నారీ, రత్నంబవు= నీవు వధువులలో రత్నంవంటిదానివి, అంటే శ్రేష్ఠురాలివి; ఆతండు= ఆ నలుడు; పురుషరత్నంబు= పురుషులలో శ్రేష్ఠుడు; కావున; మీ+ఇద్దఱు+అ= మీ ఇరువురి; సమాగమంబు= కలయిక; అన్యోన్య, శోభా+ ఆకరంబు+ అగున్= ఒకరికి ఇంకొకరు కాంతి కలిగించేటట్లు అవుతుంది; అనినన్= అని చెప్పగా; విని= ఆలకించి; సంప్రాప్త, హృదయ, సమ్మద+ఐ= హృదయంలో ఏర్పడిన సంతోషం కలదై; దమయంతి; దానికి= ఆ హంసకు; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= చెప్పింది.

తాత్పర్యం: నీవు స్త్రీ రత్నానివి. ఆ నలుడు పురుషరత్నం. మీ ఇరువురి సంయోగం ఒకరి కొకరు శోభ చేకూర్చినట్లు ఉంటుంది'- అని హంస పలుకగా దమయంతి మిక్కుటమైన ఆనందం పొంది ఇట్లా అన్నది.

మధ్యాక్కర.

'ఆ రాజుగుణములు నా కెఱింగించి నట్టులు నన్ను
నా రాజునకు నెఱింగించి కరుణ నాయందుఁ గావింపు
మారంగ' ననుడు నిషధవిషయమున కరిగి యా హంస
వీరసేనజునకు దాని గుణరూప విభవముల్ సెప్పె. 20

ప్రతిపదార్థం: ఆ, రాజు, గుణములు= రాజైన ఆ నలుడి గొప్పగుణాలు; నాకు+ఎఱింగించినట్టులు= నాకు తెలియజేసినట్లుగా; నన్నున్= నన్నుగురించి (అంటే నాలోని గొప్పగుణాలను); ఆ, రాజునకున్= ఆ రాజైన నలుడికి; ఎఱింగించి= తెలిపి; నాయందున్= నాపట్ల; కరుణ= దయ; ఆరంగన్= సంపూర్ణంగా; కావింపుము= కల్పించేది; అనుడు= అని చెప్పగా; ఆ, హంస; నిషధ విషయమునకు= నిషధదేశానికి; అరిగి= వెళ్ళి; వీరసేనజునకున్= వీరసేనుడి కుమారుడైన నలుడితో; దాని= ఆ దమయంతి యొక్క; గుణ, రూప, విభవముల్= మంచిగుణాలు, అందం, సంపద గురించి; చెప్పెన్= వచించింది.

తాత్పర్యం: 'ఆ నలమహారాజుగుణాలనుగురించి నా కెట్లా చెప్పావో అట్లాగే నన్నుగురించికూడా నిండైన దయతో ఆరాజుకు తెలియజెప్పుము'- అని దమయంతి అనగానే ఆ హంస నిషధదేశానికి వెళ్ళి, నలమహారాజుకు దమయంతి గుణరూపవైభవాలను గురించి చెప్పింది.

విశేషం: మధ్యాక్కర వృత్తంలోని ప్రతిచరణంలోనూ వరుసగా రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం, రెండు ఇంద్రగణాలు, ఒక సూర్యగణం ఉంటాయి. అయిదవగణంయొక్క మొదటి అక్షరంతో యతిమైత్రి. ప్రాసనియమం పాటించబడుతుంది.

వ. అంత 21

తాత్పర్యం: అప్పుడు.

చ. నలదమయంతు లిద్దఱు మనఃప్రభవానల బాధ్యమానులై
సలిపిరి దీర్ఘవాసర నిశల్ విలసన్నవనందనంబులన్
నలినదళంబులన్ మృదుమృణాళములన్ ఘనసారపాంసులం
దలిరుల శయ్యలన్ సలిలధారలఁ జందనచారుచర్చలన్. 22

ప్రతిపదార్థం: నల, దమయంతులు= నలుడును, దమయంతియు; ఇద్దఱు= ఇరువురునూ; మనస్+ప్రభవ+అనల, బాధ్యమానులు+ఐ= మన్మథతాపంచేత బాధించబడినవారై (మనః ప్రభవుడు= మన్మథుడు); దీర్ఘ, వాసర, నిశల్= పొడవైన పవళ్ళు, రేలు; విలసత్+నవ, నందనమ్ములన్= ప్రకాశిస్తున్న అపరనందనవనాలలో (నందనవనం స్వర్గలోకంలోని ఉద్యానవనం); నలినదళంబులన్= తామరపూల రేకులలో; మృదు మృణాళములన్= మెత్తనైన తామరతూండ్లలో; ఘనసార, పాంసులన్ =కర్పూరధూళితో; తలిరుల శయ్యలన్= చిగురుటాకుల సెజ్జలపై; సలిల ధారలన్= ఎడతెగకుండ చల్లుకొనిన నీళ్ళలో; చందన, చారు, చర్చలన్= మనోహరమైన గంధపు మైపూతలతో; సలిపిరి= గడిపారు.

తాత్పర్యం: నలదమయంతులు ఇరువురున్నూ (ఒకరికొకరు సుదూరంలో ఉండి) మన్మథతాపంచేత బాధించబడినవారై చెలువం చిందే నందనవనాల వంటి క్రొత్తతోటలలో, తామరపూలరేకులలో, మెత్తని తామరతూండ్లలో, కర్పూరపరాగంతో, మంచి గంధపు మైపూతలతో, చల్లనినీటి జల్లుల్లో, చిగురుటాకుల శయ్యలమీద పెక్కు పొడవయిన రేయింబవళ్ళు గడిపారు.

విశేషం: ఓజోగుణంతో కూడుకొన్న శిథిలబంధం ప్రసాదగుణం. దాని కీపద్యం చక్కని ఉదాహరణం. పూర్వరాగ విప్రలంభ వర్ణనకు సంబంధించిన ఈ పద్యరచన చిత్తవికాసరూపమైన రసానుభూతిని అందిస్తుంది. రసోచితమైన అక్షరరమ్యత గమనించదగింది. మన్మథవిరహాగ్ని తప్తులైన నాయికా నాయకులు శీతలోపచారాలను ఆశ్రయించటం ప్రకరణౌచిత్యం. 'దీర్ఘవాసరనిశల్' అనే సమాసం సార్థకం. విరహంవలన పవళ్ళు, రాత్రులు దీర్ఘాలుగా వారి కనిపించాయని ధ్వని. లేదా - పగళ్ళు దీర్ఘాలైన గ్రీష్మాదులూ, రాత్రిళ్ళు దీర్ఘాలైన హేమంతాదులూ ఈ సమాసంవలన సూచించబడుతున్నవనీ, నలదమయంతులు అన్ని ఋతువుల్లోనూ విరహబాధను విస్తృతంగా అనుభవించారనీ గ్రహించవచ్చును. భావిప్రబంధ శృంగారరసవర్ణనలకు ఈ పద్యం ఒక వెలుగుబాట.

వ. ఇట్లిద్దఱు నన్యోన్యరూపగుణ శ్రవణసంజాతప్రీతులై యుండునంత నంతఃకరణ సంతత మనోజాత సంతాప వివర్ణ వదనయైన యా దమయంతిం జూచి భయసంభ్రమాక్రాంతులై సఖీజను లెల్ల నక్కోమలి వృత్తాంతం బంతయు భీమున కెఱింగించి యిట్లనిరి. 23

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఇద్దఱున్= ఇరువురు; అన్యోన్య, రూప, గుణ, శ్రవణ, సంజాత, ప్రీతులు+ఐ= ఉభయులందుగల అందం, మంచిగుణాల గురించి వినటం వలన పుట్టిన సంతోషం కలవారై; ఉండు+అంతన్= ఉన్నపిదప; అంతఃకరణ, సంతత, మనస్+జాత, సంతాప, వివర్ణ, వదన+ఐన= మనస్సులోపలి ఎడతెగని మన్మథబాధచేత వెలవెల

పోయిన ముఖం కలదైన; ఆ, దమయంతిన్+చూచి= ఆ దమయంతిని చూచి; భయ, సంభ్రమ+ఆక్రాంతులు+ఐ= భయంవలన కలిగిన ఉద్వేగంతో కూడినవారై; సఖీ, జనులు+ఎల్లన్= చెలికత్తెలందరు; ఆ+కోమలి= ఆ సుకుమారియొక్క; వృత్తాంతంబు+అంతయు= సమాచారమంతయు; భీమునకు= (విదర్భరాజైన) భీముడికి; ఎఱింగించి= తెలిపి; ఇట్లు+అనిరి= ఈ విధంగా పలికారు.

తాత్పర్యం: నలదమయంతులు ఇద్దరు ఒకరి రూపగుణాలను గూర్చి మరొకరు వినటంవల్ల ఒకరిపై ఒకరు ప్రేమకలవారై ఉన్నారు. అప్పుడు మన్మథతాపంచేత వెలవెలపోయిన మొగంతో లోలోపల మగ్గుతున్న దమయంతిని చూచి, భయంతో కూడిన తత్తరపాటుతో చెలికత్తెలందరు ఆ సుకుమారిసమాచారాన్ని భీమరాజుకు తెలిపి ఇట్లన్నారు.

సీ. కలహంస పలికిన పలుకులు గుణియించు, ।
వడి దాని పోయిన వలను చూచుఁ,
బలుకదు సఖులతో లలితాంగి, మిన్నక ।
యలయుచు నుండుఁ దా ననుదినంబుఁ,
జారువిభూషణాహార విహార శ ।
య్యాసన భోగంబులందు విముఖి
యయి, రేయుఁ బగలు నిద్రయు నెప్పు డెఱుఁగక ।
దమయంతి నలుఁ డను ధరణినాథు

ఆ. నంద బుద్ధి నిలిపి, కందర్ప బాధిత ।
యగుచు నున్నయది ధరాధినాథ!
ధరణిపతుల నొరుల నురుగుణాఢ్యుల విన ।
నొల్ల దెంత విభవయుక్తు లయిన. 24

ప్రతిపదార్థం: కలహంస= రాజహంస; పలికిన, పలుకులు= చెప్పినమాటలు; గుణియించున్= వల్లె వేస్తుంది; వడిన్= వేగంగా; దాని, పోయిన, వలను= అది (రాజహంస) వెళ్ళిన దిక్కునే; చూచున్= చూస్తుంటుంది; సఖులతో= చెలికత్తెలతో; పలుకదు= మాటాడదు; లలితాంగి= సుకుమారమైన శరీరంకలది (దమయంతి); మిన్నక= ఊరక; అలయుచున్+ఉండున్= అలసిపోతుంటుంది; తాన్= తాను; అనుదినంబున్= ప్రతిదినమును; చారు, విభూషణ+ఆహార, విహార, శయ్యా+ఆసన, భోగంబులందున్= అందమైన ఆభరణాలపట్ల, ఆహార విహారాలలోను, పడకలోను, పీఠంలోను- అంటే ఆయా సౌఖ్యాలలో; విముఖి+అయి= పెడమొగం కలదై- అంటే లెక్కచేయనిదై; రేయున్= రాత్రులు; పగలు= పగళ్ళు; నిద్రయున్= నిద్రను; ఎప్పుడు+ఎఱుఁగక= ఎప్పుడూ తెలియక, అంటే దివారాత్రాలలో ఎప్పుడూ నిద్రపోక; దమయంతి; నలుఁడు+అను= నలుడనే; ధరణి, నాథునందు+అ= రాజుమీదే; బుద్ధి, నిలిపి= మనస్సులో లగ్నంచేసి; కందర్ప, బాధిత+అగుచున్= మన్మథుడిచేత బాధించబడిందవుతూ; ఉన్న+అది= ఉన్నది; ధరా+అధి, నాథ!= ఓ మహారాజా!; ధరణి, పతులన్+ఒరులన్= ఇతర రాజులను; ఉరు, గుణ+ఆఢ్యులన్= గొప్ప గుణాలు కలవాళ్ళను; ఎంత, విభవ, యుక్తులు+ అయినన్= ఎంత సంపదతో కూడుకొని ఉన్న వాళ్ళనైనను; వినన్+ఒల్లదు= ఆలకించటానికి ఇష్టపడదు.

తాత్పర్యం: దమయంతి ఆ రాజహంస వెళ్ళినదిక్కునే ఎప్పుడూ చూస్తూ ఉంటుంది. ఆ రాజహంస చెప్పిన మాటలనే వల్లెవేస్తూ ఉంటుంది. ఆ లలితాంగి చెలికత్తెలతో మాటాడటం మానివేసింది. ఏ పనీ చేయకుండానే ఊరక అలసిపోతుంది. ప్రతిదినం ఎట్టి సౌఖ్యాలను ఆశించదు. అందమైన ఆభరణాలపై ఆహార విహారాలపై ఆమెకు అభిలాషలేదు. శయనించటానికి మంచిపరుపు కోరదు. కూర్చొనటానికి మెత్తనిపీఠం కావాలని అడగదు. అసలు నిద్రలేకుండ ఎన్నో రాత్రులు పగళ్ళు ఆమె గడిపింది. ఎల్లప్పుడు

నలుడు అనే మహారాజునే స్మరిస్తూ మన్మథతాపంతో క్రుంగి కృశిస్తున్నది. ఓ మహారాజా! ఇతర రాజులు ఎంతటి సంపద కలవారైనా, ఎంతటి గొప్పగుణాలు కలవారైనా వారి విషయం ఏమాత్రం వినటానికి ఇష్టపడదు.

వ. అనిన విని భీముం 'డేమి సేయుదు? నెవ్విధంబున నమ్మహీపతి నిట రావింప నగునో!' యని చింతించుచు సంప్రాప్త యౌవనయైన కూఁతుం జూచి యప్పుడు. 25

ప్రతిపదార్థం: అనిన, విని= అని చెప్పగా విని; భీముండు= భీమరాజు; ఏమి+చేయుదున్= ఏమి చేయగలను?; ఏ+విధంబునన్= ఏరీతిగా; ఆ+మహీపతిన్= ఆ (భూభర్త) రాజును; ఇట= ఇచటికిః రావింపన్+అగునో= రప్పించటానికి వీలవునో?; అని; చింతించుచున్= యోచిస్తూ; సంప్రాప్త, యౌవన+ఐన= ప్రాప్తించిన యౌవనంకలదైన-అంటే యుక్తవయస్సు వచ్చినట్టి కూఁతున్+చూచి= పుత్రికను చూచి; అప్పుడు.

తాత్పర్యం: చెలికత్తెలు అట్లా చెప్పగా విని భీమరాజు 'ఏమి చేయగలను? ఏ ఉపాయంతో ఆ నలమహారాజును ఇచటికి రప్పించగలను?' అని ఆలోచిస్తూ, యుక్తవయస్సు వచ్చిన పుత్రికను చూచి, అపుడు.

క. ఆ వైదర్భుఁడు నిఖిల ధ ।
రా వలయములోనఁ గలుగు రాజన్యుల నా
నా విషయాధీశ్వరులను ।
రావించెం దత్స్వయంవర వ్యాజమునన్. 26

ప్రతిపదార్థం: ఆ, వైదర్భుఁడు= ఆ విదర్భరాజు(భీముడు); నిఖిల, ధరా, వలయములోనన్+కలుగు= సమస్త భూమండలంలో ఉన్న; రాజన్యులన్= రాజులను, నానా, విషయ+అధీశ్వరులను= వివిధ దేశాలకు ప్రభువులైన వాళ్ళను; తద్+స్వయంవర, వ్యాజమునన్= ఆ దమయంతియొక్క స్వయంవరం అనే మిషతో; రావించెన్= రప్పించాడు.

తాత్పర్యం: ఆ విదర్భరాజు భీముడు సమస్త భూమండలంలో ఉన్న రాజులను దమయంతీ స్వయంవరమనే మిషతో రప్పించాడు.

విశేషం: పూర్వకాలంలో భారతదేశంలో క్షత్రియ రాజకన్యలు తమకు నచ్చిన వరుడిని ఎన్నిక చేసికొని పెండ్లి చేసికొనేవారు. ఆ బహిరంగ రాజసభకు రాజులందరినీ ఆహ్వానించటం పరిపాటి. ఆ మహోత్సవంలో ప్రధాన భూమిక నిర్వహించే కన్యక రాజపుత్రిక. కావున ఆ మహోత్సవానికి 'స్వయంవరం' అనే పేరు వచ్చింది.

క. మనుజేశ్వరు లెల్లను బో ।
రన దమయంతీ స్వయంవరమునకు నొప్పం
జనుదెంచిరి సైన్యస్యం ।
దన ఘట్టన నవనితలము దల్లడపడఁగన్. 27

ప్రతిపదార్థం: మనుజ+ఈశ్వరులు+ఎల్లను= రాజులందరు; బోరున= శీఘ్రంగా; దమయంతీ, స్వయంవరమునకున్= దమయంతి యొక్క స్వయంవరానికి; సైన్య, స్యందన, ఘట్టనన్= భటులయొక్క రథాలయొక్క తాకిడివలన; అవనితలము= భూమిపైభాగం; తల్లడపడఁగన్= తల్లడిల్లేటట్లు; ఒప్పన్= ఒప్పునట్లుగా (తగినట్లుగా); చనుదెంచిరి= వచ్చారు.

తాత్పర్యం: రాజులందరు ఉత్సాహంతో దమయంతీస్వయంవరానికి విచ్చేశారు. వారి సేనలయొక్క, రథాలయొక్క రాపిడిచేత భూమిపైభాగం తల్లడిల్లింది.

వ. ఆ సమయంబునఁ బర్వత నారదు లను పురాణమునులు భూలోకం బెల్లం గ్రుమ్మరి యింద్రలోకంబునకుం బోయిన నింద్రుండు వారిం బూజించి, భూలోకంబునం గుశలం బడిగి. 'యిది యెట్లు ధర్మపరిపాలనపరులై వీరులై రణనిహతు లైన రాజు లక్షయలోకసుఖంబు లనుభవింప నతిథులై యిందులకు నింతకాలంబయ్యు రాని కారణం బేమి?' యని యడిగిన నారదుం డిట్లనియె. 28

ప్రతిపదార్థం: ఆ, సమయంబునన్= అప్పుడు; పర్వత, నారదులు+అను= పర్వతుడు, నారదుడు అనే; పురాణమునులు= ప్రాచీనఋషులు; భూలోకంబు+ఎల్లన్= భూలోకాన్ని అంతటిని; క్రుమ్మరి= తిరిగి; ఇంద్ర, లోకంబునకున్+పోయినన్= ఇంద్రలోకానికి వెళ్ళగా; ఇంద్రుండు= ఇంద్రుడు; వారిన్= ఆ పర్వత నారదులను; పూజించి= గౌరవించి; భూలోకంబునన్, కుశలంబు+అడిగి= భూలోకంలోని క్షేమసమాచారం అడిగి; ఇది+ఎట్లు= ఇది ఎట్లాగ?; ధర్మ, పరిపాలనపరులు+ఐ= ధర్మంతో ఏలుబడి కొనసాగిస్తున్న వారై; వీరులు+ఐ= పరాక్రమవంతులై; రణ, నిహతులు+ఐన, రాజులు= రణంలో చంపబడిన రాజులు; అక్షయ, లోక, సుఖంబులు= తరగనట్టి లోకాలలోని సౌఖ్యాలు; అనుభవింపన్= అనుభవించటానికై; అతిథులు+ఐ= మన్ననను అనుభవించే ఆగంతుకులై; ఇందులకున్= ఇచటికి; ఇంతకాలంబు+అయ్యున్= ఇంతకాలం గడచిపోయినప్పటికి; రాని, కారణంబు+ఏమి+అని= రానట్టిహేతువు ఏమి టని; అడిగినన్= అడుగగా; నారదుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ సమయంలో పర్వతుడు, నారదుడు అనే ప్రాచీనఋషులు భూమండలమంతా తిరిగి చూచి ఇంద్రలోకానికి వెళ్ళారు. ఇంద్రుడు వారిని పూజించి భూలోకాన్నిగురించిన కుశలప్రశ్నలు వేసి 'మునీంద్రులారా! ఇంతకుపూర్వం ధర్మపరిపాలన చేసి, యుద్ధాలలో వీరమరణం చెందిన రాజులు అక్షయలోకాల సుఖాలను అనుభవించటానికై అతిథులుగా స్వర్గలోకానికి వస్తూ ఉండేవారు. కానీ, ఇంతకాలమయినా వారు రాకపోవటానికి గల కారణమేమిటి?' అని అడుగగా నారదుడు ఇట్లా చెప్పాడు.

విశేషం: (1) ప్రాచీనభారతీయవాఙ్మయంలో నారదుడిపాత్ర ఒక విశిష్టసృష్టి. నారదుడు త్రిలోకసంచారి. ఆ మునికి తెలియని సమాచారం ఉండదు. ఆయన సంగీతప్రియుడు. కలహభోజనుడు, గొప్ప భగవద్భక్తుడు. (2) అతిథి:- మర్యాదగా

ఆహ్వానాన్ని పురస్కరించుకొని విందుకై వచ్చే ఆగంతుకుడు అనేది నేటి వ్యవహారంలోని అర్థం. న+తిథి= తిథిని చూడకుండ (ఆహారార్థం) పయనించి వచ్చేవాడు- అని అసలు అర్థం.

క. 'నర సిద్ధ సాధ్య విద్యా ।
ధర సురకన్యకలకంటె దమయంతియ సుం
దరి; దాని సుస్వయంవర ।
మరుదై వర్తిల్లుచున్నయది యిప్డు మహిన్. 29

ప్రతిపదార్థం: నర, సిద్ధ, సాధ్య, విద్యాధర, సుర, కన్యకల కంటెన్= మనుజులలో, సిద్ధులలో, సాధ్యులలో, విద్యాధరులలో, దేవతలలో ఉన్న పెండ్లిగాని ఆడుపడుచు లందరికంటె; దమయంతి+అ= దమయంతి ఒక్కతె మాత్రమే; సుందరి= అందకత్తె; దాని= ఆమెయొక్క; సు, స్వయంవరము= గొప్ప స్వయంవరం; ఇప్డు= ఇపుడు; మహిన్= భూలోకంలో; అరుదు+ఐ= అసాధారణమైనదై; వర్తిల్లుచున్న+అది= జరుగుతున్నది.

తాత్పర్యం: 'దమయంతి జగదేకసుందరి. నరులలో, సిద్ధులలో, సాధ్యులలో, విద్యాధరులలో, దేవతలలో అటువంటి సౌందర్యవతి లేదు. ఆమె స్వయంవర మహోత్సవం ఇపుడు భూలోకంలో అసాధారణ వైభవంతో జరుగుతున్నది.

క. అందులకు ధరణిఁ గల నృప ।
నందను లెల్లను ముదంబునం బోయెడు వే
డ్కం దమలోఁ గలహంబును ।
గ్రందును లేకున్నవారు గడు నెయ్యమునన్.' 30

ప్రతిపదార్థం:అందులకున్= ఆ దమయంతీ స్వయంవరానికి; ధరణిన్+కల= భూమిలో ఉండే; నృపనందనులు+ఎల్లను= రాజపుత్రులందరును; ముదంబునన్= సంతోషంతో; పోయెడు= వెళ్ళే; వేడ్కన్= కుతూహలంతో; కడునెయ్యమునన్= మిక్కుటమయిన స్నేహంతో; తమలోన్= ఒకరికొకరు;

కలహంబును= విరోధాన్ని; క్రందును= పొరపొచ్చాన్ని; లేక+ఉన్నవారు= లేకుండ ఉన్నారు.

తాత్పర్యం: ఆ దమయంతీ స్వయంవరంలో పాల్గొనటానికై భూలోకంలోని రాకుమారులందరు తమలోని అన్యోన్య వైరాలు, అభిప్రాయభేదాలు ఉజ్జగించి, ఉత్సాహంతో, వేడుకతో మిక్కిలి స్నేహంతో ఉంటున్నారు.'

విశేషం: నారదుడికి కావలసింది అన్యోన్యకలహాలు. దమయంతీ స్వయంవర కారణాన కలహభోజనుడైన నారదుడు పాపం పస్తులుండవలసి వచ్చింది.

వ. అనిన నింద్రుండును, లోకపాలవరులును దదాలోకన కౌతుకంబునం గనక రత్నరమ్య దివ్య విమానారూఢులయి చనువారు ముందట దమయంతీ స్వయంవరంబునకుంబోయెడువాని నాదిత్యులలోన విష్ణుండునుంబోలెఁ దేజోధికుండైన వాని ననన్యసాధారణరూపవిభవంబున రెండవ మన్మథుండు నుంబోనివాని నలుం గని యంతరిక్షంబున విమానంబులు నిలిపి భూతలంబునకు వచ్చి వాని కిట్లనిరి. 31

ప్రతిపదార్థం: అనినన్= అని నారదమహర్షి చెప్పగా విని; ఇంద్రుండును= ఇంద్రుడున్నూ; లోకపాలవరులును= గొప్పవారైన దిక్పాలకులున్నూ; తద్+ఆలోకన, కౌతుకంబునన్= ఆ దమయంతీ స్వయంవరాన్ని చూడాలనే వేడుకతో; కనక, రత్న, రమ్య దివ్య, విమాన+ఆ రూఢులు+అయి= బంగారంతో, రత్నాలతో (పొదగబడటం చేత) అందమైన దివ్యవిమానాలలో కూర్చున్నవారై, చనువారు= ప్రయాణించేవారు; ముందట=(తమ కనుల) ముందు; దమయంతీ, స్వయంవరమునకున్+పోయెడువానిన్; ఆదిత్యుల లోనన్= సూర్యులలో; విష్ణుండునున్+పోలెన్= విష్ణువువలె; తేజస్+అధికుండు+ ఐనవానిన్= తేజస్సుచేత అధికుడైనవాడిని, అంటే మిక్కుటమైన ప్రకాశం గల నలుడిని; అనన్య, సాధారణ, రూప, విభవంబునన్= ఒరులకు సాధారణం

గాని సౌందర్యం సంపద చేత; రెండవ, మన్మథుండునున్+పోనివానిన్= అపర మన్మథుడివలె ఉన్నవాడిని; నలున్+కని= నలుడిని చూచి; అంతరిక్షంబునన్= ఆకాశంలో; విమానంబులు; నిలిపి; భూతలంబునకు, వచ్చి= భూమి మీదకు చేరి; వానికి= ఆ నలుడికి; ఇట్లు+అనిరి= ఇట్లా చెప్పారు.

తాత్పర్యం: అని నారదమహర్షి చెప్పగా విని ఇంద్రుడున్నూ, దిక్పాలకులున్నూ, ఆ దమయంతీ స్వయంవరాన్ని చూచే వేడుకతో రత్నాలు పొదగబడిన అందమైన పసిడి విమానాలను ఎక్కి బయలుదేరారు. దారిలో భూమిపై వారి కనులముందు నలుడు కనిపించాడు. ఆ మహారాజుకూడ దమయంతీ స్వయంవరానికి వెళ్ళుతున్నాడు. అతడు సూర్యులలో విష్ణువువలె మిక్కుటమైన కాంతితో వెలుగొందుతున్నాడు; సౌందర్యంలో సాటిలేనివాడై అపరమన్మథుడివలె దీపిస్తున్నాడు. అపుడు దేవతలు ఆకాశంలో తమ విమానాలను నిలిపి భూమిపైకి వచ్చి నిలిచి, నలుడితో ఇట్లా పలికారు.

విశేషం: ఆదిత్యులు పన్నెండుమంది. వారిలో 'విష్ణువు' అధిక తేజస్వి. ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు - వీరు ద్వాదశాదిత్యులు. "ఆదిత్యానా మహం విష్ణుః" అనే భగవద్గీతావాక్యం ఇట స్మరించదగింది.

సీ. 'నిత్యసత్యవ్రత! నిషధేశ! నీవు మా ।
కమరంగ దూతవై యభిమతంబు
సేయుము' నావుడుఁ జెచ్చెర 'నట్టుల ।
చేయుదు మఱి నాకుఁ జెపుఁడు మీర
లెవ్వార? లేను మీ కిష్టంబుగా దూత ।
నై యేమి సేయుదు?' ననిన, నతని
కమరేశ్వరుం డిట్టు లనియె; 'నే నింద్రుండ;' ।
వీరు దిక్పాలురు విదితయశులు;

ఆ. ధరణి నొప్పుచున్న దమయంతి సుస్వయం ।
వరముఁ జూచు వేడ్క వచ్చియున్న
వార; మీవు మమ్ము వారిజాక్షికి నెఱిం ।
గింపు నామధేయ కీర్తనముల. 32

ప్రతిపదార్థం: నిత్య, సత్య, వ్రత!= ఎల్లప్పుడు సత్యాన్ని వ్రతంగా పాటించేవాడా!; నిషధ+ఈశ!= నిషధదేశానికి పాలకుడా!; నీవు; మాకు; అమరంగన్= ఒప్పునట్లుగా; దూతవు+ఐ= హితం కోరే ప్రతినిధివై; అభిమతంబు+చేయుము= కోరిక నెరవేర్చుము; నావుడున్= అనగా; చెచ్చెరన్= వేగంగా; అట్టుల, చేయుదున్= అట్లే చేస్తాను; మఱి= ఇక; నాకున్+చెపుఁడు= నాకు చెప్పండి; మీరలు+ఏ+వారలు= మీరు ఎవరు?; ఏను= నేను; మీకు; ఇష్టంబు+కాన్= ప్రీతి కలిగేటట్లు; దూతను+ఐ= మీకు ప్రతినిధిగా; ఏమి+చేయుదున్= ఏ కర్తవ్యాన్ని నెరవేర్చవలసి ఉన్నది; అనినన్= అని పలుకగా; అతనికి= ఆ నలుడికి; అమర+ఈశ్వరుండు= దేవేంద్రుడు; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; ఏను= నేను; ఇంద్రుండ= ఇంద్రుడిని; వీరు; దిక్పాలురు= వీరు దిక్కులను పాలించేవారు; విదితయశులు= ఎల్లరకు తెలిసినట్టి కీర్తి కలవారు; ధరణిన్+ఒప్పుచున్న= భూలోకంలో విలసిల్లుతున్న; దమయంతి, సుస్వయంవరమున్= దమయంతీ శుభ స్వయంవరాన్ని; చూచు, వేడ్కన్= చూడాలనే కుతూహలంచేత; వచ్చి+ఉన్న, వారము= వచ్చినవారము; ఈవు= నీవు; మమ్మున్= మమ్మల్ని; నామధేయ, కీర్తనములన్= పేర్లు బిరుదులతోపాటు ప్రశంసించటం ద్వారా; వారిజ+అక్షికిన్= పద్మనేత్రకు, దమయంతికి; ఎఱింగింపు= తెలియజేయాలి.

తాత్పర్యం: 'ఎల్లప్పుడు సత్యవ్రతాన్ని దీక్షతో పాటించే ఓ నిషధమహారాజా! నీవు మాకు అనువైన దూతగా మా అభీష్టం నెరవేర్చాలని కోరుతున్నాం'- అని చెప్పగా నలుడు వెనువెంటనే మారుపలికాడు. 'అట్లే చేస్తాను. మరి నాకు మీ రెవరో, నేను మీకు ప్రియమొనరించటానికి మీ ప్రతినిధి (దూత)

నయి ఏ కర్తవ్యాన్ని నెరవేర్చాలో సెలవిండు' అని చెప్పగా అతడికి దేవేంద్రుడు ఇట్లా చెప్పాడు. 'నేను దేవేంద్రుడిని. వీరు నా సహచరులైన దిక్పాలురు. సుప్రసిద్ధులు. మేము భూలోకంలో జరుగుతున్న దమయంతీ స్వయంవరాన్ని చూచేవేడుకతో విచ్చేసి ఉన్నాం. నీవు పద్మదళాయతాక్షి అయిన దమయంతికి మమ్మల్ని పేర్లతో, బిరుదాలతో ప్రశంసాపూర్వకంగా పరిచయం చేయాలి.

వ. అట్లయిన నక్కోమలి మాయందుఁ దనవలచినవాని వరియించు
'ననిన నింద్రునకుఁ గృతాంజలియై నలుం డిట్లనియె. 33

ప్రతిపదార్థం: అట్లు+అయినన్= ఆ విధంగా నీవు దౌత్యం నెరపిన పిమ్మట; ఆ+కోమలి= ఆ సుకుమారి; మాయందున్= మాలో; తన వలచినవానిన్= తనకు ఇష్టమైనవాడిని; వరియించును= భర్తగా ఎన్నుకొంటుంది; అనినన్= అని చెప్పగా; ఇంద్రునకున్; కృతాంజలి+ఐ= నమస్కరించి; నలుండు= నలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ విధంగా నీవు దౌత్యం నెరపితే, ఆ సుకుమారి దమయంతి తన ఇచ్ఛవచ్చినవాడిని మాలో ఒకరిని వరుడిగా ఎన్నుకొంటుంది'- అని ఇంద్రుడు చెప్పగా విని నలుడు ఆతడికి నమస్కరించి ఇట్లా అన్నాడు.

ఆ. 'ఎఱిఁగి యెఱిఁగి నన్ను నేకార్థసముపేతుఁ ।
బాడియయ్య యిట్టి పనికిఁ బనుప?'
ననిన 'నుత్సుకుండ వై యేల చేసెద ।
నంటి? చేయకుండ నగునె యింక? 34

ప్రతిపదార్థం: ఎఱిఁగి, ఎఱిఁగి,= తెలిసి, తెలిసి; ఏక+అర్థ+సముపేతున్+ నన్నున్= ఒకేధ్యేయం గల నన్ను, అంటే మీకూ నాకూ లక్ష్యం ఒకటే అయిన నన్ను; ఇట్టి, పనికిన్+పనుపన్= ఇటువంటి పనికి నియోగించటం; పాడి+ అయ్య?= (మీకు) న్యాయమా?!; అనినన్= అని చెప్పగా; ఉత్సుకుండవు+ఐ= తమకం కలవాడివై; ఏల= ఎందుకు? చేసెదను= చేయగలను; అంటి=

అన్నావు; ఇంక= ఇక; చేయకుండన్+అగునె?= చేయకుండటం నీకు వీలౌతుందా? (ఉండదని భావం).

తాత్పర్యం: 'మీరూ, నేనూ ఒకే ధ్యేయసిద్ధికై ప్రయత్నిస్తున్నవారలం. ఆ విషయం మీకు సంపూర్ణంగా తెలిసిందే. అటువంటప్పుడు ఈ పనికి మీరు నన్ను వినియోగించటం న్యాయమా?' అని నలుడు దేవేంద్రుడిని ప్రశ్నించాడు. దేవేంద్రుడు నలుడితో 'నీవేకదా మేము ఏ విషయాన్ని అర్థించినా చేస్తానని ఉత్సాహంతో మాట ఇచ్చావు. ఇక ఆడినమాట నీ వెట్లా తప్పటానికి వీలౌతుంది?

ఆ. నిన్ను నిత్యసత్యనిరతుఁగా నెఱిఁగి యి ।
క్కార్యమునకు వలను గలుగు టెఱిఁగి
పనుప వలసె దూతభావ మపేక్షించి; ।
దేవహితము, దీనిఁ దీర్పవలయు. 35

ప్రతిపదార్థం: నిన్ను; నిత్య, సత్య, నిరతున్+కాన్= ఎల్లప్పుడు సత్యం పాటించేవాడినిగా; ఎఱిఁగి= తెలిసికొని, ఈ+కార్యమునకున్=ఈ పనికి; వలను, కలుగుట+ఎఱిఁగి= వీలున్నదని తెలిసికొని; దూత భావము+అపేక్షించి= నీ దౌత్యాన్ని కోరి; పనుప వలసెన్= నియోగించవలసి వచ్చింది; దేవ, హితము= దేవతల కొరకైన మేలు; దీనిన్= దీనిని; తీర్పన్, వలయున్= నెరవేర్చాలి.

తాత్పర్యం: నీవు సత్యసంధుడివని తెలుసు. ఈ కార్యం నిర్వహించగలిగే శక్తిసామర్థ్యాలు నీకు కలవనీ మాకు తెలుసు. అందుచేతనే నీ దౌత్యాన్ని మేము కోరుకొన్నది. ఇది దేవతల మేలు కొరకైన కార్యం. నీవు దీనిని నెరవేర్చాలి.

వ. ఆయుధీయ సురక్షితం బయిన రాజగృహం బెట్లు సొర నగు నని శంకింప వలవదు; దమయంతీ నివేశంబు ప్రవేశించు నపుడు ని న్నెవ్వరు వారింపనోడుదు' రనిన శక్రువచనంబుల నశంకితుం డయి నలుం డప్పుడ

విదర్భా నగరంబునకుం బోయి యొక్కరుండ దమయంతీగృహంబు
సొచ్చిన. 36

ప్రతిపదార్థం: ఆయుధీయ+సురక్షితంబు+అయిన=ఆయుధాలు ధరించిన భటులచేత బాగా కాపాడబడుతున్న; రాజగృహంబు= రాజుగారి అంతః పురం; ఎట్లు+సొరన్+ అగున్+అని= ఏ విధంగా ప్రవేశించటానికి వీలుంటుం దని; శంకింప, వలవదు= సందేహించ నవసరం లేదు; దమయంతీ, నివేశంబు= దమయంతిమందిరం; ప్రవేశించు నపుడు= లోనికి వెళ్ళేటప్పుడు; నిన్ను+ఎవ్వరు= నిన్ను ఎవరున్నూ; వారింపన్+ఓడుదురు= అడ్డుపెట్టజాలరు; అనినన్= అని చెప్పగా; శక్రువచనంబులన్= ఇంద్రుడి మాటలచొప్పున; అశంకితుండు+అయి= సందేహం లేనివాడై; నలుండు; అప్పుడు+అ= అప్పుడే; విదర్భానగరంబున కున్+పోయి= విదర్భరాజధానికి వెళ్ళి; ఒక్కరుండు+అ= తా నొక్కడు మాత్రమే; దమయంతీ, గృహంబు+చొచ్చినన్= దమయంతి నివసించే ఇల్లు ప్రవేశించగా.

తాత్పర్యం: 'ఆయుధాలు ధరించిన భటులు బాగా కాపాడుతున్న రాజుగారి అంతఃపురం ఎట్లా ప్రవేశించటానికి వీలవుతుంది? అని శంకించవద్దు. దమయంతీమందిరం ప్రవేశించేటప్పుడు నిన్ను ఎవరూ అడ్డుపెట్టజాలరు'- అని ఇంద్రుడు చెప్పగా, అతడి మాటల ప్రకారం నలుడు అప్పుడే విదర్భరాజధానికి వెళ్ళి తా నొక్కడు మాత్రమే దమయంతి ఇంట్లో ప్రవేశించాడు.

నలుఁడు దమయంతియొద్దకు దేవదూతయై పోవుట (సం. 3-52-10)

సీ. హంసచేఁ దన విని నంతకంటెను రూప।
విభవాతిశయమున వెలయుదాని,
సురకన్యకలయట్టి సురుచిర శతకన్య।
కాళిచేఁ బరివృతయైన దాని,

హృదయేశుఁడైన తన్నెప్పుడు వినుచున్కి।
నలయ కాశ్వాసిత యైనదాని,
దమయంతిఁ జూచి కందర్పశరావిద్ధుఁ।
డయ్యె నలుం; డంత నతనిఁ జూచి

ఆ. 'యితఁ డపూర్వ మనుజుఁ డెందుండి వచ్చెనో'?
యనుచు నుదరిపడి లతాంగు లెల్ల
నాసనములు డగ్గి యప్పు డభ్యుద్గత।
లైరి మనములందు హర్ష మెసఁగ. 37

ప్రతిపదార్థం: హంసచేన్= హంసచేత; తన, వినినంత కంటెను= తాను వినిఉన్నదాని కంటె; రూప, విభవ+అతిశయమున= సౌందర్య సంపదయొక్క ఆధిక్యంచేత; వెలయుదానిన్= విలసిల్లుతూ ఉండే దానిని; సురకన్యకల+ అట్టి= దేవకన్యకల వంటి; సు, రుచిర, శత, కన్యక+ఆళిచేన్= మిక్కిలి ప్రకాశమానలైన నూర్గురు కన్యకల సమూహంచేత; పరివృత+ఐన, దాని= చుట్టుకొనబడి ఉన్నదానిని; హృదయ+ఈశుఁడు+ఐన= మనోనాథుడైన (మనసార వలచినవాడైన); తన్ను+ఎప్పుడు= తనను గురించి ఎల్లప్పుడును; వినుచు+ఉన్కిన్= వింటూ ఉండటంచేత; అలయక= అలసి పోకుండ; ఆశ్వాసిత+ఐన, దానిన్= ఊరటపొందిన దానిని; దమయంతిన్+చూచి= దమయంతిని చూచి; కందర్ప, శర+ఆవిద్ధుఁడు+అయ్యెన్= మన్మథబాణాల చేత కొట్టబడినవాడు అయ్యాడు; నలుండు= నలుడు; అంతన్= అంతట; అతనిన్+చూచి= ఆ నలుడిని చూచి; ఇతఁడు; అపూర్వ మనుజుఁడు= క్రొత్తవాడు; ఎందుండి, వచ్చెనో= ఎచటనుండి వచ్చి ఉన్నాడో; అనుచున్= అని తలపోస్తూ; ఉదరిపడి= భయపడి; లతా+ అంగులు+ఎల్లన్= లతలవంటి శరీరాలుగల అంగనలందరు; ఆసనములు= కూర్చున్న పీఠాలు; డిగ్గి= దిగి; మనములందున్= మనస్సులలో; హర్షము= సంతోషం, ఎసఁగన్= ఉప్పొంగగా; అభ్యుద్గతలు+ఐరి= సగౌరవంగా లేచి నిల్చిన వారు అయ్యారు.

తాత్పర్యం: నలుడు అప్పు డచట దమయంతిని తొలిసారి చూచాడు. అతడికి హంస అలనాడు తనతో చెప్పినదాని కంటె ఆమె సౌందర్యసంపద ఎక్కువగా తోచింది. దేవకన్యకలతో సౌందర్యంలో తులతూగే నూరుమంది చెలికత్తెలు ఆమెను కొలుస్తూ ఉన్నారు. హృదయేశ్వరుడైన నలుడిని గూర్చి సదా వింటున్నందున, దమయంతి అలయక ఊరట పొందుతూ ఉన్నది. అట్టి దమయంతిని చూచి నలుడు మన్మథబాణ పరిపీడితుడయ్యాడు. నలుడిని చూచిన వెంటనే ఆ లలితాంగులందరు అదిరిపడి పీఠాలు దిగి 'ఈ అపూర్వ మనుజుడు ఎవ్వడు? ఎచటినుంచి ఇచటికి వచ్చాడు?' అని ఆశ్చర్యపడి, మనస్సులు సంతోషంతో ఉప్పొంగగా, సగౌరవంగా లేచి నిలబడ్డారు.

వ. అంత. 38

తాత్పర్యం: అట్లా దమయంతి చెలికత్తెలందరూ లేచి నిలబడిన తర్వాత.

క. దమయంతి మనోభవనిభు ।
నమరేంద్రప్రతిము దినకరాభు సుధారుక్
సము వరుణసదృశు ధనదో ।
పము నశ్విసమాను నిషధపతిఁ జూచి నలున్. 39

ప్రతిపదార్థం: దమయంతి; మనస్+భవ, నిభున్= మన్మథుడితో సమానుడిని; అమర+ఇంద్ర, ప్రతిమున్= దేవేంద్రుడితో సమానుడిని; దినకర+ఆభున్= సూర్యుడితో సమానుడిని (ఆభ శబ్దం సమాసోత్తరపదంగా ఉన్నపుడు 'సదృశం' అనే అర్థం ఇస్తుంది); సుధా, రుక్+సమున్= అమృత కిరణుడైన చంద్రుడితో సముడిని; వరుణ, సదృశున్= వరుణుడితో పోలినవాడిని; ధనద+ఉపమున్= కుబేరుడితో పోల్చదగినవాడిని; అశ్వి సమానున్= అశ్వినీదేవతలతో సమానుడిని; నలున్= నలుడిని; నిషధపతిన్= నిషధరాజును; చూచి= చూచి.

తాత్పర్యం: దమయంతి మన్మథుడితో సమానుడు, దేవేంద్ర సదృశుడు, సూర్యతేజస్వి, చంద్రసముడు, వరుణ నిభుడు, కుబేరతుల్యుడు, నిషధరాజు అయిన నలుడిని చూచి-

క. వారిరుహనేత్ర మదన ।
ప్రేరితయై లజ్జ యుడిగి భీతిల్లక బృం
దారకమూర్తికి రాజకు ।
మారున కిట్లనియె మందమందమృదూక్తిన్. 40

ప్రతిపదార్థం: వారి, రుహ, నేత్ర= పద్మాలవంటి కన్నులు కల దమయంతి; (వారి, రుహం= నీటిలో పుట్టింది పద్మం); మదనప్రేరిత+ఐ= మన్మథుడిచేత ప్రేరేపించబడిందై; లజ్జ+ఉడిగి= సిగ్గును వీడి; భీతిల్లక= భయపడక; బృందారక, మూర్తికిన్= దేవతల ఆకారం కలవాడికి; రాజకుమారునకు= రాజపుత్రుడికి; మంద, మంద, మృదు+ఉక్తిన్= మెలమెల్లగా మెత్తనైన మాటలతో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: పద్మనయన అయిన దమయంతి మన్మథుడిచేత ప్రేరేపించ బడిందై, సిగ్గును అవతలికి త్రోసి, జంకుగొంకులు లేకుండ దివ్యసుందర విగ్రహుడూ, రాకుమారుడూ అయిన నలుడితో మెల్లని మెత్తని పలుకులతో ఇట్లా పలికింది.

వ. 'నీవు మహానుభావుండ వెవ్వండ? విందుల కేమి కారణంబున నేకతంబ వచ్చితి? విది యత్యుగ్రశాసనుండైన మదీయ జనకుచేత సురక్షితంబగుట నెవ్వరికిఁ జొర నశక్యంబు; దీని నెవ్వరు నెఱుంగకుండ నెవ్విధంబునం జొచ్చితివి? నాకు మనోజ వేదనా వివర్ధనుండవైన నీ తెఱం గెఱింగింపు' మనిన దానికి నలుం డిట్లనియె. 41

ప్రతిపదార్థం: నీవు, మహానుభావుండవు= నీవు గొప్ప మహిమ కలవాడివి; ఎవ్వండవు= ఎవరివి?; ఇందులకు= ఇచటికి; ఏమి కారణంబునన్= ఏ

హేతువుచేత; ఏకతంబు+అ= ఒంటరిగా; వచ్చితివి; ఇది= ఈ అంతఃపురం; అతి+ఉగ్రశాసనుండు+ఐన= మిక్కిలి భయంకరమైన ఆజ్ఞలు అమలు జరిపేవాడైన; మదీయ, జనకుచేతన్= నా తండ్రిచేత; సురక్షితంబు+అగుటన్= బాగుగా కాపాడబడటంచేత; ఎవ్వరికిన్= ఎవరికైనను; చొరన్= ప్రవేశించటానికి; అశక్యంబు= సాధ్యంకానిది; దీనిన్= ఈ అంతఃపురాన్ని; ఎవ్వరున్+ఎఱుంగకుండన్= ఎవ్వరును తెలిసికొనకుండ; ఏ+విధంబునన్= ఏరీతిగా; చొచ్చితివి= చొరబడ్డావు; నాకు; మనోజ, వేదనా, వివర్ధనుండవు+ఐన= మన్మథతాపాన్ని పెంపొందించినవాడివయిన; నీ, తెఱంగు= నీ తీరు; ఎఱింగింపుము= తెలియజేయుము; అనినన్= అని చెప్పగా; దానికిన్= ఆ దమయంతికి; నలుండు= నలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నీవు మహానుభావుడివిగా కన్పిస్తున్నావు. నీవు ఎవరివి? ఎచటనుండి ఇచటికి వచ్చావు? ఏకారణంగా వచ్చావు? ఈ అంతఃపురం చండశాసనుడైన మా తండ్రిగారిచేత సురక్షితం. మరి నీవు ఎవ్వరికీ కనపడకుండ ఎట్లా ఇచటికి రాగలిగావు? ఇట్లా ఎవ్వరూ ఇచటికి రాలేరు. నాకు మన్మథతాపాన్ని హెచ్చిస్తున్న నీ తీరుతెన్నులు తెలుపుము'- అని దమయంతి అడుగగా నలుడు ఇట్లా బదులు పలికాడు.

ఆ. 'ఏను దేవదూత నింతి! నలుం డను ।
వాఁడ; నింద్రదహన వరుణ యములు
నీ స్వయంవరంబు నెమ్మితోఁ జూడంగ ।
నరుగుదెంచి నన్ను నబల! మున్న. 42

ప్రతిపదార్థం: ఇంతి!= ఓ (దమయంతీ) లలనా!; ఏను= నేను; దేవదూతను= దేవతలకు దూతను; నలుండు+అనువాఁడన్= నలుడు అనేవాడిని; ఇంద్ర, దహన, వరుణ, యములు= ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, యముడు; నీ, స్వయంవరంబు= నీ స్వయంవరాన్ని; నెమ్మితోన్= ప్రీతితో; చూడంగన్+అరుగుదెంచి= చూడటానికై వచ్చి; మున్ను+అ= ముందుగా; నన్నున్; అబల!= ఓ అంగనా! (అబల= బలంలేనట్టిది. స్త్రీవాచకం)

తాత్పర్యం: 'ఓ లలనామణీ! నేను దేవతల దూతను, నాపేరు నలుడు. ఇంద్రుడు, అగ్ని, యముడు, వరుణుడు నీ స్వయంవరాన్ని చూడటానికై వచ్చి ముందుగా నన్ను -

క. నీ యొద్దకుఁ బుత్తెంచిరి; ।
మాయం దొక్కరు నభీష్టమతి వరియింపం
దోయజముఖిఁ బ్రార్థింపుము; ।
మాయందఱకును బ్రియం బమర్పుము ప్రీతిన్.' 43

ప్రతిపదార్థం: నీ+ఒద్దకున్= నీ కడకు; పుత్తెంచిరి= పంపారు; మా+అందు= మాలో; ఒక్కరున్= ఒకరిని; అభీష్టమతిన్= ఇష్టానుసారం; వరియింపన్= భర్తగా ఎన్నుకొనటానికి; తోయజ ముఖిన్= పద్మంవంటి ముఖం కలది అయిన దమయంతిని; ప్రార్థింపుము= వేడుకొనుము; మా+అందఱకును; ప్రీతిన్= సంతోషంతో; ప్రియంబు+అమర్పుము= ఇష్టం చేకూర్చుము.

తాత్పర్యం: ఇంద్రాగ్ని యమవరుణులు, తమలో ఒకరిని భర్తగా ఎన్నుకొనుమని నిన్ను ప్రార్థించి, మా అందరికి ప్రీతికలిగించుమని నీకడకు దూతగా పంపారు.'

వ. అని పంచినఁ దత్ప్రసాదంబున నన్యులచేత నలక్షితుండనై వచ్చితి; నింద్రాదులకుఁ బ్రియంబు సేయు' మనిన నవనతవదనయై దమయంతి దొల్లి హంసచేత నలుని విని వానియందు బద్ధానురాగయై నవయుచున్న యది యపు డతని నలుంగా నెఱింగి తద్వచన శ్రవణ దుఃఖాయమాన మానస యగుచు నిట్లనియె. 44

ప్రతిపదార్థం: అని, పంచినన్= అని నియోగించగా; తద్+ప్రసాదంబునన్= ఆ దేవతల దయవలన; అన్యుల చేతన్= ఇతరుల చేత; అలక్షితుండను+ఐ=

అగోచరుడనై, అంటే అగుపించనివాడనై; వచ్చితిన్= అంతఃపురం ప్రవేశించ గలిగాను; ఇంద్ర+ఆదులకున్= ఇంద్రుడు మున్నగువారికి; ప్రియంబు+ చేయుము= ప్రీతి ఘటించుము; అనినన్= అని చెప్పగా; అవనత, వదన+ఐ= క్రిందికి దించినమొగం కలదై; దమయంతి; తొల్లి= పూర్వం; హంసచేత; నలుని, విని= నలుడి గురించి విని; వాని+అందు= ఆ నలుడిపై; బద్ధ+ అనురాగ+ఐ= లగ్నమైన ప్రేమకలదై; నవయుచున్న+అది= క్రుంగి కృశిస్తున్నటువంటిది; అపుడు= అప్పుడు; అతని= అతడిని; నలుంగాన్+ ఎఱింగి= (తాను వలచిన) నలుడిగా గుర్తించి; తద్+వచన, శ్రవణ, దుః ఖాయమాన, మానస+అగుచున్= ఆతడి మాటలు వినటంచేత శోకంతో నిండిన మనస్సు కలది అవుతూ; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: 'దేవతల దయవలన ఇతరుల కంటబడకుండ నేను ఈ అంతఃపురాన్ని ప్రవేశించగలిగాను. నీవు ఇంద్రప్రభృతులకు ప్రియం చేయుము'- అని నలుడు దమయంతితో పలికాడు. దమయంతి తొల్లి హంస చెప్పిన నాటినుండి నలుడిపై తన వలపు నిలుపుకొని క్రుంగి కృశిస్తూ ఉన్నట్టిది, ఇప్పుడు నలుడినే కనులార చూచింది. కాని, అతడి మాటలు విని మిక్కిలి దుఃఖిస్తూ ఈ విధంగా బదులు పలికింది.

తరువోజ.

'ఏ నేడ? నింద్రాదు లేడ? వారలకు ।
నెప్పుడు మ్రొక్కుదు; నేను నీ ధనమ
భూనాథ! నీ గుణంబులు హంసచేతఁ ।
బొలుపుగా విని మనంబున నిల్పియున్న
దాన; భవన్నిమిత్తమున ని ట్లఖిల ।
ధారుణినాథ సార్థంబు రావింపఁ
గా నిప్డు వలసె లోకఖ్యాతకీర్తి! ।
కరుణించి పతిబుద్ధిఁ గావింపు మిందు. 45

ప్రతిపదార్థం: ఏను+ఏడన్= నేను ఎక్కడ?; ఇంద్ర+ఆదులు= ఇంద్రుడు మున్నగువారు; ఏడ= ఎక్కడ?; వారలకున్+ఎప్పుడు, మ్రొక్కుదున్= వారికి (ఆ దేవతలకు) ఎప్పుడూ నేను నమస్కరిస్తాను; ఏను= నేను; నీ ధనము+అ= నీ సొత్తునే; భూనాథ!= ఓ నలమహారాజా!; నీ, గుణంబులు= నీ మంచి లక్షణాలు; హంసచేతన్; పొలుపుగా విని= ఒప్పుగా విని; మనంబునన్= మనస్సులో; నిల్పి+ఉన్నదానన్= దాచుకొని ఉన్నదానిని; భవత్+నిమిత్తమునన్= నీ కారణంచేత, అంటే నీకొరకే; ఇట్లు= ఈ స్వయంవరం అనే మిష కల్పించి; అఖిల, ధారుణి, నాథ, సార్థంబు= సకల రాజుల సమూహం; ఇప్డు= ఇపుడు; రావింపగాన్, వలసె= వచ్చేటట్లు చేయవలసి వచ్చింది; లోక, ఖ్యాత, కీర్తి!= జగమంతట ప్రసిద్ధిగాంచిన యశస్సుచేత వెలుగొందేవాడా!; ఇందున్= ఇచట; కరుణించి= దయచేసి; పతిబుద్ధిన్+కావింపుము= భర్తగా ఉండటానికి అంగీకరించుము.

తాత్పర్యం: 'మానవమాత్రురాలనయిన నే నెక్కడ? దేవత లైన ఇంద్రాదులు ఎక్కడ? నేను వారిని సదా నమస్కరించి అర్చిస్తానుగదా! ఓ నలమహారాజా! నేను నీ సొత్తును మాత్రమే. నీ గుణాలు హంస చెప్పింది మొదలు నిన్నే సదా నా మనస్సులో ధ్యానిస్తున్నాను. నీ రాకకొరకే ఇపుడు ఈ రాజులందరిని ఆహ్వానించవలసి వచ్చింది. ప్రపంచప్రసిద్ధమైన కీర్తిగల ఓ నలమహారాజా! దయచేసి నాకు పతిగా ఉండటానికి అంగీకరించుము.

విశేషం: ఛందస్సును గురించిన వివరణ ఆరణ్యపర్వం, ప్రథమాశ్వాసం తరువోజ (1.132) దగ్గర చూచేది.

వ. నీవు దీని కొడంబడనినాఁడు రజ్జు విషాగ్ని జలంబులం బ్రాణ పరిత్యాగంబు సేసికొందు' ననిన దానిం జూచి నలుం డిట్లనియె. 46

ప్రతిపదార్థం: నీవు; దీనికి= నీవు నా భర్తగా ఉండటానికి; ఒడంబడని నాఁడు= సమ్మతించని రోజున; రజ్జు, విష+అగ్ని, జలంబులన్= త్రాటితో, విషంతో, అగ్నితో, నీటిచేత; ప్రాణ, పరిత్యాగంబు+చేసికొందున్= ప్రాణాలు

వదలుతాను; అనినన్= అని చెప్పగా; దానిన్+చూచి= ఆ దమయంతిని చూచి; నలుండు= నలుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: నీవు నా భర్తగా ఉండటానికి సమ్మతించకపోతే నేను ఉరివేసికొని లేదా విషం త్రాగి లేదా నిప్పులో దూకి లేదా నీటిలో పడి ప్రాణాలు వదలుతాను'- అని చెప్పిన దమయంతిని చూచి నలుడు ఈ విధంగా బదులు పలికాడు.

మత్తకోకిలము.

'భూరిసత్త్వులు సర్వలోకవిభుల్ విభూతిసమృద్ధు లి
ద్ధోరుతేజులు నిన్నుఁ గోరుచు నున్నవా రమరోత్తముల్;
వారి పాదరజంబుఁ బోలనివాని నన్ను మనుష్య సం
సారిఁ గోరఁగఁ జన్నె? నీకుఁ బ్రసన్నులై సుర లుండఁగన్. 47

ప్రతిపదార్థం: భూరి, సత్త్వులు= గొప్ప బలం కలవారు; సర్వలోక, విభుల్= సమస్తలోకాలకు అధిపతులు; విభూతి, సమృద్ధులు= గొప్ప సంపద కలవారు; ఇద్ధ+ఉరు, తేజులు= ప్రకాశమానమైన గొప్పతేజం కలవారు; నిన్నున్+కోరుచున్+ఉన్నవారు= నిన్ను వలచి ఉన్నారు; అమర+ఉత్తముల్= దేవతాశ్రేష్ఠులు; వారి, పాద, రజంబున్+పోలనివానిన్= వారి పాదాలదుమ్ముతో సరిపోలని వాడిని; మనుష్య= మనుజమాత్రుడిని; సంసారిన్= జనన మరణ సహితమైన ఇహలోకంలోని సంసారంలో ఉన్నవాడిని; నీకు; ప్రసన్నులు+ఐ= నిన్ను చేపట్టటానికి సుముఖులై; సురలు= దేవతలు; ఉండఁగన్= ఉండగా; నన్ను; కోరఁగన్+చన్నె?= కోరవచ్చునా?

తాత్పర్యం: 'గొప్ప శక్తి కలవారు. సకలలోక పాలకులు, ఐశ్వర్య సమృద్ధులు, దేదీప్యమానమైన తేజస్సు కలవారు, దేవతలు నిన్ను వరిస్తుంటే, వారి పాదధూళితో కూడ సాటిరాని నన్ను- ఒక మానవమాత్రుడిని-జననమరణ రూపమైన ఇహలోక సంసారబంధంలో చిక్కుకొన్నవాడిని కోరుకొనదగునా?

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

క. దేవతల కప్రియంబులు ।
గావించు మనుష్యు లధమగతు లగుదు రిలం;
గావున వారి కభీష్టము ।
గావింపుము; నన్నుఁ బ్రీతిఁ గావుము తరుణీ!' 48

ప్రతిపదార్థం: తరుణీ= ఓ యువతీ!; ఇలన్= భూమిపై; దేవతలకు; అప్రియంబులు= ఇష్టం కాని పనులను; కావించు, మనుష్యులు= చేసే మనుజులు; అధమ, గతులు+ అగుదురు= హీనస్థితిని పొందేవారు అవుతారు; కావునన్= కాబట్టి; వారికి+అభీష్టము= ఆ దేవతలకు ఇష్టం; కావింపుము= చేయుము; నన్నున్= నన్ను; ప్రీతిన్= ప్రియంతో; కావుము= కాపాడుము.

తాత్పర్యం: ఓ దమయంతీ! భూలోకంలో దేవతలకు అప్రియాలు చేసినవారు అష్టకష్టాలపాలవుతారు. కావున, ఓ యువతీ! వారి ఇష్టాన్ని పాటించి ప్రీతితో నన్ను రక్షించుము'.

వ. అనిన దమయంతి నయనాంతర్గళిత బాష్పధారాకలిత కపోలయుగళ యగుచుం బెద్దయుంబ్రొద్దు చింతించి 'నీయభిప్రాయంబునకు నిరపాయంబైన యుపాయంబు గంటి; నింద్రాదులు నా స్వయంవరంబునకు వచ్చెదరేని వారి సన్నిధిని నిన్నువరియించెద; నట్లయిన నీకు నిర్దోషంబగు' ననిన నలుండు లోకపాలురపాలికిం బోయి దమయంతికిం దన పలికిన విధంబును దనకు దమయంతి పలికిన విధంబును జెప్పె; నంతఁ బుణ్యతిథి నక్షత్ర శుభముహూర్తంబున దమయంతీ స్వయంవరంబు ప్రవర్తిల్లిన. 49

ప్రతిపదార్థం: అనినన్= అని నలుడు చెప్పగా; దమయంతి; నయన+ అంతర్గళిత, బాష్ప, ధారా, కలిత, కపోల, యుగళ+అగుచున్= కన్నుల

లోపలనుండి జారిన కన్నీటివెల్లువతో కూడిన చెక్కిళ్ళు రెండును కలది అవుతూ; పెద్దయున్+ప్రొద్దు= చాలసేపు; చింతించి= విచారించి; నీ+అభి ప్రాయంబునకు= నీ ఉద్దేశానికి; నిరపాయంబు+ఐన= అపాయంలేనిదైన - అంటే కీడు కలుగని; ఉపాయంబు= వెరవు; కంటిన్= చూచాను; ఇంద్ర+ఆదులు= ఇంద్రుడు మున్నగువారు; నా, స్వయం వరంబునకు; వచ్చెదరు+ఏని= వచ్చినట్లయితే; వారి, సన్నిధిన= వారి సమక్షమందే; నిన్ను, వరియించెదన్= నిన్ను భర్తగా ఎన్నుకొంటాను; అట్లు+అయినన్= ఆ విధంగా జరిగితే; నీకు; నిర్దోషంబు+అగును= నీ పట్ల తప్పు ఉండదు; అనినన్= అని చెప్పగా; నలుండు= నలుడు; లోక, పాలుర, పాలికిన్+పోయి= దిక్పాలురపాలికి వెళ్ళి; దమయంతికిన్+తన, పలికిన, విధంబును= దమయంతితో తాను చెప్పిన మాటలతీరును; తనకు, దమయంతి, పలికిన, విధంబును= తనతో దమయంతి బదులు పలికిన తీరును; చెప్పెన్= చెప్పాడు; అంతన్= అంతట; పుణ్య, తిథి, నక్షత్ర, శుభ, ముహూర్తంబునన్= శుభప్రదమైన తిథితో, తారాబలంతో కూడిన మంచి లగ్నంలో; దమయంతీ, స్వయంవరంబు; ప్రవర్తిల్లినన్= జరుగగా.

తాత్పర్యం: అని నలుడు చెప్పగా దమయంతి కన్నులు చెమ్మగిల్లాయి. బాష్పాలు పెల్లుబికి ఆమె రెండు చెక్కిళ్లపై ప్రవహించాయి. ఆమె చాలాసేపు యోచించి నలుడితో ఇట్లా పలికింది. 'నీ అభిప్రాయానికి అపాయం లేని ఒక ఉపాయం తట్టింది. ఇంద్రుడు మున్నగు దిక్పాలకులు నా స్వయంవరానికి వస్తే, నేను వారి సమక్షంలోనే నిన్ను భర్తగా ఎన్నుకొనగలను. అప్పుడు నీపై తప్పు ఏమియు ఉండదుగదా!'- అనిన పిదప, నలుడు దిక్పాలకులదగ్గరకు వెళ్ళి, తాను దమయంతితో చెప్పిన మాటల తీరును, ఆమె తనకు బదులు పలికిన తీరును వివరించి చెప్పాడు. అంతట ఒక శుభముహూర్తంలో తిథినక్షత్రబలం గల లగ్నంలో దమయంతీ స్వయంవరం జరిగింది.

ఆ. 'నలున కాని నలినదళనేత్ర వరియింప।
దట్టె చూత' మనుచు నమరవరులు
నలువురును గడంగి నలరూపమున వచ్చి।
రా స్వయంవరమున కతిరయమున. 50

ప్రతిపదార్థం: నలున్+అ= నలుడినిమాత్రమే; కాని= తప్ప; నలిన, దళ, నేత్ర= తామరరేకులవంటి కన్నులుగల దమయంతి; వరియింపదు+అట్టె= పతిగా ఎన్నుకొనదట; చూతము= చూతుముగాక; అనుచున్= అంటూ; అమర, వరులు= దేవతలలో శ్రేష్ఠులైన; నలువురును; కడంగి= పూనికతో; నల, రూపమునన్= నలుడి ఆకారం ధరించి; అతిరయమునన్= మిక్కిలి వేగంతో; వచ్చిరి= (స్వయంవర మండపానికి) వచ్చారు.

తాత్పర్యం: 'నలుడిని తప్ప మరెవరిని దమయంతి వరియించదా? చూద్దాం!' అని ఆ దేవతాశ్రేష్ఠులు నలువురు నలరూపం ధరించి వేగంగా స్వయంవరానికి వచ్చారు.

వ. అంత. 51

తాత్పర్యం: అంతట. (ఆ స్వయంవర మంటపంలో ఒక విచిత్ర సన్నివేశం ఏర్పడింది. ఒకేవరుసలో ఐదుగురు నలమహారాజులు కూర్చొని ఉన్నారు. ఆ సమయంలో).

సీ. దమయంతి సితపుష్ప దామాభిశోభిత।
హస్తయై చనుదెంచి యంబుజాక్షి
యమ్మహోత్సవ దర్శనాగత రాజన్య।
నివహంబు నీక్షించి నెమ్మితోడ
నలువురు వేల్పులు నలుఁదొట్టి యప్పు డే।
కాకారులై యున్న నందు నలుని
నేర్పరింపఁగ నేర 'కింద్రాదులను నలు।
నెఱుఁగు నుపాయ మిం కెద్ది యొక్కొ?'

ఆ. యనుచు సంశయాకులాత్మయై 'సురలార! ।
నలు నెఱుంగువిధము నాకుఁజేయుఁ
డాత్మరూపధరుల రగుఁ' డని పరిదేవ ।
నంబు సేసెఁ దన మనంబులోన. 52

ప్రతిపదార్థం: దమయంతి; సిత, పుష్ప, దామ+అభిశోభిత, హస్త+ఐ= తెల్లని పూలదండచేత వెలుగొందిన చేతులుకలదై; చనుదెంచి= వచ్చి; అంబుజ+ అక్షి= పద్మాలవంటి కన్నులుకలది (అంబుజం= నీటిలో పుట్టింది-పద్మం); ఆ+మహా+ఉత్సవ, దర్శన+ఆగత, రాజన్య, నివహంబున్= ఆ గొప్ప పండుగను చూడటానికై వచ్చిన మహారాజ సమూహాన్ని; ఈక్షించి= చూచి; నెమ్మితోడ= ప్రీతితోడ; నలువురు, వేల్పులు= నలుగురు దేవతలు; నలున్+తొట్టి= నలుడితోపాటు, నలుణ్ణి అనుసరించి; అప్పుడు; ఏక+ ఆకారులు+ఐ+ఉన్నన్= ఒకేరూపం కలవారై ఉండగా; అందు= వారిలో; నలునిన్= నలుడిని; ఏర్పరింపఁగ నేరక= గుర్తింపజాలక; ఇంద్రాదులను= ఇంద్రుడు మొదలగువారిని; నలున్ ఎఱుఁగు= నలుని తెలిసికొనే; ఉపాయము= వెరవు; ఎద్ది+ఒక్కొ= ఏదైఉండవచ్చును?; అనుచు= అని తలపోస్తూ; సంశయ+ఆకుల+ ఆత్మ+ఐ= సందేహంచేత కలత చెందిన మనస్సు కలదై; సురలార!= ఓ దేవతలార!; నలున్= నలుడిని; ఎఱుంగు, విధము= తెలిసికొనేతీరు; నాకున్= నాకు; చేయుఁడు= కలుగజేయండి; ఆత్మ, రూప, ధరులరు+అగుఁడు= మీమీ నిజరూపాలను ధరించిన వారుగా కండి; అని; తన, మనంబులోనన్= తన మనస్సులో; పరిదేవనంబు+చేసెన్= దుఃఖంతో పలికింది.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు గల దమయంతి తనచేతులతో తెల్లని పూదండ పట్టుకొని వచ్చింది. ఆ స్వయంవర మహోత్సవాన్ని సందర్శించ వచ్చిన రాజన్యసమూహాన్ని వీక్షించింది. కాని, అచట నలుడితోపాటు మరి

నలువురు వేల్పులు నలుడి ఆకారంతోనే కనిపించారు. వారిలో అసలు నలుడు ఎవ్వరో ఏర్పరించలేక ఆమె సంశయాకుల చిత్తయై 'ఓ దేవతలారా! నాకు నలుడిని ఎన్నుకొనే పరిజ్ఞానం కలుగజేయండి; మీ నిజస్వరూపాలు ధరించండి' అని తన మనస్సులో దుఃఖిస్తూ ప్రార్థన చేసింది.

వ. దేవతలు దాని పరిదేవనంబు విని కరుణించి, యనిమిషలోచనం బులు నస్వేదగాత్రంబులు నొప్ప నవనీ తలంబు ముట్టక యాసన్నులై నిలిచి; రంత లోకపాలురును భూలోకంబునఁ గల రాజలోకంబు నవలోకించు చుండఁబుణ్యశ్లోకుండయిన నలు ధర్మవిధానంబున వరియించి, దమయంతి తదీయ స్కంధంబున సుగంధి కుసుమ దామకంబు వెట్టిన. 53

ప్రతిపదార్థం: దేవతలు= వేల్పులు; దాని= దమయంతియొక్క; పరిదే వనంబు= దీనాలాపాలు; విని= ఆలకించి; కరుణించి= దయకలిగి; అనిమిష. లోచనంబులున్= రెప్పపాటులేని కన్నులు; న+స్వేద, గాత్రంబులున్= చెమట లేని దేహాలు; ఒప్పన్= భాసించగా; అవనీ, తలంబు, ముట్టక= నేలపైభాగాన్ని తగులకుండ; ఆసన్నులు+ఐ, నిలిచిరి= దగ్గరగా ఉన్నవారైరి; అంత; లోకపాలురును= దిక్పాలకులున్నూ; భూ, లోకంబునన్+కల= భూలోకంలో ఉండే; రాజలోకంబున్= రాజ సమూహమున్నూ; అవలోకించుచుండన్= చూస్తుండగా; దమయంతి; పుణ్యశ్లోకుండు+అయిన= పుణ్యమైన కీర్తి కలవాడయిన (పుణ్యాత్ముడైన); నలున్= నలుడిని; ధర్మ విధానంబునన్= ధర్మమార్గాన; వరియించి= ఎన్నుకొని; తదీయ, స్కంధంబునన్= ఆతడి భుజంపై; సుగంధి, కుసుమ, దామకంబు= పరిమళించే పూలదండ; పెట్టినన్= వేయగా,

తాత్పర్యం: దేవతలు దమయంతి మొర విని కరుణించారు. వారు రెప్పలు మూతవడని కన్నులతో, చెమటపట్టని దేహాలతో, నేలను అంటక దగ్గరగా

నిలిచారు. అంత దిక్పాలకులూ, భూలోకంలోని రాజసమూహమూ చూస్తుండగా పుణ్యశ్లోకుడైన నలుడి భుజంపై (కంఠంలో) పూలదండ వేసి దమయంతి అతడిని వరుడిగా ఎన్నుకొన్నది.

క. దేవతల సాధువాదము।
తో విప్రాశీరవంబుతో బహు తూర్యా
రావంబులు సెలఁగెను, బా।
రావార రవంబుఁబోలె ననివార్యములై. 54

ప్రతిపదార్థం: దేవతల= వేల్పుల; సాధువాదముతోన్= శుభాకాంక్షల శబ్దాలతో; విప్ర+ఆశీః+రవంబుతోన్= బ్రాహ్మణుల దీవనల ధ్వనులతో, బహుతూర్య+ ఆరావంబులు= పెక్కు తూర్యధ్వనులు (తూర్యం= మంగళవాద్యం;) న+నివార్యములు+ ఐ= వారించటానికి వీలులేనివై; (అంటే స్వచ్ఛందంగా, సంకులంగా); పారావార, రవంబున్+పోలెన్= సముద్రఘోష వలె; చెలఁగెను= ఉప్పొంగాయి.

తాత్పర్యం: వేల్పుల శుభాకాంక్షల శబ్దాలు, బ్రాహ్మణుల ఆశీర్వాద నినాదాలు, అనేకవిధాల మంగళవాద్యాల ధ్వనులు కలిసి సముద్రఘోషవలె అతిశయించాయి.

విశేషం: అలం: ఉపమ.

నలుండు స్వయంవరలబ్ధ యయిన దమయంతిం బెండ్లియగుట (సం. 3-54-25)

వ. ఇట్లపూర్వ స్వయంవర లబ్ధయైన దమయంతి నత్యంత విలాసంబుతో వివాహంబైన యా నలునకు నింద్రుండు వానియజ్ఞంబులయందు నిజరూపంబుఁజూపను, నగ్నియు వరుణుండును వాని వలచిన చోటన యగ్ని జలంబు లుత్పాదింపను, ధర్ముండు ధర్మువునందవానిబుద్ధి వర్తిల్లను వరంబు లిచ్చి దేవలోకంబున కరుగువా రెదుర ద్వాపరంబుతో వచ్చు కలిం గని' యెందులకుం బోయెద?' వని యడిగిన నింద్రాదులకుఁ గలి యిట్లనియె. 55

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అపూర్వ, స్వయంవర, లబ్ధ+ఐన= పూర్వకాలంలో ఎన్నడు జరుగనట్టి స్వయంవరంలో లభించినట్టి; దమయంతిన్= దమయంతిని; అత్యంత, విలాసంబుతోన్= గొప్పవైభవంతో; వివాహంబు+ఐన= పెండ్లి కాగా; ఆ నలునకున్; ఇంద్రుండు; వాని, యజ్ఞంబుల+అందున్= ఆ నలుడి క్రతువులలో; నిజ, రూపంబున్+ చూపనున్= నిజమైన తన ఆకృతిని చూపటానికి అంటే ప్రత్యక్షమవటానికి; అగ్నియు, వరుణుండును; వాని, వలచిన, చోటన్+అ= ఆ నలుడు కోరిన స్థలంలోనే; అగ్ని= నిప్పు; జలంబులు= నీళ్ళు; ఉత్పాదింపను= కలిగేటట్లు చేయటానికి; ధర్ముండు= యముడు; ధర్మువునందు+అ= ధర్మంపైనే; వానిబుద్ధి= నలుడిబుద్ధి; వర్తిల్లను= వెలసేటట్లును; వరంబులు+ఇచ్చి= వరాలను అనుగ్రహించి; దేవలోకంబునకు= స్వర్గానికి; అరుగువారు= వెళ్ళేవారు; ఎదురన్= ఎదురుగా; ద్వాపరంబుతోన్= ద్వాపరంతో; వచ్చు= వస్తున్న; కలిన్+కని= కలి పురుషుడిని చూచి; ఎందులకున్+పోయెదవు?= ఎక్కడికి పోతున్నావు?; అని; అడిగినన్= ప్రశ్నించగా; ఇంద్రాదులకున్= ఇంద్రుడు మున్నగువారికి; కలి= కలిపురుషుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ విధంగా అత్యద్భుతమైన స్వయంవరంలో లభించిన దమయంతిని నలుడు మహావైభవోపేతంగా పెండ్లాడాడు. ఇంద్రుడు తాను స్వయంగా ప్రత్యక్షమై నలుడు చేసే యజ్ఞాలలో పాల్గొంటానని వరమిచ్చాడు. అగ్ని, వరుణుడుకూడా నలుడు కోరిన చోటులలో నిప్పు, నీరు లభించేటట్లు వరాలు అనుగ్రహించారు. యమధర్మరాజు నలుడి మనస్సు ధర్మంపైనే లగ్నమయ్యేటట్లు వరం ప్రసాదించాడు. వేల్పులు అట్లా నలుడికి వరాలిచ్చి

స్వర్గానికి వెళ్ళుతుండగా మార్గమధ్యంలో ద్వాపరపురుషుడితోపాటు వస్తున్న కలి కనిపించాడు. వారు కలిని 'నీవు ఎక్కడికి పోతున్నావు?' అనిప్రశ్నించారు.

తే. 'అవనిలో దమయంతీ స్వయంవరంబు।
విస్తరిల్లుట విని కడు వేడ్కతోడ
నేను దమయంతిచే వరియింపఁబడుదు।
నని తదర్థినై యరిగెద నాసఁ జేసి.' 56

ప్రతిపదార్థం: అవనిలోన్= భూలోకంలో; దమయంతీ, స్వయంవరంబు= దమయంతియొక్క స్వయంవరం; విస్తరిల్లుట విని= జరగటం విని; కడు, వేడ్కతోడన్= మిక్కిలి సంబరంతో; ఏను= నేను; దమయంతిచే= దమయంతిచేత; వరియింపన్+ పడుదున్= ఎన్నుకొనబడతాను; అని; తత్+అర్థిని+ఐ= ఆ కోరిక కలవాడినై; ఆసన్+ చేసి= ఆశతో; అరిగెదన్= వెళ్ళుతున్నాను.

తాత్పర్యం: 'భూలోకంలో దమయంతీ స్వయంవరం జరుగుతుందని వినిఉన్నాను. అందులో నేను దమయంతిచేత వరించబడతాననే సంబరంతో, ఆసతో, కోరికతో వెళ్ళుతున్నాను.'

విశేషం: జరిగేది దమయంతీ స్వయంవరం! ఆమె అతిలోకసౌందర్యవతి. జగదేకసుందరి. ఆమె ఇంద్రాదులనే తిరస్కరించింది. ఇక, కలిపురుషుడి ఆస ఎంతటి హాస్యాస్పదమైనది! శృంగారప్రకృతి మిక్కిలి గహనమైనది. గంభీరమైనది. తాను ఎంతటి కురూపి అయినను జగదేకసుందరిని కాంక్షించవచ్చును కదా!

వ. అనిన నందఱు నగి'నీ వందుల కేల పోయెద? దది ముందర నిర్వృత్తంబయ్యెఁ; నక్కోమలి యొరుల నెవ్వరి మెచ్చక నలుం డను వాని వరియించె' ననినం గలి కరం బలిగి, 'యన్నలునకు దమయంతికి రాజ్య విభవ పరిత్యాగంబును బరస్పర వియోగంబునుం జేసెద' నని నిశ్చయించి, వాని నక్షరతుంగా నెఱింగి, యక్షంబులం జొచ్చి యుండ ద్వాపరుం బనిచి, నలు సేయుచున్న యశ్వమేధాది కానేక భూరి దక్షిణ మహాక్రతువులయు జపహోమ దానాది వివిధ పుణ్యకర్మంబులయుఁ గారణంబునం జొర నవసరంబుఁ గానక, యంతరం బన్వేషించుచుఁ బెద్దకాలం బుండి, యొక్కనాఁ డతండు కృత మూత్రుండయి జలోపస్పర్శనానంతరంబునం బాదశౌచంబు సేయమఱచి సంధ్యోపాసనంబు సేసిన, నుపలబ్ధావసరుం డయి కలి నలు నందుఁ బ్రవేశించి, పుష్కరుం డను వాని పాలికిం బోయి త న్నెఱింగించి 'నీవు నలుని తో జూదంబాడి వాని రాజ్యంబును సర్వస్వంబును నోడిచికొ' మ్మని చెప్పి తానును వానికి విప్రవేషంబున సహాయుండై యక్షంబులు గొని పుష్కరునితో నొక్కటం జని నలుం గాంచి 'నీవు మాతో జూదం బాడు' మనిన. 57

ప్రతిపదార్థం: అనినన్= అనిచెప్పగా; అందఱున్= అందరును; నగి= నవ్వి; నీవు, (కలి); అందులకున్= అందుకొరకై; (అక్కడికి); ఏల, పోయెదు= ఎందుకు పోతున్నావు?; అది= ఆ దమయంతీ స్వయంవరం; ముందర= పూర్వమే; నిర్వృత్తంబు+అయ్యెన్= జరిగిపోయింది; ఆ, కోమలి= ఆ సుకుమారి; ఒరులన్+ఎవ్వరి, మెచ్చక= ఇతరులను ఎవరిని అంగీకరించక; నలుండు= నలుడు; అనువాని= అనే వరుడిని; వరియించెన్= పతిగా ఎన్నుకొన్నది; అనినన్= అనిచెప్పగా; కలి= కలిపురుషుడు; కరంబు+అలిగి= మిక్కిలి కోపించి; ఆ+నలునకు; దమయంతికి; రాజ్య, విభవ, పరిత్యాగంబును= రాజ్యసంపద తొలగిపోయేటట్లుగను; పరస్పర వియోగంబునున్= ఇరువురును ఒకరినొకరు ఎడబాసి ఉండేటట్లుగను; చేసెదన్= చేయగలను; అని; నిశ్చయించి= నిర్ణయించి; వానిన్= ఆ నలుడిని; అక్ష, రతున్+కాన్+ఎఱింగి= పాచికలలో ఇష్టంకలవాడినిగా తెలిసికొని; అక్షంబులన్+చొచ్చి+ఉండన్= పాచికలలో చొరబడి ఉండటానికి; ద్వాపరున్= ద్వాపర పురుషుడిని; పనిచి= నియోగించి; నలు+చేయుచున్న= నలుడు సలుపుతున్న; అశ్వమేధ+ఆదిక+అనేక, భూరి, దక్షిణ, మహాక్రతువులయు=

అశ్వమేధం మొదలయిన గొప్ప బహుమతులతో కూడిన పెక్కుక్రతువుల యొక్క; జప, హోమ, దాన+ఆది, వివిధ, పుణ్య, కర్మంబులయున్= జపాలు, హోమాలు, దానాలు మొదలుగాగల పెక్కు పుణ్యకార్యాలయొక్కయు; కారణంబునన్= హేతువుచేత; చొరన్= చొరబడటానికి; అవసరంబున్= సమయాన్ని; కానక= అరయక; అంతరంబు= అవకాశాన్ని; అన్వేషించుచున్= వెదకుతూ; పెద్ద, కాలంబు+ఉండి= చాలకాలం వేచిఉండి; ఒక్కనాఁడు= ఒకానొక రోజున; అతండు= ఆ నలుడు; కృతమూత్రుండు+అయి= మూత్రంచేసినవాడయి; జల+ఉప స్పర్శన+అనంతరంబునన్= నీటిని ముట్టుకొనిన పిమ్మట; పాదశౌచంబు= కాళ్ళ పరిశుభ్రత (కాళ్లు కడుగుకొనటం); చేయమఱచి= చేయటం మరచి; సంధ్యా+ఉపాసనంబు= సంధ్యావందనం; చేసినన్= చేయటంచేత; ఉపలబ్ధ+అవసరుండు+అయి= లభించిన అదను కలవాడై; కలి= కలిపురుషుడు; నలున్+అందున్= నలుడిలో; ప్రవేశించి= చొరబడి; పుష్కరుండు+అను, వాని పాలికిన్+పోయి= పుష్కరుడనేవాడిదగ్గరకు పోయి; తన్ను+ఎఱింగించి= తానెవరో వివరించి చెప్పి; నీవు; నలునితో; జూదంబు+ఆడి; వాని రాజ్యంబును; సర్వస్వంబునున్= సర్వసంపదలను; ఒడిచికొమ్ము= ఓడించి తీసికొనుము; అనిచెప్పి; తానును; వానికిన్= ఆ పుష్కరుడికి; విప్రవేషంబునన్= బ్రాహ్మణుడి ఆకృతితో; సహాయుండు+ఐ= తోడై; అక్షంబులు+కొని= పాచికలనుగైకొని; పుష్కరునితోన్; ఒక్కటన్+చని= కలిసి వెళ్ళి; నలున్+ కాంచి= నలుడిని చూచి; నీవు= ఓ నలమహారాజా!; మాతో= పుష్కరుడితో, తనతో; జూదంబు+ఆడుము+అనినన్= జూదాన్ని ఆడుమని అడుగగా.

తాత్పర్యం: కలిపురుషుడి మాటలు విని అందరు నవ్వారు. 'స్వయంవరం జరిగిపోయింది. ఇక నీప్రయాణం నిరర్థకం. ఆ సుకుమారి దమయంతి ఒరులను ఎవ్వరిని మెచ్చక నలమహారాజును వరించింది' అని దేవతలు చెప్పగా కలిపురుషుడికి నలుడిపై కోపం వచ్చింది. నలుడికి రాజ్యవైభవం పోగొట్టటానికి, నలదమయంతులకు పరస్పర వియోగాన్ని కల్పించటానికి

కలిపురుషుడు నిశ్చయించాడు. నలుడు ద్యూతప్రియు డని కలికి తెలిసింది. అందుచేత పాచికలలో ప్రవేశించుమని కలి తన సహచరుడైన ద్వాపరుడిని నియోగించాడు. తాను నలుడిలో ప్రవేశించ సంకల్పించాడు కాని, అతడికి అవకాశం చాలకాలంవరకు లభించలేదు. నలుడు అనవరతం అశ్వమేధాది యజ్ఞయాగాదులు నిర్వర్తించి, బ్రాహ్మణులకు అపార దక్షిణలు పంచిపెట్టుతూ ఉండేవాడు. జపం, తపం, హోమం, దానధర్మ పుణ్యకార్యాలు అతడి దినచర్యలయ్యాయి. కాని, ఒకనాడు నలుడు మూత్రవిసర్జన అనంతరం పాదప్రక్షాళనం మరచిపోయి సంధ్యావందన మాచరించాడు. అప్పుడు ఆ అశుచిత్వాన్ని ఆధారం చేసికొని కలి నలుడిలో ప్రవేశించాడు. తదుపరి కలి పుష్కరుడనే రాజు వద్దకు వెళ్ళి, తనను తాను పరిచయం చేసికొని, "నలుడితో జూదమాడి నలుడిరాజ్యాన్ని, సర్వసంపదలనూ గెలుచుకొమ్మని" ప్రోత్సహించాడు. పుష్కరుడు అందుకు సమ్మతించాడు. కలి బ్రాహ్మణవేషం ధరించి పాచికలు పట్టుకొని పుష్కరుడితోపాటు నలుడి ఒద్దకు పోయి, ఇద్దరూ అతడిని జూదమాడటానికి ఆహ్వానించారు.

విశేషం: ఈ భూలోకంలో మానవజాతి సమస్తాన్ని పట్టిపీడించే సర్వపాపాలకు సమష్టి పర్యాయపదం కలి. సమస్త దుర్గుణాలలో నీచాతినీచంగా ఎన్నదగింది అసూయ. కలి మూర్తీభవించిన మాత్సర్యం. నలదమయంతులు ఆదర్శ దంపతులు. నలుడు పుణ్యమూర్తి. కలిపురుషుడు అతడికి దవుదవ్వులలో నిలువవలసినవాడు. కాని, అటువంటి నలుడిని సమీపించటానికి కలికి అవకాశం కల్పించింది. 'అశౌచం'. మూత్ర విసర్జనానంతరం పాదప్రక్షాళన విస్మరించిన పరమపుణ్యమూర్తిలో కలి అశౌచంవలన ప్రవేశించగలిగాడు. "అశౌచం- కలిపురుషుడికి ప్రవేశద్వారం" అనే నీతి నలోపాఖ్యానంలో అంతర్గర్భితం. విశ్వసాహితీప్రపంచంలో నలోపాఖ్యానంవలె శుచిత్వానికి నిరుపమాన ప్రాధాన్యం కల్పించిన గాథ మరొకటి కనిపించదు. నిరంతరనిత్యజాగృతి, శుచిత్వ పరిరక్షణకు అత్యవసరం- అనే హెచ్చరిక

నలోపాఖ్యానంలో సునిశితంగా నిక్షిప్తమైనది. వావిళ్లప్రతిలో 'నీవు మారాజుతో జూదంబాడు మనిన'- అనే పాఠాంతరం ఉన్నది.

క. ద్యూతార్థము తత్కితవా।
హూతుఁడనై జూద మాడకుండుట ధర్మా
పేతం బని యభిముఖుఁడై।
యాతనితో నలుఁడు జూదమాడఁ గడంగెన్. 58

ప్రతిపదార్థం: ద్యూత+అర్థము= జూదం ఆడటంకొరకు; తత్, కితవ+ ఆహూతుఁడను+ఐ= ఆ జూదరులచేత పిలువబడినవాడినై; జూదము+ ఆడకుండుట; ధర్మ+ అపేతంబు+అని= అధర్మమని; అభిముఖుఁడు+ఐ= అనుకూలుడై, (ఎదురుమొగం కలవాడై- దీనికి వ్యతిరేకం విముఖుడు= పెడమొగం కలవాడు); నలుడు; ఆతనితో= ఆ పుష్కరుడితో; జూదము+ఆడన్= జూదమాడటానికి; కడంగెన్= పూనుకొన్నాడు.

తాత్పర్యం: 'జూదమాడటానికై ఆ జూదరులచేత పిలువబడినవాడనై జూదమాడ కుండటం అధర్మ' మని తలచి నలుడు సమ్మతించి పుష్కరుడితో జూదమాడటానికి పూనుకొన్నాడు.

విశేషం: జూదాన్ని ప్రాచీనులు సప్తవ్యసనాలలో చేర్చారు. సప్తవ్యసనాలు: 1.మృగయ (వేట) 2. మద్యం 3. మహిళ 4. ద్యూతం 5. వాక్పారుష్యం 6. దండపారుష్యం 7. అర్థదూషణం. ధర్మమూర్తి అయిన నలుడు సప్తవ్యసనాలలో ఒకటిగా ఎన్నబడిన ద్యూతక్రీడకు ఏల అభిముఖుడయ్యాడు? అనే ప్రశ్న ఉదయించక తప్పదు. ఆ ప్రశ్నకు సమాధానం (1) అలనాటి క్షత్రియ సంప్రదాయం. జూదమాడటంకొరకు వచ్చిన ఆహ్వానాన్ని తిరస్కరించరాదు అనేభావం. (2) నలుడు కలిగ్రస్తుడు. జూదంవలన దాపురించే అనర్థాన్ని నలోపాఖ్యానం నొక్కి వక్కాణించింది. జూదాన్ని వ్యసనంగానే అభివర్ణించింది కాని సమర్థించలేదు.

క. కలధనము లెల్ల నొడ్డుచు।
నలయక జూదమున విజితుఁడగుచుండె ని జా
ప్తులు వారించిన నుడుగక।
నలుఁడు కలిప్రేరణంబునను హతమతియై. 59

ప్రతిపదార్థం:కల, ధనములు+ఎల్లన్= ఉన్న సంపదలు అన్నియు; ఒడ్డుచున్= జూదంలో పణంగా పెట్టుతూ; అలయక= విసుగుచెందక; జూదమునన్= ద్యూతంలో; నిజ+ఆప్తులు= తనయొక్క హితులు; వారించినన్= అడ్డుపడినను; ఉడుగక= విరమించక; కలి ప్రేరణంబునను= కలియొక్క ప్రేరేపణవలన; హతమతి+ఐ= బుద్ధిహీనుడై; నలుఁడు; విజితుఁడు= ఓడిపోయినవాడు; అగుచుండెన్= అవుతుండెను.

తాత్పర్యం: నలుడు జూదం మొదలుపెట్టాడు. తనకున్న సంపదలనన్నింటిని పణంగాపెట్టి అలసట లేకుండా, ఆపకుండా జూదమాడసాగాడు. ఆప్తులు వారించినప్పటికీ, బుద్ధిహీనుడై జూదం మానలేదు. అది కలి ప్రేరణ. జూదంలో నలుడు వరుసగా ఓడుతూనే ఆడుతున్నాడు.

వ. ఇట్లనేక మాసంబులు దుర్వ్యసనాసక్తుం డయిన యన్నలుండు వివిధ వస్తువాహన నివహంబు లొడ్డి పుష్కరున కోటువడం బోయిన నెఱింగి పౌర బ్రాహ్మణ ప్రధాన వరులు దమయంతీ పురస్కృతులయి వచ్చి వారించి, కలి సమావేశపరవశుండైన యన్నలుచేతం బ్రతిహతు లయి వలుక కుండి; రంత దమయంతి చింతాక్రాంత చిత్తయై. 60

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; అనేక, మాసంబులు= పెక్కునెలలు; దుర్వ్యసన+ఆసక్తుండు+అయిన= దోషకార్యంలో అపేక్ష కలవాడయిన; ఆ+నలుండు; వివిధ, వస్తు, వాహన, నివహంబులు= పెక్కు వస్తువులు, వాహన సముదాయాలు; ఒడ్డి= జూదంలో పణంగాపెట్టి; పుష్కరునకు+ఓటు, పడన్+పోయినన్= పుష్కరుడి చేతిలో ఓడిపోవటానికి సంసిద్ధుడు కాగా;

ఎఱింగి= తెలిసికొని; పౌర, బ్రాహ్మణ, ప్రధాన, వరులు= పురజనులలో, విప్రులలో, మంత్రులలో గొప్పవారు; దమయంతీ పురస్కృతులు+ అయి= దమయంతిని తమముందు నిలబెట్టుకొనినవారై; వచ్చి= అరుదెంచి; వారించి= జూదం ఆడవద్దని అడ్డుచెప్పి; కలి సమావేశ పరవశుండు+ఐన= కలియొక్క కలయికచేత వివశత్వం చెందినట్టి; ఆ+నలుచేతన్= ఆ నలుడిచేత; ప్రతిహతులు+అయి= తిరస్కరించబడినవారై; పలుకకుండిరి= మౌనం వహించిరి; అంతన్= అటుపై; దమయంతి; చింతా+ఆక్రాంత, చిత్త+ఐ= దుఃఖంచేత ఆక్రమించబడిన మనస్సుకలదై.

తాత్పర్యం: ఈ విధంగా పెక్కునెలలు దుర్వ్యసనమైన జూదానికి లోబడి, అనేక వస్తువాహనాదులను పణంగా ఒడ్డి పుష్కరుడిచేత ఓటమి చెందటానికి సంసిద్ధుడైన నలుడి దగ్గరికి పౌరబ్రాహ్మణ మంత్రిశ్రేష్ఠులు దమయంతిని తమకు ముందుపెట్టుకొని వచ్చి అతడిని వారించారు. కాని, కలిప్రభావానికి లోబడి వివశుడై ఉన్న నలుడు వారిమాటలు వినలేదు. వారు మారుమాటాడలేక మిన్నకున్నారు. అంత దమయంతి దుఃఖంచేత ఆవరించబడిన మనస్సుకలదై.

ఆ. 'ఎంత యోటువడిన నంతియ జూదంబు।
నందుఁ దగులుఁ, జలము నతిశయిల్లు,
నేమి సేయు దాన ? నిది యెగ్గునకు మూల'।
మని లతాంగి దుఃఖితాత్మ యగుచు. **61**

ప్రతిపదార్థం: ఎంత+ఓటు+పడినన్= ఎంతగా ఓడిపోయినప్పటికిని; అంతియ= అంత ఎక్కువగానే; జూదంబునందున్= ద్యూతంలో; తగులున్= తగులుకోవటం అంటే నిమగ్నతయు; చలమున్= మాత్సర్యమును (పట్టుదలయు); అతిశయిల్లున్= పెరుగుతుంది; ఏమి+చేయుదానన్= ఏమి చేయగలను? అంటే నేను కేవలం నిస్సహాయురాలిని అని అర్థం; ఇది= ఈ జూదం; ఎగ్గునకు= కీడుకు; మూలము= హేతువు; అని= అని తలపోసి; దుఃఖిత+ఆత్మ+అగుచున్= పరితపించినట్టి ఆత్మ కలది అవుతూ.

తాత్పర్యం: 'ఓడినకొలది జూదంలో ఆసక్తి, మాత్సర్యం (పట్టుదల) పెరుగుతాయి. ఇక నే నేమి చేయగలను? ఇది కీడుకు మూలకారణం' అని సుకుమారి అయిన దమయంతి మిక్కిలి దుఃఖించింది.

సీ. అక్షముల్ పుష్కరునందు వశ్యంబులై।
యునికియు, నలునియం దొండువిధము
లగుటయు నెఱింగి, నిజాధీశ్వరున కప।
జయమ కా లక్షించి, సరసిజాక్షి
భర్తయనుజ్ఞ మున్ బడసి వార్ష్ణేయుఁడన్।
సారథిఁ బిలిచి 'యీ స్యందనమున
నింద్రసేనుండను నిక్కుమారకు నింద్ర।
సేన య న్యూఁతుఁ జెచ్చరను దోడు

ఆ. కొని విదర్భ కరిగి గుఱుకొని మద్బంధు।
జనులయొద్దఁ బెట్టి చట్ట రమ్మ'
యంచు నెమ్మిఁ బుచ్చె నాప్తపురోహిత।
మంత్రిబాంధవాభిమతము గాఁగ. **62**

ప్రతిపదార్థం: అక్షముల్= పాచికలు; పుష్కరునందున్= పుష్కరుడి చేతిలో; వశ్యంబులు+ఐ= స్వాధీనములై; ఉనికియు= ఉండటమున్నూ; నలుని+అందు; ఒండు, విధములు+అగుటయున్= వేరొకరీతిగా కావటమున్నూ; ఎఱిఁగి= తెలిసికొని; నిజ+అధీశ్వరునకున్= తన భర్తకు; అపజయము+అ= అపజయమే; కాన్, లక్షించి= ఓటమే అవుతుందని తలపోసి; సరసిజ+అక్షిన్= పద్మాలవంటి కన్నులుగల దమయంతి; భర్త+అనుజ్ఞ= భర్త(నలుడి) అనుమతి; మున్, పడసి= ముందు పొంది; వార్ష్ణే యుఁడు+అన్= వార్ష్ణేయుడు అనే; సారథిన్+పిలిచి= రథ చోదకుడిని పిలిచి; ఈ, స్యందనమునన్= ఈ రథంలో; ఇంద్రసేనుండు+ అను= ఇంద్రసేనుడనే; ఈ+ కుమారకున్= ఈ

కొడుకును; ఇంద్రసేన+అన్+కూఁతున్= ఇంద్రసేన అనేకూతురిని; చెచ్చెరను= శీఘ్రంగా; తోడుకొని= వెంటబెట్టుకొని; విదర్భకు+అరిగి= విదర్భకు పోయి; గుఱుకొని= పూనుకొని; మత్+బంధు జనుల+ఒద్దన్= నా చుట్టాల దగ్గర; పెట్టి= అప్పగించి; చట్ట, రమ్ము+అ= శీఘ్రంగా రావాలి; అంచున్= అంటూ; ఆప్త, పురోహిత, మంత్రి, బాంధవ+అభిమతము, కాఁగన్= హితులు, వైదికకర్మలు నిర్వహించే గురువులు, సచివులు, చుట్టాల యొక్క అభిప్రాయాన్ని పాటించే; నెమ్మిన్= ప్రీతితో; పుచ్చెన్=పంపింది.

తాత్పర్యం: పాచికలు పుష్కరుడికి అనుకూలంగా ఉండటాన్ని, నలుడికి ప్రతికూలంగా ఉండటాన్ని తెలిసికొని దమయంతి తన భర్తకు ఓటమి సిద్ధిస్తుందని తలపోసి, ముందే భర్త అనుమతిని పొంది, వార్ష్ణేయుడనే సారథిని పిలిచి 'ఈ రథంపై ఇంద్రసేనుడనే కుమారుడిని, ఇంద్రసేన అనే కూతురిని శీఘ్రంగా తీసికొని విదర్భకు వెళ్ళి అక్కడ నా బంధువుల దగ్గర దిగబెట్టి వేగంగా తిరిగిరమ్ము' అని దమయంతి నియోగించింది. ఆమె చేసిన పనిని ఆప్తులు, చుట్టాలు, వైదికకర్మలు నిర్వహించే గురువులు, మంత్రులు ఆమోదించారు.

క. నలుఁడును ధరణీరాజ్యము।
దలఁగఁగ సర్వంబు నపహృతం బైనఁ గడుం
దలరి దమయంతిఁ దోడ్కొని।
వెలువడియె నశేషరాజ్యవిభవచ్యుతుఁడై. 63

ప్రతిపదార్థం: నలుఁడును; ధరణీ, రాజ్యము= భూరాజ్యం; తలఁగఁగన్= తొలగిపోగా; సర్వంబున్= సమస్తమున్నూ; అపహృతంబు+ఐనన్= అపహరించబడింది కాగా; కడున్= మిక్కిలి; తలరి= పరితపించి; దమయంతిన్+తోడ్కొని= దమయంతిని వెంటబెట్టుకొని; అశేష, రాజ్య, విభవ, చ్యుతుఁడు+ఐ= సమస్త రాజ్యసంపద పోయినవాడై; వెలువడియెన్= (పురంనుండి) బయటికి వెళ్ళాడు.

తాత్పర్యం: జూదంలో భూరాజ్యం తొలగిపోయింది. సర్వస్వం అపహరించబడింది. నలుడు మిక్కిలి పరితపించి దమయంతిని వెంటపెట్టుకొని రాజ్యవైభవం, సంపద కోల్పోయి రాజధానినుండి బయటకు వెళ్ళాడు.

తే. పురమువెలి మూఁ డహోరాత్రములు వసించి।
యున్న నలుపాలి కెవ్వరు నోడి రరుగ
జనవిభుం డైన పుష్కరుశాసనమునఁ।
గలికృత ద్యూతవిద్వేష కారణమున. 64

ప్రతిపదార్థం: పురమువెలి= పట్టణం బయట; మూఁడు+అహోరాత్రములు= మూడు రాత్రుళ్ళు, పగళ్ళు; వసించి= నివసించి; ఉన్న= ఉన్నట్టి; నలుపాలికి= నలుడి దగ్గరకు; జన, విభుండు+ఐన= రాజైన; పుష్కరు, శాసనమునన్= పుష్కరుడి ఆజ్ఞవలన; కలి, కృత, ద్యూత, విద్వేష, కారణమునన్= కలిచేత ఏర్పరచబడిన జూదంమీది కోపంచేత; ఎవ్వరున్= ఎవరుకూడా; అరుగన్= వెళ్ళటానికి; ఓడిరి= జంకారు.

తాత్పర్యం: జూదంలో రాజ్యం కోల్పోయిన నలుడు పురంవెలుపల మూడుదినాలు నివసించాడు. రాజైన పుష్కరుడికి భయపడటంచేత, కలిప్రేరణచేత జూదంపై ఏర్పడిన ద్వేషంచేత పౌరులు ఎవరుకూడా నలుడిదగ్గరికి వెళ్ళలేదు.

వ. ఇట్లు సర్వజన సత్కారార్హుం డయ్యును నలుండు విధికృతంబున నెవ్విరివలనను సత్కారంబు గానక జలంబు లాహారంబుగాఁ దత్పుర సమీపంబున దమయంతీ ద్వితీయుండై యుండి, బుభుక్షాపీడ సహింప నోపక, 'హిరణ్యపక్షంబులతోఁ దమముందటఁ దిరుగుచున్న పక్షులం గని యవి భక్ష్యంబు లగు నని యప్పక్షులం బట్టికొన సమకట్టి తనకట్టిన పుట్టంబు వానిపై వైచిన, నవి పుట్టంబుతోన గగనంబున కెగసి నగుచు విగతవస్త్రుండైన నలున కి ట్లనియె. 65

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; సర్వజన, సత్కార+అర్హుండు+అయ్యును= జనులందరి చేత సమ్మానం పొందటానికి యోగ్యత కలవాడు అయినప్పటికిని; నలుండు= నలుడు; విధి, కృతంబునన్= దురదృష్టవశాన; ఎవ్వరి వలనను= ఎవరిచేతకూడా; సత్కారంబున్+కానక= సమ్మానం పొందలేక; జలంబులు= నీళ్ళు; ఆహారంబుగాన్= తిండిగా; తద్+పుర సమీపంబునన్= ఆ పట్టణానికి దగ్గరగా; దమయంతీ, ద్వితీయుండు+ఐ= దమయంతిని తోడుగాకలవాడై; ఉండి= కలసి ఉండి; బుభుక్షా, పీడ= ఆకలిబాధ; సహింపన్+ఓపక= తాళజాలక; హిరణ్యపక్షంబులతోన్= బంగారురెక్కలతో; తమ, ముందటన్= తమకు ఎదురుగా; తిరుగుచున్న= విహరిస్తున్న; పక్షులన్+కని= పిట్టలను చూచి; అవి= ఆ పక్షులు; భక్ష్యంబులు= భుజింపతగినవి; అగును+అని= అవుతాయని తలపోసి; ఆ+పక్షులన్+ పట్టికొనన్= ఆ పక్షులను పట్టుకొనటానికి; సమకట్టి= పూని; తన, కట్టిన, పుట్టంబు= తాను ధరించిన వస్త్రం; వానిపై= ఆ పక్షులపై; వైచినన్= విసరగా; అవి= ఆ పక్షులు; పుట్టంబుతోనన్= వస్త్రంతోనే; గగనంబునకు= ఆకాశానికి; ఎగసి= ఎగిరి; నగుచున్= పరిహసిస్తూ; విగత, వస్త్రుండు+ఐన= పోయిన పుట్టం కలవాడైన; నలునకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాయి.

తాత్పర్యం: సర్వజనులచేత సత్కారాన్ని పొందటానికి యోగ్యత కలవాడైనను నలుడు విధిపరిపాకంచేత, ఎవరిచేతను గౌరవించబడక నీళ్ళు మాత్రమే ఆహారంగా గైకొని దమయంతియు, తాను ఇరువురు మాత్రమే ఆ పట్టణ సమీపంలో ఉన్నారు. అప్పుడు వారిముందు బంగారురెక్కలు గల పక్షులు విహరిస్తూ కనిపించాయి. నలుడు ఆకలిబాధ తాళలేక ఆ పక్షులు ఆహారంగా ఉపకరిస్తాయని ఆలోచించి, వాటిని పట్టుకొనటానికై తాను కట్టుకొన్న వస్త్రాన్ని తీసి వాటిపై విసిరాడు. ఆ పక్షులు నలుడు విసరిన వస్త్రంతోపాటు ఆకాశంలోకి ఎగిరిపోయి, నవ్వుతూ అతడితో ఇట్లా పలికాయి.

విశేషం: ఆ పక్షులు, బంగారురెక్కలు కలవి. అవి అసలు పక్షులు కావు. నలుడిని ప్రలోభపెట్టటానికి వచ్చిన పాచికలు! పాచికలపైగల వ్యామోహం బంగారురెక్కలు గల పిట్టలుగా ఉత్ప్రేక్షించబడటం మనోహరకల్పన.

నలుండు దమయంతీసహితుండై యడవికిఁ బోవుట (సం.3-58-25)

తే. 'నీ ధనంబును రాజ్యంబు నికృతిఁ గొన్న।
యక్షముల మేము; నీ వస్త్ర మపహరింపఁ
బక్షిరూపులమై వచ్చి పార్థివేంద్ర!।
యపహరించితి' మని చెప్పి యరిగెఁ జదల. 66

ప్రతిపదార్థం: పార్థివ+ఇంద్ర!= రాజులలో శ్రేష్ఠుడా! అంటే ఓ నలమహారాజా!; నీ ధనంబును= నీ(డబ్బు) సంపదను; రాజ్యంబున్= రాజ్యాన్ని; నికృతిన్+కొన్న= మోసంచేత గ్రహించిన; అక్షములము= పాచికలము; ఏము= మేము; నీ వస్త్రము+ అపహరింపన్= నీవు కట్టుకొన్న వస్త్రాన్ని మోసంతో తీసికొనటానికి; పక్షిరూపులము+ఐ= పిట్టల ఆకారం ధరించినవారమై; వచ్చి= అరుదెంచి; అపహరించితిమి= మోసంతో గ్రహించాం; అని, చెప్పి; చదలన్= ఆకాశంలో; అరిగెన్= వెళ్ళిపోయాయి.

తాత్పర్యం: 'ఓ నలమహారాజా! నీ సంపద, నీ రాజ్యం, మోసగించి పరిగ్రహించిన పాచికలం మేము. పక్షులరూపం ధరించి, నిన్ను మోసగించి నీవు కట్టిన బట్టలను గూడ అపహరించడానికి వచ్చాం, అపహరించాం' అని ఆ పక్షులు నలుడితో చెప్పి ఆకాశమార్గాన్ని బట్టి ఎగిరిపోయాయి.

వ. నలుండును వానిం జూచి విస్మయం బంది 'యీ యక్షంబుల దోషంబునం గా కేమి? నా కిట్టి దయ్యె' ననుచు దమయంతి కట్టిన పుట్టంబుచెఱంగు గట్టికొనియె; నట్లిద్దఱు నేకవస్త్రులయి యొండొరుల మొగంబులు సూచి దుఃఖించుచో నలుండు దమయంతి కి ట్లనియె. 67

ప్రతిపదార్థం:నలుండును= నలుడును; వానిన్+చూచి= ఆ పిట్టలను చూచి; విస్మయంబు+ అంది= ఆశ్చర్యపడి; ఈ+అక్షంబుల, దోషంబునన్+ కాక+ఏమి=ఈ పాచికలదోషంవలన కాక మరేమిటి; నాకు+ఇట్టిది+ అయ్యెన్= నాకు, ఇటువంటి అవస్థ దాపురించింది; అనుచున్= అని తలపోస్తూ; దమయంతి, కట్టిన, పుట్టంబు చెఱంగు= దమయంతి ధరించినట్టి చీరకొంగు; కట్టికొనియెన్= కట్టుకొన్నాడు; అట్లు+ఇద్దఱు= ఆ విధంగా ఇరువురు; ఏక వస్త్రులు+అయి= ఒకేచీర ధరించిన వారయి; ఒండొరుల, మొగంబులు, చూచి= ఒకరిమొగం ఒకరు చూచి; దుఃఖించుచోన్= పరితపిస్తున్నప్పుడు; నలుండు; దమయంతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: నలుడుకూడ ఆ పిట్టల పలుకులు విని ఆశ్చర్యపోయాడు. 'నాకు ఈ దుఃస్థితి దాపురించటానికి ఈ పాచికల దోషం గాక మరేమి కారణం ఉన్నది?' అని తలపోస్తూ దమయంతి కట్టిన వస్త్రంయొక్క చెరగునే తానుకూడ ధరించాడు. ఈ రీతిగా ఆ ఇద్దరు ఒకేచీర ధరించి ఒండొరుల మొగాలు చూచికొని పరితపిస్తున్నప్పుడు నలుడు దమయంతితో ఇట్లా అన్నాడు.

క. 'ఇది దక్షిణాపథంబున, ।
కిదియు విదర్భాపురమున, కిది కోసల, కి
య్యది యుజ్జయినికిఁ దెరువులు; ।
మది నిన్నిటిలోన నరుగ మన కెద్దియగున్? 68

ప్రతిపదార్థం: ఇది= ఈ బాట; దక్షిణాపథంబునకు= దక్షిణభారతభూమికి; ఇదియు= ఈ బాటేమో; విదర్భాపురమునకు= విదర్భానగరానికి; ఇది= ఈ బాట; కోసలకు= కోసలదేశానికి; ఈ+అది= ఈ బాట; ఉజ్జయినికిన్= ఉజ్జయిని పట్టణానికి; తెరువులు= మార్గాలు; మదిన్= నీ ఉద్దేశం (మనస్సు)లో; ఇన్నిటిలోనన్= ఈ దారులన్నిటిలో; మనకు+ఎద్ది= మనకు ఏది?; అరుగ+అగున్= వెళ్ళటానికి అనువైంది అవుతుంది?

తాత్పర్యం: 'ఇది దక్షిణాపథానికి దారి. ఇది విదర్భాపట్టణానికి పోయేబాట. ఇది కోసల దేశానికి వెళ్ళేమార్గం. ఇది ఉజ్జయినీ నగరానికి వెళ్ళేత్రోవ. ఈ తెరువులు అన్నింటిలో మనం వెళ్ళటానికి నీ ఉద్దేశంలో అనువైనది ఏది?'- అని దమయంతిని నలుడు ప్రశ్నించాడు.

విశేషం: దక్షిణంలో దక్షిణాపథం, ఉత్తరంలో విదర్భ, తూర్పున కోసల, పశ్చిమంలో ఉజ్జయిని పేర్కొనబడినాయి. ఈ శృంగాటకం (నాలుగుదారుల కూడలి)లో మహాభారత రచనాకాలానికే సుదూరాలకు వెళ్ళే సుప్రసిద్ధమైన దారులు భారతదేశంలో ఏర్పడి ఉన్నట్లు గ్రహించవచ్చును.

క. అడవులలో నాతోఁ గడు ।
నిడుమలు వడనోప; వరుగు మిందుముఖీ! యి
ప్పుడు నీ బంధుజనంబుల ।
కడ' కనవుడుఁ దరుణి శోకగద్గద యగుచున్. 69

ప్రతిపదార్థం: ఇందుముఖీ!= చంద్రుడివంటి మొగం కలదానా!; అడవుల లోన్; నాతోన్= నాతో; కడు+ఇడుమలు= మిక్కిలి కష్టాలు; పడన్+ఓపవు= అనుభవించలేవు; ఇప్పుడు; నీ, బంధుజనంబుల, కడకు= నీ చుట్టాల దగ్గరికి; అరుగుము= వెళ్ళుము; అనవుడున్= అని చెప్పగా; తరుణి= యౌవనవతి అయిన దమయంతి; శోక, గద్గద+అగుచున్= దుఃఖంచేత కంపించిన కంఠస్వరం కలదై.

తాత్పర్యం: చంద్రబింబం వంటి ముఖం గల ఓ దమయంతీ! నాతో ఈ అడవులలో కష్టాలు పడుతూ తిరుగజాలవు. ఇపుడు మీ పుట్టినింటికి పోయి బంధుజనులతో సుఖించుము' - అని నలుడు పలుకగా, దుఃఖంచేత కంపించే కంఠస్వరం కలదై (దమయంతి).

ఆ. అతని కిట్టు లనియె 'నవనీశ! నీవును ।
నేనుఁ జని విదర్భ నిష్టలీల

నుండుదము; మృగాకులోగ్రవనంబుల।
కరుగ నేల? యిడుమ లంద నేల?' **70**

ప్రతిపదార్థం: అతనికి= ఆ నలుడితో; ఇట్టులు= ఈ విధంగా; అనియెన్= (దమయంతి) పలికింది; అవని+ఈశ!= ఓ రాజా!; నీవును, నేనున్= నీవు మరియు నేను; చని= వెళ్ళి; విదర్భన్= విదర్భలో; ఇష్టలీలన్+ఉండుదము= ఇష్టానుసారంగా ఉందాం; మృగ+ఆకుల+ఉగ్ర, వనంబులకు= క్రూర జంతువులతో వ్యాపించి భీతిగొలిపే (భయంకరమైన) అడవులకు; అరుగన్+ఏల= వెళ్ళటమెందుకు?; ఇడుమలు+ అందన్+ఏల= కష్టాలు అనుభవించట మెందుకు?

తాత్పర్యం: దమయంతి నలుడితో ఇట్లా చెప్పింది - 'ఓ నలమహారాజా! నీవూ, నేనూ విదర్భకు వెళ్ళి సుఖంగా ఉందాం. క్రూరమృగాలచేత భయంకరాలైన ఈ అడవులలో కష్టాలను అనుభవించటం ఎందుకు?'

వ. అనిన విని నలుం డవనతాననుండై 'నీ చెప్పినట్ల విదర్భేశ్వరు రాజ్యంబును మన రాజ్యంబ; యేను దొల్లి యధికైశ్వర్యయుతుండనై యందులకుంబోయి బంధుజనులకు హృదయానందంబు సేసి, యిప్పు డివ్విధంబున సర్వ స్వహీనుండనై యెట్లు పోవనేర్తు?' ననిన దమయంతి యిట్లనియె. **71**

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; విని; నలుండు= నలుడు; అవనత+ ఆననుండు+ఐ= వంచిన మొగం కలవాడై; నీ, చెప్పిన+అట్లు+అ= నీవు చెప్పిన రీతిగానే; విదర్భ+ఈశ్వరు= విదర్భేశ్వరుడి - అంటే విదర్భప్రభువు యొక్క; రాజ్యంబును= రాజ్యం; మనరాజ్యంబు+అ= మన రాజ్యమే; ఏను= నేను; తొల్లి= పూర్వం; అధిక+ ఐశ్వర్యయుతుండను+ఐ= ఎక్కువ సంపదతో కూడినవాడినై; అందులకున్, పోయి= ఆ విదర్భకు వెళ్ళి; బంధు, జనులకున్= చుట్టాలకు; హృదయ+ ఆనందంబు+ చేసి= హృదయాలకు ఆనందం కల్పించి; ఇప్పుడు+ఈ+విధంబునన్= ఇప్పు డీ రీతిగా; సర్వస్వహీనుండను+ ఐ= అంతయు పోగొట్టుకొన్నవాడినై; ఎట్లు= ఏ విధంగా; పోవ, నేర్తును= పోగలను; అనినన్= అని చెప్పగా; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నలుడు మొగం వాల్చికొని దమయంతితో ఇట్లా చెప్పాడు. 'నీవు చెప్పినట్లు విదర్భప్రభువు రాజ్యంగూడ మనరాజ్యంగానే భావించుకొన వచ్చును. కాని, మునుపు నేను సమస్తసంపదలతో తులతూగుతూ విదర్భకు వెళ్ళి బంధువులందరికి అపరిమితా నందాన్ని కలిగించినవాడినికదా! ఇప్పుడు అంతా పోగొట్టుకొని పరమ దరిద్రుడనై అక్కడికి ఎట్లా పోగలను? నాకు ఎట్లా మొగం చెల్లుతుంది?'- అని అనగా అతడితో దమయంతి ఇట్లా అన్నది.

తే. 'అధికదుఃఖరోగార్తున కౌషధంబు।
సురుచిరంబుగ భార్యయ చూవె యెందు;
నొనర భార్యాసమేతుఁడై యున్నవాని।
కెంతలయ్యును నాపద లెఱుకపడవు. **72**

ప్రతిపదార్థం: అధిక, దుఃఖ, రోగ+ఆర్తునకు= తీవ్రమైన దుఃఖంఅనే, రోగంచేత పీడించబడేవాడికి; ఔషధంబు= మందు; సు, రుచిరంబుగన్= సుస్పష్టంగా (సు= మంచి; రుచిరము= వెలుగొందేది); ఎందున్= ఎచటనైనా; భార్య+అ, చూవె= పెండ్లామే సుమా!; ఒనరన్= ఒప్పేటట్లుగా; భార్యా, సమేతుఁడు+ఐ+ఉన్నవానికి= భార్యతో కలిసి ఉండేవాడికి; ఎంతలు+ అయ్యునున్= ఎంతెంత తీవ్రాలైనప్పటికిని; ఆపదలు= కష్టాలు; ఎఱుక, పడవు= అనుభవిస్తున్నట్లు తెలియబడవు.

తాత్పర్యం: గొప్పదుఃఖ మనే రోగంతో పీడితుడైనవాడికి మంచిమందు భార్యయే సుమా! భార్యతో కూడి ఉన్నవాడికి ఎంతటి కష్టాలైనా అనుభవిస్తున్నట్లు అనిపించవు.

క. అలసి నెడ, డస్సి నెడ, నాఁ ।
కలి దప్పియు నైన యెడలఁ గడుకొని ధరణీ
తలనాథ! పురుషునకు ని ।
మ్ముల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్. 73

ప్రతిపదార్థం: అలసిన+ఎడన్= విసిగిఉన్న సమయంలో; డస్సిన+ఎడన్= బడలిన సమయంలో; ఆఁకలి, దప్పియున్+ఐన+ఎడలన్= తిండి తినాలని, నీరు త్రాగాలని అనిపించే సమయాలలో; కడుకొని= పూనుకొని; ధరణీ, తల, నాథ!= (భూస్థలికి భర్త అయిన వాడా) ఓ నలమహారాజా!; పురుషునకున్= మగవాడికి (భర్తకు); ఇమ్ములన్= ప్రీతితో; చిత్తమునన్= మనస్సులోని; దుః ఖంబుల్; భార్య+అ= భార్యయే; పాచున్= పోగొట్టుతుంది.

తాత్పర్యం: ఓ నలమహారాజా! విసిగిఉన్న సమయంలో, బడలిన సమయంలో, ఆఁకలి అయిన వేళలో, దాహం వేసినపుడు, మగవాడికి ప్రీతితో తోడ్పడి, భార్యయే అతడి మనస్సులోని దుఃఖాలను పోగొట్టుతుంది.

వ. కావున నిది మదనుజీవిత యనియు, ననువ్రత యనియు ననుకంపనీయ యనియు, నన్ను విడువక నా యనుగమనంబున కొడంబడు' మనిన 'నట్ల చేయుదుఁ, బ్రాణసమాన వైన నిన్నేల విడుతు; నోడకుండు' మని నలుండు దనదేవి నాశ్వాసించుచు నొక్కటఁ జని విజనంబైన విపినంబున నొక్క సభం గని యందు విశ్రమించి, పరుషధూళిధూసర స్థలంబున శయనించి, మార్గశ్రమ నిమీలిత నయనుండై దుఃఖంబునఁ గన్నులు వొందకున్న లేచి, తనపాదంబుల యంతికంబున నతిక్లేశపరవశయై నిద్రవోయెడు దమయంతిం జూచి. 74

ప్రతిపదార్థం: కావునన్= కాబట్టి; ఇది=ఈమె (దమయంతి); మత్+అను జీవిత= నాపై ఆధారపడి బ్రతికేది; అనియున్; అనువ్రత= తనను అన్నిట అనుసరించేది; అనియున్; అనుకంపనీయ+అనియున్= దయచూపతగింద నిన్నీ; నన్ను, విడువక= నన్ను విడిచిపెట్టక; నా, అనుగమనంబునకున్= నేను వెంట రావటానికి; ఒడంబడుము= సమ్మతించుము; అనినన్= అని పలుకగా; అట్లు+అ+చేయుదున్= అట్లే చేస్తాను; ప్రాణసమానవు+ఐన= ప్రాణంతో సమానమైనదానవైన; నిన్ను+ఏలన్= నిన్నెందుకు?; విడుతున్= విడిచి పెట్టుతాను; ఓడకుండుము= భయపడకుండా ఉండుము; అని= అని చెప్పి; నలుండు= నలుడు; తన, దేవిన్= తనరాణి అయిన దమయంతిని; ఆశ్వాసించుచున్= ఓదార్చుచు; ఒక్కటన్+చని= ఏకాంతంగా వెళ్ళి; వి, జనంబు+ఐన= జనులు లేని; విపినంబునన్= అడవిలో; ఒక్క, సభన్+కని= ఒక గృహాన్ని చూచి (ఒక ఎత్తైన మంటపాన్ని చూచి); అందు= ఆ ఇంటిలో (ఆ స్థలంలో); విశ్రమించి= అలసట తీర్చికొని; పరుష, ధూళి, ధూసర, స్థలంబునన్= మొరటుదుమ్ముతో బూడిదరంగుగా ఉండే నేలపై - కఠినమైన దుమ్ముకొట్టుకొని ఉన్ననేలపై; శయనించి= పండుకొని; మార్గ, శ్రమ, నిమీలిత, నయనుండు+ఐ= దారిలో నడచిన బడలికచేత మూయబడిన కన్నులు కలవాడై; దుఃఖంబునన్= పరితాపంచేత; కన్నులు+పొందకున్నన్= నిదుర (కనుకూర్కు) రాకపోగా; లేచి= మేలుకొని; తన పాదంబుల+అంతికం బునన్= తన అడుగుల దగ్గర; అతి, క్లేశ, పరవశ+ఐ= మిక్కుటమైన బాధకు లోనై; నిద్ర+పోయెడు= నిదురిస్తున్న; దమయంతిన్+చూచి= దమయంతిని చూచి.

తాత్పర్యం: కాబట్టి, ఈమె నాపై ఆధారపడి బ్రతికేదనీ, నన్ను అన్నిట అనుసరించేదనీ, దయ చూపతగినదనీ నన్ను విడువక నేను నీతో రావటానికి సమ్మతించుము'- అని దమయంతి నలుడిని ప్రార్థించింది. నలుడు 'అట్లాగే చేస్తాను. నీవు నాకు నా ప్రాణాలతో సమానురాలవు; నిన్నెందుకు విడిచిపెట్టుతాను? భయపడకుము'- అని దమయంతిని ఓదార్చాడు. అంత వారు అడవిలో ఏకాంతంగా పయనించి ఒక్కచోట ఒక గృహాన్ని (మంటపాన్ని)

చూచారు. నిర్మానుష్యమైన ఆ అడవిలోని ఆ ఇంటిలో (ఆ స్థలంలో) మొరటుదుమ్ముతో బూడిదరంగుగా ఉన్న (కఠినమైన దుమ్ము కొట్టుకొని ఉన్న) నేలపై పడుకొన్నారు. నలుడు మార్గాయాసం తొలగించుకొనటానికై కనులు మూసికొన్నాడు. కాని, అతడికి నిదుర రాలేదు. లేచి చూచేసరికి దమయంతి అతడి పాదాలసమీపంలో, దారిలో పడిన శ్రమకు బాగా అలసిపోయి గాఢంగా నిద్రపోతున్నది. అట్టి దమయంతిని చూచి నలుడు.

సీ. 'ధరణిరాజ్యంబుతో ధనమెల్లఁ బరులచే।
నపహృతం బగుటయు, నాప్తమిత్ర
బంధుజనంబులుఁ బ్రకృతిజనంబులు।
విడుచుటయును, మహావిపినభూమిఁ
బత్నితోఁ దన పరిభ్రమియించుటయు నప్డు।
దలఁచి శోకించి, యిత్తరుణి దొల్లి
మృదుశయనంబున మెలఁతలు మెలపుతో।
నడుగు లొత్తఁగ నిద్ర యనుభవించు

ఆ. కోమలాంగి యిపుడు గుఱుకొని పాంసుల।
స్థలమునందు నిద్ర దగిలినదియుఁ
బంకజాక్షి నాకు భార్యయై యింత దుః।
ఖంబు వొందె దైవఘటనఁ జేసి. 75

ప్రతిపదార్థం: ధరణి, రాజ్యంబుతోన్= భూరాజ్యంతోపాటు; ధనము+ఎల్లన్= సంపద అంతయు; పరులచేన్= శత్రువులచేత; అపహృతంబు+అగుటయున్= అపహరించ బడటమున్నూ; ఆప్త, మిత్ర, బంధు జనంబులున్= హితులు, చెలికాండ్రు, చుట్టాలు; ప్రకృతి జనంబులు= సాధారణ ప్రజలు; విడుచుటయును= వీడటమున్నూ; మహా, విపిన, భూమిన్= గొప్ప అడవి ప్రదేశంలో; పత్నితోన్= భార్యతో; తన, పరిభ్రమియించు టయున్= తాను తిరుగాడుతుండటమున్నూ; అప్డు= అపుడు; తలఁచి= తలపోసి; శోకించి= దుఃఖించి; ఈ+తరుణి= ఈ యౌవనవతి అయిన దమయంతి; తొల్లి= మునుపు; మృదు, శయనంబునన్= మెత్తని పరుపుపై; మెలఁతలు= చెలికత్తెలు; మెలపుతోన్= శ్రద్ధతో; అడుగులు+ఒత్తఁగన్= పాదాలు ఒత్తుతుండగా; నిద్ర+అనుభవించు= నిదురపోయే; కోమల+అంగి= సుకుమారి; ఇపుడు= ఇప్పుడు; గుఱుకొని= పూనికతో; పాంసుల, స్థలమునందు= దుమ్ముతో నిండినచోట; నిద్ర+తగిలినదియున్= నిద్రపోతున్నట్టిదియు; పంకజ+అక్షి= (బురదలో పుట్టింది పంకజం= పద్మం) పద్మంవంటి కన్నులుకలది; దైవ, ఘటనన్+చేసి= దైవంయొక్క కూర్పువలన; నాకు; భార్య+ఐ; ఇంత, దుః ఖంబు+పొందెన్= ఇంత పరితాపం పొందింది.

తాత్పర్యం: భూరాజ్యంతోపాటు సమస్తసంపద శత్రువులచేత అపహరించబడటమున్నూ; హితులు, బంధువులు, మిత్రులు, సాధారణ పౌరులు తనను విడనాడటమున్నూ; పెద్ద అడవిలో తాను తిరగటాన్ని నలుడు తలపోసి మిక్కిలి పరితపించాడు. 'ఈ దమయంతి తొల్లి మెత్తనైన పరుపులపై జాగరూకతతో చెలికత్తెలు పాదాలు ఒత్తుతుంటే శయనిస్తుండేది. నేడు ఈ దుమ్మునేలపై నిదురపోతున్నది. విధిపరిపాకంచేత ఇట్టి కష్టాలు ఈమె నాకు భార్య అవటంచేత పొందుతున్నది కదా!'- అని మిక్కిలి దుఃఖించాడు.

వ. ఏను దీని దుఃఖంబుఁ జూడ నోప; నెట యేనియుం బోయెద; నిది నన్నుం గానక తన బంధువుల యొద్దకుం బోయి దుఃఖంబులం బొరయకుండు' నని విచారించి, పోవ సమకట్టి యక్కోమలి మేలుకొనకుండ మెల్లన దాని వస్త్రంబు నర్ధంబు సించి తనకుం బరిధానంబు సేసికొని వెలువడి కొండొకనేలయరిగి, దమయంతి యందు ఘనంబైన తన నెయ్యం బను తీఁగం ద్రెంపనేరక క్రమ్మఱి వచ్చి. 76

ప్రతిపదార్థం: ఏను=నేను; దీని= ఈ దమయంతి; దుఃఖంబున్= దుః ఖాన్ని; చూడన్+ ఓపను= చూడజాలను; ఎట+ఏనియున్= ఇంకెక్కడికైనా;

పోయెదను= వెళ్ళుతాను; ఇది= ఈ దమయంతి; నన్నున్+కానక= నేను కనిపించక (నన్ను చూడక); తన, బంధువుల+ఒద్దకున్+పోయి= తన చుట్టాల దగ్గరకు పోయి; దుఃఖంబులన్= బాధలను; పొరయక+ఉండున్= పొందక ఉంటుంది; అని; విచారించి= యోచించి; పోవ, సమకట్టి= వెళ్ళటానికి ఉద్యమించి; ఆ+కోమలి= ఆ సుకుమారి అయిన దమయంతి; మేలుకొన కుండన్= నిద్రనుండి లేవకుండ; మెల్లన= మెల్లగా; దాని= ఆ దమయంతియొక్క; వస్త్రంబున్= చీరను; అర్ధంబు= సగం; చించి=త్రెంపి; తనకున్, పరిధానంబు+చేసికొని= తనకు కట్టు వస్త్రంగా చేసికొని; వెలువడి= బయటకు వెళ్ళి; కొండొక, నేల+అరిగి= కొంత ప్రదేశం వెళ్ళి (అంటే కొన్ని అడుగులు వేసి); దమయంతి+ అందు; ఘనంబు+ఐన= మిక్కుటమైన; తన నెయ్యంబు+అను= తన స్నేహమనే; తీఁగన్+త్రెంపనేరక= లతను త్రుంచజాలక; క్రమ్మఱి= తిరిగి; వచ్చి= చేరి.

తాత్పర్యం: నేను దమయంతి పరితాపం ఓర్వలేను. కాబట్టి ఎక్కడికైనా వెళ్ళుతాను. నేను వెళ్ళిపోతే ఈమె నన్ను కానక, చేసేది లేక తన బంధువుల దగ్గరకు వెళ్ళిపోతుంది. ఆ విధంగా ఆవిడకు నాతో అడవిలో పడవలసిన బాధలు తగ్గుతాయి'- అని నలుడు విచారించి, తాను పోవటానికి ఉద్యుక్తుడయి, ఆమె చీరలో కొంతమేర చించి తనకు కట్టు పుట్టంగా చేసికొన్నాడు. నలుడు కొన్ని అడుగులు ముందుకు నడిచాడు కాని, అతడి కాళ్ళు కదలలేదు. దమయంతిపై తనకు గల స్నేహమనే లతను త్రెంచుకోలేక తిరిగి వచ్చాడు.

చ. కలి దమయంతిఁ బాప సమకట్టుఁ, బొరింబొరి వాయనోపఁ డా
లలన నుదీర్ణసౌహృదబలంబున; నిట్టులు రెంటఁ జేసి య
న్నలుఁడు విమోహరజ్జులఁ బెనంగి గతాగతకారి యైన యు
య్యెలయును బోలె నూఱడక యెంతయుఁ బ్రొద్దు వినిశ్చితాత్ముఁడై 77

ప్రతిపదార్థం: కలి= కలిపురుషుడు; దమయంతిన్= దమయంతిని; పాపన్= ఎడం చేయటానికి; సమకట్టున్= పూనుకొంటాడు; ఉదీర్ణ, సౌహృద, బలంబునన్= గొప్పదైన స్నేహంయొక్క బలంతో; ఆ, లలనన్= అంగన అయిన ఆ దమయంతిని; పొరిన్+పొరి= మాటి మాటికి; పాయన్+ఓపఁడు= ఎడబాయజాలడు; ఇట్టులు= ఈ విధంగా; రెంటన్+చేసి= (అటు కలిప్రభావం, ఇటు భార్యమీది స్నేహం) రెండింటివలన; ఆ+నలుఁడు; విమోహరజ్జులన్+పెనంగి= మిక్కుటమైన వలపు అనే త్రాళ్ళతో పెనవేసికొన బడిన వాడై; గత+ఆగత కారి+ఐన= ముందుకు పోయి మరల వెనుకకు వచ్చేటట్లు చేసేదైన; ఉయ్యెలయును+పోలెన్= ఊయలవలె; ఎంతయున్+ప్రొద్దు= చాలసేపు; ఊఱడక= ఊరట చెందక, వి, నిశ్చిత+ఆత్ముఁడు+ఐ= ఒక నిర్ణయానికి రాలేని ఆత్మకలవాడై;

తాత్పర్యం: కలిప్రభావంవలన నలుడు దమయంతిని ఎడంచేయటానికి ఉద్యమించేవాడు; గొప్పదైన స్నేహాను బంధంవలన దమయంతిని వీడజాలక ఉండేవాడు. ఇటు అనురాగబంధం, అటు కలి ప్రభావం. ఈ రెంటివలన నలుడు, అతిశయమైన అనురాగబంధమనే త్రాళ్లు పెనవేసికొని ముందుకు వెనుకకు ఊయలవలె ఊరట చెందలేక, ఒక స్థిరనిశ్చయానికి రాలేక చాలసేపు ఊగిసలాడాడు.

విశేషం: అలంకారం- 'విమోహరజ్జులు' అనేచోట రూపకం. 'నలుడు--- ఉయ్యెలయును బోలె' అనేచోట ఉపమ.

తే. 'బాల నొక్కర్తు నిక్కానపాలు సేసి ।
నిష్ఠురుండనై యే నెట్లు నేర్తుఁ బోవ'
ననక కలిచేత నాకృష్టుఁడైన నలుఁడు ।
విగతకరుణుఁడై దమయంతి విడిచి చనియె. 78

ప్రతిపదార్థం:బాలన్= బాలప్రాయంలో ఉన్నదానిని (చిన్నదైన దమయంతిని); ఒక్కర్తున్= ఒకతెను; ఈ+కాన, పాలు+చేసి= ఈ అరణ్యంపాలుచేసి; నిష్ఠురుండను+ ఐ= కఠినాత్ముడినై; ఏన్+ఎట్లు= నేను ఏరీతిగా; పోవన్+నేర్తున్= పోగలను; అనక= అని తలపోయక; కలిచేతన్= కలిపురుషుడిచేత; ఆకృష్టుఁడు+ఐన= లాగబడినవాడైన; నలుఁడు= నలమహారాజు; విగత, కరుణుఁడు+ఐ= పోయిన దయ కలవాడై; దమయంతిన్= దమయంతిని; విడిచి= వీడి; చనియెన్= వెళ్ళిపోయాడు.

తాత్పర్యం: 'చిన్నవయస్సులో ఉన్న దమయంతిని ఈ అడవి పాలుచేసి కఠినాత్ముడినై నేను ఎట్లా పోగలను?'- అని తలపోయక, కలిపురుషుడిచేత ఆకర్షించబడినవాడై నలుడు దయలేని హృదయంతో ఆమెను విడిచి వెళ్ళిపోయాడు.

వ. అంత దమయంతి మేలుకని పతిం గానక, తన వస్త్రార్ధ నికృంతనంబును జూచి లేచి, నలుగడం బరికించి, భయశోకవ్యాకులచిత్త యయి. 79

ప్రతిపదార్థం: అంతన్= తరువాత; దమయంతి; మేలుకని= నిద్రనుండి లేచి; పతిన్+కానక= భర్త కనిపించకపోగా; తన, వస్త్ర+అర్ధ, నికృంతనంబును+చూచి= తన చీరలో సగభాగం చించబడి ఉండటాన్ని చూచి; నలుగడన్+పరికించి= నాలుగువైపుల చూచి; భయ, శోక, వ్యాకుల, చిత్త+అయి= భయంతో, దుఃఖంతో కలతచెందిన మనస్సు కలదయి.

తాత్పర్యం: అటు పిమ్మట దమయంతి నిద్రనుండి మేల్కొన్నది. కాని, భర్త అచట కనిపించలేదు. తన చీర సగం చించబడి ఉండింది. ఆమె నాలుగువైపుల తేరిపార చూచింది. భయంతో, దుఃఖంతో కలత చెందినదయి- (తర్వాతి పద్యంతో అన్వయం).

సీ. 'హా! మహారాజ! మహామహీ రక్షణ।
దక్ష దక్షిణబాహుదండ! దండి
తారాతి! నిషధరాజాగ్రణి! న న్నిట్లు।
వీతదయుండవై విడిచి చనఁగఁ
దగునె? నీ వెన్నఁడు ధర్మువు దప్పని।
వాఁడవు, సూనృతవ్రతరతుండ;
వోడకు మని నన్ను నూఱడఁ బలికిన।
పలు కిట్లు మఱవంగఁ బాడి యగునె?

ఆ. పొదలలోన డాఁగి పొడసూప కిట్టేల।
యున్నవాఁడ? విట్టి యుగ్రభావ
మేల నీకు వలసె? నెట వోదు? నిం కెట్లు।
గాంతు నిన్ను నుగ్రకాననమున? 80

ప్రతిపదార్థం: హా!= అయ్యో!; మహారాజ= గొప్పరాజా!; మహా, మహీ, రక్షణ, దక్ష, దక్షిణ, బాహుదండ= సువిశాలమైన భూమిని సంరక్షించటానికి సమర్థమైన కుడిభుజం (దండం వంటి కుడిచేయి) కలవాడా!; దండిత+ అరాతి!= శిక్షించబడిన శత్రువులు కలవాడా!; నిషధ, రాజ+అగ్రణి!= నిషధ దేశాన్ని ఏలే రాజులలో శ్రేష్ఠుడా!; నన్ను+ఇట్లు= నన్ను ఈ రీతిగా; వీతదయుండవు+ఐ= పోయిన దయ కలవాడివై; విడిచి, చనఁగన్+తగునె?= విడిచి వెళ్ళటం తగునా?; నీవు+ఎన్నఁడు= నీవు ఎల్లప్పుడు; ధర్మువు= ధర్మం; తప్పనివాఁడవు= మీరనివాడివి; సూనృత, వ్రత రతుండవు= సత్యమనే వ్రతాన్ని పాటించటంలో ఇష్టం కలవాడివి; ఓడకుము+అని= భయపడకు మనిచెప్పి; నన్నున్; ఊఱడన్+పలికిన, పలుకు= ఓదార్చినట్టి మాటలు; ఇట్లు= ఈ రీతిగా; మఱవంగన్+ పాడి+అగునె?= మరచిపోవటం న్యాయమవునా?; పొదలలోనన్= చెట్ల గుబురులలోన; డాఁగి= కనిపించకుండ ఉండి;

పొడ+చూపక= అగుపించక; ఇట్లు= ఈ విధంగా; ఏల= ఎందుకు; ఉన్నవాఁడవు= ఉన్నావు; ఇట్టి= ఈ విధమైన; ఉగ్రభావము= కఠినత్వం; ఏల?= ఎందుకు?; నీకు, వలసెన్= నీవు పూనవలసివచ్చింది; ఎట+పోదున్?= ఎక్కడికి పోగలను?; నిన్ను; ఉగ్ర, కాననమునన్= భయంకరమైన అడవిలో; ఇంక+ఎట్లు= ఇంక ఏవిధంగా; కాంతున్= చూడగలను?

తాత్పర్యం: 'ఓ నలమహారాజా! సువిశాలమైన భూమండలాన్ని సంరక్షించటానికి సామర్థ్యం గల దక్షిణబాహువు గలవాడా! శత్రువులను ఓడించినవాడా! ఓ నిషధదేశ ప్రభూ! దయలేకుండ న న్నిట్లా వదలిపెట్టి వెళ్ళటం నీకు తగునా? నీవు ఎన్నడు ధర్మం తప్పనివాడివి. సత్యసంధుడివి. భయపడకుమని నన్ను ఓదారుస్తూ చెప్పినమాటలు నీవు మరవటం న్యాయమా? పొదలలో దాగి ఉన్నావా? ఎందుకు నాకు కనిపించవు. ఎందుకు నీ కీ కఠినత్వం? నే నెచటికి పోగలను? ఈ భయంకరమైన అడవిలో నిన్ను ఇంక నేను ఎట్లా చూడగలను?

విశేషం: దమయంతి ఆక్రందనం హృదయవిదారకం. వేల్పులను కాదని నలుడిని వలచి స్వయంవరంలో ఆతడిని వివాహమాడిన దమయంతి కారడవిలో చేసిన దీనాలాపం విశ్వసాహితీజగత్తులో నిరుపమానమైనది. అరణ్యరోదనానికి ఇంతకంటె చక్కని ఉదాహరణం ఇంకేముంది?

క. వగవఁగ సాంగోపాంగము।
లగు నాలుగు వేదములయు నధ్యయనము పొ
ల్పుగ నొక సత్యముతో నెన।
యగునే? యెవ్వియును బోల వటె సత్యంబున్. 81

ప్రతిపదార్థం: వగవఁగన్= ఆలోచించగా; స+అంగ+ఉప+అంగములు+అగు= అంగాలతో, ఉపాంగాలతో కూడినవైన; నాలుగు, వేదములయు; అధ్యయనము= పఠనం, అనుశీలనం; పొల్పుగన్= ఒప్పేటట్లుగా; ఒక

సత్యముతోన్; ఎన+అగునే= సాటి అవుతుందా?; సత్యంబున్= సత్యమును; ఎవ్వియును= ఏవైననుకూడా; పోలవు+అటె= పోలవుకదా!

తాత్పర్యం: యోచనచేసి చూస్తే నాలుగువేదాలు, వేదాంగాలు, వేదోపాంగాలు చదివినప్పటికిన్నీ ఆ వైదిక వాఙ్మయ పరిజ్ఞానం అంతయూ ఒక్క సత్యంతో సరితూగదని పెద్దలు చెప్తుతారు. సత్యానికి ఏవియు సరిపోలవు.

విశేషం: నాలుగువేదాలు:- 1. ఋగ్వేదం 2. యజుర్వేదం 3. సామవేదం 4. అథర్వవేదం. వేదాంగాలు (షడంగాలు):- 1. శిక్ష 2. వ్యాకరణం 3. ఛందస్సు 4. నిరుక్తం 5. జ్యోతిషం 6. కల్పం. ఉపాంగాలు:- 1. మీమాంస 2. న్యాయశాస్త్రం 3. పురాణం 4. ధర్మశాస్త్రం. ఉపవేదాలు:- ఋగ్వేదానికి ఆయుర్వేదం, యజుర్వేదానికి ధనుర్వేదం, సామవేదానికి గాంధర్వవేదం, అథర్వవేదానికి స్థాపత్య శస్త్రవేదాలు ఉపవేదాలు. ఇది రుచిరార్థసూక్తి.

వ. ప్రాణ సమానవయిన ని న్నవశ్యంబును విడువనని పలికితి; సత్యప్రతిపాలనంబు సేయు' మని ప్రలాపించుచుం దన యేకాకిత్వంబునకు నబలాభావంబునకుఁ బ్రతిపదన్యాస జాయమాన కంటక మృగ పన్నగభయంబునకు వగవక, నిజనాథు నసహాయత్వంబునకు దుస్సహక్షుత్పిపాసాశ్రమాకులత్వంబునకు వగచుచు. 82

ప్రతిపదార్థం: ప్రాణ, సమానవు+అయిన= ప్రాణాలతో సమానురాలవైన; నిన్ను; అవశ్యంబును= ఎన్నడును; విడువను+అని= విడిచిపెట్టనని; పలికితి= అన్నావు; సత్య, ప్రతిపాలనంబు+చేయుము= ఆడినమాటను తప్పకుండ ఆచరించుము; అని= అంటూ; ప్రలాపించుచున్= గట్టిగా మొరపెట్టుతూ; తన+ఏకాకిత్వంబునకున్= తనయొక్క ఒంటరితనానికి; అబలా, భావంబునకున్= బలంలేని ఆడుతనానికి; ప్రతిపద, న్యాస, జాయమాన, కంటక, మృగ, పన్నగ, భయంబునకున్= ప్రతి అడుగు మోపినప్పుడు పుట్టే-ముండ్లు, క్రూరమృగాలు, పాములవలన కలిగే భయానికి; వగవక= దుః

ఖించకుండా; నిజనాథు= తనభర్తయొక్క; అసహాయత్వంబునకున్= తోడులేని స్థితికి; దుస్సహ, క్షుత్, పిపాసా, శ్రమ+ఆకులత్వంబునకున్= భరించరాని ఆకలి, దప్పిక, అలసటవలన కలిగే క్షోభకు; వగచుచు= విచారిస్తూ.

తాత్పర్యం: ఓ నలమహారాజా! 'ప్రాణసమానవైన నిన్ను, ఎన్నడును విడువ'నని నాతో చెప్పావుకదా! నీవు ఆడినమాట నిలుపుకో'- అని దమయంతి బిగ్గరగా మొరపెట్టుకొంటూ అడవిలో తిరిగింది. ఆమె తన ఒంటరితనానికి, అబలగా తన బలహీనతకు, అడుగులు మోపితే ముండ్లవలన, క్రూర జంతువులవలన, పాములవలన దాపురించే భయానికి చింతించలేదు కాని, తన ప్రాణనాథుడైన నలుడికి ఎటువంటి తోడులేనందుకు, భరించరాని ఆకలిదప్పులు శ్రమ మూలంగా ఆయనకు కలిగే వేదనకు దుఃఖించింది.

క. అలయుచుఁ, బులుఁగుల యెలుఁగుల।
కులుకుచు, నుగ్రాతపమున కోపక వృక్షం
బులనీడల నిలుచుచు, నెలుఁ।
గులఁ బులులం జూచి భయముగొని వగ వగచున్. 83

ప్రతిపదార్థం: అలయుచున్= బడలిపోతూ; పులుగుల+ఎలుఁగులకు+ ఉలుకుచున్= పక్షుల అరుపులకు భయపడుతూ; ఉగ్ర+ఆతపమునకు+ఓపక= తీక్ష్ణమైన ఎండకు తాళజాలక; వృక్షంబుల, నీడలన్= చెట్లనీడలలో; నిలుచుచున్= నిలబడుతూ; ఎలుఁగులన్= ఎలుగుబంట్లను; పులులన్= పెద్దపులులను; చూచి= చూచి; భయము+కొని= భయపడి; వగన్= బాధతో; వగచున్= పరితపిస్తున్నది.

తాత్పర్యం: ఆ అడవిలో దమయంతి అలసట చెందుతున్నది. పక్షుల అరుపులకు భయపడుతున్నది. తీవ్రమైన ఎండ వేడిమిని భరించజాలక చెట్ల నీడలలో నిలుస్తున్నది. ఎలుగుబంట్లను, పెద్దపులులను చూచి భయపడి పరిపరి విధాల పరితపిస్తున్నది.

క. ఏచిన పొదలఁ బొరల్పడఁ।
ద్రోచుచు, ముండ్లకును నల్లఁ దొలఁగుచు, దిక్కుల్
సూచుచుఁ, దొడరుచుఁ ద్రెళ్ళుచు।
లేచుచు లలితాంగి సంచలించుచు నరిగెన్. 84

ప్రతిపదార్థం: ఏచిన= ఏపుగా ఎదిగిన; పొదలన్= గుబురుచెట్లను; పొరల్పడన్+త్రోచుచు= వెనుకకు పడేటట్లు త్రోస్తూ; ముండ్లకున్= కంటకాలకు; అల్లన్= మెల్లగా; తొలఁగుచున్= తప్పుకొని నడుస్తూ; దిక్కుల్+ చూచుచున్= దిక్కులు చూస్తూ (అంటే దారి తెలియక తిరుగాడుతూ); తొడరుచున్+త్రెళ్ళుచున్= తొట్రుపడుతూ, క్రిందపడుతూ; లేచుచున్= లేచినిలబడుతూ; లలిత+అంగి= సుకుమారమైన దేహంగల దమయంతి; సంచలించుచున్= కంపిస్తూ; అరిగెన్= నడిచింది.

తాత్పర్యం: దట్టంగా ఎదిగిన పొదలను ప్రక్కకు నెట్టుతూ, ముండ్లకు మెల్లగా దూరంగా తొలగి నడుస్తూ, దిక్కులు చూస్తూ, తొట్రుపడుతూ, క్రిందపడుతూ, లేస్తూ సుకుమారి అయిన దమయంతి వణుకుతూ అడవిలో తిరుగాడుతున్నది.

వ. ఇ ట్లరుగుచున్న దమయంతి నంతిక న్యస్త చరణయైన దాని నాహారార్థి యయి యొక్క యజగరంబు పట్టికొనిన నక్కోమలి మెదల నేరక. 85

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; అరుగుచున్న= నడుస్తున్న; దమయంతిన్= దమయంతిని; అంతిక, న్యస్త, చరణ+ఐన దానిన్= సమీపంలో ఉంచబడిన పాదం కలదానిని; ఆహార+అర్థి+ అయి= తిండిని కోరినదై; ఒక్క, అజగరంబు= ఒక కొండచిలువ; పట్టికొనినన్; ఆ+కోమలి= ఆ సుకుమారి అయిన దమయంతి; మెదలనేరక= కొంచెమైనా కదలజాలక.

తాత్పర్యం: ఈ విధంగా నడుస్తూ సమీపించిన దయమంతిని ఆకలిగొన్న ఒక కొండచిలువ పట్టుకోగా, దమయంతి కదలలేకపోయింది.

ఆ. 'ఇంక నైన నన్ను నేల యాలింపవు?
నాకు శరణ మగుము నాథ!' యనుచు
నఱచుచున్న దాని యాక్రందనధ్వని।
వినుచు నొక్క యెఱుకు వేగ వచ్చి. 86

ప్రతిపదార్థం: ఇంకన్+ఐన= ఇకనైనను; (అంటే ఇంతవరకు నన్ను వదలిపెట్టినప్పటికిని ఆపదలో చిక్కుకొన్నప్పుడైనా); నన్నున్+ఏల+ఆలింపవు= నా మొర ఎందుకు వినిపించుకోవు; నాకు+శరణము+అగుము= నాకు సంరక్షణ చేకూర్చేవాడివి కమ్ము; నాథ!= (నా) భర్త అయిన ఓ నలమహారాజా!; అనుచున్= అని మొరపెట్టుతూ; అఱచుచున్నదాని= కేకలు పెట్టుతున్న దానియొక్క; ఆక్రందన ధ్వని= ఏడుపు సవ్వడి; వినుచున్= ఆలకిస్తూ; ఒక్క+ఎఱుకు= ఒక కిరాతుడు; వేగ= శీఘ్రంగా; వచ్చి= అరుదెంచి.

తాత్పర్యం: 'భర్త వయిన ఓ నలమహారాజా! ఇంతదాక నన్ను ఉపేక్షించావు కాని, ఇప్పుడు ఈ ఆపదలో చిక్కిన మీదటనైన నన్ను సంరక్షించేవాడివి కమ్ము' అని మొఱపెట్టుతున్న దమయంతి ఏడుపుకేకలు విని, ఒక కిరాతుడు వేగంగా వచ్చి.

వ. తన పట్టిన సురియ నప్పెనుఁబాము వదనంబువ్రయ్యం దఱిగిన రాహుముఖ విముక్తయైన చంద్రరేఖయుంబోలె నజగరముఖంబువలన వెలువడిన యా దమయంతి నాశ్వాసించి, తత్సమీప సరోవరస్నాతను వన్యస్వాదు ఫలాహారనుంగాఁ జేసి విగతశ్రమం గావించి, 'నీ వెవ్వరిదాన విట్లేల యేక తంబ యివ్వనంబునకు వచ్చి?' తని యడిగి మధురభాషిణి యైన యమ్మగువవలన నంతవృత్తాంతంబు నెఱింగి. 87

ప్రతిపదార్థం: తన, పట్టిన= తాను పట్టుకొన్న; సురియన్= చురకత్తితో; ఆ+పెనున్+ పాము= ఆ పెద్దపాముయొక్క; వదనంబు= ముఖం; వ్రయ్యన్+ తఱిగినన్= ముక్కలుగా చీల్చగా; రాహు, ముఖ, విముక్త+ఐన= రాహువుమొగంనుండి విడివడి బయటపడిన; చంద్రరేఖయున్+పోలెన్= చంద్రవంకవలె; అజగర, ముఖంబువలనన్= కొండచిలువ ముఖంనుండి; వెలువడిన= బయటకు వచ్చిన; ఆ దమయంతిన్= ఆ దమయంతిని; ఆశ్వాసించి= ఊరడించి; తద్+సమీప, సరోవర, స్నాతను= అచోటికి సమీపంలో ఉన్న సరస్సులో స్నానం చేసిన దానిని; (దమయంతిని); వన్య, స్వాదు, ఫల+ఆహారనున్+ కాన్+చేసి= అడవిలో లభించే రుచిగల పండ్లు ఆహారంగా స్వీకరించిన దానినిగా చేసి; విగతశ్రమన్+కావించి= పోయిన అలసట కలదానినిగా చేసి; నీవు; ఎవ్వరిదానవు= నీవు ఎవరికి సంబంధించినదానివి; ఇట్లు+ఏల= ఈ విధంగా ఎందుకు?; ఏకతంబు+ అ= ఒంటరిగా; ఈ+వనంబునకున్= ఈ అడవికి; వచ్చితి= వచ్చావు; అని+అడిగి= అని ప్రశ్నించి; మధుర, భాషిణి+ఐన= తియ్యని (ఇంపైన) మంచిమాటలు మాటాడేటటువంటి; ఆ+మగువవలనన్= ఆ అంగనవలన; అంత, వృత్తాంతంబున్= సమస్త సమాచారం; ఎఱింగి= తెలిసికొని.

తాత్పర్యం: తాను పట్టిన చురకత్తితో ఆ కిరాతుడు ఆ కొండచిలువముఖాన్ని ముక్కలుగా తరిగాడు. అంత రాహు ముఖంనుండి వెలువడిన చంద్రరేఖవలె, ఆ పెనుబాముముఖంనుండి దమయంతి బయటపడింది. ఆ కిరాతుడు ఆమెను ఓదార్చి, దగ్గర ఉండే కొలనులో ఆమె స్నానంచేసి బడలిక తీర్చుకొన్న పిదప, ఆమెను ఆ అడవిలో దొరికే మంచి పండ్లు ఆరగింపజేసి 'నీవు ఎవరిదానవు? నీ విట్లా ఎందుకు ఒంటరిగా ఈ అడవికి వచ్చావు?' అని అడిగి, తియ్యగా మాటలు మాట్లాడే ఆమెచేత సమాచారమంతా తెలిసికొని.

కవిరాజ విరాజితము.

రజనికరాననఁ బీనపయోధర।
రాజితరాజసుతన్ విలస
ద్గజపతిగామినిఁ జందనగంధిఁ బ్ర।
కాశితకాంతిసమన్వితఁ బం
కజదళలోచనఁ జూచి కిరాతుఁడు।
కామనిశాతశరాహతుఁడై
నిజహృదయం బెఱిఁగించె లతాంగి క।
నింద్యచరిత్రకు వేడుకతోన్. 88

ప్రతిపదార్థం: రజనికర+ఆననన్= చంద్రుడి వంటి ముఖం గల దానిని (రజనికరుడు= రాత్రిని చేసేవాడు చంద్రుడు); పీన, పయోధరన్= బలిసిన పాలిండ్లు కలదానిని; రాజిత, రాజసుతన్= ప్రకాశించే రాజకుమారిని; విలసత్+గజపతి, గామినిన్= గజరాజునడకవలె విలసిల్లే మెల్లని నడక గలదానిని; చందనగంధిన్= చందన పరిమళం వెదజల్లే దేహం గలదానిని; ప్రకాశిత, కాంతి, సమన్వితన్= దేదీప్యమానమైన వర్చస్సు కలదానిని; పంకజ, దళ, లోచనన్= పద్మపత్రాలవంటి కన్నులు కలదానిని; చూచి= చూచి; కిరాతుఁడు; కామ, నిశాత, శర+ఆహతుఁడు+ఐ= మన్మథుడియొక్క వాడిబాణాలచేత కొట్టబడినవాడై; లతా+అంగికి= తీగవలె సుకుమారమైన మేను గలదానికి; అనింద్య చరిత్రకు= నిందించదగిన శీలంగల దమయంతికి; వేడుకతోన్= సంబరంతో; నిజ, హృదయంబు= తన హృదయాన్ని, అంటే వలపును; ఎఱిఁగించెన్= తెలిపాడు.

తాత్పర్యం: చంద్రబింబంవంటి మొగం కలది, పెద్దవైన స్తనాలు కలది, లావణ్యవతి అయిన రాజకుమారి, సుందర గజరాజగమన, చందన పరిమళం వెదజల్లే మేనితావి కలది, దేదీప్యమానమైన వర్చస్సు కలది, పద్మదళాల వంటి విశాలమైన కన్నులు కలది అయిన దమయంతిని చూచి, ఆ కిరాతుడు

పదునైన మన్మథబాణాలచేత కొట్టబడిన వాడయ్యాడు (కామభావప్రేరితు డయ్యాడు). వెంటనే, అతడు మచ్చలేని చరిత్రగల ఆ లతాంగికి తన మనస్సులోని కోర్కెను వేడుకతో వెల్లడించాడు.

విశేషం: ఈ వృత్తంలోని ప్రతిపాదంలోనూ న,జ,జ,జ,జ,జ,జ,లగ అనే గణాలు వరుసగా ఉంటాయి. 8, 14, 20 అక్షరాలతో యతిమైత్రి.

ఆ. అగ్నిశిఖయుఁ బోలె నంటను డాయను।
జూడ రానియట్టి శుభచరిత్ర
నెఱుక లేని కఱకుటెఱు కపేక్షించెఁ గా।
దనక తనకు నాయు వల్పమైన. 89

ప్రతిపదార్థం: అగ్ని, శిఖయున్+పోలెన్= అగ్నిజ్వాలవలె; అంటను= ముట్టుకొనటానికి; డాయను= సమీపించటానికి; చూడ, రానియట్టి= చూడటానికి వీలులేనట్టి; శుభచరిత్రన్= మంచి ప్రవర్తన కల దమయంతిని; ఎఱుక లేని= జ్ఞానంలేని; కఱకు+ఎఱుక= మొరటుమానిసి అయిన కిరాతుడు; కాదు+అనక= అది తనకు తగదని ఎంచక; తనకు; ఆయువు= ఆయుస్సు; అల్పము+ఐన= తక్కువ అవటంచేత; అపేక్షించెన్= కామించి కోరుకొన్నాడు.

తాత్పర్యం: దమయంతి పరమ పవిత్రచరిత్ర. అగ్నిజ్వాల వంటిది. ముట్టుకొనటానికి గాని, సమీపించటానికిగాని వీలు కానట్టిది. తేరిపార చూడ వీలులేనిది. అటువంటి అనింద్యచరిత్రను ఆ మొరటు కిరాతుడు తగదని తలచక- తనకు ఆయుర్దాయం తక్కువ కావటంచేత- కామించి కోరుకొన్నాడు.

దమయంతి శాపంబునం గిరాతుండు చచ్చుట. (సం. 3-61-34)

వ. దమయంతి వాని నలిగి చూచి 'యేను పతివ్రత నైతినేని యిద్దురాత్ముండైన కిరాతుం డిప్పుడ మృతుం డయ్యెడు' మని శాపం బిచ్చిన, వాఁ డప్పుడ యగ్నిదగ్ధం బైన వృక్షంబునుంబోలె విగతజీవుండై పడియె; నట్లు పరమపతివ్రతాగుణప్రభావంబున. 90

ప్రతిపదార్థం: దమయంతి; వానిన్+అలిగి, చూచి= ఆ కిరాతుడిని కోపించి చూచి; ఏను= నేను; పతివ్రతను+ఐతిన్+ఏని= నేనే కనుక పతివ్రతను అయితే; (పతివ్రత= భర్తపట్ల అనన్య అనురాగం గలిగి ఆరాధించే భార్య); ఈ, దురాత్ముండు+ఐన= ఈ దుష్టుడైన; కిరాతుండు= ఎఱుకు; ఇప్పుడు+అ= ఇప్పుడే; మృతుండు+అయ్యెడున్+అని= మరణిస్తాడుగాక అని; శాపంబు+ఇచ్చినన్= శాపాన్ని ఇవ్వగా; (శాపమంటే జరిగితీరే తిట్టు); వాఁడు= ఆ కిరాతుడు; అప్పుడు+అ= అప్పుడే; అగ్నిదగ్ధంబు+ఐన= నిప్పుచేత మండిపోయిన; వృక్షంబునున్+పోలెన్= చెట్టువలె; విగతజీవుండు+ఐ= పోయిన ప్రాణం కలవాడై; పడియెన్= నేలపై పడ్డాడు; అట్లు= ఆ విధంగా; పరమ, పతివ్రతా, గుణ, ప్రభావంబునన్= గొప్ప పతివ్రతయొక్క గుణమహిమచేత.

తాత్పర్యం: దమయంతి ఆ కిరాతుడిపై కోపించి చూచి 'నేను పతివ్రతనే అయితే దుష్టుడైన ఈ కిరాతుడు ఇప్పుడే ఇచట చనిపోవునుగాక' - అని శపించింది. అంత కిరాతుడు నిప్పుచేత దహించబడిన చెట్టువలె నేలపై కూలి మరణించాడు. అంత తన పాతివ్రత్యమాహాత్మ్యంతో.

విశేషం: ప్రాచీన భారతీయ వాఙ్మయంలో పాతివ్రత్యం మిక్కిలి మహిమ కలిగినట్టిదిగా వర్ణించబడింది. భర్తపట్ల త్రికరణశుద్ధితోడి ప్రేమ కల భార్య పతివ్రత.

క. బాల హృదయమున నృపశా ।
ర్దూలు నిజాధీశు నిలిపి దుష్టోరగ శా
ర్దూ లాభీల మృగావలి ।
కోలిన భయ మంద కరిగె నుగ్రాటవిలోన్. 91

ప్రతిపదార్థం: బాల= చిన్నదయిన దమయంతి; హృదయమునన్= తన మనస్సులో; నృపశార్దూలున్= రాజులలో పెద్దపులి వలె శ్రేష్ఠుడైన; నిజ+అధీశున్= తన భర్త అయిన నలమహారాజును; నిలిపి= నెలకొలిపి; దుష్ట+ఉరగ, శార్దూల+ఆభీల, మృగ+ఆవలికిన్= క్రూరాలైన పాముల, పెద్దపులుల, భయంకరమైన మృగాల సముదాయానికి; భయము+అందక= భయపడక; ఉగ్ర+అటవిలోన్= భయంకరమైన అడవిలో; ఓలిన= వరుసగా; అరిగెన్= వెళ్ళింది.

తాత్పర్యం: దమయంతి తన హృదయంలో రాజులలో శ్రేష్ఠుడైన తన భర్త నలమహారాజును ధ్యానిస్తూ, పతివ్రతామాహాత్మ్యంవలన భయంకరారణ్యంలోని క్రూరసర్పాలకు, పెద్దపులులకు, క్రూరమృగాలకు భీతిచెందక వరుసగా పయనం సాగించింది.

వ. మఱియును. 92

తాత్పర్యం: ఇంకా,

సీ. 'సహకార! మత్ప్రియసహకారుఁ, బున్నాగ! ।
పున్నాగుఁ, దిలక! భూభువనతిలకుఁ,
జందన! బుధహరిచందనుఁ బుష్పితా ।
శోక! సుహృజ్జనశోకదమను,
వకుళ! కులైకదీపకు, విభీతక! భయో ।
పేతార్తిహరు నలుఁ బ్రీతితోడఁ
గానరే కానలలోన లోకోత్తరు?' నని
ప్రాని ప్రానికి నరిగి యరిగి

ఆ. యడుగు, నడుగు లెండఁ బొడ వొడఁ బొక్కిన ।
నిర్ఝరాంతరముల నిలుచుఁబిలుచు,
గిరుల దరుల యెడల నురుగుహాగృహములఁ ।
దొంగి తొంగి చూచుఁ దోయజాక్షి. 93

ప్రతిపదార్థం: సహకార!= ఓ సహకార వృక్షమా! (సహకారం= తియ్యమామిడి); మత్+ప్రియ, సహకారున్= నాకు ప్రీతి కలిగించే సాయంచేసే వాడిని; పున్నాగ!= ఓ పున్నాగవృక్షమా! (సురపొన్న చెట్టు); పున్నాగున్= పురుష శ్రేష్ఠుడిని; తిలక!= ఓ తిలకవృక్షమా! (తిలకం= బొట్టుగుచెట్టు); భూ, భువన, తిలకున్= భూలోకంలోని మనుజులలో శ్రేష్ఠుడిని (తిలకం శ్రేష్ఠవాచకం); చందన!= ఓ చందనవృక్షమా!; బుధ, హరిచందనున్= బుద్ధిమంతులకు హరిచందనం వంటివాడిని (హరిచందనం కల్పవృక్షాలలో ఒకటి- అంటే పండితులకు కోరిన కోరికలు ఈడేర్చేవాడిని); పుష్పిత+అశోక!= పుష్పించిన అశోకవృక్షమా!; సుహృద్+జన, శోక, దమనున్= మిత్రుల దుఃఖాన్ని హరింపచేసేవాడిని (మిత్రులకు అశోకుడిని); వకుళ!= ఓ వకుళవృక్షమా! (వకుళం= పొగడ చెట్టు); కుల+ఏక, దీపకున్= వంశమంతటికి ముఖ్యమైన జ్యోతివంటి వాడిని; విభీతక!= ఓ విభీతకవృక్షమా! (విభీతకం= తాండ్ర చెట్టు); భయ+ఉపేత+ ఆర్తిహరున్= భయంతో కూడిన వారియొక్క ఆరాటాన్ని తొలగించేవాడిని; లోక+ ఉత్తరున్= లోకమంతటిలో శ్రేష్ఠుడిని; నలున్= నలమహారాజును; ప్రీతితోడన్= ప్రేమతోడ; కానలలోనన్= అడవులలో; కానరే= చూడరే; అని= అని విలపిస్తూ; తోయజ+అక్షి= పద్మాలవంటి కన్నులుగల దమయంతి; మ్రాని మ్రానికిన్= చెట్టు చెట్టుకు; అరిగి+అరిగి= వెళ్ళి, వెళ్ళి; అడుగున్= అడుగుతున్నది; అడుగులు= పాదాలు; ఎండన్= ఎండలో; పొడ+పొడన్+పొక్కిన= పొరలు రాలేటట్లు బొబ్బలెక్కగా; నిర్ఝర+ అంతరములన్= సెలయేళ్ళ మధ్య; నిలుచున్= నిలబడుతుంది; పిలుచున్= పిలుస్తుంది; గిరుల, దరుల+ఎడలన్= కొండగట్టుల చేరువలో; ఉరు= పెద్ద; గుహా, గృహములన్= గుహల ఉనికిపట్టులలో; తొంగి, తొంగి, చూచున్= మాటిమాటికి లోపలికి దృష్టిని సారిస్తుంది.

తాత్పర్యం: ఈ పద్యంలో దమయంతి ఆర్తితో నలునికై వెదకటం వర్ణించబడింది. తోయజాక్షి అయిన దమయంతి కారడవిలో నలుడిని వెదికింది. చెట్టు చెట్టును అడిగింది. 'ఓ సహకారవృక్షమా! నాకు ప్రీతిని చేకూర్చి నాతో సహకరించే నాభర్త నలమహారాజును చూచావా? ఓ పున్నాగవృక్షమా! పురుషులలో పున్నాగుడైన నలుడిని చూచావా? ఓ తిలకవృక్షమా! భూలోకంలో తిలకుడైన (శ్రేష్ఠుడైన) నలుడిని చూచావా? ఓ చందనవృక్షమా! బుధులలో హరిచందన ప్రాయుడైన నలుడిని చూచావా? పూచిన అశోకవృక్షమా! ఉత్తములగు మిత్రుల శోకాన్ని నివారించే నల చక్రవర్తిని చూచావా? ఓ వకుళవృక్షమా! కులదీపకుడైన నలమహారాజును చూచావా? ఓ విభీతకవృక్షమా! (విభీతకమనగా తాండ్రచెట్టు. ఇది భయమును పుట్టించుటచే దీనికీపేరువచ్చింది) భయోపేతులకు విభీతకుడైన (భయాన్నిపోగొట్టే) నలుడిని చూచావా? నలుడు లోకోత్తరుడు. నలుడిని చూడలేదా?' అని ఆమె ఎండలో అడవిలో అడుగులు బొబ్బలెక్కేటట్లు తిరుగుతూ చెట్టు చెట్టునూ పలకరిస్తూ తిరిగింది. వేడినేలపై నడువలేక సెలయేళ్ళలో నిలబడి పిలిచింది. కొండ చరియల దాపుల్లో వెదకింది. కొండ గుహలలో తొంగితొంగి చూచింది.

విశేషం: ఈ పద్యంలో శ్లేషానుప్రాణితమైన అనుప్రాసం ఉన్నది. సహకారం అంటే తియ్యమామిడి చెట్టు, తోడ్పాటు అని అర్థాలు. అట్లే తక్కిన చెట్లపేర్లకు రెండర్థాలు ఉన్నాయి. అర్థాంతర స్ఫూర్తి శ్లేష, ఏకశబ్ద పునరావృత్తి అనుప్రాసం. దమయంతి దృష్టికి ఆ అడవి అంతయు నలుడి గుణశీల లక్షణమయంగా కనిపించింది. సహకార వృక్షంలో నలుడి సహకారత్వం, పున్నాగ వృక్షంలో నలుడి పున్నాగత్వం, చందనవృక్షంలో హరిచందనత్వం, అశోకవృక్షంలో నలుడి అశోకత్వం, వకుళంలో నలుడి కులదీపకత్వం, విభీతకంలో నలుడి ధైర్యాన్ని, విభీతకత్వాన్ని దమయంతి దర్శించింది. దమయంతికి ఆ అడవి నలుడి విశ్వరూప ప్రదర్శనం అనిపించింది. నలుడిపై ఆమె వలపు అటువంటిది.

వ. ఇట్లు దమయంతి నిజనాథు నన్వేషించుచు భీషణారణ్యంబునం ద్రిమ్మరునది ముందట. **94**

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; దమయంతి; నిజ, నాథున్= తన భర్తను; అన్వేషించుచున్= వెదకుతూ; భీషణ+అరణ్యంబునన్= భయంకరమైన అడవిలో; త్రిమ్మరునది= దిక్కుతోచక తిరుగుతున్నట్టిది; ముందట= ఎదురుగా.

తాత్పర్యం: ఈ విధంగా దమయంతి తన భర్తకొరకు వెదకుతూ భయంకరమైన అడవిలో దిక్కుతోచక తిరుగుతూ తన ఎదుట (తర్వాతి పద్యంతో అన్వయం).

మత్తకోకిలము.

వారిభక్షులు పర్ణభక్షులు వాయుభక్షులు శాకనీ
వారభక్షులు వృక్షమూల నివాసయుక్తులునై తపం
బారఁజేయు మహామునీంద్రుల యాశ్రమం బెడఁ గాంచె నం
భోరుహాక్షి పురాసమార్జితపుణ్యకర్మఫలంబునన్. 95

ప్రతిపదార్థం: వారి, భక్షులు= నీటిని ఆహారంగా స్వీకరించి బ్రతికేవారు; పర్ణ, భక్షులు= ఆకులు ఆహారంగా తిని బ్రతికేవారు; వాయు, భక్షులు= గాలిని ఆహారంగా తీసికొని బ్రతికేవారు; శాక, నీవార, భక్షులు= ఆకుకూరలు, నివ్వరిగింజలు ఆహారంగా తిని బ్రతికేవారు; వృక్ష, మూల, నివాస, యుక్తులును+ఐ= చెట్ల మొదళ్ళలో (నివాసాలు గల) నివసిస్తూ ఉన్న వారున్నూ అయి; తపంబు+ఆరన్+చేయు= దీక్షతో తపస్సుచేసే; మహా, ముని+ఇంద్రుల= గొప్ప ఋషివర్యులయొక్క; ఆశ్రమంబు= ఆశ్రమాన్ని; అంభస్+రుహ+అక్షి= పద్మాలవంటి కన్నులు గల దమయంతి; పురా, సమార్జిత, పుణ్య, కర్మ, ఫలంబునన్= పూర్వంలో సంపాదించబడిన పుణ్యకార్యాల ఫలితంగా; ఎడన్= అల్లంతదూరంలో; కాంచెన్= చూచింది.

తాత్పర్యం: పద్మాలవంటి కన్నులు గల దమయంతి తన పూర్వపుణ్యఫలం వలన ఆ అడవిలో అల్లంతదూరాన ఒక ఋష్యాశ్రమ స్థలాన్ని చూచింది. ఆ

ఆశ్రమంలో నీరు మాత్రమే ఆహారంగా గొని తపస్సు చేసేవారు, ఆకులు మాత్రమే తిని తపస్సు చేసేవారు, గాలి మాత్రమే క్రోలేవారు, ఆకుకూరలు, నివ్వరిగింజలు తిని తపస్సు చేసేవారు, చెట్ల క్రింద నివసిస్తున్నవారు అయిన మునిశ్రేష్ఠులను చూచింది.

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

వ. ఇట్లు మృగవ్యాళ తస్కర కిరాత నిరంతరం బయిన కాంతారంబునం బుణ్యనదీతీరంబున నొక్కముని పల్లియం గని యందు వసిష్ఠ వామదేవ వాలఖిల్య భృగు నారద సదృశులైన మహామునులం గని నమస్కరించి యున్న నమ్మునులు దమయంతిం జూచి యచ్చెరువడి 'యవ్వా! నీ వెవ్వరి దాన? యివ్వనదేవతవో! దేవభామినివో! దివ్యంబైన తేజంబుతో నేకతంబ యేల క్రుమ్మరియెదె?' వనిన వారలకు దమయంతి యిట్లనియె. 96

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; మృగ, వ్యాళ, తస్కర, కిరాత, నిరంతరంబు+అయిన= జంతువులతో, పాములతో, దొంగలతో, ఎఱుకులతో ఎల్లప్పుడును కూడి ఉన్న; కాంతారంబునన్= అడవిలో; పుణ్య, నదీ, తీరంబునన్= పవిత్రమైన నదిఒడ్డున; ఒక్క, ముని, పల్లియన్+కని= ఒక ఋష్యాశ్రమాన్ని చూచి; అందున్= ఆ మునిపల్లెలో; వసిష్ఠ, వామదేవ, వాలఖిల్య, భృగు, నారద సదృశులు+ఐన= వసిష్ఠుడు, వామదేవుడు, వాలఖిల్యులు, భృగువు, నారదుడు-అనే మునులతో సమానులైన; మహా, మునులన్+కని= గొప్ప ఋషివరేణ్యులను చూచి; నమస్కరించి+ఉన్న= వందనాలు అర్పించి ఉండగా; ఆ+మునులు= ఆ ఋషులు; దమయంతిన్+చూచి= దమయంతినికాంచి; అచ్చెరువడి= ఆశ్చర్యం పొంది; అవ్వా= అమ్మా!; నీవు+ ఎవ్వరిదానవు= నీవు ఎవరికి సంబంధించినదానివి; ఈ+వన, దేవతవో= ఈ వనానికి సంబంధించిన దేవతవా?; దేవ, భామినివో;= అప్సరసవా (దేవతవా)!; దివ్యంబు+ఐన= దేవతలకు అనువైన; తేజంబుతోన్= వర్చస్సుతో;

ఏకతంబు+అ= ఒంటరిగా; ఏల, (కుమ్మరియెదవు?= ఎందుకు తిరుగుతున్నావు?; అనినన్= అని అడుగగా; వారలకున్= ఆ మునులకు; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: క్రూరమృగాలు, పాములు, దొంగలు, కిరాతులు ఎల్లప్పుడు తిరుగాడే అడవిలో దమయంతి ఒక పవిత్రమైన నదిఒడ్డున ఒక మునిపల్లెను చూచింది. ఆ ఋష్యాశ్రమంలోని మహర్షులు వసిష్ఠ, వామదేవ, వాలఖిల్య, భృగు, నారదుల వంటివారు. దమయంతి ఆ ఋషీశ్వరులకు నమస్కరించింది. ఆ మునులు దమయంతి అతిలోక సౌందర్యానికి, వర్చస్సుకు ఆశ్చర్యపరవశులై 'అమ్మా! నీవు వనదేవతవా? దేవతాస్త్రీవా? ఎవరవు నీవు? ఈ అడవిలో ఎందుకు ఈ రీతిగా ఒంటరిగా తిరుగాడుతున్నావు?' అని ప్రశ్నించారు. వారికి దమయంతి ఇట్లా బదులు పలికింది.

క. 'వినుఁ డేఁ బుణ్యశ్లోకుం ।
డనఁగ సదా యజ్ఞనిరతుఁ డనఁగ ధరిత్రిం
దనరిన నలు భార్యను, స ।
జ్జనసుత దమయంతి యన నెసంగినదానన్. 97

ప్రతిపదార్థం: వినుఁడు; ఏన్= నేను, పుణ్యశ్లోకుండు+అనఁగన్= పవిత్రమైన చరిత్ర కలవాడుగా కీర్తి పొందినవాడు అనగా; సదా= ఎల్లప్పుడు; యజ్ఞనిరతుఁ డు+అనఁగన్= యజ్ఞాలు చేయటంలో మిక్కిలి ప్రీతి కలవాడు అనగా; ధరిత్రిన్+తనరిన= భూమిపై విలసిల్లిన; నలు, భార్యను= నలుడి భార్యను; సజ్జన, నుత, దమయంతి+అనన్= మంచివారిచేత కొనియాడబడే దమయంతి అని (అనే పేరుతో); ఎసంగినదానన్= ఒప్పినట్టిదానిని.

తాత్పర్యం: దయచేసి నా వృత్తాంతం అవధరించండి. 'పుణ్యచరిత్రుడుగా కీర్తిని ఆర్జించినవాడున్నూ, ఎల్లప్పుడు యజ్ఞాలు చేయటంలో మిక్కిలి ప్రీతి కలవాడున్నూ అయి భూమండలంపై విలసిల్లిన నలుడి భార్యను నేను. పెద్దలచేత మన్ననలు పొందిన నాపేరు దమయంతి.

వ. విధివశంబున నన్నుం బాసి నా హృదయేశ్వరుం డెట యేనియుం బోయినఁ దదన్వేషణాసక్తచిత్తనై విపిన పరిభ్రమణంబు సేసెద; మీతపోవనంబునకు వచ్చి నలుండు భవత్పాదాభివందన కృతార్థుండై యెక్కడికింబోయె? నతని పోయిన వల నెఱుంగుదురేని నానతిండు; కొన్ని దినంబులలోనఁ దద్దర్శనంబు సంభవిల్లనినాఁడు దేహంబు విడుతు' నని యేడ్చుచున్న దానిం జూచి కరుణించి మును లిట్లనిరి. 98

ప్రతిపదార్థం: విధి, వశంబునన్= దురదృష్టం చొప్పున; నన్నున్+పాసి= నన్ను వదలిపెట్టి; నా, హృదయ+ఈశ్వరుండు= నా భర్త; ఎట+ఏనియున్+ పోయి= ఎచటికో తెలియని చోటికి వెళ్లగా; తద్+అన్వేషణ+ఆసక్త, చిత్తను+ఐ= ఆతడిని వెదకటంలో లగ్నమైన మనస్సు కలదానినై; విపిన, పరిభ్రమణంబు= అడవిలో చుట్టూ తిరుగాడటం; చేసెద= సలువుతున్నాను; మీ, తపస్+వనంబునకున్, వచ్చి= మీ తపోవనానికి వచ్చి; నలుండు; భవత్, పాద+అభివందన, కృత+అర్థుండు+ఐ= మీ అడుగులకు నమస్కరించటం చేత ధన్యుడై; ఎక్కడికిన్+పోయెన్? ఎచటికి వెళ్ళాడు?; అతని, పోయిన, వలను= అతడు వెళ్ళిన దిక్కు; ఎఱుంగుదురు+ఏనిన్= మీకు తెలిసినట్లయితే; ఆనతి+ఇండు= దయచేసి తెల్పండి; కొన్ని దినంబుల లోనన్= ఇంక కొన్ని రోజుల లోపల; తద్+దర్శనంబు= ఆతడిని చూడటం; సంభవిల్లనినాఁడు= జరుగనివేళ; దేహంబు, విడుతున్= ఆత్మహత్యకు పాల్పడగలను; అని= అంటూ; ఏడ్చుచున్నదానిన్= శోకిస్తున్న దమయంతిని; చూచి; కరుణించి= దయకలిగి; మునులు+ఇట్లు+ అనిరి= మునులు ఈ రీతిగా అన్నారు.

తాత్పర్యం: విధివిపరిపాకంచేత నన్ను విడిచి నా ప్రాణేశ్వరుడు నలుడు ఎచటికో వెళ్ళిపోయాడు. నేను నా భర్తను వెదకుతూ ఈ అడవిలో తిరుగాడుతున్నాను. మీ తపోవనానికి వచ్చి నలుడు మీ పాదాలకు నమస్కరించి ధన్యుడై ఎటైనా వెళ్ళిపోయాడా? ఆతడు పోయిన వైపు మీకు తెలిసి ఉంటే

దయచేసి తెలుపండి. ఇక కొన్ని దినాలలో నేను నా భర్తను చూడలేకపోతే ప్రాణాలు విడిచిపెట్టుతాను'- అని ఏడుస్తున్న దమయంతికి ఆ ఋషివరేణ్యులు ఇట్లా చెప్పారు.

క. 'వనజాయతాక్షి! కతిపయ ।
దినములఁ జూడంగఁ గాంతు తివిరి నలుని భూ
జననుతు నెప్పటియట్టుల ।
తన పురమున రాజ్యలీలఁ దనరెడివానిన్. 99

ప్రతిపదార్థం: వనజ+ఆయత+అక్షి!= పద్మాలవలె విశాలమైన కన్నులు గల దమయంతీ!; కతిపయ, దినములన్= కొన్నాళ్ళలో; ఎప్పటి+అట్టులు+అ= యథా ప్రకారంగానే; తన పురమునన్= తన రాజధానిపట్టణంలో; రాజ్యలీలన్= దొరతనంచేస్తూ; తనరెడివానిన్= విలసిల్లేవాడిని; భూ, జన, నుతున్= భూమిలోని ప్రజలచేత కీర్తించబడినవాడిని; నలుని; తివిరి= పూనికతో; చూడంగన్+కాంతు= చూడగలవు.

తాత్పర్యం: 'తామరరేకులవంటి విశాలమైన కన్నులు కల ఓ దమయంతీ! కొన్నినాళ్ళలో నీవు నీ భర్త అయిన నలుడిని- పూర్వంవలెనే తన రాజధానీనగరంలో రాజ్యవైభవంతో విలసిల్లేవాడినిగా, ప్రజానురంజకుడైన ప్రభువుగా చూడగలవు.

వ. ఏము తపోదృష్టిం జూచితిమి, దుఃఖింపకుండు' మని తాపసులు దమయగ్నిహోత్రంబులయు నపారఫల పుష్పతరు నదీ రమ్య తపోవనంబులయుఁదోడ నదృశ్యులైనం జూచి దమయంతి 'యిది కలయో నిక్కువంబో' యని విస్మయం బందుచుం జని, ముందట నొక్క చనుపం గని దానిం జొచ్చునపు డందలి జనంబులు. 100

ప్రతిపదార్థం: ఏము= మేము; తపస్+దృష్టిన్+చూచితిమి= తపస్సుయొక్క మహిమచేత లభించిన చూపుతో చూచాము; దుఃఖింపకుండుము+అని= శోకించకుము అని చెప్పి; తాపసులు= ఋషులు; తమ అగ్నిహోత్రంబులయున్= తమ నిప్పుకుండాలతో; అపార, ఫల, పుష్ప, తరు, నదీ, రమ్య, తపస్+వనంబులయున్+తోడన్= మితిలేని పండ్లు పువ్వులు గల చెట్లతో కూడిన నదీతీరాల్లో విలసిల్లే ఏటిప్రక్కన ఉండటంచేత అందమైన తపస్సు చేసుకొనే తోటలతోడ; అదృశ్యులు+ఐనన్= అంతర్ధానం కాగా; చూచి; దమయంతి; ఇది కలయో= ఇది స్వప్నమో; నిక్కువంబో= నిజమో; అని= అని తలపోసి; విస్మయంబు= అబ్బురపాటు; అందుచున్= పొందుతూ; చని= వెళ్ళి; ముందటన్= ఎదుట; ఒక్క, చనుపన్+కని= ఒక సార్థం చూచి, (సార్థం అంటే వర్తకజన సమూహం, దేశదేశాలకు వాణిజ్యానికై పయనించేది); దానిన్+చొచ్చునపుడు= ఆ గుంపులో ప్రవేశించేటప్పుడు; అందలి, జనంబులు= ఆ సార్థంలోని జనులు.

తాత్పర్యం: మేము తపోదృష్టితో చూచి నీకు ఈ విషయాలు తెలిపాము. శోకించవద్దు' - అని చెప్పి ఆ తాపసులు వారి అగ్నిహోత్రాలతో, పూలు, పండ్లు గల చెట్లతో కూడిన రమ్యమైన ఆ నదీ తీరంలోని ఋష్యాశ్రమాలతో మాయమయ్యారు. దమయంతి అది స్వప్నమా! నిజమా! అని ఆశ్చర్యపడి అడవిలో వెళ్లుతుండగా ఆమె యెదుట ఒక వర్తకుల గుంపు కనిపించింది. దమయంతి ఆ గుంపును చేరటంతో అందున్న వ్యాపారులు (ఆమెను చూచారు)

సీ. పాంసుజాలములు పైఁబ్రాకినఁ గరము రూ ।
క్షములగు నూర్ధ్వాలకముల దాని
నతిమలినంబైన యర్ధవస్త్రంబుచే ।
నావృతం బగు దేహయష్టి దాని,
నాఁకలి తృష నిద్ర యను వీని నెఱుఁగక ।
యున్మాదినియుఁ బోలె నున్న దాని,
దమయంతిఁ జూచి కొందఱు పిశాచం బని ।
పఱచిరి, కొందఱు భయము వొంది.

ఆ. రందుఁ గొంద అధిక హాస్యంబు సేసిరి, ।
'యడవి నేమి రోసె' దనిరి కొంద,
'అవ్వ! నీవు వేల్పవగు' దని కొందఱు ।
మొగిన కేలు మొగిచి మ్రొక్కి రంత. 101

ప్రతిపదార్థం: పాంసు, జాలములు= ధూళికణాల సముదాయం; పైన్+ప్రాఁకినన్= పైకి విస్తరించి వ్యాపించగా; కరము= మిక్కిలి; రూక్షములు+అగు= ఎఱ్ఱబారిన; ఊర్ధ్వ+ అలకములదానిన్= పై ముంగురులు కలదానిని; అతి, మలినంబు+ఐన= మిక్కిలిమాసినట్టి; అర్ధ వస్త్రంబుచేన్= సగంచీరచేత; ఆవృతంబు+అగు= కప్పబడిన; దేహ, యష్టిదానిన్= దేహమనే కర్ర కలదానిని; అంటే మిక్కిలి చిక్కిన శరీరం కల దానిని; ఆఁకలి= తిండికైన తహతహ; తృష= దాహం; నిద్ర= నిదుర; అను= అనే; వీనిన్= వీటిని; ఎఱుఁగక= తెలియక; ఉన్మాదినియున్+ పోలెన్= పిచ్చిదానివలె; ఉన్నదాని= కనిపిస్తున్న దానిని; దమయంతిన్= దమయంతిని; చూచి; కొందఱు= కొంతమంది; పిశాచంబు+అని= దయ్యమని; పఱచిరి= పారిపోయారు; కొందఱు, భయము+పొందిరి= భయపడ్డారు; అందున్= ఆ సార్థంలో; కొందఱు= కొంతమంది; అధిక, హాస్యంబు+చేసిరి= మిక్కుటంగా ఎగతాళి చేశారు; కొందఱు= కొంతమంది; అడవిన్+ఏమి, రోసెదు+అనిరి= ఈ అడవిలో ఏమి వెదకుతున్నావు? అని అడిగారు; కొందఱు= కొంతమంది; అవ్వ!= అమ్మా!; నీవు; వేల్పవు+అగుదు= దేవతవు అవుతావు; అని; మొగిన= పూనికతో; కేలు, మొగిచి= చేతులు జోడించి; అంతన్= అంతట; మ్రొక్కిరి= నమస్కరించారు.

తాత్పర్యం: ఆ వర్తకసమూహం దమయంతిని చూచి పలుతెరగుల తలపోశారు. రేగినదుమ్ము నెత్తిపై పడటంచేత ఎఱ్ఱబారిన ముంగురులు కలదానిని, మిక్కుటంగా మాసిపోయిన సగంచీరచేత కప్పబడి బెత్తంవలె కనిపించే శరీరం కల దానిని; ఆకలి, దప్పిక, నిదుర అనే వాటికి దూరమై

పిచ్చిదానివలె తిరుగుతున్నదానిని ఆ దమయంతిని చూచి కొందరు ఆమెను దయ్యం అనుకొని భీతితో పారిపోయారు. కొందరు ఆమెను అపహాస్యం చేశారు. కొందరు 'అవ్వా! ఈ అడవిలో నీవు దేనికొరకు వెదకుతున్నావు'? అని ప్రశ్నించారు. కొందరు 'దేవీ! నీవు సాక్షాత్తు భువికి దిగి వచ్చిన దేవతవే' అని కేలు మోడ్చి మ్రొక్కారు.

వ. దమయంతియు సార్థవాహుఁజూచి' యిమ్మహాగహనంబున నిట్టి జనసంకులం బైన సార్థంబు గానంబడియెడు నెట్టి పుణ్యంబో' యని పల్కి మఱియు నిట్లనియె. 102

ప్రతిపదార్థం: దమయంతియు= దమయంతి సయితం; సార్థవాహున్+ చూచి= వర్తక ప్రముఖుడిని చూచి; ఈ+మహా, గహనంబునన్= ఈ గొప్ప అడవిలో; ఇట్టి, జన, సంకులంబు+ఐన= ఈ విధంగా జనులచేత క్రిక్కిరిసిన; సార్థంబు= వర్తకుల గుంపు; కానంబడియెడున్= కనిపిస్తున్నది; ఎట్టి; పుణ్యంబో= ఎటువంటి మంచి కర్మకు ఫలితమో?; అని పల్కి= అని వచించి; మఱియున్= వెండియు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: దమయంతి వర్తకుడిని చూచి ఇట్లా పలికింది - 'ఈ ఘోరారణ్యంలో ఈ వర్తక జనులు కనిపించటం ఎంతటి పుణ్యం!' అని, ఆమె మళ్ళీ ఇట్లా అన్నది.

క. 'ఏను నలు భార్యఁ బుణ్యవి ।
హీనతఁ బతిఁ బాసి నవసి యేకాంతమ యీ
కానలఁ బరిభ్రమించెదఁ ।
గానరె ? మీ రమృతసదృశుఁ గరుణాత్ము నలున్?' 103

ప్రతిపదార్థం: ఏను= నేను; నలుభార్యన్= నలుడిభార్యను; పుణ్య, విహీనతన్= పుణ్యం కొరవడటంచేత, అంటే కేవలం దురదృష్టవశాన; పతిన్+పాసి= భర్తను

ఎడబాసి; నవసి= మిక్కిలి గాసిచెంది; ఏకాంతము+అ= ఒంటరిగా; ఈ కానలన్= ఈ అడవులలో; పరిభ్రమించెదన్= చుట్టూ తిరుగుతున్నాను; అమృత, సదృశున్= అమృతంతో సరిపోలేవాడిని; కరుణాత్మున్= దయామయుడిని; నలున్= నలుడిని; మీరు; కానరె= చూడలేదా?

తాత్పర్యం: 'నేను నలుడిభార్యను, దురదృష్టవశాన నేను నా భర్తను ఎడబాసి, ఒంటరిగా ఈ అడవులలో కష్టాలపాలై తిరుగాడుతున్నాను. అమృత సమానుడు, దయామయుడు అయిన నలుడిని మీరు ఎచటనైనా చూడలేదా?'

విశేషం: ఆనంద ముద్రణాలయం వారి ప్రతిలో "గానరె? మీ రమరసదృశుఁ" అనే పాఠాంతరం ఉన్నది. దీనిని బట్టి "నలుడు దేవతలతో సమానుడు"- అనే విశేషార్థం వెల్లడౌతున్నది.

వ. అనిన దానికి సార్థవాహుండు శుచి యను వాఁ డిట్లనియె. 104

ప్రతిపదార్థం: అనినన్= అని దమయంతి చెప్పగా; దానికిన్= ఆ దమయంతికి; సార్థవాహుండు= సార్థంలోని వర్తకుడు; శుచి+అనువాఁడు= శుచి అనే పేరు గల వణిక్ప్రముఖుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: అని దమయంతి చెప్పగా శుచి అనే పేరుగల వర్తకప్రముఖుడు దమయంతితో ఇట్లా బదులు పలికాడు.

క. 'నలుఁ గాన మివ్వనంబునఁ।
గల వెప్పుడుఁ గాంతు ముగ్రకరులను సింహం
బుల బుక్షంబుల; నిది మ।
ర్త్యుల కవిషయ; మాతపంబు దూఱదు దీనన్.' 105

ప్రతిపదార్థం: ఈ+వనంబునన్= ఈ అడవిలో; నలున్+కానము= నలుడిని చూడలేదు; ఉగ్ర, కరులను= భయంకరాలైన ఏనుగులను; సింహంబులన్= సింగాలను; బుక్షంబులన్= ఎలుగుబంట్లను; ఎప్పుడున్= సతతం; కాంతుము= చూస్తూ ఉంటాము; కలవు= ఉన్నాయి; ఇది= ఈ అరణ్యం, మర్త్యులకు= మానవులకు; న+విషయము= చేరగూడని ప్రదేశం; దీనన్= ఈ అడవిలో; ఆతపంబు= ఎండ; దూఱదు= చొరబడదు.

తాత్పర్యం: 'ఈ అడవిలో మేము నలుడిని చూడలేదు కాని, ఇక్కడ ఉండే భయంకరాలైన సింహాలను, ఏనుగులను, ఎలుగుబంట్లను మాత్రం చూస్తూ ఉంటాము. ఈ అడవి మనుజులు ప్రవేశించదగిన ప్రదేశం కాదు. ఇందులోకి సూర్యరశ్మికూడా ప్రవేశించలేదు'.

వ. అనిన 'నిచ్చనుప యెట వోయెడు?' నని యడిగినఁ 'జేదిపతియైన సుబాహుపురంబునకుం బోయెడు' నని చెప్పిన 'నట్లేని మీతోడ వచ్చెద' నని యప్పరమపతివ్రత పతిదర్శన లాలసయై మునుల పలుకులు తలఁచుచు సార్థంబుతో నరిగిన. 106

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఈ+చనుప= ఈ వర్తకులగుంపు; ఎట+ పోయెడున్= ఎక్కడికి పోతుంది; అని+అడిగినన్= అని దమయంతి అడుగగా; (శుచి బదులు పలుకుతూ), చేది, పతి+ఐన= చేదిదేశప్రభువు అయిన; సుబాహు పురంబునకున్+పోయెడున్= సుబాహువుయొక్క రాజధానీనగరానికి పోతుంది; అని, చెప్పినన్= అని చెప్పగా; అట్లు+ఏని= అట్లయితే; మీ తోడ, వచ్చెదన్= మీతోపాటు వస్తాను; అని; ఆ+పరమ పతివ్రత= ఆ గొప్ప పతివ్రత; పతిదర్శన లాలస+ఐ= భర్తను చూడాలనే కోరికకలదై; మునుల, పలుకులు= మునుల మాటలు; తలఁచుచు= స్మరిస్తూ; సార్థంబుతోన్= చనుపతో; అరిగినన్= వెళ్ళగా.

తాత్పర్యం: అని శుచి అనే వర్తకప్రముఖుడు చెప్పగా, దమయంతి 'ఈ వర్తకులందరు ఎక్కడికి వెళ్తారు?'- అని ప్రశ్నించింది. 'ఈ వర్తకులందరు

చేదిప్రభువు సుబాహువుయొక్క రాజధాని నగరానికి వెళ్తారు'. - అని శుచి బదులు పలికాడు. 'అట్లయితే నేను మీతో వస్తాను'- అని దమయంతి భర్తను చూడాలనే తహతహతో, ఋషివరేణ్యుల మాటలు స్మరిస్తూ, వారితో కలసి వెళ్ళింది.

క. కడునెండ యెక్కు నంతకు ।
నుడుగక యచ్చనుప నడచి యుగ్రాటవిలో
విడిసె బహుశీతజలముల ।
బెడఁ గగు నొక చెఱువునొద్దఁ బెద్దయు డప్పిన్. 107

ప్రతిపదార్థం: కడున్+ఎండ= మిక్కుటంగా ఎండ; ఎక్కునంతకున్= (మింటి పైకి) ఎగబ్రాకే వరకు; ఉడుగక= విరమించక; ఆ+చనుప= ఆ సార్థం; నడచి= పయనించి; ఉగ్ర+అటవిలోన్= భయంకరమైన అడవిలో; బహు, శీత, జలములన్= మిక్కిలి చల్లని నీళ్లచేత; బెడఁగు+అగు= మంచిదైన; ఒక, చెఱువు+ఒద్దన్= ఒక తటాకం దగ్గర; పెద్దయు, డప్పిన్= పెను దాహంచేత; విడిసెన్= విడిది చేసింది.

తాత్పర్యం: మిక్కిలిగా పొద్దు ఎక్కేవరకు ఆ వర్తకులు పయనించి, చల్లని నీళ్ళచేత ఆహ్లాదకరంగా కనిపించే చెరువు దగ్గర దాహం తీర్చుకొని విశ్రమించటానికి విడిది చేసారు.

వ. అంత. 108

తాత్పర్యం: అప్పుడు.

సీ. అర్ధరాత్రమునప్పు డందుల కేతెంచె ।
గజయూథములు జలకాంక్షఁ జేసి
యంబుధి విమలతోయంబు లాస్వాదింపఁ ।
జనుదెంచు జలధరసమితియట్ల

యచ్చన్పలోన నిద్రాసక్తులైన వా ।
రున్నత ద్విపముల యుగ్ర పాద
హతిఁ జేసి మర్దితు లైరి కొందఱు, దంత ।
హతిఁ జేసి భిన్నాంగు లైరి కొంద,

ఆ. ఱఱచి ప్రాణభీతిఁ బఱచి మహీజంబు ।
లెక్కి రందుఁ గొంద ఱుక్కడంగి;
చనుప యిట్టిపాటఁ బెనుపఱి యవినీతు ।
సిరియుఁబోలె నడఁగి విరిసి చనియె. 109

ప్రతిపదార్థం: అర్ధ రాత్రము+అప్పుడు= నడిరేయి వేళ; అందులకు= అచటికి; జల, కాంక్షన్+చేసి= నీటిని త్రాగటంకొరకు; గజ, యూథములు= ఏనుగుల గుంపులు; అంబుధి, విమల, తోయంబులు= సముద్రంలోని నిర్మల జలాలు; ఆస్వాదింపన్= క్రోలటానికి; చనుదెంచు= వచ్చే; జలధర, సమితి+అట్లు+అ= మేఘాల సమూహాల వలె; ఏతెంచెన్= వచ్చాయి; ఆ+చన్పలోనన్= ఆ సార్థంలో; కొందఱు= కొంతమంది; నిద్రా+ఆసక్తులు+ ఐనవారు= నిద్రలో తగుల్కొన్నవారు; ఉన్నత, ద్విపముల= పెద్ద ఏనుగుల; ఉగ్ర, పాద, హతిన్+చేసి= భయంకరమైన పాదాలయొక్క తాకిడిచేత; మర్దితులు+ఐరి= మర్దించబడ్డారు, అంటే నలగగొట్టబడి మరణించారు; కొందఱు= కొంతమంది; దంతహతిన్+చేసి= దంతాల తాకిడిచేత; భిన్న+ అంగులు+ఐరి= ముక్కలైన శరీరాలు కలవారైనారు (ఎముకలు, అంగాలు విరిగినవారైనారు); అందున్+ కొందఱు= వారిలో కొంతమంది; ఉక్కు+ అడంగి= స్థైర్యం కోల్పోయి; ఆఱచి= పెనుకేకలు పెట్టి; ప్రాణభీతిన్= ప్రాణభయంచేత; పఱచి= పరుగెత్తి; మహీజంబులు= చెట్లను; ఎక్కిరి= అధిరోహించారు; చనుప= సార్థం; ఇట్టి, పాటన్= ఇట్టి పరిస్థితి వలన; పెనుపు+అఱి= సమృద్ధిని కోలుపోయి (అంటే సంఖ్యాబలాన్ని కోల్పోయి,

క్షీణించి); అవినీతు, సిరియున్+పోలెన్= నీతిబాహ్యుడి ఐశ్వర్యంవలె; విరిసి, చనియెన్= పగిలి (చెదరి) పోయింది.

తాత్పర్యం: నడిరేయి నీరు త్రాగటానికై అడవి యేనుగుల గుంపులు ఆ చెరువు దగ్గరకు వచ్చాయి. ఆ యేనుగులు, సముద్ర జలాలను త్రాగటానికై సముద్రాన్ని చేరిన మేఘాల సమూహాలవలె ఉన్నాయి. ఆ సార్థంలో నిద్రలో నిమగ్నులై ఉండే కొంతమంది ఏనుగుల పాదతాడనంచేత మరణించారు. కొంతమంది ఏనుగుల దంతాలచేత శరీరాలు చీలి చనిపోయారు. కొంతమంది స్థైర్యం కోల్పోయి అరుస్తూ ప్రాణభీతితో పరుగెత్తి చెట్లు ఎక్కారు. ఈ విధంగా ఆ సార్థం నీతిబాహ్యుడి సంపదవలె క్షీణించి చెదిరిపోయింది.

వ. అట్టి సంక్షోభంబున మరణంబునకుఁ దప్పి దమయంతి యాత్మగతంబున. 110

ప్రతిపదార్థం: అట్టి= అటువంటి; సంక్షోభంబునన్= అలజడిలో; మరణంబునకున్+తప్పి= చావకుండ తప్పించుకొని; దమయంతి; ఆత్మగతంబునన్= తనలో తాను ఇట్లా తలచింది.

తాత్పర్యం: అటువంటి అలజడిలో దమయంతి దైవికంగా చావును తప్పించుకొని తన మనస్సులో ఇట్లా తలపోసింది.

ఆ. 'జీవితార్థు లైన జీవుల సుఖసుప్తు ।
లైన వారిఁ జంపె నఱవ నఱవ;
మరణకాంక్ష నున్న మగువఁ జంపక నను ।
మఱచె; విధి కరంబు మందబుద్ధి. 111

ప్రతిపదార్థం:జీవిత+అర్థులు= బ్రతకాలనే కోరిక ఉన్నవారు; ఐన; జీవులన్= ప్రాణులను; సుఖ, సుప్తులు+ఐన వారిన్= సుఖంగా నిద్రిస్తున్నవారిని; అఱవన్+అఱవన్= కేకలు పెట్టుతుండగా; చంపెన్= చంపాడు; మరణ

కాంక్షన్+ఉన్న, మగువను= చనిపోవాలనే కోరికతో ఉన్న ఆడుదానిని; ననున్= నన్ను; చంపక= చంపకుండ; మఱచె= విస్మరించాడు; విధి= దైవం; కరంబు= మిక్కిలి; మందబుద్ధి= బుద్ధిహీనుడు.

తాత్పర్యం: 'బ్రతికి ఉండాలనే కోరికతో మైమరచి నిద్రిస్తున్నవారిని, ప్రాణభయంతో కేకలు పెట్టుతూవుండగా చంపివేశాడు. కాని, చావాలనే కోరికతో ఉన్నదానిని నన్ను చంపకుండ మరచిపోయాడు । ఆ విధి మిక్కిలి బుద్ధిహీనుడు కదా!

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. మానవజీవితంలో హృదయవిదారకాలైన విచిత్రవిరోధాభాసాలలో ఇదొకటి!

సీ. ఇచ్చన్వతోఁ జని యివ్వనక్లేశంబు ।
దలఁగుదు నని బుద్ధిఁ దలఁచి యున్న
నురుతర సార్థ పయోరాశి హస్తియూ ।
థాగస్త్యుచేఁ బీత మయ్యెఁ; నదియుఁ
దొలుమేనఁ జేసిన దుష్కృత శక్తియో, ।
వగవక నా స్వయంవరమునాఁడు
సురవరు లర్థులై చూచుచు నుండఁగ ।
నలు వరియించిన నాఁటి యెగ్గు

ఆ. దలఁచి యిట్టి యాపదలు సేసిరో వేల్పు, ।
లమరకోపమునన యయ్యె నాకు
నివ్వియోగదుఃఖ; మింకేమి సేయుదు?' ।
ననుచు వగచుచుండె నంబుజాక్షి. 112

ప్రతిపదార్థం: ఈ+చన్వతోన్= ఈ సార్థంతో కలిసి; చని= వెళ్ళి; ఈ+వనవాస క్లేశంబు= ఈ అడవిలో పడే బాధ; తలఁగుదును+అని= తొలగించుకొంటానని; బుద్ధిన్+తలఁచి+ఉన్నన్= మదిలో భావించి ఉండగా;

ఉరుతర, సార్థ, పయస్+రాశి= గొప్పదైన సార్థం అనే సముద్రం; హస్తియూథ+అగస్త్యుచేన్= ఏనుగుల గుంపు అనే అగస్త్యుడి చేత; పీతము+అయ్యెన్= త్రాగబడింది అయింది; అదియున్= అదికూడా; తొలుమేనన్= మొదటి శరీరంలో అంటే పూర్వజన్మలో; చేసిన; దుష్కృత, శక్తియో= చెడుకర్మ మహిమ ఏమో?; వగవక= ఆలోచించక; నా, స్వయంవరము, నాఁడు= నా స్వయంవర సమయంలో; సుర, వరులు= దేవతలలో శ్రేష్ఠులు; అర్థులు+ఐ= కోరినవారై; చూచుచున్+ఉండఁగ= చూస్తున్నప్పుడు; నలున్= నలుడిని; వరియించిన, నాఁటి+ఎగ్గు, తలఁచి= వరించిన సమయంలోని అపకారాన్ని మనసులో పెట్టుకొని; వేల్పులు= దేవతలు; ఇట్టి= ఈ విధమైన; ఆపదలు, చేసిరో= ఇక్కట్టులు తెచ్చిపెట్టారో; ఈ+వియోగ దుఃఖము= ఈ ఎడబాటువలన పరితాపం; అమర కోపమునన్+అ= దేవతల కోపంచేతనే; నాకు+అయ్యెన్= నాకు ఏర్పడింది; ఇంక+ఏమి+చేయుదున్?= ఇక ఏమి చేయగలను?; అనుచున్= అని తలపోస్తూ; అంబుజ+అక్షి= పద్మాలవంటి కన్నులుకల దమయంతి; (అంబుజం= నీటినుండి పుట్టింది, పద్మం); వగచుచుండెన్= దుఃఖిస్తూ ఉండింది.

తాత్పర్యం: ఈ సార్థంతో వెళ్ళి ఈ అడవిలో పడేబాధలు తొలగించుకొందాము'- అని తలచి ఉన్నాను. కాని, ఏనుగుల గుంపు అనే అగస్త్యుడిచేత ఈ సార్థం అనే సముద్రం పీల్చివేయబడింది. ఇది పూర్వజన్మ కర్మఫలమో! లేక నా స్వయంవరంనాడు ఆలోచించక నన్నుకోరి వచ్చిన దేవతాశ్రేష్ఠులు చూస్తుండగా నేను నలుని వరించటం అపకారంగా తలచి ఇటువంటి కష్టాలు నాకు తెచ్చి పెట్టుతున్నారో! నా భర్తతో నాకు ఇటువంటి ఎడబాటు దుఃఖం దేవతల కోపంవలననే కలిగింది. ఇంకేమి చేయగలను?' అని దమయంతి వాపోయింది.

విశేషం: (1) ఆకస్మికంగా ఈ సార్థం ఏనుగులగుంపుచేత ప్రమాదానికి గురికానేల? ఇది పూర్వజన్మ కర్మఫలితమా? భారతీయ సంస్కృతిలో మిక్కిలి ప్రాధాన్యం వహించిన కర్మ సిద్ధాంతం ఇట ప్రస్తావించబడింది. ఏల నిద్రలో మునిగిఉండే నిర్దోషులు వధించబడ్డారు? అది పూర్వజన్మ కర్మ అవుతుందా? అట్లే అరణ్యక్లేశం తప్పుతుందని దమయంతి చనుపలో చేరింది. తానొకటి తలచితే దైవ మింకొకటి తలచింది కదా! అంతటికిని పూర్వజన్మ కృతమైన కర్మయే కారణం- అని ఆమె వగచింది. (2) అగస్త్యమహర్షి సముద్రజలాన్ని పీల్చిన సుప్రసిద్ధ పురాణగాథ ఇచట ప్రస్తావించబడింది. (3) అలంకారం: రూపకం.

దమయంతి సుబాహుపురంబు ప్రవేశించుట (సం. 3-62-28)

వ. ఇట్లు దుఃఖించుచు దమయంతి ప్రభాతంబ హతశేషులైన యచ్చనుపలోని బ్రాహ్మణవరులతో ననవరత ప్రయాణంబులం జేదిపతి పురంబు సొచ్చి, జనసంకులంబైన రాజమార్గంబు దఱియ వచ్చుచున్న దాని దినకర ప్రభాపటల ధూసరిత ప్రభాతచంద్రరేఖయుంబోలె దీప్తివిహీనయై డస్సియు రమ్యాకృతియైన దాని దమయంతిం బ్రాసాదగతయైన రాజమాత దవ్వులం గని తన దాది కిట్లనియె. 113

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; దుఃఖించుచున్= పరితపిస్తూ; దమయంతి; ప్రభాతంబు+అ= తెల్లవారినపుడు; హతశేషులు+ఐన= చావగా మిగిలిన; ఆ+చనుపలోని= ఆ వర్తకులగుంపులోని; బ్రాహ్మణ, వరులతోన్= బ్రాహ్మణశ్రేష్ఠులతో; అనవరత, ప్రయాణంబులన్= ఆగని ప్రయాణాలు చేసి (అంటే మార్గమధ్యంలో ఎక్కువగా విడిదిచేయక శీఘ్రప్రయాణాలు చేసి); చేదిపతి, పురంబు= చేదిప్రభువు రాజధానిని; చొచ్చి= ప్రవేశించి; జన సంకులంబు+ఐన= ప్రజలచేత క్రిక్కిరిసినట్టి; రాజమార్గంబు= ప్రధానమైన దారిని, (రాజు పయనించే మార్గం రాజమార్గం); తఱియ, వచ్చుచున్న దానిన్= చేరవస్తున్న దానిని; దినకర, ప్రభా, పటల, ధూసరిత, ప్రభాత చంద్రరేఖ

యున్+పోలె= సూర్యుడి కాంతికిరణ సమూహాలచేత బూడిద రంగు కలదిగా చేయబడిన (వెలవెలపోయిన) ప్రాతఃకాలమందలి చంద్రవంకవలె; దీప్తి, విహీన+ఐ= కాంతి తరిగినట్టిదై; డస్సియు= బడలినప్పటికిని; రమ్య+ఆకృతి+ఐన, దానిన్= అందమైన ఆకారం కలదానిని; దమయంతిన్= దమయంతిని; ప్రాసాదగత+ఐన= మేడపై ఉన్న; రాజమాత= రాజుగారి తల్లి; దవ్వులన్+కని= దూరంనుండి చూచి; తనదాదికి= తనసేవకురాలితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఈ విధంగా పరితపిస్తూ దమయంతి, తెల్లవారగానే చావగా మిగిలిన ఆ చనుపలోని (వర్తకులగుంపు) బ్రాహ్మణశ్రేష్ఠులతో కలిసి శీఘ్రంగా పయనించి కొన్నాళ్లకు చేదిదేశ రాజధానికి చేరి జనసమ్మర్దం గల రాజమార్గాన్ని సమీపిస్తూ ఉండగా సూర్యకిరణసమూహంచేత బూడిదరంగు కలదిగా చేయబడి వెలవెలపోయిన ప్రాతఃకాల చంద్రరేఖవలె కాంతి కోల్పోయి, అలసిపోయికూడ అందమైన ఆకృతి కలిగిన ఆ దమయంతిని మేడపైనుండి రాజమాత అల్లంతదూరాన చూచి, తన దాదితో ఇట్లా పలికింది.

విశేషం: అలం: ఉపమ. మహాభారతంలోని మనోజ్ఞమైన ఉపమాలంకారాలలో ఇది ఒకటి. ఇచట 'డస్సియు రమ్యాకృతి' గల దమయంతి ఉపమేయం. ప్రభాతవేళలో సూర్యకిరణ సమూహాలచేత ధూసరితమైన చంద్రవంక ఉపమానం. సూర్యకిరణ ధూసరిత మైనది చంద్రవంక, ధూళి ధూసరితమైనది దమయంతి. కృశత్వం, దీప్తి తరగటం చంద్ర వంకకు దమయంతికి సమానధర్మాలే. చంద్రవంక కృశించినా, దీప్తిహీనమైనా మనోహర మైనదే. అట్లే దమయంతికూడ.

తే. 'జీర్ణమై కడు మాసిన చీరగట్టి।
ధూళి ధూసరాలకములు దూలుచుండ
నబల యున్మత్తవేషిణి యైన లచ్చి।
కరణి నిట వచ్చుచున్నది కంటె దాని. 114

ప్రతిపదార్థం: జీర్ణము+ఐ= చినిగినట్టిదై; కడు= మిక్కిలి; మాసిన= మలినమైన; చీర= వస్త్రం; కట్టి= ధరించి; ధూళి, ధూసర+అలకములు= దుమ్ముచేత బూడిదవన్నెగల ముంగురులు; తూలుచుండన్= ఇటు అటు కదలుతూ ఉండగా; అబల= మగువ; ఉన్మత్త, వేషిణి+ఐన= పిచ్చిదాని వేషం వేసికొన్న; లచ్చి, కరణిన్= లక్ష్మీదేవివలె; ఇట= ఇచటకు; వచ్చుచున్నది= వస్తున్నది; దానిన్= ఆమెను; కంటె= చూచావుకదా!.

తాత్పర్యం: 'చినిగిపోయి మిక్కిలి మాసినచీర కట్టుకొని, దుమ్ముచేత, ఎఱ్ఱవారిన ముంగురులు ఇటూఅటూ కదలుతుండగా, పిచ్చిదానివేషం వేసికొన్న లక్ష్మీదేవివలె ఇటు వస్తున్న ఆమెను చూచావుకదా!.

విశేషం: అలం: ఉపమ. 115-116 పద్యాలు తీర్చిన ఒరవడిలో నన్నయ మహాకవి 'ప్రసన్నకథాకలితార్థయుక్తి' ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది. ఆమె ఎవరో రాజమాతకు తెలియదుకదా! అయినను రాజమాత దమయంతిని ఉన్మత్తవేషిణి అయిన లక్ష్మీదేవి వలె, ప్రభాతవేళలో సూర్యరశ్మి తాకిడికి దీప్తి కోల్పోయిన చంద్రవంకవలె ఉపమించటం హృద్యం.

వ. అక్కోమలియందు నా కతిస్నేహంబై యున్నయది; దానిం దోడ్కొని ర'మ్మనిన నదియు దమయంతిం దోడ్కొని రాజమాత యొద్దకుం జనిన, నా రాజమాతయు దానిం జూచి 'నీవెవ్వరి దాన? వి ట్లేల దుఃఖావేశవివశవై యున్నదానవు చెప్పు' మనిన దమయంతి యిట్లనియె. 115

ప్రతిపదార్థం: ఆ+కోమలియందు= సుకుమారి అయిన ఆ అంగనపట్ల; నాకు+ అతిస్నేహంబు+ఐ+ఉన్న+అది= నాకు మిక్కుటమైన ప్రేమ ఏర్పడింది; దానిన్= ఆమెను; తోడ్కొనిరమ్ము+అనినన్= తీసికొనిరమ్ము అని అనగా; అదియు= ఆ దాదియు; దమ యంతిన్+తోడ్కొని= దమయంతిని వెంటపెట్టుకొని; రాజమాత+ ఒద్దకున్+చనినన్= రాజుగారి తల్లి దగ్గరగా వెళ్ళగా; ఆ, రాజ, మాతయు; దానిన్+ చూచి= ఆమెను (దమయంతిని) చూచి; నీవు+ఎవ్వరి దానవు= నీవు ఎవరికి సంబంధించినదానివి; ఇట్లు=

ఈ విధంగా; ఏల= ఎందుకు; దుఃఖ+ఆవేశ, వివశవు+ఐ+ ఉన్న= దానవు= శోకంవలన ఏర్పడిన ఉద్వేగంతో వశం తప్పిఉన్నదానివి; చెప్పుము; అనినన్= అని అడుగగా; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నాకు ఆ కోమలాంగిపై అత్యంతమైన ప్రీతి ఏర్పడింది. నీవు పోయి ఆమెను ఇచటికి తోడ్కొని రమ్ము' అని, రాజమాత తన దాదిని నియోగించింది. ఆ దాది వెళ్ళి దమయంతిని వెంటబెట్టుకొని రాజమాత సన్నిధికి వచ్చింది. రాజమాత దమయంతితో 'నీవు ఎవరిదానివి? ఇట్లా ఎందుకు పరమశోకమూర్తివై కనిపిస్తున్నావు?' అని ప్రశ్నించింది. అప్పుడు దమయంతి ఇట్లా బదులు చెప్పింది.

మధ్యాక్కర.

> **'జితవైరి మత్పతి జూదమాడి నిర్జితుఁడయి చనినఁ**
> **బతితోడ నీడయుఁ బోలె నేనును బాయక యరిగి**
> **యతిబుభుక్షాతురుండైన పతిచేత నవ్వ! దైవాను**
> **మతిఁజేసి వంచితనైతి నొక్కచో మఱచి నిద్రించి. 116**

ప్రతిపదార్థం: మత్+పతి= నాభర్త; జిత, వైరి= పరాక్రమంచేత జయింపబడిన శత్రువులు కలవాడు; జూదము+ఆడి; నిర్జితుఁడు+ఐ= ఓడించబడినవాడై; చనినన్= వెళ్ళగా; పతితోడన్= భర్తతో; నీడయున్+పోలెన్= నీడవలె; ఏనును= నేను కూడ; పాయక= ఆతడిని విడిచిపెట్టక; అరిగి= వెళ్లి; అతి, బుభుక్షా+ఆతురుండు+ఐన= మిక్కిలి ఆకలిచేత పీడితుడైన; పతిచేతన్= భర్తచేత; అవ్వ!= అమ్మా!; దైవ+అనుమతిన్+చేసి= దురదృష్టవశాన; ఒక్కచోన్= ఒకానొకచోట; మఱచి, నిద్రించి= మైమరచి నిద్రపోయి; వంచితన్+ఐతి= మోసగించబడినదానినయ్యాను.

తాత్పర్యం: 'అమ్మా! నా పతి పరాక్రమోపేతుడైన వీరుడు. శత్రువులను జయించినవాడు. కాని, ఆయన జూదమాడి, ఓడిపోయి రాజ్యాన్ని వదలివెళ్ళగా,

నేను కూడ నీడవలె వెన్నంటి వెళ్ళి, ఒకచోట మైమరచి నిద్రించి, విధివశాన అతిగా ఆకలిచే బాధితుడైన భర్తచేత మోసగించబడ్డాను.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. అంతనుండియు నమ్మహానుభావు నేకవస్త్రు ననికేతను నన్వేషించుచు, సైరంధ్రీవృత్తంబు సేకొని, వియోగానలంబునం గంది, కందమూల ఫలంబుల యాహారంబుగాఁ, బ్రొద్దు వడినచోట నివాసంబుగా, మృగంబుల సహాయంబుగా, వనంబులం బరిభ్రమించితి' నని, బాష్పజలంబులం బయోధరస్థలపరాగంబు పంకంబు సేయుచుఁ బలుకనేరకున్న యా దమయంతికి రాజమాత యిట్లనియె. 117

ప్రతిపదార్థం: అంతనుండియున్= అప్పటినుండి; ఆ+మహా+అనుభావున్= ఆ మహాత్ముడిని; ఏక, వస్త్రున్= ఒకే పుట్టం కట్టుకొన్నవాడిని; అనికేతనున్= ఇల్లు లేనివాడిని; అన్వేషించుచున్= వెదకుతూ; సైరంధ్రీ, వృత్తంబు+చేకొని= సైరంధ్రి యొక్క నడవడిని పాటించి; వియోగ+అనలంబునన్+కంది= భర్తయొక్క ఎడబాటు అనే అగ్నివలన తపించి; కంద, మూల, ఫలంబులు+అ= దుంపలు, వేళ్ళు, పండ్లు మాత్రమే; ఆహారంబు+ కాన్= తిండిగా; ప్రొద్దు+పడిన, చోటు+అ= ప్రయాణంలో ఏచోట సూర్యుడు అస్తమిస్తాడో ఆ స్థలమే; నివాసంబు+కాన్= నివసించేచోటుగా; మృగంబులు+ అ, సహాయంబు+కాన్= జంతువులే సాయంగా; వనంబులన్= అడవులలో; పరిభ్రమించితిన్= తిరుగాడాను; అని= అనిచెప్పి; బాష్ప, జలంబులన్= కన్నీటితో; పయోధర, స్థల, పరాగంబు, పంకంబు, చేయుచున్= పాలిండ్లపై ఉన్న దుమ్మును బురదగా చేస్తూ; పలుకనేరకున్న= మాటాడ జాలనట్టి; ఆ, దమయంతికి; రాజమాత; ఇట్లు= ఈ విధంగా; అనియెన్= అని చెప్పింది.

తాత్పర్యం: అప్పటినుండియు ఏకవస్త్రం మాత్రమే కట్టుకొన్నవాడిని, నిలువ నీడ లేనివాడిని, వెదకుతూ సైరంధ్రి వృత్తిని చేపట్టి భర్త ఎడబాటువలన

తపించి దుంపలు, వేళ్ళు, పండ్లు ఆహారంగా, మృగాలే సహాయంగా, ప్రొద్దుకుంకిన వేళ నే నెక్కడ ఉంటే అదే అప్పటికి నివాసంగా అడవుల్లో తిరుగాడాను'- అని చెప్పి దమయంతి విలపించింది. ఆమె కన్నులనుండి కారిన బాష్పధారలచేత ఆమె స్తనాలపై గల దుమ్ము బురదగా మారింది. ఆమె మాటాడలేక మూగవోయిన పిమ్మట, దమయంతితో రాజమాత ఇట్లా చెప్పింది.

విశేషం: (1) సైరంధ్రీవృత్తిని గురించి తర్వాతి పద్యంలో వివరణ ఉన్నది. సైరంధ్రి అంటే సౌశీల్యవతి అయిన పరిచారిక అని సంగ్రహంగా చెప్పవచ్చును. (2) దమయంతి తాను పతిచేత వంచితనని చెప్పింది. కాని తన భర్తపై అది దోషారోపణ కాకుండటానికై ఆయన మహావీరుడు, మహాత్ముడు అని నొక్కి వక్కాణించింది. ఇది గమనించదగిన అంశం. (3) అడవులలో పరిభ్రమిస్తూ దమయంతి పడినపాట్లు వర్ణనాతీతాలు. ఆమెకు అరణ్యంలో ఆవాసస్థల మేది? అది ప్రొద్దు క్రుంకినపుడు ఆమె ఉన్నచోటే, పగలెల్ల అడవులలో తిరగటం, పొద్దుక్రుంకినపుడు తా నెచట ఉంటే ఆచోటనే తాత్కాలికంగా నివసించటం. దమయంతి పడినపాట్లు ఎంతటి కఠిన హృదయాన్నైనా కరిగించగలవు. ఇక, ఆర్ద్రహృదయ అయిన రాజమాతనుగురించి వేరుగా చెప్పవలెనా?

క. 'నీ వుండుము నాకడ నిం ।
దీవరదళనేత్ర! నీ పతిని రోయఁగ భూ
దేవోత్తములం బంచెద' ।
నావుడు ని ట్లనియె భీమనందన నెమ్మిన్. 118

ప్రతిపదార్థం: నా కడన్= నా దగ్గర; నీవు+ఉండుము= నీవు ఉండుము; ఇందీవర, దళ, నేత్ర!= నల్లకలువరేకులవంటి కన్నులు కలదానా!; నీపతిని= నీ భర్తను; రోయఁగన్= వెదకటానికై; భూ, దేవ+ఉత్తములన్= బ్రాహ్మణోత్తములను; పంచెదన్= నియోగిస్తాను; నావుడున్= అని చెప్పగా; భీమ, నందన= భీముడి పుత్రిక అయిన దమయంతి; నెమ్మిన్= ప్రీతితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: 'నల్లకలువరేకులవంటి కన్నులు కలదానా! నీవు నాదగ్గర ఉండుము. నీ భర్తను వెదకటానికై బ్రాహ్మణోత్తములను పంపగలను'- అని రాజమాత పలుకగా, సంతోషించి దమయంతి ఇట్లా చెప్పింది.

వ. 'ఏను సైరంధ్రి నయి యుండియు నుచ్ఛిష్టంబు ముట్టను; బదధావనంబు సేయను; బరపురుషులతోఁ బలుక నోపఁ; బతి నన్వేషించు పొంటె నరిగెడు బ్రాహ్మణులతోఁ బలుకుదు; నట్లయిన నీయొద్ద నుండుదు; నొండు విధంబైన నుండనేర' ననిన 'నీకిష్టం బైన విధంబున నాయొద్దన యుండు' మని దాని నతిగౌరవంబునం జేకొని యుండఁ దనకూఁతు సునంద యనుదాని సమర్పించిన. 119

ప్రతిపదార్థం: ఏను=నేను; సైరంధ్రిన్+అయి+ఉండియున్= నేను పరిచారిక నయి ఉన్నప్పటికిన్నీ; ఉచ్ఛిష్టంబు= ఎంగిలి; ముట్టను= తాకను; పద, ధావనంబు, చేయను= కాళ్ళు పిసుకను (కడగను); పరపురుషులతోన్= ఇతరులైన మగవారితో; పలుకన్+ఓపన్= మాటాడజాలను; పతిన్= భర్తను; అన్వేషించుపొంటెన్= వెతకటం కొరకు; అరిగెడు= వెళ్ళే; బ్రాహ్మణులతోన్= విప్రులతో; పలుకుదున్= మాటాడతాను; అట్లు+అయినన్= ఆ రీతిగా అయితే; నీ+ఒద్దన్= నీ దగ్గర; ఉండుదున్= ఉంటాను; ఒండు, విధంబు+ ఐనన్= ఇంకొక పద్ధతి అయితే; ఉండనేరను= ఉండజాలను; అనిన్= అని చెప్పగా; నీకు+ఇష్టంబు+ఐన, విధంబునన్= నీకు సమ్మతమైన రీతిగానే; నా+ఒద్దన= నా కడనే; ఉండుము; అని= అని చెప్పి; దానిన్= ఆమెను (దమయంతిని); అతి, గౌరవంబునన్= మిక్కుటమైన మన్ననతో; చేకొని+ఉండన్= చేర్చుకొని ఉండేటట్లుగా; తన, కూఁతు= తన పుత్రిక అయిన; సునంద+అను, దానిన్= సునంద అనే పేరుకలదానిని;

సమర్పించినన్= ఇవ్వగా (అంటే సునందను దమయంతిని గూర్చిన రక్షణలో ఉండేటట్లు నియమించగా.)

తాత్పర్యం: 'నేను సైరంధ్రివృత్తిలో ఉన్నప్పటికీ ఎంగిలి తినను. కాళ్ళు పిసకటం వంటి పనులు చేయను. నాభర్తను అన్వేషించటానికి వెళ్ళే బ్రాహ్మణులతో తప్ప ఇతర పురుషులతో మాటాడను. ఆవిధంగా నీ వంగీకరిస్తేనే నీ దగ్గర ఉండగలను' అని దమయంతి చెప్పగా 'నీ ఇష్టం వచ్చిన తీరున ఉండవచ్చు' నని రాజమాత అంగీకరించి, ఆమెను తన కూతురు సునందకు అప్పగించింది.

విశేషం: సైరంధ్రి అంటే -- 'సీరాణాం సమూహం-సైరమ్-తత్ ధరతీతి సైరంధ్రీ'- అనే అర్థం ప్రసిద్ధం. తెర చీరల గుంపును ధరించేది సైరంధ్రి అని భావం. ఆమె లక్షణాలను గురించిన శ్లోకం - "చతుష్షష్టి కలాభిజ్ఞా, శీలరూపాది సేవినీ । ప్రసాధనోపచారజ్ఞా, సైరంధ్రీ పరికీర్తితా॥". అరవైనాలుగు కళలలో పండితురాలు, శీలం రూపం కలది, వస్త్రాది అలంకరణలు చేసే ఉపచారాలలో బాగా నిపుణురాలు. అటువంటి స్త్రీని సైరంధ్రి అంటారు. విరాటపర్వంలో ద్రౌపది విరటుడి రాణియైన సుదేష్ణవద్ద సైరంధ్రిగా చేరిన సన్నివేశం ఇట సంవదించేది. ద్రౌపదికి ఒరవడి పెట్టినది దమయంతియే. ద్రౌపది ధర్మరాజుతో పాటు బృహదశ్వమహర్షి చెప్పిన నలచరిత్ర విని ఉండింది కదా!

క. అలయక పుణ్యవ్రతములు ।
సలుపుచుఁ జేదీశుపురిని సైరంధ్రి యనన్
నలుదేవి యుండె నెదఁ బతిఁ ।
దలఁచుచు దుస్సహవియోగతాపార్దితయై. 120

ప్రతిపదార్థం: అలయక= అలసటచెందక; పుణ్యవ్రతములు= పుణ్యాన్నిఒసగే నోములు; చలుపుచున్= చేస్తూ; చేది+ఈశు, పురిని= చేది దేశపు రాజధాని నగరంలో; ఎదన్= మనస్సులో; పతిన్= భర్తను; తలఁచుచున్= స్మరిస్తూ; దుస్సహ, వియోగ, తాప+ అర్దిత+ఐ= భరించరాని (భర్త) ఎడబాటువలన ఏర్పడిన దుఃఖంచేత పీడించబడినదై; నలుదేవి= నలుడి పట్టపురాణి; ఉండెన్= ఉండింది.

తాత్పర్యం: నలుడి పట్టపురాణియైన దమయంతి అలయకుండా పుణ్యప్రదమైన నోములు నోస్తూ, భర్తనే హృదయంలో ధ్యానిస్తూ, భరించరాని వియోగదుఃఖంతో బాధపడుతూ సైరంధ్రిగా చేదిభూపతిపురంలో ఉండింది.

వ. అట నలుండు దమయంతిం బాసి దారుణారణ్యంబులో నరుగు వాఁడు ముందట. 121

ప్రతిపదార్థం అటన్= అచట; నలుండు; దమయంతిన్+పాసి= దమయంతిని ఎడబాసి; దారుణ+అరణ్యంబులోన్= భయంకరమైన అడవిలో; అరుగువాఁడు= వెళ్ళేవాడు; ముందట= తనముందు.

తాత్పర్యం: అచట నలుడు దమయంతిని విడిచిపెట్టి అడవిలో వెళ్ళుతున్నాడు. అంతట అతడు తనముందట.

చ. అవిరళ విస్ఫులింగ నివహంబుల నభ్రపథంబు నంటుచున్
దవదహనం బుదగ్రతరుదాహము సేయుచు నున్నఁ జూచి మా
నవపతి దాని యంతరమునన్ వినియెన్ 'నరనాథ! నన్ను గా
రవమునఁ గావ వేగ యిట ర' మ్మను నార్తమహానినాదమున్. 122

ప్రతిపదార్థం: అవిరళ, విస్ఫులింగ, నివహంబులన్= ఎడతెగని నిప్పురవ్వల సమూహాలతో; అభ్ర, పథంబున్= ఆకాశమార్గాన్ని; అంటుచున్= తాకుతూ; దవ దహనంబు= దావాగ్ని; ఉదగ్ర, తరు, దాహము, చేయుచున్+ఉన్నన్+ చూచి= పెద్దపెద్ద చెట్లను దహించి వేస్తుండటం చూచి; మానవ, పతి= రాజు (నలుడు); దాని+ అంతరమునన్= ఆ అగ్నిమధ్యంలో; నరనాథ!= ఓ మహారాజా!; నన్ను, గారవమునన్+కావన్= నన్ను మన్ననతో కాపాడటానికై; వేగ= వేగంగా; ఇటన్= ఇచటకు; రమ్ము= రావలసింది; అను= అనేటి; ఆర్త, మహా, నినాదమున్= దుఃఖపూరితమైన గొప్పకేకను; వినియెన్= విన్నాడు.

తాత్పర్యం: ఎడతెగని నిప్పురవ్వల దొంతరలు ఆకాశమార్గాన్ని అంటుతూ పెద్దపెద్ద చెట్లను సైతం దహించివేస్తున్న దావాగ్నిని చూచి, ఆ దావాగ్ని మధ్యంలోనుండి 'ఓ మహారాజా! నన్ను మన్ననతో రక్షించటానికి ఇచటకు వేవేగ రమ్ము' అనే ఆర్తనాదం విన్నాడు.

క. విని శంకింపక చెచ్చెర।
ననఘుం డత్యుగ్రతర దవానలమధ్యం
బున కుఱికి కనియె దీనా।
ననుఁ గుండలితాంగు నొక్క నాగకుమారున్. 123

ప్రతిపదార్థం: విని= ఆ ఆర్తనాదం విని; శంకింపక= సందేహించక; చెచ్చెరన్= వేగంగా; అనఘుండు= పాపరహితుడు; అతి+ఉగ్రతర, దవ+అనల మధ్యంబునకు= మిక్కిలి తీక్ష్ణమైన దావాగ్ని మధ్యంలోకి; ఉఱికి= దూకి; దీన+ఆననున్= భీతిచెందిన మొగం కలవాడిని; కుండలిత+అంగున్= చుట్టుకొనబడిన దేహం కలవాడిని; ఒక్క, నాగకుమారున్= ఒక పాము కొడుకును; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: పుణ్యాత్ముడైన నలుడు ఆ దీనధ్వని విని, సందేహించక వేగంగా ఆ దావాగ్ని మధ్యంలోకి ఉరికాడు. ఆ అగ్నిమధ్యంలో నిరాశతో క్రుంగిన మొగంకలవాడు, చుట్టలు చుట్టలుగా శరీరాన్ని ముడుచుకొని భయపడుతున్న వాడైన ఒక నాగకుమారుడిని చూచాడు.

వ. అన్నాగకుమారుండును నలునకుం గృతాంజలియై 'యేను గర్కోటకుం డనువాఁడఁ; గర్మవశంబున నొక్క బ్రహ్మఋషి నుపాలంభించి తచ్ఛాపంబున నెక్కడం గదలనేరకున్నవాఁడ; నియ్యెరగలి చిచ్చు సర్వజీవులకు సంహార కారణంబై పేర్చి నలుదెసలం గలయం బర్వి చనుదెంచుచున్నయది; యీ యపాయంబు దలఁగు నట్లుగా నుద్ధరింపవలయు; నీవు కరుణాత్మకుండవు గావున నిన్ను వేడెద. 124

ప్రతిపదార్థం: ఆ+నాగ, కుమారుండును= ఆ పాప బుడుతడును; నలునకున్; కృత+అంజలి+ఐ= చేసిన నమస్కృతి కలవాడై; ఏను= నేను; కర్కోటకుండు+అనువాఁడన్= కర్కోటకుడు అనే పేరుగలవాడను; కర్మ, వశంబునన్= చేసిన కర్మవలన; ఒక్క, బ్రహ్మ+ఋషిన్= బ్రహ్మజ్ఞాని అయిన ఒక మునిని; ఉపాలంభించి= నిందించి; తద్+శాపంబునన్= అతడి శాపంచేత; ఎక్కడన్= ఎచటికి; కదలనేరక+ఉన్నవాఁడన్= సంచరించలేక ఉన్నవాడిని; ఈ+ఎరగలి, చిచ్చు= ఈ కార్చిచ్చు (దావాగ్ని); సర్వ జీవులకున్= సకల ప్రాణులకు; సంహార, కారణంబు+ఐ= మరణ కారకమై; పేర్చి= అతిశయించి; నలుదెసలన్+ కలయన్+పర్వి= నాలుగుదిక్కులు కలిసేటట్లు వ్యాపించి; చనుదెంచుచున్న+అది= వస్తున్నది; ఈ+అపాయంబు= ఈ కీడు; తలఁగునట్లుగాన్= తొలగిపోయేటట్లుగా; ఉద్ధరింపవలయున్= నన్ను కాపాడాలి; ఈవు= నీవు; కరుణా+ఆత్మకుండవు= దయకలవాడివి; కావున= కాబట్టి; నిన్ను; వేడెదన్= ప్రార్థిస్తాను.

తాత్పర్యం: ఆ నాగకుమారుడు నలుడికి నమస్కరించి, 'నాపేరు కర్కోటకుడు. కర్మవశాన ఒక బ్రహ్మర్షిని నిందించి ఆతడి శాపంవలన కదలనేరక పడిఉన్నాను. ఈ దావాగ్ని సకలప్రాణికోటికి మృత్యుకారణమై అన్ని వైపుల విజృంభిస్తున్నది. ఈ కీడునుండి నీవు నన్ను కాపాడ వేడుకొంటున్నాను. నీవు దయామయుడివి. దయచేసి నన్ను రక్షించుము' అన్నాడు.

క. నాలుగుదిశలను దావ।
జ్వాలావలి గవిసె; గ్రుంది చానోప; మహీ
పాలక! న న్నొక సరసీ।
కూలముఁ జేరంగ నెత్తికొని పొమ్ము దయన్. 125

ప్రతిపదార్థం: నాలుగు, దిశలను= నాలుగుదెసల; దావ, జ్వాలా+ఆవలి= కార్చిచ్చు మంటల వరుసలు; కవిసెన్= సమీపించాయి (వ్యాపించాయి); క్రమంది= కాలి (నొచ్చి); చాన్+ఓపన్= చనిపోజాలను; మహీపాలక!= ఓ మహారాజా!; నన్ను, ఒక, సరసీ, కూలమున్= నన్నొక సరస్సుయొక్క ఒడ్డుకు; చేరంగన్= చేరేట్లు; దయన్= దయతో ఎత్తికొని; పొమ్ము= మోసికొని తీసుకొని వెళ్ళుము.

తాత్పర్యం: 'ఓ మహారాజా! ఈ కారు చిచ్చుమంటలు నాలుగుదిక్కులా క్రమ్ముకొని సమీపించాయి. ఈ మంటలలో కాలి చనిపోజాలను. కావున, దయతో నన్ను ఎత్తుకొని ఒక చల్లని సరోవరతీరం చేర్చుము.

నలుఁడు కర్కోటకునిచేత దష్టుం డగుట (సం. 3-63-7)

వ. నన్ను రక్షించిన నీకుం బ్రియంబు సేయ నోపుదు' ననిన వాని నెత్తికొని పోవం జులుక నై యంగుష్ఠ ప్రమాణ దేహుండైయున్న నెత్తికొని, నలుం డతిత్వరితగతి నరిగి తాపవర్జితంబైన యొక్క సరోవర సమీపంబున విడువం బోయిన 'నింకను బదియడుగు లరుగుము నీకు శ్రేయఃప్రాప్తిఁ జేసెద ననిన నడుగు లెన్నికొనుచు నరిగి పదియగు నడుగునప్పు డప్పాముచేత దష్టుండై తనరూపంబు విడిచి వికృతరూపంబుతో నున్న నన్నలునకుం గర్కోటకుం డాత్మరూపంబు సూపి యిట్లనియె 'నయ్యా! నీవు నా చేత విషపీడితుండ నైతి నని దుఃఖింపవలదు; ని న్నొరు లెఱింగిన నెగ్గగుం గావున వికృతశరీరుం జేసితి; నెంతకాలంబు నీ శరీరంబున నా విషం బుండు నంతకాలంబును నీకు విషోరగ రాక్షస పిశాచ శత్రునివహంబువలని భయంబు లేదు; సర్వ సంగ్రామజయంబును భార్యాసంగమంబును నెప్పటిరాజ్యవిభవంబును నగు; నీ కెప్పుడేని నిజరూపంబు సేకొన నిష్టం బయ్యె నప్పుడ నన్నుం దలంపు; మీ వస్త్రంబు

నీయొద్దకు వచ్చు; దీని ధరియించుడు నిజరూప ప్రాప్తి యగు' నని వరం బిచ్చి వెండియు నిట్లనియె. 126

ప్రతిపదార్థం: నన్ను; రక్షించినన్= కాపాడితే; నీకున్= నీకు; ప్రియంబు= మేలు; చేయనోపుదున్= చేయగలను; అనినన్= అని చెప్పగా; వానిన్= ఆ కర్కోటకుడిని; ఎత్తికొని పోవన్= మోసికొనిపోవటానికి; చులుకనై+అంగుష్ఠ, ప్రమాణ, దేహుండై= తేలికఅయి బొటనవ్రేలంత కొలత గల శరీరం కలవాడై; ఉన్నన్= ఉండగా; ఎత్తికొని= లేవదీసి తన మూపుపై పెట్టుకొని; అతి, త్వరిత, గతిన్= మిక్కిలి వేగం గల నడకతో; అరిగి= వెళ్ళి; తాప వర్జితంబు+ఐన= వేడి లేనిదైన; ఒక్క, సరోవర, సమీపంబునన్= ఒక సరస్సు దగ్గరగా; విడువన్+పోయినన్= విడిచిపెట్టటానికి సిద్ధం కాగా; ఇంకను= ఇంకా అదనంగా; పది, అడుగులు+అరుగుము= పదిఅడుగులు వెళ్ళుము; నీకు, శ్రేయస్+ప్రాప్తిన్+చేసెదన్= నీకు మేలుకలిగేట్లు చేస్తాను; అనినన్= అనిచెప్పగా; అడుగులు+ఎన్నుకొనుచున్= అడుగులు లెక్కపెట్టుకొంటూ; అరిగి= వెళ్ళి; పది+అగు+అడుగు+అప్పుడు= పదవ అడుగు వేసేటప్పుడు; ఆ+పాముచేత; దష్టుండు+ ఐ= కరువబడినవాడై; తన రూపంబు= తన ఆకారం; విడిచి= వీడి; వికృత రూపంబు తోన్= వికారమైన ఆకారంతో; ఉన్నన్; ఆ+నలునకున్; కర్కోటకుండు; ఆత్మ, రూపంబు+చూపి= తన నిజస్వరూపం ప్రదర్శించి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు; అయ్యా!= ఆర్యా!; నీవు, నా, చేత; విష. పీడితుండను+ఐతిని+అని= విషంచేత బాధించబడినవాడిని అయ్యానని; దుఃఖింపవలదు= పరితపించవద్దు; నిన్ను+ఒరులు= నిన్ను ఇతరులు; ఎఱింగినన్= తెలిసికొంటే; ఎగ్గు+అగున్+కావునన్= కీడు కలుగుతుంది కనుక; వికృత శరీరున్+చేసితిన్= వికారమైన దేహం కలవాడినిగా చేశాను; ఎంతకాలంబు= ఎంతకాలం; నీ, శరీరంబునన్= నీ శరీరంలో; నా, విషంబు+ఉండున్= నా విషం ఉంటుందో; అంత, కాలంబును= అన్నినాళ్ళును; నీకు; విష+ఉరగ, రాక్షస, పిశాచ, శత్రు,

నివహంబు, వలని= విషసర్పాలనుండి, రాక్షసులనుండి, దయ్యాలనుండి, విరోధుల సముదాయంనుండి; భయంబు లేదు; సర్వ, సంగ్రామ, జయంబును= అన్ని యుద్ధాలలో గెలుపున్నూ; భార్యా, సంగమంబునున్= భార్యతో కలయికయున్నూ; ఎప్పటి, రాజ్య, విభవంబునున్= మునుపటి రాజ్యంయొక్క వైభవం(సంపద) లభించట మున్నూ; అగున్= కలుగుతాయి; నీకు+ఎప్పుడు+ఏని= నీకు ఏ సమయం లోనైనా; నిజరూపంబు= అసలైన ఆకారం; చేకొనన్+ ఇష్టంబు+ అయ్యెన్= స్వీకరించ కోరిక కలిగితే; అప్పుడు+అ= ఆ క్షణంలోనే; నన్నున్+తలంపుము= నన్ను స్మరించుము; ఈ, వస్త్రంబు= ఈ ఉత్తరీయం; నీ+ఒద్దకున్= నీ దగ్గరకు; వచ్చున్= చేరుతుంది; దీని; ధరియించుడు= ఈ వస్త్రాన్ని ధరించగానే; నిజ, రూప, ప్రాప్తి+అగున్= అసలు ఆకారం ఏర్పడుతుంది; అని; వరంబు+ఇచ్చి= వరాన్ని అనుగ్రహించి; వెండియున్= మరల; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'నన్ను రక్షించుము. నీకు మేలు చేస్తాను' అని కర్కోటకుడు కోరగా, నలుడు వాడిని ఎత్తుకొన్నాడు. కర్కోటకుడు అప్పుడు బొటనవ్రేలి కొలతకు సరిపోయే దేహం కలవాడై ఎత్తుకొనటానికి సులువుగా మారాడు. నలుడు ఆ కర్కోటకుడిని ఎత్తుకొని, త్వరగా వెళ్ళి చల్లని ఒక సరోవరం సమీపంలో విడవటానికి ప్రయత్నించగా, అతడు మరి పదిఅడుగులు వేయుమనిన్నీ, తాను నలుడికి శ్రేయస్సును చేకూర్చుతా ననిన్నీ చెప్పాడు. అంతట నలుడు లెక్కపెట్టుకొంటూ అడుగులు వేస్తున్నపుడు పదవఅడుగు వేసేటప్పటికి కర్కోటకుడు అతడిని కాటు వేశాడు. సర్పదష్టుడైన (కరవబడిన) నలుడు వికృతరూపుడు అయినాడు. కాని, కర్కోటకుడు నలుడికి తన నిజరూపాన్ని చూపి ఇట్లా చెప్పాడు: 'ఆర్యా! నీవు నాచేత కరవబడినందుకు విచారించకుము. ఇప్పుడు నీవు వికృతరూపుడ వవటమే నీకు మేలు. నిన్ను ఎవరైనా గుర్తిస్తే నీకే కీడు. నా విషం నీ శరీరంలో ఉన్నంతకాలం నీకు

విషసర్పాలభయం గాని, పిశాచ రాక్షస భీతిగాని, శత్రుభయం గాని ఉండదు. నీకు అన్ని యుద్ధాలలో విజయం కలుగుతుంది. భార్యాసంగమం కలుగుతుంది. పూర్వపు రాజ్యసంపద తిరిగి లభిస్తుంది. నీకు ఎప్పుడు అసలు ఆకృతి కావాలని అనిపిస్తుందో ఆ క్షణం నీ తొల్లిటి ఆకృతి నీకు లభించగలదు. అప్పుడు నన్ను స్మరిస్తే చాలు. నీ దగ్గరకు ఈ వస్త్రం వస్తుంది. ఈ వస్త్రాన్ని కప్పుకొనగానే నీకు అసలు రూపం సంప్రాప్తం అవుతుంది' - అని వరమిచ్చి ఇంకా ఇట్లా పలికాడు.

విశేషం: ఇందులో ప్రస్తావించబడిన అంశాలు: 1. సర్పవిషంచేత వికృతరూపం సంప్రాప్తించటం 2. ఆ విషం విరిగిన పిమ్మట తిరిగి తొల్లిటి రూపం సంప్రాప్తించటం, ఇది కేవలం కవితాకల్పన కాదని అనేవారున్నారు. ఇది భావిపరిశోధనవలన తేలవలసిన అంశం. 3. కర్కోటకపాత్రకు భారతదేశంలో వచ్చిన ప్రాముఖ్యం నిరుపమానం. మేలు చేసిన వాడికి వెనువెంటనే కీడుచేసేవాడికి కర్కోటక శబ్దం పర్యాయపదమైంది. కాని, ఇక్కడ నలుడికి కర్కోటకుడు 'కీడు' రూపంలో 'మేలు' చేశాడు.

మధ్యాక్కర.

'ఇలఁ బ్రసిద్ధుఁడు ఋతుపర్ణుఁ డనెడు మహీశుఁ డిక్ష్వాకు
కులజుండు నీకు సేవ్యుం డగు; నతనిఁ గొలిచి యం దుండు;
నెలకొని యతనికి నశ్వహృదయ మనెడి విద్య యిచ్చి,
వెలయ నతనిచేత నక్షహృదయ మ న్విద్యఁ జేకొనుము. 127

ప్రతిపదార్థం:ఇలన్= భూమిలో; ప్రసిద్ధుఁడు= పేరుకెక్కినవాడు; ఋతుపర్ణుఁడు+ అనెడు= ఋతుపర్ణుడనే; మహీ+ఈశుఁడు= భూభర్త(మహారాజు); ఇక్ష్వాకు, కులజుండు= ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు; నీకు, సేవ్యుండు+ అగున్= నీకు సేవింపదగినవాడు అవుతాడు; అతనిన్+కొలిచి= అతడిని సేవించి; అందు+ఉండు= అచట ఉండుము; నెలకొని= అచట ఉండి;

అతనికిన్; అశ్వ, హృదయము+అనెడి, విద్య= అశ్వహృదయం, అంటే గుర్రాల స్వభావం తెలిసికొనే విద్య; ఇచ్చి= అతనికి నేర్పి; వెలయన్= ఒప్పేటట్లుగా; అతనిచేతన్= అతడినుండి; అక్ష, హృదయము, అన్, విద్యన్= అక్షహృదయం (అంకగణిత రహస్యం తెలిసికొనటం) అనే విద్యను; చేకొనుము= స్వీకరించుము.

తాత్పర్యం: 'ఋతుపర్ణుడనే మహారాజు భూమండలంలో సుప్రసిద్ధుడు, ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు. అతడు నీచేత కొలువదగినవాడు. కాబట్టి, నీవు అతడిని సేవిస్తూ ఉండ వలసింది. అతడికి నీ అశ్వహృదయవిద్యను ఉపదేశించి, నీవు అతడినుంచి అక్ష హృదయ విద్యను స్వీకరించుము.

విశేషం: ఈ పద్యం పెక్కు వ్రాతప్రతులలో పెక్కురీతుల కన్పిస్తున్నది. వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. మఱియు బాహుకుం డను నామంబుతో సూతవృత్తి నుండు' మని హితోపదేశంబు సేసి కర్కోటకుం డదృశ్యుం డైనఁ, దద్వచనంబున నలుం డయోధ్యాపురంబునకుం జని ఋతుపర్ణుం గని 'యేను బాహుకుం డనువాఁడ నశ్వశిక్షయందుఁగుశలుండ; నన్నసంస్కారంబులు శిల్పంబులుఁ బెక్కువిధంబులరచియింప నేర్తు; భవత్సేవార్థినై వచ్చితి' ననిన ఋతుపర్ణుం డిట్లనియె. 128

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; బాహుకుండు+అను, నామంబుతోన్= బాహుకుడనే పేరుతో; సూత, వృత్తిన్+ఉండుము= రథచోదకుడివిగా ఉండుము; అని; హిత+ఉపదేశంబు= హితవు చెప్పటం; చేసి; కర్కోటకుండు; అదృశ్యుండు+ఐనన్= అంతర్ధానం చెందగా; తద్+వచనంబునన్= అతడిమాట చొప్పున, అంటే కర్కోటకుడి వాక్యానుసారం; నలుండు; అయోధ్యా, పురంబునకున్+చని= అయోధ్యాపట్టణానికి వెళ్ళి; ఋతుపర్ణున్+ కని= ఋతుపర్ణుడిని చూచి; ఏను= నేను; బాహుకుండు+అనువాఁడన్= బాహుకుడనేవాడిని; అశ్వ, శిక్ష+అందున్= గుర్రాలపెంపకంలో; కుశలుండన్= నేర్పరిని; అన్న, సంస్కారంబులు= వంటలుచేయటం; శిల్పంబులున్= విగ్రహాలను రూపొందించటం; పెక్కువిధంబులన్= ఎన్నోరీతులలో; రచియింపనేర్తున్= కూర్చగలను; భవత్+సేవా+అర్థిని+ఐ= నీ దగ్గర కొలువు చేయటానికై; వచ్చితిన్= అరుదెంచాను; అనినన్= అని చెప్పగా; ఋతుపర్ణుండు+ ఇట్లు+అనియెన్= ఋతుపర్ణుడు ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: మరియు బాహుకుడు అనే పేరు పెట్టుకొని రథసారథివిగా ఉండు'- మని హితవు చెప్పి కర్కోటకుడు మాయమయ్యాడు. ఆ కర్కోటకుడి వచనానుసారం నలుడు అయోధ్యాపురికి వెళ్ళి ఋతుపర్ణుడిని సందర్శించి, 'నేను బాహుకుడనే వాడిని. అశ్వశిక్షలో నేర్పరిని. పాకకళలో నిపుణుడిని. శిల్పవిద్యా నిష్ణాతుడిని; నీ దగ్గర సేవ చేయటానికి వచ్చాను' - అని చెప్పగా ఆతడితో ఋతుపర్ణుడు ఈ విధంగా అన్నాడు.

క. 'నాయొద్ద నుండుదేని మ । దీయ రథాశ్వములకును ద్రుతిని శీఘ్రముగాఁజేయుము' నావుడు 'నట్టుల। చేయుదు' నని నలుఁడు వాని సేవించెఁదగన్. 129

ప్రతిపదార్థం: నా+ఒద్దన్= నా కడ; ఉండుదు+ఏని= ఉన్నట్లయితే; మదీయ, రథ+ అశ్వములకును= నా రథానికి పూన్చే గుర్రాలకు; ద్రుతిని= నడకను; శీఘ్రముగాన్= వేగమయ్యేటట్లు; చేయుము; నావుడున్= అనగా విని; అట్టుల= ఆ విధంగానే; చేయుదును+అని= చేస్తానని; నలుఁడు; వాని= అతడిని (ఋతుపర్ణుడిని); తగన్= ఒప్పునట్లుగా; సేవించెన్= కొలిచాడు.

తాత్పర్యం: 'నీవు నా ఒద్ద ఉన్నట్లయితే నా రథాశ్వాల గమనాన్ని వేగంచేసి తీర్చిదిద్దుము' అని ఋతుపర్ణుడు చెప్పగా 'అట్లాగే చేస్తాను' అని నలుడు ఆతడి కొలువులో చేరాడు.

వ. ఇట్లు ఋతుపర్ణునొద్దనశ్వాధ్యక్షుండయి దుష్టాశ్వంబుల వశంబుఁ జేయుచు, నశ్వారోహకుల నారోహణంబుల శిక్షించుచు, రసవంతంబుగ నన్నసంస్కారంబు సేయుచు, ఋతుపర్ణుచేత నియుక్తు లయిన వార్ష్ణేయ జీవలులు దనకు సహాయులుగాఁ బ్రచ్ఛన్నుండై యుండి యొక్కనాఁడు.130

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; ఋతుపర్ణు+ఒద్దన్= ఋతుపర్ణుడి దగ్గర; అశ్వ+ అధ్యక్షుండు+అయి= గుఱ్ఱాలకు అధినేత అయి; దుష్ట+అశ్వంబులన్= చెడ్డ గుఱ్ఱాలను; వశంబున్+చేయుచున్= లొంగదీస్తూ; అశ్వ+ఆరోహకులన్= రౌతులను; ఆరోహణం బులన్= గుఱ్ఱాలపై స్వారీలు చేయటంలో; శిక్షించుచున్= నేర్పుతూ; రసవంతంబుగన్= రుచికరంగా; అన్న, సంస్కారంబు+చేయుచున్= ఆహార పదార్థాలను వండుతూ; ఋతుపర్ణు, చేత= ఋతుపర్ణుడిచేత; నియుక్తులు+అయిన= నియమించబడిన వారయిన; వార్ష్ణేయ, జీవలులు= వార్ష్ణేయుడు, జీవలుడు; తనకు, సహాయులు+కాన్= తనకు తోడ్పడేవారు కాగా; ప్రచ్ఛన్నుండు+ఐ= ఇతరులకు తెలియనట్టివాడై; ఉండి; ఒక్కనాఁడు= ఒకానొక రోజున.

తాత్పర్యం: ఈ విధంగా నలుడు ఋతుపర్ణుడి దగ్గర గుఱ్ఱాలకు అధినేత అయ్యాడు. అతడు చెడుగుఱ్ఱాలను లొంగదీసేవాడు. రౌతులకు స్వారి చేయటం నేర్పేవాడు. అంతేకాక, రుచికరాలైన ఆహారపదార్థాలు వండి వడ్డించేవాడు. ఋతుపర్ణుడిచేత నియోగించబడిన వార్ష్ణేయ జీవలులు నలుడికి తోడ్పడేవారు. ఈ విధంగా నలుడు అజ్ఞాతవాసం చేశాడు. ఒకనాడు.

సీ. 'ఇభరాజగమన! నీ వెందుల కరిగి? త ।
త్యురుకుచభార! యెందున్నదాన?
వబల! యెవ్వరిచేత నడవులలోఁ బట్టు ।
వడి? తశనాపేక్షఁ బఱచుచున్న

యుగ్రమృగంబుల యుదరంబులో నున్న ।
దానవే? నీ తల్లిదండ్రులొద్ద
ధృతి నున్న దానవే? దేశాంతరంబుల ।
నున్న దానవె?' యంచు నుదితమదన

ఆ. హతి విమోహితాత్ముఁడై హృదయేశ్వరిఁ ।
దలఁచి రాత్రు లెల్లఁ దాపమునను
నిద్రలేక వంది నిట్టూర్పు లూర్చుచు ।
నుండె నలుఁడు శోక ముత్కటముగ. 131

ప్రతిపదార్థం: ఇభరాజ, గమన!= (ఓ దమయంతీ!) (ఇభ= ఏనుగు, ఇభరాజము= మదపుటేనుగు, ఇభరాజగమన= మదపుటేనుగునడకవంటి నడక గలది); నీవు; ఎందులకు+అరిగితి= ఎక్కడికి వెళ్ళావు?; అతి+ఉరు, కుచ, భార= మిక్కిలి పెద్దవైన స్తనాలయొక్క భారంగలదానా!; ఎందు+ ఉన్నదానవు= ఎచట ఉన్నావు?; అబల= బలంలేని మగువా! (అబల-సాధారణ స్త్రీ వాచకంగా గ్రహించాలి); ఎవ్వరిచేతన్= ఎవరిచేత; అడవులలోన్= అరణ్యాలలో; పట్టు+పడితి= పట్టుబడి ఉన్నావు, అంటే నిన్ను అరణ్యాలలో ఎవరు పట్టుకొన్నారు?; అశన+అపేక్షన్= ఆహారం కొరకై; పఱచుచున్న= వడిగా తిరుగాడుతున్న; ఉగ్ర మృగంబుల= క్రూరజంతువుల; ఉదరంబు లోన్= పొట్టలో; ఉన్నదానవే?; నీ తల్లిదండ్రుల+ఒద్ద= నీ జననీజనకుల కడ; ధృతిన్= ధైర్యంతో; ఉన్నదానవే?; దేశాంతరంబులన్= ఇతరప్రదేశాలలో; ఉన్నదానవె? = నివసిస్తున్నావా!; అంచున్= అంటూ; ఉదిత, మదన, హతిన్= ఉదయించిన మన్మథ తాపంచేత; విమోహిత+ఆత్ముఁడు+ఐ= మిక్కుటమైన మోహంచేత ఆవరించబడిన ఆత్మకలవాడై; హృదయ+ఈశ్వరిన్+తలఁచి= ప్రేయసి అయిన దమయంతినిగురించి తలపోసి; రాత్రులు+ఎల్లన్= రేలు అన్నింటిలో;

నిద్రలేక; తాపమునను= బాధచేత; వంది= దుఃఖించి; నిడు+ఊర్పులు+ ఊర్చుచున్= దీర్ఘనిశ్వాసాలు వెలికి విడుస్తూ; శోకము+ ఉత్కటముగన్= పరితాపం అతిశయించగా; నలుఁడు= ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: 'మత్తేభంనడక వంటి నడక గలదానా! (దమయంతీ!), నీవు ఎక్కడికి వెళ్ళావోకదా! మిక్కిలి పెద్దవైన స్తనాల బరువు గలదానా ఎక్కడ ఉన్నావో? ఓ అబలా! అడవులలో నీవు ఎవరిచేత పట్టువడ్డావో? ఆహారంకొరకు వడిగా తిరుగుతున్న క్రూర జంతువుల పొట్టలలో ఉన్నావా? నీ తల్లిదండ్రుల ఒద్ద దిటవుగా ఉన్నావా? లేక వేరే ప్రదేశాలలో ఉన్నావా?' అంటూ మదనతాపంతో రాత్రులలో నిదురలేక పలవిస్తూ నిట్టూర్పులు విడుస్తూ మిక్కిలి పరితపిస్తూ నలుడు ఉన్నాడు.

వ. అతని ప్రలాపంబు విని యొక్కనాఁడు జీవలుం డాత్మగతంబున. 132

ప్రతిపదార్థం: అతని= ఆతడి, అంటే బాహుకుడి; ప్రలాపంబు= పలవింత; విని= ఆలకించి; ఒక్కనాఁడు= ఒకానొకరోజున; జీవలుండు= జీవలుడు; ఆత్మగతంబునన్= తనలోతాను.

తాత్పర్యం: ఆ బాహుకుడి పలవింతలు విని ఒకనాడు జీవలుడు తనలో తాను.

క. 'అఱపొఱడు కుఱుచ చేతులు, ।
నొఱవ శరీరంబుఁ గలిగి యొరులకుఁజూడం
గొఱగా కుండియు, మన్మథు ।
నొఱపులఁ బడియెడు నితండు యువతీప్రియుఁడై. 133

ప్రతిపదార్థం: అఱ, పొఱడు, కుఱుచ, చేతులున్= సగం గూనితో పొట్టిచేతులున్నూ; ఒఱవ శరీరంబున్= వికారమైన దేహమున్నూ; కలిగి; ఒరులకున్= ఇతరులకు; చూడన్= చూడటానికి; కొఱగాక+ఉండియు=

ప్రియం గాకుండ ఉండికూడా, అంటే చూడటానికి అసహ్యంగా ఉండికూడా; ఇతండు= ఇతడు (ఈ బాహుకుడు); యువతీప్రియుఁడు+ఐ= జవరాలిని ప్రేమించినవాడై; మన్మథు+ఒఱపులన్= మన్మథతాపంలో; పడియెడున్= పడుతున్నాడు (బాధపడుతున్నాడు).

తాత్పర్యం: 'ఈ బాహుకుడి చేతులా పొట్టివి. ఈ గూనివాడి దేహమా వంకరటింకర అయినట్టిది. ఇతరులకు చూడటానికి కూడ కొఱగానట్టిది. ఈ కురూపి ఒక జవరాలిని ప్రేమించటమా? ప్రేమించి మన్మథతాపంతో బాధపడటమా? ఎంత విడ్డూరం?

వ. వీనిచేతఁదలంపంబడియెడు వనిత వీనికంటె లెస్స కాకున్నె!' యనుచు బాహుకునొద్దకు వచ్చి 'నీ తలంచుచున్న భార్యకు, నీకు నేల వియోగం బయ్యె?' నని యడిగిన వానికి బాహుకుం డిట్లనియె. 134

ప్రతిపదార్థం: వీనిచేతన్= ఈ బాహుకుడిచేత; తలంపన్+పడియెడు= స్మరించబడేటి; వనిత= మగువ; వీనికంటెన్= ఈ కురూపి అయిన బాహుకుడి కంటె; లెస్స= గొప్పది; కాక+ఉన్నె= కాకుండునా?; అనుచున్= అని ఆలోచిస్తూ; బాహుకు+ఒద్దకు= బాహుకుడి దగ్గరకు; వచ్చి= అరుదెంచి; నీ తలంచుచున్న= నీవు స్మరిస్తున్న; భార్యకున్= పెండ్లానికి; నీకున్= నీకు; ఏల= ఎందుకు; వియోగంబు+అయ్యెన్= ఎడబాటు కలిగింది; అని= అంటూ; అడిగినన్= ప్రశ్నించగా; వానికిన్= ఆతడికి (ఆ జీవలుడికి); బాహుకుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఆహా! వీడిచేత ప్రేమించబడిన వనిత వీడికంటె గొప్పది కాకుండా ఉంటుందా? ఈతడే ఇంత కురూపి అయితే ఇక ఆమె ఎంతటి కురూపిణి కావాలి?'- అంటూ జీవలుడు తలపోసి, బాహుకుడికడకు వచ్చి 'నీవు స్మరిస్తున్న నీ భార్యకూ నీకూ అసలు ఎడబాటు ఎందుకు కలిగింది?' అని ప్రశ్నించాడు. వాడికి బాహుకుడు ఇట్లా బదులు చెప్పాడు.

విశేషం: (1) బాహుకుడు ఒకనాడు జగదేకవీరుడు. భువనైక మోహనుడు. ఈనాడు ఒరులు చూడటానికి కొరగాని కురూపి. ఎంతటి మార్పు? ఎంతటి విధిపరిపాకం? సేవకవృత్తిలో ఉండే జీవలుడికి గూడ బాహుకుడిని చూస్తే జాలి కలుగలేదు సరిగదా అతడు ఈతడిని అపహాస్యం చేశాడుకూడా! (2) ఇక జీవలుడికి బాహుకుడి ప్రేయసినిగురించి ఏమి తెలియును? కాని, ఇట్టి కురూపి భార్య ఎంతటి కురూపిణి కావాలి?'- అనేదే అతడి ఆలోచన. కాని, నిజానికి బాహుకుడిభార్య జగదేకసుందరి. దేవతలు సయితం ఆమెను వలచి ఆమె పొందుకై ఉవ్విళ్ళు ఊరారు. అది విషయాంతరం. జీవలుడు కలలోకూడ ఇట్టి పరిణామం ఊహించుకోలేడు. నలదమయంతుల చరిత్రలో ఏర్పడిన 'మలుపు' చదువరుల గుండెలు కరిగింపచేసేటటువంటిది. కథాశిల్ప సౌష్ఠవంలో విశ్వసాహితీ జగత్తులో నలోపాఖ్యానానికి గల విశిష్టత నిరుపమానమైనది.

ఆ. 'నన్నుఁ జూచి నగరె? నలినాక్షి నా కేల?
విప్రయోగ మేల? వినవె తొల్లి
యేలయో యెఱుంగ నేను, మందప్రజ్ఞుఁ ।
డను భటుండు దన లతాంగిఁబాసి. 135

ప్రతిపదార్థం: నన్నున్+చూచి, నగరె?= నన్ను చూచి జనులు నవ్వరా?; నలిన+అక్షి= పద్మాలవంటికన్నులు కలది (ప్రేయసి); నాకు+ఏల?= నాకెందుకు?; అంటే నాబోటి కురూపికి ఒక ప్రేయసి కావాలా? (కావాలంటే నన్ను చూచి ప్రజలు నవ్వరా?); (ఇక) విప్రయోగము+ఏల= విరహం ఎందుకు?; ఏలయో, ఎఱుంగన్+ఏను= ఎందుకో నాకేమి తెలుసు; తొల్లి= పూర్వం; వినవె= వినవా? మందప్రజ్ఞుఁడు+అను, భటుండు= మందప్రజ్ఞుడనే సైనికుడు; తన, లతా+అంగిన్+పాసి= తన లతవంటి దేహం కలిగిన ప్రేయసిని ఎడబాసి.

తాత్పర్యం: 'నన్ను చూచి నవ్వరా? నాకు ఒకప్రేయసి కూడానా? అసలు ప్రేయసే లేనప్పుడు ఇక వియోగం అనేమాట ఎందుకుంటుంది? నీవు

వినలేదా? పూర్వకాలంలో ఏకారణంచేత జరిగిందో నాకు తెలియదు కాని, మందప్రజ్ఞుడు అనే సైనికుడు తనప్రేయసిని ఎడబాసి.

విశేషం: ఈ మాటలనుబట్టి బాహుకుడికి తనకు సంక్రమించిన వైరూప్యం తెలిసినట్లే అనిన్నీ, తనవైరూప్యాన్ని గురించి చుట్టూ ఉన్నవారికి సుస్పష్టంగా తెలిసి ఉన్నట్లుకూడ తాను గ్రహించినట్లున్నూ తేలుతున్నది. అయితే, ప్రత్యక్షంగా తన విరహవేదనను జీవలుడు గుర్తించాడుకదా! ఇక తా నెట్లా తప్పుకొనగలడు? నలుడు పోగొట్టుకొన్నది బాహ్యరూపమేకాని ఆంతరంగికమైన తెలివితేటలు మాత్రం కావుకదా! అందుచేత నలుడు సద్యఃస్ఫూర్తితో తన ప్రలాపం తనది కాదనీ, భార్యావియుక్తుడైన మందప్రజ్ఞుడి అభిభాషణాన్ని తాను కాలక్షేపంకొరకై అనుసరించా నని సమ్యక్సమాధానం చెప్పి తప్పించుకొన్నాడు.

వ. దాని నన్వేషించి యెందునుం గానక దుఃఖితుండై ప్రలాపించినం దత్ప్రలాపం బేను ననుకరించితి' నని చెప్పి యి ట్లయోధ్యాపురంబునఁ బ్రచ్ఛన్నుండై బాహుక నామంబుతో నలుం డుండె; నంత నిట విదర్భేశ్వరుండు నలురాజ్యభ్రంశంబు విని కూఁతురు నల్లుండు నెట వోయిరో? యెందున్నవారో? యని శోకించి. 136

ప్రతిపదార్థం: దానిన్= దానిని (తనభార్యను); అన్వేషించి= వెదకి; ఎందునున్+కానక= ఎచటను చూడక; దుఃఖితుండు+ఐ= పరితాపం చెందినవాడై; ప్రలాపించినన్= పెద్దగా విలపించగా; తద్+ప్రలాపంబున్= ఆతడి పలవరాన్ని; ఏనున్= నేను; అనుకరించితిన్= నటించాను; అనిచెప్పి; ఇట్లు= ఈ విధంగా; అయోధ్యాపురంబునన్= అయోధ్య అనే నగరంలో; ప్రచ్ఛన్నుండు+ఐ= ఇతరులకు తెలియబడనట్టివాడై; బాహుక నామంబుతోన్= బాహుకుడు అనే పేరుతో; నలుండు+ఉండెన్= నలుడు ఉండినాడు; అంతన్= అటుపిమ్మట; ఇట= ఇచట; విదర్భ+ఈశ్వరుండు= విదర్భరాజు; నలు= నలుడియొక్క; రాజ్యభ్రంశంబు= రాజ్యం తప్పిపోవటం; విని= ఆలకించి; కూఁతురు= కుమార్తె; అల్లుండున్= అల్లుడున్నూ; ఎట= ఎచటకు; పోయిరో=

వెళ్ళారో; ఎందు+ఉన్నవారో= ఎచట ఉన్నారో; అని; శోకించి= దుఃఖించి (చింతించి).

తాత్పర్యం: తన భార్యకొరకు వెదకి వెదకి, ఆమె కన్పించకపోవటంచేత మిక్కిలి పరితపించినవాడై కలవరించాడు. నేను ఆతడి ప్రలాపాలను అనుకరించాను, అంతే. అవి మందప్రజ్ఞుడి మాటలు'- అని చెప్పి నలుడు తప్పించుకొన్నాడు. అట్లా ఆ అయోధ్య అనే పట్టణంలో మారువేషంతో బాహుకుడు అనే మారుపేరుతో నలుడు బ్రతుకు గడుపుతున్నాడు. అంత, ఇట, విదర్భలో భీమరాజు- నలుడు తనరాజ్యం పోగొట్టుకొన్నాడని విని, కూతురు, అల్లుడు ఎక్కడికి వెళ్ళారో, ఎచట ఉన్నారో?- అని చింతిస్తూ ఆందోళనపడుతున్నాడు.

క. వారల రోయఁగఁ బంచె న।
పారబలుం డిష్టులైన బ్రాహ్మణుల సదా
చారుల విద్వాంసుల స।
త్కారంబులఁ దనిపి వారిఁ గడు నెయ్యమునన్. 137

ప్రతిపదార్థం: అపారబలుండు= గొప్పబలం కలవాడు (విదర్భరాజు); ఇష్టులు+ఐన= తనకు అనురక్తులైన; బ్రాహ్మణుల= విప్రుల; సత్+ఆచారుల= మంచి ప్రవర్తన కలవారిని; విద్వాంసులన్= బాగుగా చదువుకొన్నవారిని; సత్, కారంబులన్= బహు మానాలతో; తనిపి= సంతృప్తిపరచి; వారిన్= ఆ బ్రాహ్మణులను; కడు, నెయ్యమునన్= మిక్కుటమైన స్నేహంతో; వారలన్= వారిని, అంటే నలదమయంతులను; రోయఁగన్= వెదకటానికై; పంచెన్= ఆజ్ఞాపించాడు.

తాత్పర్యం: మితిలేని బలంకలవాడైన విదర్భరాజు భీముడు, తనకు అనురక్తులు, మంచి నడవడి కలవారు, పెద్ద చదువులు చదువుకొన్నవారు అయిన బ్రాహ్మణులను బహుమానాలతో సంతృప్తులను కావించి, మిక్కుటమైన స్నేహంతో నలదమయంతులను వెదకటానికై నియోగించాడు.

వ. మఱియు నలదమయంతు లున్నచో టెఱింగి వచ్చిన వారికి వెయ్యేసి గద్యాణంబు లిత్తు ననియు, వారలం దోడ్కొని వచ్చినవారికి గోసహస్రంబులు నగ్రహారంబులు నిత్తు ననియుఁ బలికి పంచిన. 138

ప్రతిపదార్థం: మఱియు= అంతేకాక; నల, దమయంతులు+ఉన్నచోటు+ ఎఱింగి= నలదమయంతులు ఉన్నచోటు తెలుసుకొని; వచ్చినవారికి; వేయి+ఏసి= (ఒక్కొక్కరికి) వెయ్యివంతున; గద్యాణంబులు+ఇత్తున్+ అనియు= వరహాలు ఇస్తాననీ; వారలన్+ తోడ్కొని= ఆ నలదమయంతులను వెంటపెట్టుకొని; వచ్చినవారికి; గోసహస్రంబులున్= వేలకొలది ఆవులును; అగ్రహారంబులున్+ఇత్తును+అనియున్= అగ్రహారాలు ఇస్తాననీ; పలికి= చెప్పి; పంచినన్= పంపగా.

తాత్పర్యం: విదర్భరాజు బ్రాహ్మణులకు చెప్పినమాటలు: (1) నలదమయంతులు ఉన్నచోటు తెలిసికొని వచ్చిన వారికి ఒక్కొక్కరికి వేయి గద్యాణాలు పారితోషికంగా ఇవ్వబడతాయి. (2) నలదమయంతులను తమతోపాటు వెంటబెట్టుకొని వచ్చినవారికి వేలకొలది గోవులు, అగ్రహారాలు, బహుమానాలుగా ఇవ్వబడతాయి.

విశేషం: (1) గద్యాణం తెలుగుదేశంలో అంటే వేంగివిషయంలో చాళుక్యకాలంలో చలామణిలో ఉన్న బంగారునాణెం. గద్యాణప్రసక్తి సంస్కృత మూలభారతంలో లేదు. నన్నయభట్టు సమకాలీనమైన నాణెమును పేర్కొనటం సహజమే. కాని, గద్యాణాలు వ్యాసుడికాలంలోగాని, నలదమయంతుల కాలంలోగాని ఉన్నట్టివికావు. సారస్వతానికి సమకాలీన సమాజానికి గల బింబప్రతిబింబ భావానికి ఇది ఒక ఉదాహరణంగా గ్రహించవచ్చును. (2) అగ్రహారాలు:- అగ్రహారం అనే శబ్దం చాళుక్యులకాలంలో విశేష ప్రాచుర్యం అందింది. అగ్రహారం అంటే వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణులకు రాజుగారు సమర్పించే బహుమానగ్రామం. చాళుక్యులు బ్రాహ్మణులకు అగ్రహారాలను సర్వకర పరిహారంగా అంటే పన్నులు అన్నియు తీసివేసి దానంచేసేవారు. ఆంధ్రమహాభారత రచనంలో నన్నయభట్టుకు

తోడ్పడిన నారాయణభట్టుకు నందంపూడి గ్రామాన్ని అగ్రహారంగా చేసి, సూర్యగ్రహణంనాడు 4-11-1054 తేదీన రాజరాజనరేంద్రుడు దానంచేశాడు. అగ్రహార ప్రసక్తి మూల సంస్కృత భారతంలో లేదని వేరుగా చెప్పనక్కరలేదు.

చేదిపురంబున సుదేవుఁడను బ్రాహ్మణుఁడు దమయంతి నెఱుంగుట
(సం. 3-65-5)

క. జగతీచక్రమునం గల।
నగర మహాగ్రామ పట్టణంబులు కలయన్
జగతీదేవోత్తము లి।
మ్ముగ రోసిరి నిఖిల దేశముల కరిగి వడిన్. 139

ప్రతిపదార్థం: జగతీ, దేవ+ఉత్తములు= బ్రాహ్మణశ్రేష్ఠులు; వడిన్= వేగంగా; నిఖిల, దేశములకు= అన్నిదేశాలకు; అరిగి= వెళ్లి; జగతీ, చక్రమునన్+కల= భూమండలంలో ఉండే; నగర, మహాగ్రామ, పట్టణంబులు= రాజధానులవంటి నగరాలు, పెద్దపల్లెలు, పట్టణాలు; కలయన్= అంతటను; ఇమ్ముగన్= సంపూర్ణంగా; (బాగుగా); రోసిరి= వెదికారు.

తాత్పర్యం: బ్రాహ్మణోత్తములు వేగంగా నానాదేశాలకు వెళ్ళి, భూచక్రంలో ఉండే నగరాలు, పెద్దపల్లెలు, పట్టణాలు అంతటను సంపూర్ణంగా (నలదమయంతులకొరకు) వెదికారు.

వ. అందు సుదేవుం డను బ్రాహ్మణుండు చేదిపతియైన సుబాహు పురంబునకుం జని పుణ్యాహంబు సేయింపం బోవు బ్రాహ్మణులతో రాజగృహంబు సొచ్చి; యంతఃపురంబున సునందా సహితయై యున్నదాని ధూమజాల నిబద్ధం బైన యగ్నిప్రభయునుం బోలె నీలాభ్రసంవృతం బైన చంద్రరేఖయుంబోలె బహుపంకనిమగ్నం బైన మృణాళియుంబోలె నేర్పడ కున్ననుం దదీయ భ్రూయుగ మధ్యగతంబైన సూక్ష్మలక్షణం బిమ్ముగా

నిరీక్షించి, దాని దమయంతిఁగా నెఱింగి, యాత్మగతంబున 'నిది పతి విముక్తయై శుష్కప్రవాహ యైన నదియునుంబోలె శూన్యకమలయైన నళినియుం బోలె నపేతచూతంబైన వనభూమియుం బోలె నొప్ప కుండియుఁ దన పతివ్రతాగుణంబునం జేసి యొప్పుచున్నయది. 140

ప్రతిపదార్థం: అందున్= ఆ బ్రాహ్మణులలో; సుదేవుండు+అను, బ్రాహ్మణుండు= సుదేవుడు అనే పేరుకల బ్రాహ్మణుడు; చేదిపతి+ఐన= చేదిదేశానికి రాజైన; సుబాహు పురంబునకున్= సుబాహుని రాజధానికి; చని= వెళ్ళి; పుణ్య+అహంబు= పుణ్యమైన దినం- అనే పేరిటి మంగళకరమైన శుభకార్యాన్ని; చేయింపన్+పోవు= చేయిం చటానికై వెళ్ళే; బ్రాహ్మణులతోన్= విప్రులతో; రాజ గృహంబు+చొచ్చి= రాజుగారి మందిరం ప్రవేశించి; అంతః పురంబునన్= రాణివాసంలో; సునందా, సహిత+ఐ=సునంద అనే రాజకుమారితో కలిసి; ఉన్నదాని; ధూమ, జాల, నిబద్ధంబు+ఐన= పొగదొంతరలతో ఉన్నదైన; అగ్ని ప్రభయునున్+ పోలె= అగ్నిదీప్తివలె; నీల+అభ్ర, సంవృతంబు+ఐన= నల్లని మేఘాలతో చుట్టుకొనబడిందైన; చంద్రరేఖయున్+పోలెన్= చంద్రవంకవలె; బహు, పంక, నిమగ్నంబు+ఐన= గొప్ప బురదలో మునిగి ఉన్న; మృణాళియున్+పోలెన్= తామర తూడు (తామరకాడలోని దారం) వలె; ఏర్పడక+ఉన్ననున్= స్పష్టంగా తెలియక పోయినను; తదీయ, భ్రూ, యుగ, మధ్యగతంబు+ఐన= ఆమెయొక్క కనుబొమలు రెండింటికి మధ్య ఏర్పడి ఉన్న; సూక్ష్మ, లక్షణంబు= సన్నని గుర్తు; ఇమ్ముగా= చక్కగా; నిరీక్షించి= పరిశీలించి; చూచి; దానిన్= ఆమెను; దమయంతిన్+ కాన్+ ఎఱింగి= దమయంతి అని తెలిసికొని; ఆత్మ, గతంబునన్= తనలోతాను; ఇది= ఈమె (దమయంతి); పతి విముక్త+ఐ= భర్త నుండి విడివడిందై; శుష్క, ప్రవాహ+ఐన= ఎండిపోయిన నీటిపొరుదల కల; నదియునున్+పోలెన్= ఏరువలె; శూన్య, కమల+ఐన= పద్మాలు లేనట్టి; నళినియున్+పోలెన్= తామర తీగవలె; అపేత, చూతంబు+ఐన= మామిడిచెట్టు లేని; వనభూమియున్+

పోలెన్= అరణ్యసీమవలె; ఒప్పకుండియున్= శోభించకుండా ఉండి కూడా; తన, పతివ్రతా, గుణంబునన్+చేసి= తన పాతివ్రత్య మహిమచేత; ఒప్పుచున్న+అది= శోభిల్లుతున్నది.

తాత్పర్యం: ఆ విధంగా నానాదేశాలకు వెళ్ళిన బ్రాహ్మణులలోనివాడు సుదేవుడు చేదిరాజు సుబాహుడి రాజధానికి చేరి, పుణ్యాహం నిర్వర్తించే బ్రాహ్మణులతో కలసి రాజమందిరంలోకి వెళ్ళి, అచట అంతఃపురంలో సునందతో కలిసిఉండే దమయంతిని చూచాడు. అప్పుడు దమయంతి పొగదొంతరలతో మిళితమైన అగ్నిదీప్తివలె, నల్లని మబ్బులచేత ఆవరించబడిన చంద్రవంకవలె, పెనుబురదలో మునిగిఉన్న తామర తూడువలె అణగి ఉండి గుర్తించటానికి వీలుగాక ఉండింది. కాని, ఆమె కనుబొమల మధ్య ఉండే పుట్టుమచ్చను బట్టి ఆమెను దమయంతిగా ఆ సుదేవుడు గుర్తించాడు. అతడు తనలో తాను ఇట్లా భావించాడు: 'ఈ దమయంతి భర్తనుండి విడివడి నీటి పొరుదల ఎండిపోయిన ఏరువలె, పద్మాలు లేని తామరతీగవలె, మామిడి చెట్టు లేని వనసీమ వలె శోభించకుండ ఉండికూడా తన పాతివ్రత్యమహిమచేత ప్రకాశిస్తూ ఉన్నది.

విశేషం: అలం: ఉపమ.

తే. అనపహార్యంబు తేజోమయంబు సర్వ।
గుణములకు నలంకారంబు గురుతరంబు
భామలకుఁ బతిభక్తియ పరమ మైన।
భూషణం; బిట్టివే పెఱ భూషణములు? 141

ప్రతిపదార్థం: న+అపహార్యంబు= అపహరించటానికి వీలులేనట్టిది; తేజస్+మయంబు= ప్రకాశమానమైనది; సర్వగుణములకున్= సమస్తగుణాలకు; అలంకారంబు= భూషణం వంటిది; గురుతరంబు= గొప్పది; భామలకున్= స్త్రీలకు; పతిభక్తి+అ= భర్తపట్ల కల భక్తియే; పరమము+ఐన= అన్నిటికంటె

గొప్పదైన; భూషణంబు= అలంకారం; ఇట్టివి+ఏ= ఇట్టివా?; పెఱ, భూషణములు= ఇతరాలైన అలంకారాలు.

తాత్పర్యం: ఆడువారికి పతిభక్తియే గొప్పభూషణాలలో గొప్పభూషణం. పాతివ్రత్యానికి సరిపోలు ఆభరణం ఆడువారికి వేరొకటి లేదు కదా! పతిభక్తియే వారినుండి అపహరించటానికి వీలులేనిది, ప్రకాశమానమైనది, మిక్కిలి గొప్పదైనది, సమస్త సద్గుణాలలోనికెల్ల ఎన్నదగినది అయినఅలంకారవిశేషం.

వ. రోహిణికిఁ జంద్రసమాగమంబునుంబోలె దీనికి భర్తృసమాగమం బెన్నం డయ్యెడునో? తుల్యశీల వయోరూపాభిజాత్యులైన నలదమయంతు లొక్కట నుండం జూచి విదర్భేశ్వరుం డెన్నఁడు కృతార్థుం డయ్యెడునో?' యంచు నల్లనల్లన డాయవచ్చి దమయంతి కిట్లనియె. 142

ప్రతిపదార్థం: రోహిణికిన్= రోహిణీ నక్షత్రానికి; చంద్ర, సమాగమంబునున్+పోలెన్= చంద్రుడితో సంయోగంవలె; దీనికిన్= ఈ దమయంతికి; భర్తృ, సమాగమంబు= భర్తతో సంయోగం; ఎన్నండు+అయ్యెడునో= ఎప్పుడు జరుగుతుందో; తుల్య, శీల, వయస్+రూప= ఆభిజాత్యులు+ఐన= సమానమైన స్వభావం, ఈడు, అందంలో జోడు, వంశగౌరవం కలవారైన; నలదమయంతులు; ఒక్కటన్+ఉండన్+చూచి= ఒకచోట కలిసి ఉండటం చూచి; విదర్భేశ్వరుండు= విదర్భరాజు; ఎన్నఁడు= ఎప్పుడు; కృత+ అర్థుండు= ధన్యుడు; అయ్యెడున్+ఓ= అవుతాడో; అంచున్= అంటూ; అల్లన+అల్లనన్= మెల్లమెల్లగా; డాయవచ్చి= దగ్గరకు చేరి; దమయంతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: రోహిణీ నక్షత్రానికి చంద్రుడికి జరిగే సంయోగంవలె ఈ దమయంతికి ఎప్పుడు భర్తతో కలయిక జరుగుతుందో? శీలంలో, అందంలో, వంశగౌరవంలో ఈడుజోడు కుదిరిన నలదమయంతులు ఒకచోట కలిసి కాపురం చేయటం చూచి విదర్భరాజు భీముడు ఎప్పుడు ధన్యుడవుతాడో?'-

అని తలపోస్తూ, మెల్లగా దగ్గరకు వచ్చి ఆ బ్రాహ్మణుడు దమయంతితో ఇట్లా చెప్పాడు.

విశేషం: ఆకసంలో రాత్రివేళ రోహిణీ నక్షత్రం చంద్రుడు కలిసి ఉన్నప్పుడు చూపరులకు అది ఒక మనోహరదృశ్యం. భారతీయుల ఖగోళవిజ్ఞానం మిక్కిలి ప్రాచీనమైనది.

తే. ‘అవ్వ! నీ తల్లిదండ్రుల కాత్మజులకు ।
బంధుజనులకుఁ గుశలంబు; భామ! నీదు
కుశల మెఱుఁగునంతకు వంతగూరి వగుచు ।
చున్నవారు; వారికి వంత యుడుగు నింక. 143

ప్రతిపదార్థం: అవ్వ= అమ్మా!; నీ, తల్లి దండ్రులకు= నీ తల్లికి, తండ్రికి; ఆత్మ జులకున్= నీ కొడుకుకు, కూతురుకు; బంధు జనులకున్= చుట్టాలకు; కుశలంబు= క్షేమం; భామ!= ఓ దమయంతీ!; నీదు, కుశలము= నీక్షేమం; ఎఱుఁగు+అంతకు= తెలిసేవరకు; వంత+కూరి= దుఃఖంతో నిండి; వగచుచున్నవారు= పరితపిస్తున్నారు; ఇంక= ఇకమీదట; వారికి= వారలకు; వంత= దుఃఖం; ఉడుగున్= పోతుంది.

తాత్పర్యం: ‘అమ్మా! దమయంతీ! నీ తల్లిదండ్రులు, నీ సంతానం, నీ బంధువులు అందరు క్షేమంగా ఉన్నారు. నీ క్షేమం తెలిసేంతవరకు దుః ఖంతో పరితపిస్తున్నారు. ఇకమీద నీ కుశలవార్త విని సంతసిస్తారు.

వ. దేవీ! యేను భవద్భ్రాతృసఖుండ; సుదేవుండను బ్రాహ్మణుండ; విదర్భేశ్వరుండు నీ యున్నచో టెఱుంగం బెక్కండ్రు బ్రాహ్మణులం బుచ్చిన నిందులకు వచ్చి నా పుణ్యంబున నిన్నుం గంటి’ ననిన దమయంతి వాని నెఱింగి తన పుత్త్రులఁ దల్లిదండ్రుల బాంధవులం బ్రత్యేకంబ యడిగి, యశ్రుజలంబు లురల నేడ్చుచున్నం జూచి ‘యేలకో యిప్పడు సైరంధ్రి యేడ్చుచున్నయది’ యని సునంద తన జననికిం జెప్పి పుచ్చిన. 144

ప్రతిపదార్థం: దేవీ= మహారాణీ!; ఏను= నేను; భవత్+భ్రాతృ, సఖుండ= నీయొక్క సోదరుడి మిత్రుడిని; సుదేవుండు+అను= సుదేవుడనే పేరున్న; బ్రాహ్మణుండ= బ్రాహ్మణుడిని; విదర్భ+ఈశ్వరుండు= విదర్భరాజు; నీ+ఉన్నచోటు+ఎఱుంగన్= నీవు ఉండే స్థలాన్ని తెలిసికొనటానికై; పెక్కండ్రు, బ్రాహ్మణులన్= చాలమంది బ్రాహ్మణులను; పుచ్చినన్= నియోగించగా; ఇందులకున్= ఇచటికి; వచ్చి= అరుదెంచి; నా, పుణ్యంబునన్= నా సుకృతంవలన; నిన్నున్+కంటిన్= నిన్ను చూచాను; అనినన్= అని చెప్పగా; దమయంతి; వానిన్= ఆ బ్రాహ్మణుడిని; ఎఱింగి= తెలిసికొని; తన, పుత్త్రులన్= తన పిల్లలను; తల్లిదండ్రుల; బంధువులన్= చుట్టాలను; ప్రత్యేకంబు+అ= వేర్వేరుగా; అడిగి= (కుశలం) అడిగి; అశ్రు, జలంబులు= కన్నీళ్లు; ఉరలన్= క్రిందకి కారగా; ఏడ్చుచున్నన్+చూచి= విలపిస్తుండగా చూచి; ఏలకో= ఎందుచేతనో; ఇప్పుడు= ఇపుడు; సైరంధ్రి = దమయంతి; ఏడ్చుచున్న+అది= రోదిస్తున్నది; అని= అంటూ; సునంద; తన, జననికిన్= తన తల్లికి; చెప్పిపుచ్చినన్= చెప్పిపంపగా.

తాత్పర్యం: దమయంతీదేవీ! నేను నీ సోదరుడికి మిత్రుడిని. నాపేరు సుదేవుడు. నేను బ్రాహ్మణుడిని. విదర్భప్రభువు నీవు ఉండేచోటు వెదకటానికై పలువురు బ్రాహ్మణోత్తములను పెక్కుదేశాలకు పంపించాడు. నేను ఇచటికి వచ్చి నా సుకృతవిశేషంవలన నిన్ను చూడగలిగాను’ - అని చెప్పగా దమయంతి తల్లిదండ్రులగురించి, తన పిల్లల గురించి, చుట్టాలను గురించి కుశలం అడిగి, ఆమె విలపిస్తూ ఉండటం చూచి సునంద ఆ వార్తను తల్లికి నివేదింపజేసింది.

క. చనుదెంచె నంతిపురమున ।
వనితానివహంబుతోడ వారిజదళలో

చన రాజమాత నృపనం ।

దన యగు దమయంతికడకుఁ దద్దయు వేడ్కన్. 145

ప్రతిపదార్థం: వారిజ, దళ, లోచన= నీటినుండి పుట్టిన పద్మం (వారిజం) యొక్క రేకులవంటి కన్నులుకలది అయిన; రాజమాత= రాజుగారి తల్లి; నృప, నందన+అగు= రాజపుత్రి అయిన; దమయంతి కడకున్; అంతిపురమున= రాణివాసంలోని; వనితా నివహంబుతోడన్= స్త్రీల సమూహంతో; తద్దయు= మిక్కిలి; వేడ్కన్= కుతూహలంతో; చనుదెంచెన్= వచ్చింది.

తాత్పర్యం: పద్మదళాలవంటి కన్నులు గల రాజమాత అంతఃపురంలోని అంగనలను వెంటబెట్టుకొని రాజకుమారి దమయంతి దగ్గరకు మిక్కుటమైన కుతూహలంతో వచ్చింది.

వ. ఇట్లు వచ్చి తమలో మాటలాడుచున్న బ్రాహ్మణుని దమయంతిం జూచి రాజమాత బ్రాహ్మణున కిట్లనియె; 'నయ్యా! ఇది యెవ్వని కూఁతు? రెవ్వని భార్య? యేమి కారణంబునం దనభర్తను బాంధవులనుం బాసి పుణ్యవ్రతంబులు సలుపుచున్నయది? నీ వె ట్లెటింగి? తిక్కోమలి నామం బేమి?' యని యడిగిన సుదేవుం డిట్లనియె.. 146

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; వచ్చి= అరుదెంచి; తమలో మాటలాడు చున్న= పరస్పరం సంభాషణ చేస్తున్న; బ్రాహ్మణుని; దమయంతిన్; చూచి; రాజమాత; బ్రాహ్మణునకు; ఇట్లు+అనియె= ఈ విధంగా పలికింది; అయ్యా!= ఆర్యా!; ఇది= ఈమె; ఎవ్వని, కూఁతురు= ఎవరి పుత్రిక?; ఎవ్వని భార్య?= ఎవరి పెండ్లాము?; ఏమి కారణంబునన్= ఏ కారణంచేత; తన భర్తను= తన పెనిమిటిని; బాంధవులనున్+పాసి= చుట్టాలను విడిచి; పుణ్యవ్రతంబులు= పవిత్రమైననోములు; సలుపుచున్న+అది= చేస్తున్నది; నీవు+ఎట్లు+ఎఱింగితి(వి)= నీవు ఏవిధంగా తెలిసికొన్నావు?; ఈ+కోమలి= ఈ సుకుమారి; నామంబు+ఏమి= పేరేమిటి?; అని; అడిగిన; సుదేవుండు; ఇట్లు+ అనియె.

తాత్పర్యం: ఈ విధంగా దమయంతి, బ్రాహ్మణుడు పరస్పరం మాటాడుతుండగా రాజమాత వచ్చి ఆ బ్రాహ్మణుడితో 'అయ్యా! ఈమె ఎవరికూతురు? ఎవరిభార్య? ఏకారణంవలన భర్తను, బంధువులను, ఎడబాసి పుణ్యప్రదమైన నోములు నోస్తున్నది? అసలు ఈమెసంగతి నీ కెట్లా తెలిసింది? ఈమె పేరేమిటి?' అని అడుగగా సుదేవుడు ఇట్లా బదులు పలికాడు.

మధ్యాక్కర.

'నలినాక్షి! యిది విదర్భేశుతనయ, పుణ్యశ్లోకుఁ డైన

నలుదేవి దమయంతి సుమ్ము; విధి కారణమ్మున రాజ్య

చలితుఁడై నిజనాథుఁ డరిగినం దోన చనియె; నవ్వార్త

వెలయంగ విని వీరి రోయఁబంచె భూవిభుఁడు బ్రాహ్మణుల. 147

ప్రతిపదార్థం: నలిన+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా! (ఓ రాజమాతా!); ఇది= ఈమె; విదర్భ+ఈశు తనయ= విదర్భరాజు కూతురు; పుణ్య శ్లోకుఁడు+ఐన= పవిత్రమైన చరిత్ర కలవాడైన; నలుదేవి= నలుడియొక్క రాణి; దమయంతి, సుమ్ము; విధి, కారణమ్మునన్= దురదృష్టహేతువుచేత; రాజ్య చలితుఁడు+ఐ= రాజ్యభ్రష్టుఁడై; నిజ, నాథుఁడు= తనభర్త; అరిగినన్= వెళ్ళిపోగా; తోన= ఆతని వెనువెంటనే; చనియెన్= వెళ్ళింది; ఆ+వార్త= ఆ సమాచారం; వెలయంగ, విని= వ్యాపించగా విని; భూవిభుఁడు= రాజు; బ్రాహ్మణులన్= విప్రులను; వీరి= నలదమయంతులను; రోయన్+పంచెన్= వెదకటానికై పుత్తెంచాడు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులుగల ఓ రాజమాతా! ఈమె విదర్భరాజు పుత్రిక. నలమహారాజుదేవేరి. ఈమెయే దమయంతి సుమా! విధిపరిపాకం

వలన నలుడు రాజ్యం పోగొట్టుకొని వెళ్ళిపోయేటప్పుడు, ఈమె భర్తను అనుసరించింది. ఈ వార్త విని విదర్భప్రభువు వీరిని (నలదమయంతులను) వెదకటానికై బ్రాహ్మణులను పంపించాడు.

విశేషం: వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. ఏ నిందులకు వచ్చి, మీచేత సురక్షితయై యున్న యిక్కోమలిం జూచి, దీని భ్రూమధ్యంబునం బద్మప్రభంబై విభూత్యర్థంబుగా విధాతృనిర్మితం బైన పుణ్యలక్ష్మంబు పాంసుపటలచ్ఛన్నం బై యున్న నుపలక్షించి మారాజు పుత్త్రింగా నెఱింగితి' ననిన సునంద శుద్ధోదకంబుల దాని భ్రూమధ్యంబు గడిగిన నది విస్పష్టంబగుడు నందఱు నాశ్చర్యం బంది; రంత. 148

ప్రతిపదార్థం: ఏను+ఇందులకు, వచ్చి= నేను ఇచటికి వచ్చి; మీచేత; సురక్షిత+ఐ, ఉన్న= బాగుగా రక్షించబడిఉన్న; ఈ+కోమలిన్= ఈ సుకుమారిని; చూచి; దీని= ఈమెయొక్క; భ్రూమధ్యంబునన్= కనుబొమల మధ్య; పద్మ, ప్రభంబు+ఐ= పద్మంయొక్క దీప్తికలదియై; విభూతి+అర్థంబుగా= సంపదకు సూచికగా; విధాతృ, నిర్మితంబు+అయిన= బ్రహ్మదేవుడిచేత సృష్టించబడిన; పుణ్యలక్ష్మంబు= సుకృతవిశేషమైన పుట్టుమచ్చ; పాంసు, పటల, ఛన్నంబు+ఐ+ఉన్నన్= దుమ్ము కణాలచేత కప్పబడి ఉండగా; ఉపలక్షించి= అరసి, చూచి; మా, రాజపుత్త్రిన్+కాన్= మారాజు కుమారిగా; ఎఱింగితిన్= తెలిసికొన్నాను; అనినన్= అని చెప్పగా; సునంద; శుద్ధ+ ఉదకంబులన్= మంచినీళ్ళతో; దాని= ఆమెయొక్క; భ్రూమధ్యంబు= కనుబొమల మధ్య ప్రదేశాన్ని; కడిగినన్= పరిశుభ్రం చేయగా; అది= ఆ పుట్టుమచ్చ; విస్పష్టంబు+ అగుడు= సుస్పష్టంగా కనిపించగా; అందఱున్; ఆశ్చర్యంబు+అందిరి= అచ్చెరువు పొందారు; అంత= అంతట.

తాత్పర్యం: నేను ఇచటికి వచ్చి మీచేత కాపాడబడుతున్న ఈ కోమలి దమయంతిని చూచి ఈమె కనుబొమల మధ్య, ఐశ్వర్యప్రదమైన చిహ్నంగా

బ్రహ్మదేవుడు సృష్టించిన పుట్టుమచ్చ, దుమ్ముచేత కప్పబడి ఉండటం పరిశీలించి చూచి మా రాకుమారిగా గుర్తించగలిగాను'- అని సుదేవుడు చెప్పాడు. అంతట సునంద మంచినీళ్ళను తెప్పించి దమయంతి ముఖం కడుగగా, ఆమె నొసటిపై పద్మకాంతి గల పుట్టమచ్చ స్ఫుటంగా కనిపించింది. అందరు అప్పుడు ఆశ్చర్యం పొందారు. అంత.

సీ. ఆనందభరితాత్మయై రాజమాత య ।
క్కమలాక్షిఁ బ్రీతితోఁ గౌఁగిలించి
కొని, 'తల్లి! నీవు నా కూతుర; వేను నీ ।
జననియుఁ బేర్మి దశార్ణరాజ
తనయల; మదియు విదర్భేశు సతి యయ్యె; ।
నే వీరబాహున కింతి నైతి'
ననిన నయ్యవ్వకు నతివినయంబుతో ।
నలుదేవి మ్రొక్కి, సునంద నెత్తి

ఆ. కొని, కరంబు నెమ్మిఁ గొన్నిదినంబు లం ।
దుండి యిట్టు లనియె నొక్కనాడు
'దేవి! యిదియు నదియు ధృతి నాకుఁ బుట్టిన ।
యిండ్లు; కడుసుఖంబ యిందు నందు. 149

ప్రతిపదార్థం: ఆనంద, భరిత+ఆత్మ+ఐ= ఆనందంతో నిండిన ఆత్మకలదై; రాజమాత; ఆ+కమల+అక్షిన్= కమలాల వంటి కన్నులు కలదానిని, దమయంతిని; ప్రీతితోన్= ప్రేమతో; కౌఁగిలించికొని= ఆలింగనం చేసికొని; తల్లి!= అమ్మా! (దమయంతీ!); నీవు; నా కూతురవు= నా కూతురివే సుమా!; ఏను, నీ, జననియున్= నేనూ నీ తల్లియు; పేర్మి= గౌరవంగల; దశార్ణ, రాజ, తనయలము= దశార్ణ రాజపుత్రికలం; అదియు= నీ తల్లియు;

విదర్భేశు, సతి+అయ్యెన్= విదర్భరాజు భార్య అయింది; ఏన్= నేను; వీరబాహునకు+ఇంతిన్+ఐతిన్= వీరబాహుడి భార్యను అయ్యాను; అనినన్= అని చెప్పగా, ఆ+అవ్వకున్= ఆ సతికి; అతి, వినయంబుతోన్= మిక్కిలి అణకువతో; నలుదేవి= నలుడియొక్క భార్య (దమయంతి); మ్రొక్కి= నమస్కరించి; సునందన్+ ఎత్తికొని= సునందను లేవదీసి; కరంబు, నెమ్మిన్= మిక్కిలి ప్రీతితో; కొన్ని, దినంబులు= కొన్నినాళ్ళు; అందు+ఉండి= అచట ఉండి; ఒక్కనాఁడు= ఒక దినం; ఇట్టులు+అనియెన్= ఈ విధంగా పలికింది; దేవి!= రాజమాతా!; ఇదియున్= ఈ వీరబాహుపురం; అదియు= విదర్భయు; ధృతిన్= స్థిరంగా; నాకున్+పుట్టిన+ఇండ్లు= నాకు పుట్టిండ్లే; ఇందున్+అందు= ఇచట, అచట; కడు, సుఖంబు+అ= మిక్కిలి సుఖమే.

తాత్పర్యం: రాజమాత ఆనందంతో నిండిన హృదయంతో దమయంతిని కౌగిలించుకొన్నది. పిమ్మట రాజమాత 'తల్లీ! నీవూ నా కూతురవే సుమా! నేనూ, నీ తల్లీ దశార్ణరాజు పుత్రికలం. నీ తల్లి విదర్భరాజు దేవేరి అయింది. నేను వీరబాహుడి సతిని అయ్యాను'- అని చెప్పగా దమయంతి ఆమె పాదాలకు నమస్కరించింది. తనకు నమస్కరించిన సునందను లేవనెత్తికొని లాలించింది. ఆ విధంగా నలుడిదేవి అయిన దమయంతి అక్కడ కొన్ని దినా లుండి, ఒకానొకనాడు రాజమాతతో 'దేవీ! ఈ పురమూ, విదర్భా నాకు పుట్టిండ్లే. ఇచట, అచట కూడా నాకు సమాన సౌఖ్యమే.

వ. అయినను దల్లిదండ్రుల ననుజుల నాత్మజులం జూడ వేడుక యైనది; విదర్భకుం బోయెద; నానతి' మ్మని కృతాంజలి యైన దమయంతి నతిస్నేహంబున సుబాహుజనని సుతప్రేషితబలంబుతో సువర్ణమణిమయ విమానోపమాన యానంబున నునిచి పుచ్చిన. 150

ప్రతిపదార్థం: అయినను= అయినప్పటికిని; తల్లి దండ్రులన్= తల్లిని, తండ్రిని; అనుజులన్= సోదరులను; ఆత్మజులన్= కన్నబిడ్డలను; చూడ, వేడుక+ఐనది= చూడటానికి కుతూహలమైనది; విదర్భకున్+పోయెదన్= విదర్భకు వెళ్ళుతాను; ఆనతి+ ఇమ్ము= అనుజ్ఞ దయచేయుము; అని; కృత+అంజలి+ఐన= నమస్కృతి చేసిన దైన; దమయంతిన్; అతి, స్నేహంబునన్= మిక్కిలి ప్రీతితో; సుబాహు, జనని= సుబాహుడి యొక్క తల్లి; సుత, ప్రేషిత, బలంబుతోన్= కొడుకు సమకూర్చిన భటులను తోడిచ్చి; సువర్ణ, మణిమయ, విమాన+ఉపమాన, యానంబునన్= బంగారం మణులు పొదగబడిన విమానంతో సరిపోవు వాహనంలో; ఉనిచి పుచ్చినన్= ఎక్కించి పంపగా.

తాత్పర్యం: అయినప్పటికి తల్లిదండ్రులను, సోదరులను, కన్నబిడ్డలను చూడాలని నాకు అనిపిస్తున్నది. విదర్భకు వెళ్ళుతాను. అనుజ్ఞ దయసేయుము' - అని నమస్కరించిన దమయంతిని మిక్కిలి ప్రీతితో ఆదరించి, రాజమాత తన కొడుకు సమకూర్చిన భటులతో, బంగారుమయమై నిండుగ మణులు పొదిగిన విమానంవంటి రథంపై పంపగా.

దమయంతి నలు నెడఁబాసి విదర్భాపురంబు సేరుట (సం. 3-66-22)

ఉ. భామ విదర్భ కేఁగి తన బంధుజనంబులయొద్ద నుండియుం
గోమలి దేహసౌఖ్యములకున్ వెలియై మలినార్ధవస్త్రమున్
భూమిరజంబు నంగమునఁ బొల్పగుచుండఁగ నుండె జీవిత
స్వామి నిజేశుఁ జూచు దివసంబులఁ గోరుచు సువ్రతంబుతోన్.151

ప్రతిపదార్థం: భామ=వనిత (దమయంతి); విదర్భకు+ఏఁగి= విదర్భకు వెళ్ళి; తన, బంధు, జనంబుల+ఒద్దన్+ఉండియున్= తన చుట్టాల కడ ఉన్నప్పటికిని; కోమలి= సుకుమారి; దేహసౌఖ్యములకున్= శరీర సుఖాలకు; వెలి+ఐ= దూరంగా ఉండి; మలిన+అర్ధ, వస్త్రమున్= మాసిన సగం చీరను; భూమి, రజంబున్= పుడమియొక్క దుమ్ము; అంగమునన్= దేహంపై; పొల్పు+అగుచుండఁగన్= ఒప్పుతుండగా; జీవిత, స్వామి, నిజ+ఈశున్=

జీవితానికి అధినేత అయిన తన భర్తను; చూచు, దివసంబులన్= చూచే రోజులనే; కోరుచున్= కాంక్షిస్తూ; సువ్రతంబుతోన్= గొప్ప దీక్షతో; ఉండెన్= నివసించింది.

తాత్పర్యం: దమయంతి విదర్భకు వెళ్ళి, బంధువుల ఒద్ద ఉన్నప్పటికిని శరీరసౌఖ్యాలు త్యజించి, మాసిన సగం చీరనే ధరించి, దుమ్ము పేరుకొని పోయినా ఒప్పుతున్న శరీరంతో తన జీవితానికి అధినేత అయిన భర్తను చూచే రోజులకొరకు ఎదురుచూస్తూ దృఢదీక్షతో బ్రతికింది.

వ. ఇట్లు భర్తృవియోగాతురయై దమయంతి ప్రాణంబు భరియింపనోపక యొక్కనాఁ డేకాంతంబునఁ దన జనని కిట్లనియె. 152

ప్రతిపదార్థం: ఇట్లు= ఈవిధంగా; భర్తృ, వియోగ+ఆతుర+ఐ= భర్తయొక్క ఎడబాటు చేత ఏర్పడిన ఉద్వేగం కలదై; దమయంతి; ప్రాణంబు, భరియింపన్+ఓపక= అసువులు భరించలేక; ఒక్కనాఁడు= ఒకానొక దినం; తన, జననికి= తన తల్లికి; ఏకాంతంబునన్= రహస్యంగా; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: ఈ విధంగా భర్తయొక్క ఎడబాటువలన కలిగిన ఉద్వేగంతో దమయంతి అసువులు భరించలేక ఒకానొకదినం రహస్యంగా తల్లితో ఇట్లా చెప్పింది.

క. 'శోకాపనోదిఁ బుణ్య ।
శ్లోకుని నలు రోయఁ బనుపు శుభచరితుఁ దదా
లోకనవిహీననై పర ।
లోకకృతావాస నగుదు లోకం బెఱుఁగన్'. 153

ప్రతిపదార్థం: శోక+అపనోదిన్= దుఃఖం పోకార్చేవాడిని; పుణ్యశ్లోకుని= పవిత్రమైన చరిత్ర కలవాడిని; శుభ చరితున్= మంగళకరమైన స్వభావం కలవాడిని; నలున్= నలుడిని; రోయన్+పనుపు= వెదకటానికి పంపుము; తద్+ఆలోకన, విహీనను+ఐ= ఆతడిని చూడటానికి నోచనిదానినై; లోకంబు+ఎఱుఁగన్= జనులందరికి తెలిసేటట్లుగా; పర, లోక, కృత+ఆవాసన్+అగుదున్= పరలోకంలో చేయబడిన నివాసం కలదానిని అవుతాను.

తాత్పర్యం: 'నా దుఃఖాన్ని పోగొట్టగల పుణ్యచరిత్రుడైన నలుడిని వెదకటానికై పంపుము. ఆతడిని చూడకుంటే నేను బహిరంగంగా ఈ లోకాన్ని వదలి పరలోకానికి వెళ్ళుతాను.'

వ. అనిన నదియును గూఁతు నభిప్రాయంబు భీమున కెఱింగించిన, నాతండు నలుమార్గణంబున ఋజుమార్గులయిన బ్రాహ్మణుల నియోగించినం, దన పతి నన్వేషింప నరుగు బ్రాహ్మణులకు దమయంతి యిట్లనియె. 154

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; ఆదియును= ఆమెయు; కూఁతున్+అభిప్రాయంబు= పుత్రికయొక్క ఉద్దేశం; భీమునకు= విదర్భరాజయిన భీముడికి; ఎఱింగించినన్= తెలుపగా; ఆతండు= ఆ భీముడు; నలు, మార్గణంబునన్= నలుడిని వెదకటంలో; ఋజు మార్గులు+అయిన= తిన్నని నడవడి కల; బ్రాహ్మణులన్= విప్రులను; నియోగించినన్= పుత్తెంచగా; తన, పతిన్= తన భర్తను; అన్వేషింపన్+అరుగు= వెదకటానికి వెళ్ళే; బ్రాహ్మణులకున్= విప్రులకు; దమయంతి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: అని చెప్పగా, ఆమె తన కూతురి ఉద్దేశాన్ని భీమరాజుకు తెలిపింది. ఆతడు నలుడిని అన్వేషించటానికై సత్ప్రవర్తన గల బ్రాహ్మణులను నియోగించాడు. తన పతిని వెదకటానికై వెళ్ళే బ్రాహ్మణులతో దమయంతి ఇట్లా చెప్పింది.

ఆ. 'నైషధేశ్వరుండు నలుఁ డిప్పు డసమర్థుఁ ।
డగుటఁ జేసి తన్ను నన్యు లెఱుఁగ
కుండ నుండుఁ; గాన నురుసభాంతరముల ।
కరిగి యరిగి యిట్టు లనుడు మీరు. 155

ప్రతిపదార్థం: నైషధ+ఈశ్వరుండు= నిషధ దేశ ప్రజలకు ప్రభువు; నలుఁడు; ఇప్పుడు; అసమర్థుఁడు+అగుటన్+చేసి= సమర్థుడు కాకపోవటంచేత- అంటే తన పదవిని కోలు పోయి నిషధప్రభువుగా లేకుండటంచేత; తన్నున్= తనను; అన్యులు= ఇతరులు; ఎఱుఁగక+ఉండన్= తెలియకుండ; ఉండున్+కానన్= ఉంటాడు కాబట్టి; ఉరు, సభా+ అంతరములకున్= గొప్ప కొలువుకూటాలకు; అరిగి+అరిగి= వెళ్ళి, వెళ్ళి; ఇట్టులు+ అనుడు= ఇట్లా మీరు చెప్పండి.

తాత్పర్యం: 'నిషధప్రజలకు రాజైన నలుడు ప్రస్తుతం అసమర్థుడు. పదవిని కోలుపోయాడు. కాబట్టి ఇతరులు తనను గుర్తించకుండ అజ్ఞాతవాసం చేస్తూ ఉంటాడు. మీరు పలుదేశాలకు వెళ్ళినపుడు అచటి సభలలో ఈవిధంగా పలకండి.

విశేషం: 'అరిగి యరిగి' అనే ప్రయోగం వలన నలుడిని అన్వేషించటానికి బ్రాహ్మణులు పలు తావులకు వెళ్ళవలసి ఉంటుందన్న సూచన సుస్పష్టం.

సీ. 'నిత్యసత్యుండవు; నీ సతి వంచించి ।
దాని వస్త్రార్థంబు దఱిగి నీకుఁ
బరిధానముగఁ జేసి పాడియే పోవంగ?
భార్య భర్తవ్యనాఁ బరఁగు ధర్మ
మది మిథ్య యయ్యె నీయందు; నీ కిట్టి ని ।
ర్దయబుద్ధిఁ జేకొనఁ దగునె?

యట్టి సాధ్వికిఁ గరుణఁ బ్రసన్నుండ వగు' మని ।
యెల్లచోఁ బలికిన నెవ్వఁడేనిఁ

ఆ. బలుకు వడఁగ నోడి ప్రతివచనం బిచ్చు ।
నతఁడు నలుఁడుగాఁ బ్రియంబుతోడ
నెఱిఁగి నన్ను నతని కెఱిఁగించి తోడ్కొని ।
రండు; రానినాఁడు రం డెఱింగి.' 156

ప్రతిపదార్థం: నిత్యసత్యుండవు= ఎల్లప్పుడు సత్యసంధుడివైన వాడివి; నీ, సతిన్= నీభార్యను; వంచించి= మోసంచేసి; దాని వస్త్ర+అర్ధంబు= ఆమె సగం చీరను; తఱిగి= చించి; నీకున్, పరిధానముగన్+చేసి= నీకు కట్టుపుట్టంగా చేసికొని; పాడియే పోవంగన్= పోవటం ధర్మమా?; భార్య= పెండ్లాం; భర్తవ్య= భరించబడేది; నాన్+పరఁగు= అనబడే టటువంటి; ధర్మము+అది= ఆ ధర్మం; నీయందు= నీ పట్ల; మిథ్య+అయ్యెన్= అసత్యమయింది; నీకు+ఇట్టి, నిర్దయ, బుద్ధిన్= నీకు ఇటువంటి దయలేని కఠినవైఖరిని; చేకొనన్+తగునె= స్వీకరించతగునా?; అట్టి, సాధ్వికిన్= అటువంటి ఉత్తమురాలికి; కరుణన్= దయతో; ప్రసన్నుఁడవు+అగుము= అనుగ్రహం కలవాడివి కమ్ము; అని= అంటూ; ఎల్లచోన్= అన్నిచోట్లలో; పలికినన్= ప్రకటించగా; ఎవ్వడు+ఏనిన్= ఎవ్వడైనా; పలుకు+పడఁగన్+ఓడి= మాట పడటానికి ఇష్టపడక; ప్రతివచనంబు+ఇచ్చున్= ఎదురు సమాధానం చెపుతాడో!; అతఁడు= ఎదురు చెప్పినవాడు; ప్రియంబుతోడన్= ప్రీతితో; నలుండు+కాన్+ఎఱిఁగి= నలుడని గుర్తించి; నన్నున్+అతనికి+ఎఱిఁగించి= నా విషయం అతడికి తెలిపి; తోడ్కొని రండు= అతడిని ఇచటికి తీసికొనిరండు; రాని, నాఁడు= అతడు ఇచటికి రాకున్నట్లయితే; ఎఱింగి= తెలిసికొని; రండు= తిరిగిరండు.

తాత్పర్యం: 'నీవు నిత్యసత్యవ్రతుడివి. నీ భార్యను మోసంచేసి ఆమెచీరను సగం చింపి నీవు కట్టుబట్టగా చేసికొని పోవటం న్యాయమా? భరించబడేది

భార్య అని కదా ధర్మం. ఆ ధర్మం నీపట్ల అసత్యమైనదిగదా! నీవు ఇటువంటి దయలేని కఠినమైన బుద్ధిని అవలంబించ తగునా? అటువంటి పతివ్రతాశిరోమణి పట్ల అనుగ్రహం చూపుము' - అని అన్ని చోట్ల పలుకండి. ఎవరు ఆ మాటలు విని రోషం చెంది ఎదురు సమాధానం చెపుతాడో అటువంటివాడిని ప్రియమార నలుడిగా గుర్తించి, అతడికి నా విషయం తెలిపి, ఇచటికి తోడ్కొని రండి. ఒకవేళ అతడు ఇచటికి రాకుంటే అతడిని గుర్తుపెట్టుకొని మీరు తిరిగి రండి'.

వ. అని పంచినం, బనిపూని బ్రాహ్మణులు దమయంతి కఱపిన పలుకు లెల్ల సభలం బలికి యెందునుం గానక వచ్చి; రందుఁ బర్ణాదుం డను బ్రాహ్మణుండు దమయంతి కిట్లనియె; 'నే నయోధ్య కరిగి నీ కఱపిన పలుకు లెల్ల ఋతుపర్ణుసభం బలికిన నొక్క పురుషుండు కుఱుచ చేతులవాఁడు ఋతుపర్ణునొద్ద నూఱుగద్యాణంబుల జీవితంబువాఁడు శీఘ్రయానకు శలుండు సూదక్రియానిపుణుండు విరూపాంగుండు బాహుకుం డను నశ్వ శిక్షకుండు విని, నన్ను నేకతంబ కనుంగొని వెలవెల నగుచు దీర్ఘనిశ్వాస పురస్సరుండై యిట్లనియె. 157

ప్రతిపదార్థం: అని= అంటూ; పంచినన్= నియోగించగా, పనిపూని= కార్యభారం వహించి; బ్రాహ్మణులు= విప్రులు; దమయంతి, కఱపిన= దమయంతి చెప్పిన; పలుకులు= మాటలు; ఎల్ల, సభలన్, పలికి= అన్ని సభలలో భాషించి; ఎందునున్, కానక, వచ్చిరి= (నలుడిని) ఎచ్చటను చూడలేక తిరిగి వచ్చారు; అందున్= ఆ బ్రాహ్మణులలో; పర్ణాదుండు+ అను+బ్రాహ్మణుండు= పర్ణాదుడనే విప్రుడు; దమయంతికి; ఇట్లు+అనియె= ఈవిధంగా చెప్పాడు; ఏను= నేను; అయోధ్యకు; అరిగి= వెళ్ళి; నీ, కఱపిన, పలుకులు+ఎల్ల= నీవు నేర్పిన మాటలన్నియు; ఋతుపర్ణు, సభన్= ఋతుపర్ణుడి కొలువుకూటంలో; పలికినన్= మాటాడగా; ఒక్క, పురుషుండు= ఒక మగవాడు; కుఱుచ చేతులవాఁడు= పొట్టి చేతులు కలవాడు; ఋతు, పర్ణు+ఒద్ద= ఋతుపర్ణుడి దగ్గర; నూఱు గద్యాణంబుల, జీవితంబు, వాఁడు= వందగద్యాణాలను జీతంగా పొందేవాడు; (జీవితంబు అనే పదానికి జీతంబు అనే పాఠాంతరం కొన్ని ప్రతులలో కానవస్తున్నది. జీవితం యొక్క రూపాంతరమే జీతం); శీఘ్రయాన కుశలుండు= వేగంగా ప్రయాణం చేయటంలో నేర్పరి; సూదక్రియా నిపుణుండు= వంటలు చేయటంలో నేర్పు కలవాడు; విరూప+అంగుండు= వికృతమైన ఆకృతి కలవాడు; బాహుకుండు+అను= బాహుకుడనే పేరుకలవాడు; అశ్వశిక్షకుండు= గుర్రాలకు శిక్షణ ఇచ్చేవాడు; విని= ఆలకించి; నన్నున్+ఏకతంబు+అ, కనుంగొని= నన్ను రహస్యంగా కలిసికొని; వెలువెలన్+అగుచు= తెల్లబోతూ; దీర్ఘనిశ్వాస పురస్సరుండు+ఐ= నిట్టూర్పులు ముందుగా ప్రసరింపచేస్తున్నవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని నియోగించగా, కర్తవ్యభారాన్ని పూని బ్రాహ్మణులు దమయంతి చెప్పిన మాటలు సకల సభలలో పలికి ఎచ్చటనూ నలుడిని కానక తిరిగి వచ్చారు. కాని, వారిలో పర్ణాదుడు అనే విప్రుడు దమయంతికి ఈ విధంగా చెప్పాడు: నేను అయోధ్యకు వెళ్ళి అచట ఋతుపర్ణుడి సభలో నీవు నేర్పిన మాటలు పలికాను. ఒకడు కురూపి, కురుచ చేతులవాడు, ఋతుపర్ణుడి దగ్గర వంద గద్యాణాల వేతనంతో పనిచేసే సేవకుడు, వంటలు చేయటంలో నేర్పు కలవాడు, వేగంగా ప్రయాణం చేయటంలో నేర్పు కలవాడు, బాహుకుడు అనే గుర్రాల శిక్షకుడు నా మాటలు విని, నన్ను రహస్యంగా కలిసికొని వేడినిట్టూర్పులు వెదజల్లుతూ ఈ విధంగా పలికాడు.

ఆ. 'పురుషునందు దోషపుంజంబు గలిగిన।
నెఱిఁగి యెద సహించునేని భార్య
పురుషునం దభీష్టభోగంబు, దేహాంత।
రంబునందు ధర్మరతియుఁ బడయు.' 158

ప్రతిపదార్థం: పురుషునందు= మగనిలో; దోషపుంజంబు= తప్పులు పెక్కు; కలిగినన్= ఉన్నప్పటికీ; ఎఱిఁగి= తెలిసికూడ; ఎదన్= హృదయంలో; సహించును+ఏని= ఓర్చుకొన్నట్లయితే; భార్య= ఆపెండ్లం; పురుషునందు= మగడియందు; అభీష్టభోగంబు= తాను కోరుకొన్న సౌఖ్యం; దేహ+ అంతరంబు+అందున్= వేరొక జన్మలో; ధర్మరతియున్= ధర్మంపై ప్రీతిని; పడయున్= పొందగలదు.

తాత్పర్యం: మగడియందు తప్పు లుంటే తెలిసి ఉండికూడ సైరించే భార్య ఎప్పటికైనా ఇహలోకంలో భర్త నుండి తాను కోరిన సౌఖ్యం పొందుతుంది. అట్లాగే ఆ పుణ్యంవలన మరుజన్మలో ధర్మంపట్ల ప్రీతిని పొందగలదు.'

వ. అని యొండెద్దియుం బలుకక తన నివాసంబునకుం బోయె' నని చెప్పిన విని, దమయంతి పెద్దయుం బ్రొద్దు చింతించి 'నలుండు గానివాఁ డు ప్రతివచనం బేల యిచ్చు? నింకను వలను గల వారలం బంచి యాతని నిమ్ముగా నెఱుంగవలయు' నని నిజజనని యనుమతంబున సుదేవు రావించి వాని కిట్లనియె. 159

ప్రతిపదార్థం: అని; ఒండు+ఎద్దియున్+పలుకక= వేరే ఏదియు మాట్లాడక; తన నివాసంబునకున్+పోయెన్= తాను నివసించే చోటికి వెళ్ళాడు; అని; చెప్పిన; విని; దమయంతి; పెద్దయున్+ప్రొద్దు= చాలాసేపు; చింతించి= ఆలోచించి; నలుండు, కాని, వాఁడు= నలుడు కాక వేరొకడు; ప్రతివచనంబు= సమాధానం; ఏల+ఇచ్చున్?= ఎందుకు ఇస్తాడు?; ఇంకను; వలను+ కలవారలన్+పంచి= వీలైన వారిని పుత్తెంచి; ఆతనిన్= ఆ ప్రత్యుత్తరం ఇచ్చిన వాడిని; ఇమ్ముగాన్= పరిపూర్ణంగా; ఎఱుంగవలయున్= తెలిసికొనాలి; అని; నిజ, జనని= తన తల్లి; అనుమతంబున= అంగీకృతితో; సుదేవు, రావించి= సుదేవుడిని రప్పించి; వానికి= ఆతడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

తాత్పర్యం: అని మాత్రమే చెప్పి, తదుపరి మౌనం వహించి అతడు తన నివాసానికి వెళ్ళాడు' - అని చెప్పగా విని దమయంతి చాలసేపు ఆలోచించి 'అతడు నలుడు కాని పక్షంలో ఎందుకు ఎదురు సమాధానం చెప్తుతాడు? ఇంకను వీలైనవాళ్ళను పంపించి ఆతడి సంగతిని సంపూర్ణంగా తెలిసికొనవలసి ఉన్నది' అని తల్లి అనుమతితో సుదేవుడిని రావించి అతడితో ఇట్లా చెప్పింది.

క. 'న న్నెఱిఁగి తెచ్చినట్లు జ ।
గన్నుతు నలు నెఱిఁగి తెమ్ము కౌశలమున వి
ద్వన్నుత! సర్వసుగుణసం ।
పన్నుండవు నీవ బుద్ధిఁ బరికింపంగన్. 160

ప్రతిపదార్థం: నన్ను+ఎఱిఁగి, తెచ్చినట్లు= నన్ను గుర్తించి తెచ్చినట్లుగానే; జగత్+నుతున్= జగత్తుచేత స్తుతించబడిన; నలున్= నలుడిని; కౌశలమునన్= సామర్థ్యంతో; ఎఱిఁగి తెమ్ము= గుర్తించి తీసికొని రమ్ము; విద్వత్+నుత!= పండితులచేత కీర్తించబడిన వాడా!; బుద్ధిన్+పరికింపంగన్= మెదడుతో ఆలోచించి చూస్తే; నీవు+ అ=నీవే; సర్వసుగుణసంపన్నుండవు= సకల సద్గుణాల సంపద కలవాడివి.

తాత్పర్యం: 'విద్వాంసులచేత కీర్తించబడిన ఓ సుదేవా! బుద్ధితో ఆలోచిస్తే నీవే సకల సద్గుణాల సంపద కలవాడివి. నీవు నన్ను గుర్తించి తెచ్చావు కదా! అట్లే లోకులచేత ప్రశంసించబడే నలమహారాజును కూడ వెదకి నేర్పుగ గుర్తించి తీసికొనిరమ్ము.

క. అరుగు మయోధ్యకు దేశాం ।
తర విప్రుఁడవై; రవిప్రతాపోన్నతు ను
త్తరకోసలేంద్రు నుర్వీ ।
శ్వరుఁ గనఁ జను మనఘు నమరసము ఋతుపర్ణున్. 161

ప్రతిపదార్థం: దేశ+అంతర, విప్రుఁడవు+ఐ= మరొకదేశానికి చెందిన బ్రాహ్మణుడివిగా; అయోధ్యకున్= అయోధ్యాపురికి; అరుగుము= వెళ్ళుము; ఉత్తర కోసల+ఇంద్రున్= ఉత్తర కోసల దేశానికి రాజును; ఉర్వీ+ఈశ్వరున్= భూపతిని; రవి, ప్రతాప+ఉన్నతున్= సూర్యుడి వంటి ప్రతాపంచేత గొప్పవాడిని; అనఘున్= పాపరహితుడిని; అమరసమున్= దేవతలవంటి వాడిని; ఋతుపర్ణున్= ఋతుపర్ణుడిని; కనన్= చూడటానికి; చను= వెళ్ళుము.

తాత్పర్యం: ఓ సుదేవా! నీవు అయోధ్యకు విదేశవిప్రుడివలె వెళ్ళుము. వెళ్ళి ఉత్తర కోసలపతి, సూర్యుడి వంటి ప్రతాపంచేత ఉన్నతుడు, పుణ్యాత్ముడు, దేవతలతో సమానుడు అయిన ఋతుపర్ణుడిని దర్శించుము.

విశేషం: ఉస్మానియా విశ్వవిద్యాలయ సంశోధిత ముద్రిత ప్రతిలో - పై పద్యం ఉత్తరార్ధంలో 'ఉత్తరకోసలేశు భాంగాసరినింగను మనఘు నమరసము' అనే పాఠం ఉన్నది. అందులోని 'భాంగాసరి' - అనే పదానికి 'భాంగస్వరి', 'భాంగాసురి'- అనే పాఠభేదాలు కూడ కనబడు తున్నాయి. కాని, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిలో పాఠాంతరంగా ఇవ్వబడిన ప్రస్తుత పాఠం అర్థప్రసన్నతకు తోడ్పడేదైనందున ఇందులో ప్రధానపాఠంగా స్వీకరించటం జరిగింది.

వ. 'మఱి విదర్భావిభుం డగు భీముండు నలు రోయం బంచి, యెందునుం గానక యింకను దమయంతికిఁ బునఃస్వయంవరంబు రచియింపం బోయిన, నందులకు భూవలయంబునం గల రాజులెల్లను బోయెద'రని యతిత్వరితంబుగా ఋతుపర్ణునకుం జెప్పు' మని పంచిన సుదేవుం డయోధ్యానగరంబునకుం బోయి ఋతుపర్ణుం గాంచి 'విదర్భాపురంబున దమయంతీ ద్వితీయ స్వయంవరం బెల్లియె యయ్యెడు' నని చెప్పిన విని ఋతుపర్ణుండు బాహుకుం జూచి 'నాకు దమయంతీ స్వయంవరంబుఁ జూడ నొక్క నాఁటన విదర్భకుం బోవలయు నీ యశ్వశిక్షానైపుణ్యంబుఁ బ్రకాశింపు' మనవుడు 'నట్ల చేయుదు' నని నలుండు దన మనంబున దుఃఖించి. 162

ప్రతిపదార్థం: మఱి= అదియునుగాక; విదర్భా, విభుండు+అగు= విదర్భ రాజైన; భీముండు= భీముడు; నలున్=నలుడిని; రోయన్+పంచి= వెదకటానికి పుత్తెంచి; ఎందునున్+కానక= ఎచటను అతడు కనిపించక పోవటంచేత; ఇంకను= తదుపరి; దమయంతికిన్= దమయంతి కొరకు; పునః స్వయంవరంబు= తిరిగి స్వయంవరం; రచియింపన్+పోయినన్= ఏర్పాటు చేయటానికి పూనగా; అందులకు= ఆ దమయంతీ ద్వితీయ స్వయంవరానికి; భూవలయంబునన్+కల= భూమండలంలో గల; రాజులు+ఎల్లను= రాజులందరును; పోయెదరు= వెళ్ళుతారు; అని= అని చెప్పి; అతి, త్వరితంబుగాన్= మిక్కిలి వేగంగా; ఋతుపర్ణునకున్= ఋతుపర్ణుడికి; చెప్పుము= చెప్పేది; అని= అంటూ; పంచిన= నియోగించగా; సుదేవుండు= సుదేవుడు; అయోధ్యా నగరంబునకున్+పోయి= అయోధ్యాపురికి వెళ్ళి; ఋతుపర్ణున్+కాంచి= ఋతుపర్ణుడిని చూచి; విదర్భాపురంబునన్= విదర్భానగరంలో; దమయంతీ, ద్వితీయ, స్వయంవరంబు= దమయంతి యొక్క రెండవ స్వయంవరం; ఎల్లియె(ఎల్లి+ఎ)= రేపే; అయ్యెడున్= జరుగుతుంది; అని, చెప్పిన; విని; ఋతుపర్ణుండు; బాహుకున్+చూచి= బాహుకుడిని చూచి; నాకు; దమయంతీ, స్వయంవరంబున్= దమయంతీ స్వయంవరాన్ని; చూడన్= చూడటానికి; ఒక్కనాఁటను+అ= ఒక్క దినంలోపలే; విదర్భకున్+పోవలయున్= విదర్భకు వెళ్ళాలి; నీ, అశ్వ, శిక్షా, నైపుణ్యంబున్= గుఱ్ఱాలను నడిపే నీ నేర్పరితనాన్ని; ప్రకాశింపుము= వెలుగొందజేయుము; అనవుడున్= అని చెప్పగా; అట్ల+చేయుదును+ అని= అట్లే చేస్తానని చెప్పి; నలుండు= నలుడు; తన, మనంబునన్= తనమనస్సులో; దుఃఖించి= పరితపించి.

తాత్పర్యం: అంతేగాక, విదర్భప్రభువు భీముడు నలుడిని అన్వేషించటానికై పలువురిని పుత్తెంచి, ఎక్కడా ఆతడి జాడను తెలియజాలక, దమయంతికి ద్వితీయ స్వయంవరాన్ని ఏర్పాటు చేశాడనిన్నీ, అందుకు భూమండలంలోని

రాజులందరూ వస్తున్నారనిన్నీ మిక్కిలి శీఘ్రంగా ఋతుపర్ణుడికి చెప్పుము'- అని దమయంతి చెప్పి పంపించింది. సుదేవుడు అంతట అయోధ్యాపురి చేరి ఋతుపర్ణుడిని సందర్శించి విదర్భానగరాన దమయంతీ ద్వితీయస్వయంవరం మరునాడు జరుగుతుందని చెప్పాడు. ఋతుపర్ణుడు అంతట బాహుకుడిని పిలిచి 'నాకు దమయంతీ స్వయంవరం చూడాలని ఉన్నది. అయితే, ఒక దినంలో మనం విదర్భ చేరవలసి ఉన్నది. నీ అశ్వశిక్షా చాతుర్యం వెలుగొందచేయుము' అని చెప్పగా బాహుకుడు అట్లాగే చేస్తానని చెప్పి, తన మనస్సులో మిక్కిలి పరితపించాడు.

ఆ. 'అడవిఁ దన్నుఁ బాసి యరిగిన నలిగి కా ।
కున్నె యిట్లు సేయ నువిద గడఁగె;
నెట్లయేనిఁ గూర్తు రింతులు మా కని ।
విశ్వసించువారు వెడఁగు లెందు. 163

ప్రతిపదార్థం: అడవిన్= అడవిలో; తన్నున్+పాసి+అరిగినన్= తనను ఎడబాసి వెళ్ళటంచేత; అలిగి, కాకున్నె= కోపగించుకొనటం వల్లనే కదా!; ఉవిద= ఇంతి (దమయంతి); ఇట్లు= ఈ విధంగా; (అంటే రెండవ స్వయంవరానికి పాల్పడటం); చేయన్= చేయటానికి; కడఁగెన్= పూనింది; ఎట్లు+అ+ఏనిన్= ఏవిధంగానైనను; ఇంతులు= ఆడువారు; మాకు= మమ్ము; కూర్తురు= ప్రేమిస్తూ ఉంటారు; అని; విశ్వసించువారు= నమ్మేవారు; ఎందున్= ఎచటనైనను; వెడఁగులు= వెర్రివారు (వివేకం లేనివారు).

తాత్పర్యం: 'ఆనాడు అడవిలో ఎడబాసి వెళ్ళాను- అనే కదా ఆమె నాపై కోపం పూనింది. లేకుంటే ఈ విధంగా మళ్ళీ రెండవస్వయంవరానికి పూనుకొంటుందా? తా మేమి చేసినా తమనే వనితలు ప్రేమిస్తూ ఉంటారని నమ్మే పురుషులు అవివేకులు'.

విశేషం: అలం: అర్థాంతరన్యాసం. ఇది దమయంతిని గురించిన నలుడి అనుభూతి. దాన్ని నలుడు పురుషలోకానికి స్త్రీ జాతికి అన్వయించాడు.

దమయంతి ఇంగితజ్ఞానం అద్భుత మైనది. ఆత్మాభిమానధురంధరుడైన నలుడి హృదయాన్ని కదలించగల శక్తి ద్వితీయ స్వయంవరవార్తకు మాత్రమే కలదని గుర్తించిన ఇంగితజ్ఞురాలు దమయంతి.

ఆ. సాధ్వి నాకుఁ గూర్చు సంతతి గలయది ।
చెలువ యిట్టు లేల చేయు? నైన
నెఱుఁగవలయు దీని నే ఋతుపర్ణుతోఁ ।
బోదు' నని నలుండు బుద్ధిఁ దలఁచి. 164

ప్రతిపదార్థం: సాధ్వి= సతీమణి అయిన దమయంతి; నాకున్+కూర్చు, సంతతి, కల+అది= నాపై అనురాగం గల బిడ్డలు కలది; చెలువ= మగువ (దమయంతి); ఇట్టులు+ఏల, చేయున్= ఈ విధంగా ఎందుకు చేస్తుంది? (అంటే ఎందుకు రెండవ స్వయంవరానికి పాల్పడుతుంది?); ఐనన్= అయినప్పటికిని; దీనిన్= ఈ విషయాన్ని; ఎఱుఁగవలయున్= అరసి తెలిసికోవలసి ఉన్నది; ఏన్= నేను; ఋతుపర్ణుతోన్+పోదున్= ఋతుపర్ణుడితో వెళ్ళుతాను; అని= అంటూ; నలుండు= నలుడు; బుద్ధిన్= మనస్సులో; తలఁచి= ఆలోచించి.

తాత్పర్యం: నలుడు తనలో తాను ఇట్లా తర్కించుకొన్నాడు- 'దమయంతి పతివ్రతాతిలకం. నాపట్ల అనురాగం గల బిడ్డలు ఉన్నారు ఆమెకు! ఆమె ఈ విధంగా రెండవ స్వయంవరానికి పాల్పడుతుందా? ఇది పరిశీలించవలసిన అంశం. కాబట్టి, నేను ఋతుపర్ణుడితో విదర్భకు వెళ్ళి సర్వం తెలుసుకొని వస్తాను.

వ. తొల్లి వార్ష్ణేయుండు దెచ్చిన తన రథంబునందు నిజహయంబుల నాలక్ష్యమాణ శుభలక్షణంబులు మనోవాయు వేగంబులు నైన వానిం బూన్చి కొని వచ్చిన, ఋతుపర్ణుం డా రథంబెక్కునప్పుడు హయంబులు మ్రొగ్గినం జూచి 'యప్పేదగుఱ్ఱంబు లతిదూరం బెట్లు పోవనోపు? నొండు గుఱ్ఱంబులం బూన్పు' మనిన బాహుకుం డిట్లనియె. 165

ప్రతిపదార్థం: తొల్లి= మునుపు; వార్‌ష్ణేయుండు= వార్‌ష్ణేయుడు (నలుడి సారథిగా పని చేసినవాడు, ప్రస్తుతం ఋతుపర్ణుడి కొలువులో కుదురుకొన్న వాడు); తెచ్చిన= తీసికొని వచ్చిన; తన రథంబునందు= తనతేరుకు; ఆలక్ష్యమాణ, శుభలక్షణంబులు= మంచి లక్షణాలు కలిగి ఒప్పుతున్నట్టివి; మనస్+వాయు, వేగంబులు= మనోవేగం, వాయువేగం కలిగినట్టివి; ఐనవానిన్= అయినవాటిని; నిజ హయంబులన్= తన గుఱ్ఱాలను; పూన్చికొని వచ్చిన= రథానికి కట్టుకొని రాగా; ఋతుపర్ణుండు; ఆ, రథంబు+ఎక్కునప్పుడు= ఆ తేరును అధిరోహించేటప్పుడు; హయంబులు= గుఱ్ఱాలు; మ్రొగ్గినన్+ చూచి= కొంచెం వంగటం గమనించి; ఆ+పేద, గుఱ్ఱంబులు= ఆ బడుగు గుఱ్ఱాలు; అతి దూరంబు= ఎక్కువ దూరం; ఎట్లు, పోవన్+ఓపున్?= ఏవిధంగా పోజాలుతాయి?; ఒండు, గుఱ్ఱంబులన్+పూన్పుము= వేరు గుఱ్ఱాలు తెచ్చి రథానికి కట్టుము; అనినన్= అని అనగా బాహుకుండు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా బదులు పలికాడు.

తాత్పర్యం: బాహుకుడు (నలుడు) ఇదివరలో వార్‌ష్ణేయుడు అయోధ్యకు తెచ్చి ఉంచిన తన రథానికి, మనోవేగం, వాయువేగం, సమస్త శుభలక్షణాలు గల తన గుఱ్ఱాలను కట్టి రథాన్నితెచ్చాడు. ఋతుపర్ణుడు ఆ రథాన్ని ఎక్కుతుండగా ఆ గుఱ్ఱాలు కొంచెం క్రిందికి మొగ్గాయి. ఋతుపర్ణుడు అది చూచి బాహుకుడితో 'ఈ బడుగు గుఱ్ఱాలు అంతదూరం ఎట్లా పోగలుగుతాయి? వేరే గుఱ్ఱాలను పూన్చుము' అని అదేశించాడు. అప్పుడు బాహుకుడు ఇట్లా బదులు పలికాడు.

క. 'అవనీశ! యీ హయంబులు ।
పవనగతిం బఱచుఁ బ్రొద్దువడకుండఁగ నేఁ
డ విదర్భకు' ననవుడు విని ।
కువలయపతి మెచ్చి బాహుకున కి ట్లనియెన్. 166

ప్రతిపదార్థం: అవనీ+ఈశ!= భూమికి ఈశ్వరుడివంటివాడా, అంటే-ఓ మహారాజా!; ఈ హయంబులు= ఈ గుఱ్ఱాలు; నేఁడు+అ= ఈ దినాననే; విదర్భకున్= విదర్భా పట్టణానికి; ప్రొద్దు+పడకుండఁగన్= సూర్యాస్తమయం కాకుండానే; పవనగతిన్= వాయువేగంతో; పఱచున్= పరుగెత్తుతాయి; అనవుడు= అని చెప్పగా; విని= ఆలకించి; కువలయపతి= భూభర్త అయిన మహారాజు; మెచ్చి= అభినందించి; బాహుకునకున్= బాహుకుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: 'ఓ రాజా! ఈ గుఱ్ఱాలు వాయువేగంతో పరుగెత్తుతాయి. ప్రొద్దు క్రుంకే లోపలే విదర్భకు చేరేటట్లు చేస్తాయి'- అని బాహుకుడు అన్నాడు. అతడి మాటలకు మెచ్చుకొని ఋతుపర్ణుడు ఇట్లా పలికాడు.

వ. 'అట్లయిన నీ హయతత్త్వకౌశలం బెఱింగి నీకు నభిమతం బొనరింతు' నని రథం బెక్కి బాహుక వార్‌ష్ణేయ సహితుం డయి యరుగువాఁడు. 167

తాత్పర్యం: 'ఆ విధంగా నేడే ప్రొద్దుక్రుంకే లోపల విదర్భ చేరగలిగితే నీకు గుఱ్ఱాల స్వభావం తెలిసికోవటంలో, వాటికి శిక్షనివ్వటంలో ఉండే నైపుణ్యాన్ని గుర్తించి నీవుకోరింది ఇస్తాను' అని చెప్పి బాహుకుడితో వార్‌ష్ణేయుడితో కలిసి ఋతుపర్ణుడు పయనించాడు.

మధ్యాక్కర.

ఎదురను దవ్వులఁ జూచిన పొడవు లెల్లఁ దత్క్షణమ
కదియఁగా, నవ్వి యెంతయును దవ్వయి కనఁబడఁ బిఱుఁద
'నిది దినేశ్వరు రథమో! యనూరుఁడో! యితఁ' డంచు నపుడు
హృదయమునను గడు విస్మయం బందె నిక్ష్వాకుకులుఁడు. 168

ప్రతిపదార్థం: ఎదురను= ఎదురుగా; దవ్వులన్= దూరంగా; చూచిన= కనిపించిన; పొడవులు+ఎల్లన్= రూపాలన్నీ; (తద్,) క్షణము+అ= ఆ

క్షణంలోనే; కదియఁగాన్= సమీపించగా; అవ్వి= అవి; ఎంతయును; దవ్వు+అయి= దూరమై; పిఱుఁదన్= వెనుకగా; కనన్+పడన్= కనిపించగా; ఇది= ఈ తేరు; దిన+ఈశ్వరు= సూర్యుడియొక్క; రథమో= తేరో?; ఇతఁడు= ఈ బాహుకుడు; అనూరుఁడో= సూర్యుడి రథసారథి అయిన అనూరుడో?; అంచున్= అంటూ; అపుడు; హృదయమునను= మనస్సులో; ఇక్ష్వాకు, కులుఁడు= ఇక్ష్వాకుకులంలో పుట్టిన ఋతుపర్ణుడు; కడు= మిక్కిలి; విస్మయంబు+అందెన్= ఆశ్చర్యం పొందాడు.

తాత్పర్యం: ఎదురుగా సుదూరంలో కనిపించిన రూపాలు ఆ క్షణంలోనే దగ్గరగా కనిపించి, వెనువెంటనే వెనుకగా మిక్కిలి దూరంలో కనిపించేవి. ఋతుపర్ణుడు 'ఇది సూర్యుడి రథమా? ఈ రథసారథి బాహుకుడా, అనూరుడా?' అని తన మనస్సులో మిక్కిలి ఆశ్చర్యం పొందాడు.

విశేషం: ఇది రథవేగవర్ణనం. దీనిని కాళిదాసమహాకవి వ్రాసిన అభిజ్ఞాన శాకుంతలంలోని రథవేగవర్ణనతో సరిపోల్చి చూడండి. వృత్తలక్షణానికి ఈ ఆశ్వాసంలోని 22వ పద్యం విశేషవ్యాఖ్య చూడండి.

వ. వార్ష్ణేయుండును బాహుకురథంబు గడపునేర్పున కచ్చెరువడి యాత్మగతంబున. 169

తాత్పర్యం: వార్ష్ణేయుడు కూడా బాహుకుడు రథాన్ని నడిపే నైపుణ్యానికి ఆశ్చర్యపడి, మనస్సులో (ఇట్లా అనుకొన్నాడు)

క. 'ఈతండు శాలిహోత్రుఁడొ!।
మాతలియో! నలుఁడొ యొరులు మానవులు జవో
పేతముగ నిట్లు రథహయ।
నీతి యెఱుంగుదురె? ధారుణీవలయమునన్. 170

ప్రతిపదార్థం: ఈతండు= ఈ బాహుకుడు; శాలిహోత్రుఁడొ= అశ్వశాస్త్ర రచయితయైన శాలిహోత్ర మహర్షియో; మాతలియో!= దేవేంద్రుడి రథసారథి

అయిన మాతలియో!; నలుఁడొ!; మానవులు, ఒరులు= మానవులు ఇంకెవ్వరు; ఇట్లు= ఈ విధంగా; జవ+ఉపేతముగన్= వేగంతో కూడినట్లు; రథ, హయనీతి= తేరులయొక్క, గుర్రాలయొక్క స్వభావపాటవ పద్ధతులు; ధారుణీ; వలయమునన్= భూమండలంలో; ఎఱుంగుదురె?= తెలిసి ఉన్నారా?

తాత్పర్యం: 'ఈ బాహుకుడు అశ్వశాస్త్రకర్తయైన శాలిహోత్ర మునీంద్రుడా? దేవేంద్రుడి రథసారథి అయిన మాతలియా? లేక నలుడా? తదితర మానవులు ఇంత శక్తిమంతంగా ఈ భూలోకంలో రథాలను గురించిన, గుర్రాలను గురించిన దర్శనజ్ఞానం కలవారు ఉన్నారా?

వ. వయోవిద్యావైభవంబుల నితండు నలుంబోలియు వికృతరూపధరుండయిన కారణం బేమియొ? మహాపురుషులు దైవనియుక్తులై ప్రచ్ఛన్నవృత్తినుండుదురు; వారి నెఱుంగంబోలునె?' యనుచుఁ జనునప్పుడు ఋతుపర్ణుండు దన యుత్తరీయంబు జారి భూతలంబుపయిం బడినమలంగి చూచి 'బాహుకా! వార్ష్ణేయుండు వోయి యుత్తరీయంబు దెచ్చునంతకు రథగమనం బించుక మందంబు సేయు' మనిన బాహుకుండును 'నయ్యా! నీ యుత్తరీయంబు వడినయెడ యిచ్చోటికి నొక్క యోజనంబు గలదు; దాని వార్ష్ణేయుం డెట్లు దే నేర్చు?' నని రథగమనవేగమాహాత్మ్యంబు సెప్పుచు ననేకదేశంబులు గడచి చని యొక్కయెడ నగణ్యపర్ణఫలశాఖాలంకృతంబైన విభీతకవృక్షంబు గని; రంత ఋతుపర్ణుండు బాహుకున కిట్లనియె. 171

ప్రతిపదార్థం: వయో, విద్యా వైభవంబులన్= వయస్సుకు, జ్ఞాన నైపుణ్యానికి సంబంధించిన గొప్పతనంలో; ఇతండు= ఈ బాహుకుడు; నలున్+పోలియు= నలుడిని పోలి ఉన్నప్పటికిని; వికృత, రూప, ధరుండు+ఐన= వికారరూపాన్ని ధరించినవాడు కావటానికి; కారణంబు+ఏమియొ= హేతువు ఏమై ఉండవచ్చునో?; మహాపురుషులు= గొప్పవారు; దైవ, నియుక్తులు+ఐ= దైవంచేత

నియమించబడినవారై; ప్రచ్ఛన్నవృత్తిన్= అజ్ఞాతవర్తనంతో; ఉండుదురు= ఉంటారు; వారిన్= అటువంటివారిని (అంటే అజ్ఞాతరూపంలో ఉన్నవారిని); ఎఱుంగన్+పోలునె= తెలిసికొనటానికి వీలవుతుందా?; అనుచున్= అని తలుస్తూ; చనునప్పుడు= వెళ్ళేటప్పుడు; ఋతుపర్ణుండు; తన+ ఉత్తరీయంబు= తన పైవలువ; జారి= క్రిందకి ఒరిగి; భూతలంబు, పయిన్+పడిన= భూమిపై పడగా; మలంగి= వెనుకకు తిరిగి; చూచి= అరసి; బాహుకా= ఓ బాహుకా!; వార్ష్ణేయుండు+పోయి= వార్ష్ణేయుడు వెళ్ళి; ఉత్తరీయంబు= పై వస్త్రం; తెచ్చునంతకు= తీసుకొని వచ్చేవరకు; రథగమనంబు= రథం వెళ్ళటం; ఇంచుక= కొంచెం; మందంబు+ చేయుము= తగ్గించుము; అనిన= అని చెప్పగా; బాహుకుండును= బాహుకుడును; అయ్యా!= ఆర్యా!; నీ+ఉత్తరీయంబు= నీ పైపుట్టం; పడిన+ఎడ= పడినచోటు; ఈ+చోటికిన్= ఇచటికి; ఒక్క యోజనంబు= ఒక ఆమడదూరం; కలదు; దాని= ఆ ఉత్తరీయాన్ని; వార్ష్ణేయుండు; ఎట్లు= ఏ విధంగా; తేనేర్చును= తీసికొని రాగలడు?; అని= అని చెప్పి; రథ, గమన, వేగ, మాహాత్మ్యంబు+చెప్పుచున్= రథం వెళ్ళే వేగంయొక్క గొప్పతనాన్ని గురించి చెప్తూ; అనేక, దేశంబులు= పెక్కుదేశాలు; కడచి= దాటి; చని= వెళ్ళి; ఒక్క+ఎడన్= ఒకచోట; అగణ్య, పర్ణ, ఫల, శాఖా+ అలంకృతంబు+అయిన= లెక్కకు మిక్కిలి అయిన ఆకులతో, పండ్లతో, కొమ్మలతో అలంకరించబడిన; విభీతక, వృక్షంబున్+కనిరి= విభీతకమనే చెట్టును చూశారు (విభీతకవృక్షము= తాండ్రచెట్టు); అంతన్= అంతట; ఋతుపర్ణుండు; బాహుకునకు= బాహుకుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఈ బాహుకుడు వయస్సుకు, చదువుకు సంబంధించిన గొప్పతనంలో నలుడికి సమానుడే! అయితే ఆకారంలో పోలిక లేదుగదా! రూపం మారటానికి వేరే కారణం ఏదైనా ఉన్నదా? మహాపురుషులు కారణాంతరాల చేత మారురూపంలో ఇతరులకు తెలియ రాకుండ ఉండటం కద్దు. వారిని గుర్తుపట్టటం కష్టం కదా!'- అని వార్ష్ణేయుడు తన మనస్సులో

తర్కించుకొంటుండగా, ఋతుపర్ణుడి ఉత్తరీయం జారి నేలపై పడింది. అంతట ఋతుపర్ణుడు 'బాహుకా! రథం ఇంచుక ఆపు! వార్ష్ణేయుడు దిగి నేలపై పడ్డ నా ఉత్తరీయం తెస్తాడు'- అని అన్నాడు. అంతట బాహుకుడు 'మహారాజా! నీ ఉత్తరీయం పడిపోయిన చోటు ఇచటికి ఇప్పుడు ఒక ఆమడ దూరంలో ఉన్నది. (అంటే రథం కొన్ని నిమేషాలలో మిక్కిలి వేగంగా యోజనదూరం పయనించింది). ఇక వార్ష్ణేయుడు అంతదూరం పాదచారి అయి వెళ్ళి ఎట్లా ఆ వస్త్రాన్ని తేగలడు?'- అని బదులు పలికి రథం పోతున్న వేగంయొక్క మహిమను నిరూపించి చెప్పాడు. అటువంటి వేగంతో రథం పయనించి పెక్కు దేశాలను దాటి వెళ్ళింది. ఒకచోట దారిలో ఒక పెద్ద విభీతకవృక్షం (తాండ్రచెట్టు) దట్టమైన ఆకులతో, లెక్కింప నలవికాని రెమ్మలతో, కొమ్మలతో పండ్లతో కన్పించింది. అప్పుడు ఋతుపర్ణుడు బాహుకుడితో ఇట్లా పలికాడు.

ఆ. 'ఎల్లవారు నెఱుఁగ రెల్లవానిని; భిన్న ।
విషయు లెల్లవారు విద్యలందుఁ;
దొలఁగ కే నెఱుంగుదును దృష్టిమాత్రన ।
సకల మైన వస్తుచయముసంఖ్య. 172

ప్రతిపదార్థం: ఎల్లవారున్= అందరు; ఎల్లవానిని= సమస్తమైన అంశాలను; ఎఱుఁగరు= తెలియజాలరు; విద్యలందున్= జ్ఞాననైపుణ్యాలలో; ఎల్లవారు= అందరు; భిన్న విషయులు= వేరువేరు విషయాలలో నేర్పరులు; తొలఁగక= తప్పకుండ; దృష్టి మాత్రన= చూపుతో మాత్రమే; సకలము+ఐన= సమస్తమైన; వస్తు, చయము, సంఖ్య= వస్తు సమూహాల లెక్క; ఏను= నేను; ఎఱుంగుదును= తెలిసికొనగలను.

తాత్పర్యం: 'అందరికి అన్ని విషయాలు తెలియవు కదా! జ్ఞాన నైపుణ్యాలలో అందరు వేరు వేరు విషయాలలో గొప్పవారు. నేను చూచినంత మాత్రంతోనే అన్ని వస్తుసమూహాలకు సంబంధించిన సంఖ్యను తప్పిపోకుండా లెక్కకట్టి చెప్పగలను.

విశేషం: సంస్కృతంలోని - "ముఖే ముఖే సరస్వతీ" అనే లోకోక్తిని పై పద్యంలోని ప్రథమ ఖండానికి సారసంగ్రహంగా ఎన్నవచ్చును. ఒక్కొక్కరికి ఒక్కొక్క ప్రజ్ఞ ఉంటుంది. ఎవరున్నూ సర్వజ్ఞులు కారు. ఈ సందర్భంలో సంస్కృతభారతంలో ఈ శ్లోకం ఉంది: "సర్వః సర్వం న జానాతి సర్వజ్ఞో నాస్తి కశ్చన। నైకత్ర పరినిష్ఠాస్తి జ్ఞానస్య పురుషే క్వచిత్॥" నలోపాఖ్యానం 'ఇతివృత్తం'గా ఎన్నితే అది నిరుపమానమైన కథ. అందులో కథాశిల్పం మాత్రమే కాక ఎన్నో అంతరార్థాలు హృదయంగమంగా నిక్షిప్తాలు. నలుడు రథసారథ్యంలో నిపుణుడు. ఋతుపర్ణుడు గణితశాస్త్రప్రవీణుడు.

వ. ఇవ్విభీతకంబున ఫల పర్ణ సముదాయ సంఖ్యఁ జెప్పెద విను; మీ రెండు శాఖలం గల పర్ణ ఫలంబులు పదివేలు నొక్కండు; దక్కిన శాఖలం గల యవి రెండువేలుం దొంబదే; ననిన బాహుకుండు విని 'వీని నెన్నికాని నిశ్చయింప నేర' నని తన రథంబు నిలిపి యా వృక్షం బాక్షణంబ యురలం ద్రోచి యయ్యై శాఖలం గల యాకులు పండులు నెన్నిన ఋతుపర్ణుండు సెప్పినయన్ని యయిన నచ్చెరువడి, 'యివ్విద్య నాకు నుపదేశింపవలయు' నని యడిగిన ఋతుపర్ణుం డిట్లనియె. 173

ప్రతిపదార్థం: ఈ+విభీతకంబునన్= ఈ తాండ్రచెట్టులో; ఫల, పర్ణ, సముదాయ సంఖ్యన్= పండ్లు, ఆకులు వెరసి మొత్తం సంఖ్యను; చెప్పెదన్= చెపుతాను; విను= వినుము; ఈ రెండు శాఖలన్+కల= ఈ రెండు కొమ్మలలో ఉండే; పర్ణఫలంబులు= ఆకులు, పండ్లు; పదివేలున్+ఒక్కండు= పదివేల ఒకటి; తక్కిన, శాఖలన్+కల+అవి= మిగిలిన కొమ్మలలో కలవి; రెండు వేలున్+తొంబది+ఏను+అనినన్= రెండువేల తొంబయిఅయిదు అని చెప్పగా; బాహుకుండు= బాహుకుడు; విని= ఆలకించి; వీనిన్+ఎన్నికాని= వీటిని లెక్కపెట్టికాని; నిశ్చయింపనేరను+అని= నిర్ణయించజాలనని పల్కి; తన రథంబు, నిలిపి= తన తేరు ఆపి; ఆ వృక్షంబు= ఆ చెట్టును; ఆ క్షణంబు+అ= వెంటనే; ఉరలన్+త్రోచి= క్రింద పడేట్లు త్రోసి; అయ్యై,

శాఖలన్+కల= ఆయా కొమ్మలలో ఉండే; ఆకులు, పండులున్; ఎన్నినన్= లెక్కపెట్టగా; ఋతుపర్ణుండు; చెప్పిన+ అన్ని+ అయినన్= చెప్పినట్లే అన్నియేఉండగా; అచ్చెరువు+పడి= ఆశ్చర్యం పొంది; ఈ+విద్య; నాకున్= నాకు కూడ; ఉపదేశింప వలయును+అని; అడిగినన్= అర్థించగా; ఋతుపర్ణుండు= ఋతుపర్ణుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విభీతకవృక్షంలో ఉండే పండ్లు, ఆకులు మొత్తం లెక్కచెప్పుతాను వినండి. ఈ రెండు కొమ్మలలోను గల ఆకులు, పండ్లు కలిసి పదివేల ఒకటి. తక్కిన కొమ్మలలో కలవి రెండువేల తొంబయిఅయిదు'. అప్పుడు బాహుకుడు వీటిని లెక్కపెట్టితే కాని నిజమని నిశ్చయించజాలనని పలికి, తన రథాన్ని ఆపి, అ క్షణమే ఆ వృక్షాన్ని క్రింద పడద్రోసి ఆయా కొమ్మలలో ఉండే ఆకులు, పండ్లు లెక్కపెట్టగా, ఋతుపర్ణుడు చెప్పిన సంఖ్యలతో సరిపోయాయి. బాహుకుడు ఋతుపర్ణుడి ప్రజ్ఞకు ఆశ్చర్యపోయి ఆ విద్యను తనకు ఉపదేశించుమని ప్రార్థించాడు. అంత అతడికి ఋతుపర్ణుడు ఈ విధంగా చెప్పాడు.

క. 'ఇది యక్షహృదయ మనఁగా।
విదితం బగు విద్య; దీని విధ్యుక్తముగా
మది నెఱుఁగు నరుఁడు సంఖ్యా।
విదుఁ డగు దుష్కృతకళంకవిషముక్తుఁ డగున్. 174

ప్రతిపదార్థం: ఇది= ఈ ప్రజ్ఞ; అక్ష హృదయము; అనన్+కాన్= అని చెప్పబడుతూ; విదితంబు+అగు, విద్య= తెలియబడినదైన జ్ఞాననైపుణ్యం; దీనిన్= ఈ విద్యను; విధి+ఉక్తముగా= విధులందు చెప్పబడినట్లుగా (అంటే శాస్త్రసూత్రవిధులలో నిర్దేశించబడినట్లుగా); మదిన్= మనస్సులో; ఎఱుఁగు నరుఁడు= తెలిసే మనుజుడు; సంఖ్యావిదుఁడు+అగు= సంఖ్యల ఆంతర్యం తెలిసినవాడు అవుతాడు; దుష్కృత, కళంక, విషముక్తుఁడు+అగున్= పాపాలనుండి, చెడుగుణాలనుండి, విషాలనుండి తొలగినవాడు అవుతాడు.

తాత్పర్యం: 'ఇది అక్షహృదయం అని ప్రసిద్ధికెక్కిన విద్య. దీన్ని శాస్త్రీయంగా అభ్యసించిన మనుజుడు సంఖ్యావేత్త అవుతాడు. అతడు పాపాలనుండి, దుర్గుణాలనుండి, విషంనుండి విముక్తి పొందుతాడు.

చ. సకలగుణప్రసిద్ధుఁ డగు సర్వహితుం డగుఁ జూవె!' యంచు బా
హుకునకుఁ బ్రీతితోడ విధియుక్తముగా నుపదేశ మిచ్చె న
త్యకుటిలబుద్ధి నక్షహృదయంబుఁ గరంబు రయంబుతో విద
ర్భకుఁ జను వేడ్కఁజేసి ఋతుపర్ణుఁడు పూర్ణమనఃప్రసన్నుఁడై. 175

ప్రతిపదార్థం: సకల, గుణ, ప్రసిద్ధుఁడు+అగు= అన్ని మంచి లక్షణాలు కలవాడయి; సర్వహితుండు+అగున్+చూవె, అంచున్= అందరికిని మేలు చేకూర్చేవాడు అవుతాడు సుమా అంటూ; అతి+అకుటిల, బుద్ధిన్= మిక్కిలి వంకరకాని మనస్సుతో అంటే సరళమైన బుద్ధితో; కరంబు= మిక్కిలి; రయంబుతోన్= త్వరగా; విదర్భకున్+చను= విదర్భకు పోయే; వేడ్కన్+చేసి= కుతూహలం చేత; ఋతుపర్ణుఁడు; పూర్ణ, మనస్+ప్రసన్నుఁడు+ఐ= నిండు మనస్సుతో అనుకూలుడై; అక్షహృదయంబున్= అక్షహృదయం అనే గణితవిద్యను; ప్రీతితోడన్= సంతోషంతో; బాహుకునకున్; విధియుక్తముగాన్= శాస్త్రీయంగా; ఉపదేశము+ఇచ్చెన్= ప్రబోధం చేశాడు.

తాత్పర్యం: 'ఈ విద్యను పొందిన వ్యక్తి సకల గుణప్రసిద్ధుడై, విశ్వశ్రేయస్సును ఒనగూర్చేవాడు కాగలడు సుమా!' అని అంటూ ఋతుపర్ణమహారాజు మిక్కిలి ప్రసన్నుడై, నిండు హృదయంతో, త్వరితంగా విదర్భకు వెళ్ళవలెననే కుతూహలంతో, సంప్రీతితో బాహుకుడికి అక్షహృదయం అనే గణితవిద్యను శాస్త్రీయంగా ఉపదేశించాడు.

విశేషం: ఇందులో విద్యయొక్క పరమార్థం వివరించబడింది. విశ్వశ్రేయం, సర్వగుణ పరిపూర్ణమైన యశస్సు- విద్యాదర్శాలు. విద్య శాస్త్రీయంగా ఉపదేశించబడాలి. గురువుకు ఉండవలసిన లక్షణాలు: కౌటిల్యం ఏ మాత్రం లేని సరళబుద్ధి, శిష్యుడిపై వాత్సల్యం.

వ. ఇట్లు నలుండు ఋతుపర్ణువలన నక్షహృదయంబు వడసి సంతుష్టుండై 'నీకు నశ్వహృదయం బిచ్చెదఁ బరిగ్రహింపు' మనిన ఋతుపర్ణుం 'డట్ల చేయుదు, నది యంతకు నీయంద యుండనిమ్ము; నా వలసినప్పుడు గొందు' ననియె; నంత నయ్యక్షహృదయ సామర్థ్యంబున నప్పుడు. 176

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ రీతిగా; నలుండు; ఋతుపర్ణువలనన్= ఋతుపర్ణుడినుండి; అక్షహృదయంబు= అక్షహృదయం అనే విద్య; పడసి= పొంది; సంతుష్టుండు+ఐ= తనివిచెందినవాడై; నీకున్; అశ్వహృదయంబు= అశ్వహృదయమనే విద్యను; ఇచ్చెదన్= ఉపదేశిస్తాను; పరిగ్రహింపుము= పుచ్చుకొనుము; అనినన్= అని చెప్పగా; ఋతుపర్ణుండు; అట్ల, చేయుదున్= ఆ రీతిగానే చేయగలను; అది= ఆ విద్య; అంతకున్= అంతవరకు, అంటే నేను పరిగ్రహించేవరకు; నీయందు+అ= నీ ఒద్దనే; ఉండనిమ్ము= ఉంచుము; నా వలసినప్పుడు= నాకు కావలసినప్పుడు; కొందున్= గ్రహించగలను; అనియెన్= అని చెప్పాడు; అంతన్= అటుపిమ్మట; ఆ+అక్షహృదయ, సామర్థ్యంబునన్= ఆ అక్షహృదయవిద్యయొక్క శక్తివలన; అప్పుడు.

తాత్పర్యం: ఈ విధంగా నలుడు ఋతుపర్ణుడివలన అక్షహృదయవిద్య సంపాదించి మిక్కిలి సంతృప్తి చెందాడు. అంత బాహుకుడు ఋతుపర్ణుడితో 'నీకు అశ్వహృదయాన్ని ఉపదేశిస్తాను; పరిగ్రహించు' మని చెప్పగా ఋతుపర్ణుడు 'అట్లే పరిగ్రహిస్తాను. ఆ విద్య అంతవరకు నీ దగ్గరే ఉండనిమ్ము. నాకు అవసరమైనపుడు స్వీకరిస్తాను' - అని బదులు పలికాడు. పిదప ఆ అక్షహృదయమనే విద్యామహిమవలన అప్పుడు.

నలుండు గలిచేత విముక్తుం డయి విదర్భకుఁ బోవుట (సం. 3-72-7)

క. నలుఁ దొల్లి యాక్రమించిన।
కలి గర్కోటకవిషంబు గ్రక్కుచు నొడలన్
వెలువడి, నలునకు విహితాం।
జలియై త న్నెఱుఁగఁ జెప్పెఁ జంచలుఁ డగుచున్. 177

ప్రతిపదార్థం: నలున్= నలుడిని; తొల్లి= మునుపు; ఆక్రమించిన= ఆవహించిన; కలి= కలిపురుషుడు; ఒడలన్= శరీరం నుండి; కర్కోటక, విషంబు, క్రక్కుచు; వెలువడి= బయటకు వచ్చి; నలునకు, విహిత+అంజలి+ఐ= నలుడికి నమస్కరించినవాడై; చంచలుఁడు+అగుచున్= వణుకుతూ; తన్ను+ఎఱుఁగన్+చెప్పెన్= తనను తెలియజేసికొంటూ మాట్లాడాడు.

తాత్పర్యం: మునుపు నలుడిని ఆవహించిన కలిపురుషుడు కర్కోటకుడి విషాన్ని క్రక్కుతూ, నలుడిశరీరంనుండి బయటకు వచ్చి, అతడికి నమస్కరించి, గజగజ వణికిపోతూ తనను తెలియజేసికొన్నాడు.

ఆ. వానిఁ జూచి నలుఁడు దా నల్గి శాప మీ।
నున్నఁ, గలి యెఱింగి 'నిన్నుఁబొంది
యహివిషంబుచేత ననిశంబు దగ్ధుండ।
నైతి; నింక నాకు నలుగ వలదు.' 178

ప్రతిపదార్థం: వానిన్= ఆ కలిని; చూచి= కాంచి; నలుఁడు= నలుడు; తాను+అల్గి= తాను కోపించి; శాపము+ఈన్+ఉన్నన్= శాపం ఇవ్వటానికి సిద్ధంగా ఉండటాన్ని; కలి= కలిపురుషుడు; ఎఱింగి= తెలిసికొని; నిన్నున్+పొంది= నిన్ను ఆవహించి; అహి, విషంబుచేతన్= పాముయొక్క విషంచేత; అనిశంబు= ఎల్లప్పుడు; దగ్ధుండన్+ఐతిన్= తగులబడిపోయాను; ఇంక= ఇక; నాకున్+అలుగ, వలదు= నామీద ఆగ్రహించవలదు.

తాత్పర్యం: ఆ కలిపురుషుడిని చూచి నలుడు కోపించి, అతడిని శపించటానికి సంసిద్ధుడయ్యాడు. ఆ సంగతి తెలిసికొని కలి 'నిన్ను ఆవహించటంచేత ఎల్లప్పుడు కర్కోటకవిషంచేత తగులబడిపోయాను. ఇంక వేరే దండన ఎందుకు? దయచేసి నాపై ఆగ్రహం విడువుము'.

వ. 'నిన్నును నీ చెలువను గీర్తించిన జనంబులు నావలని భయంబు బొరయరు; నాకుం గరుణింపు' మనిన నలుండు గోపం బుడిగెఁ; గలియు

నవ్విభీతకవృక్షంబు నాశ్రయించె; నది మొదలుగా విభీతకం బప్రశస్తం బయ్యెఁ; నట్లు నలుండు వికృత రూప మాత్రంబు దక్కఁ దక్కిన దుష్కృతం బులవలన విముక్తుండై రథం బెక్కి యతివేగంబున ఋతుపర్ణ వార్‌ష్ణేయ సహితుండై విదర్భకుం జనియె; నంత సాయాహ్నంబున. 179

ప్రతిపదార్థం: నిన్నును, నీ చెలువను= నిన్నును మరియు నీ భార్య అయిన దమయంతిని; కీర్తించిన జనంబులు= కొనియాడిన ప్రజలు; నావలని భయంబు= నా మూలంగా ఏర్పడే భయాన్ని; పొరయరు= పొందరు (అంటే నలదమయంతులను కీర్తించిన వారు కలిదోషవిముక్తులు అవుతారు); నాకున్+కరుణింపుము+అనినన్= నాపట్ల దయ చూపుము అని అడుగగా; నలుండు, కోపంబు+ఉడిగెన్= నలుడు ఆగ్రహాన్ని వీడాడు; కలియున్= ఆ కలిపురుషుడున్నూ; ఆ+విభీతకవృక్షంబున్= ఆ విభీతకమనే చెట్టును; ఆశ్రయించెన్= ఆవహించాడు; అది, మొదలుగా= అప్పటినుండి; విభీతకంబు= విభీతకవృక్షం; అప్రశస్తంబు+అయ్యెన్= దుష్టమైనదిగా ఎన్నబడింది; అట్లు= ఆ విధంగా; నలుండు= నలుడు; వికృత, రూప, మాత్రంబున్+తక్క= వికారమైన ఆకృతిమాత్రం తప్ప; తక్కిన= మిగిలిన; దుష్కృతంబులవలన= పాపాలనుండి; విముక్తుండు+ఐ= ముక్తిచెందిన వాడై; రథంబు+ఎక్కి= తేరెక్కి; అతి వేగంబునన్= మిక్కుటమైన రయంతో; ఋతుపర్ణ, వార్‌ష్ణేయ, సహితుండు+ఐ= ఋతుపర్ణుడితో, వార్‌ష్ణేయుడితో కూడినవాడై; విదర్భకున్+చనియెన్= విదర్భకు వెళ్ళాడు; అంతన్= అటుపిమ్మట; సాయ+అహ్నంబున= ప్రొద్దు క్రుంకేవేళ.

తాత్పర్యం: 'నిన్నూ, నీ భార్య అయిన దమయంతినీ ధ్యానించినవారు నావలన భీతిని పొందరు (అంటే కలిదోషవిముక్తులు అవుతారు). దయచేసి నన్ను క్షమించి నామీద కోపం విడువుము'- అని కలిపురుషుడు ప్రార్థించగా నలుడు ఆగ్రహం విడిచాడు. కలి అంతట విభీతకవృక్షాన్ని ఆవహించాడు. ఆనాటినుండి విభీతకవృక్షం మంచిది కాదనే భావం విస్తరించింది. అట్లా

నలుడు వికృతమైన ఆకృతి వినా తదితర పాపాలనుండి విముక్తుడై రథాన్నెక్కి మిగులవేగంతో ఋతుపర్ణ వార్ష్ణేయులతో కలిసి విదర్భకు వెళ్ళాడు. అంత ప్రొద్దుక్రుంకేవేళ.

క. మానుగ ఋతుపర్ణుఁడు భీ।
మానుజ్ఞాతుఁడయి చొచ్చె నా ప్రోలు రథ
ధ్వానంబు మ్రోయుచుండఁగ।
నానాదిఙ్ముఖములను ఘనధ్వనివోలెన్. 180

ప్రతిపదార్థం: మానుగన్= ఒప్పునట్లుగా, అంటే వైభవోపేతంగా; ఋతుపర్ణుఁడు= ఋతుపర్ణమహారాజు; భీమ+అను జ్ఞాతుఁడు+అయి= భీముడిచే అనుమతించబడినవాడై; రథధ్వానంబు= తేరుయొక్క చప్పుడు; నానాదిక్+ముఖములను= దిగ్దిగంతరాలలో; ఘనధ్వని+పోలెన్= మేఘగర్జనలవలె; మ్రోయుచుండఁగ= నినదిస్తుండగా; ఆ, ప్రోలు= ఆ నగరాన్ని; చొచ్చెన్= ప్రవేశించాడు.

తాత్పర్యం: ఋతుపర్ణుడు, భీమరాజు అనుమతితో వైభవోపేతంగా విదర్భాపురిలో ప్రవేశించాడు. ఆతడు పురప్రవేశం చేస్తుంటే ఆతడి రథఘోష దిగ్దిగంతరాలలో మేఘగర్జనవలె ప్రతిధ్వనించింది.

సీ. దమయంతి యా రథధ్వని విని, యిది నలు।
రథఘోష మని యనురాగ మొంది,
'నలు నిషధేశుఁ బుణ్యశ్లోకు లోకోప।
కారకుఁ జూడంగఁ గాంతు నేఁడు;
ఘనభుజుఁ జూడంగఁ గాననినాఁడుఁ ద।
ద్భుజ పరిరంభణోద్భూత సుఖముఁ
బడయని నాఁడును బ్రాణముల్ విడుతు నే'।
నని తలంచుచుఁగమలాయతాక్షి

ఆ. యా రథాధిరూఢుఁడై వచ్చు ఋతుపర్ణుఁ।
జూచి యప్పు డధికశోకతప్త
యగుచు నుండె; నంత నా ఋతుపర్ణుండు।
భీముఁ గాన వచ్చెఁ బ్రియముతోడ. 181

ప్రతిపదార్థం: దమయంతి; ఆ, రథ, ధ్వని, విని= ఆ తేరు మ్రోత ఆలకించి; ఇది; నలు, రథ, ఘోషము+అని= నలుడి రథధ్వనియే అని; అనురాగము+ఒంది= ప్రేమ ఏర్పడి; నలున్= నలుడిని; నిషధ+ఈశున్= నిషధరాజును; పుణ్యశ్లోకున్= పవిత్రమైన చరిత్ర కలవాడిని; లోక+ఉపకారకున్= లోకానికి శ్రేయస్సును ఒనగూర్చేవాడిని; నేఁడు= ఈ దినం; చూడంగన్+కాంతున్= దర్శించగలను; ఘనభుజున్= గొప్ప భుజాలు కలవాడిని- అంటే పరాక్రమవంతుడిని; చూడంగన్+కానని, నాఁడు= చూడలేకపోయిన దినాన; తద్+భుజ, పరిరంభణ+ఉద్భూత, సుఖమున్+పడయని నాఁడును= ఆతడి యొక్క భుజాలవలన ఏర్పడిన కౌగిలినుండి కలిగిన సౌఖ్యం పొందనివేళ; ప్రాణముల్, విడుతును+ఏను+అని= ప్రాణాలను విడిచి పెట్టుతానని తలస్తూ; కమల+ఆయత+అక్షి= పద్మాలను పోలిన సోగకన్నులు కల దమయంతి; ఆ, రథ+ ఆరూఢుఁడు+ఐ= ఆ తేరును ఎక్కి; వచ్చు= వస్తున్న; ఋతుపర్ణున్+చూచి= ఋతుపర్ణుడిని చూచి; అప్పుడు; అధిక, శోక, తప్త= మిక్కుటమైన శోకంతో ఉడికినట్టిది; అగుచున్+ఉండెన్= అవుతున్నది; అంతన్= అంతట; ఆ, ఋతుపర్ణుండు; ప్రియముతోడన్= ప్రీతితో; భీమున్= భీమరాజును; కానవచ్చెన్= చూడవచ్చాడు.

తాత్పర్యం: దమయంతి ఆ రథఘోష వినగానే అది నలుడి రథమని గుర్తుపట్టి అనురక్తి చెందింది. నిషధేశుడు, విశ్వజనీనచరితుడు, పుణ్యశ్లోకుడు, లోకోపకారి, పరాక్రమోపేతుడు అయిన నలుడిని నేడు చూడగలుగుతానని మిక్కిలి సంతోషించింది. ఆతడిని చూడనినాడు, ఆతడి కౌగిలిలో తిరిగి

సుఖం అనుభవించనినాడు ప్రాణాలను విడిచిపెట్టుతానని తలపోసి, పద్మాలవంటి సోగకన్నులతో రథంరాకకై నిరీక్షించింది. ఆ రథంపై ఆసీనుడై కనిపించింది ఋతుపర్ణుడు. అతడిని చూచి దమయంతి మిక్కుటమైన శోకవేదనలో మునిగింది. ఋతుపర్ణుడు ప్రీతితో భీమరాజును సందర్శించటానికి వచ్చాడు.

వ. భీముండును వానిం బూజించి యొక్క రమ్యహర్మ్యంబున విడియించిన, ఋతుపర్ణుం డప్పురంబున స్వయంవరం బను శబ్దంబు మొదలుగా వినం గానక యాత్మగతంబున. 182

ప్రతిపదార్థం: భీముండును= భీమరాజును; వానిన్= ఆతడిని, ఆ ఋతుపర్ణ మహారాజును; పూజించి= అర్చించి, ఒక్క=ఒక; రమ్యహర్మ్యంబునన్= అందమైన మేడలో; విడియించినన్= విడిది ఏర్పాటుచేయించగా; ఋతుపర్ణుండు; ఆ+ పురంబునన్= ఆ పట్టణంలో; స్వయంవరంబు= స్వయంవరం; అను, శబ్దంబు= అనే మాట; మొదలుగా, వినన్+కానక= మొదలైన శబ్దాలు వినిపించనందువలన; ఆత్మగతంబునన్= తనలో తాను.

తాత్పర్యం: ఆ ఋతుపర్ణుడికి అతిథిసత్కారాలు చేసి భీమరాజు రమణీయమైన ఒక పెద్దమేడలో అతడికి విడిది ఏర్పాటు చేశాడు. కాని ఆ పురంలో స్వయంవరం అనే శబ్దంగాని, స్వయంవరానికి సంబంధించిన సందడిగాని వినరాక ఋతుపర్ణుడు తనలో తాను (ఇట్లా తలపోశాడు).

క. 'ధరణిఁ గల రాజు లిట యె।
వ్వరు వచ్చినవారు లేరు; వైదర్భి యొరున్
వరియించు నంత ధర్మే।
తరచరితయె?' యనుచు నుండెఁ దద్దయు లజ్జన్. 183

ప్రతిపదార్థం: ధరణిన్+కల, రాజులు= భూమిపై కల ప్రభువులు; ఇట= ఇటు; ఎవ్వరు, వచ్చినవారు, లేరు= వచ్చినవారు ఎవరున్నూ లేరు; వైదర్భి= విదర్భరాజపుత్రిక అయిన దమయంతి; ఒరున్= ఇంకొకరిని; వరియించు+అంత= భర్తగా ఎన్నుకొనేంతటి; ధర్మ+ఇతర, చరితయె= ధర్మ బాహ్యమైన నడవడి కలదా?; అనుచున్= అని తలపోస్తూ; తద్దయు= మిక్కిలి; లజ్జన్= సిగ్గుతో; ఉండెన్= ఉన్నాడు.

తాత్పర్యం: 'భూమండలంలోని రాజులు ఎవరున్నూ ఇక్కడికి రాలేదు. విదర్భరాజపుత్రిక అయిన దమయంతి ఇంకొక మగని వరించేటంత అధర్మప్రవర్తన కలదా?'- అని తలపోస్తూ ఋతుపర్ణుడు మిక్కుటమయిన సిగ్గుతో ఉండిపోయాడు.

వ. బాహుకుండును రథశాల రథాశ్వంబుల బంధించి రథసమీపంబున విశ్రమించియుండె; నంత దమయంతి బాహుక వార్ష్ణేయులతోడ వచ్చిన ఋతుపర్ణుం జూచి విఫలమనోరథయై, యుండనోపక, కేశిని యను దానిం బిలిచి 'ఋతుపర్ణు నయోధ్యాపతింగా వార్ష్ణేయు సూతపుత్త్రుంగా నెఱింగితి; బాహుకుం డను వాఁ డెవ్వండో? వానియందు నా హృదయంబు ముదితం బగుచున్నయది; మన పర్ణాదునకుఁ బ్రతివచనం బిచ్చినవాఁడు వాఁడ కావలయు; వానికడకుం బోయి యెఱింగి ర' మ్మని పంచిన, నదియును బోయి బాహుకుం, గని 'దమయంతి నీ కుశలం బడుగఁ బుత్తెంచె; నిందుల కేమి కారణంబున వచ్చి?' తనిన దానికి బాహుకుం డిట్లనియె. 184

ప్రతిపదార్థం: బాహుకుండును= బాహుకుడును; రథశాల= రథాల చావడిలో; రథ+ అశ్వంబుల= రథాలకు పూన్చిన గుఱ్ఱాలను; బంధించి= కట్టి; రథ సమీపంబున= రథానికి దగ్గరగా; విశ్రమించి+ఉండెన్= సేదదీరుతూ ఉండినాడు; అంతన్= అంతట; దమయంతి; బాహుక, వార్ష్ణేయులతోడ, వచ్చిన= బాహుకుడితో వార్ష్ణేయుడితోపాటు వచ్చిన; ఋతుపర్ణున్+చూచి= ఋతుపర్ణుడిని చూచి; విఫలమనోరథ+ఐ= ఫలించని కోరిక కలదై;

ఉండన్+ఓపక= ఉండజాలక; కేశిని+అనుదానిన్+పిలిచి= కేశిని అనే దాసిని పిలిచి; ఋతుపర్ణున్= ఋతుపర్ణుడిని; అయోధ్యాపతిన్+కా= అయోధ్యకు రాజుగా; వార్ష్ణేయు= వార్ష్ణేయుడిని; సూతపుత్త్రుంగాన్= సూతుడి కొడుకైన రథ సారథిగా; ఎఱింగితి= తెలిసికొంటిని; బాహుకుండు+అనువాఁడు= బాహుకుడనేవాడు; ఎవ్వండో= ఎవడై ఉంటాడో; వానియందు= ఆ బాహుకుడి పట్ల; నా, హృదయంబు= నా డెందం; ముదితంబు+ అగుచున్న+అది= సంతోషాన్ని పొందుతున్నది; మన, పర్ణాదునకు= మనం అయోధ్యకు పంపిన పర్ణాదుడనే బ్రాహ్మణుడికి; ప్రతివచనంబు+ ఇచ్చినవాఁడు= ఎదురు సమాధానం చెప్పినవాడు; వాఁడు+అ= కావలయు= ఆతడే కావచ్చును; వాని, కడకున్+పోయి= అతడివద్దకు వెళ్ళి; ఎఱింగి రమ్ము+అని= తెలిసికొని రమ్మని; పంచినన్= నియోగించగా; అదియును= ఆ కేశినియు; పోయి= వెళ్ళి; బాహుకున్+కని= బాహుకుడిని చూచి; దమయంతి; నీ కుశలంబు= నీ క్షేమం; అడుగన్+పుత్తెంచెన్= తెలిసికొమ్మని పంపింది; ఇందులకు= ఇచటికి; ఏమి, కారణం బునన్= ఏ హేతువుచేత; వచ్చితి= అరుగుదెంచావు; అనినన్= అని అడుగగా; దానికి= ఆమెకు; బాహుకుండు= బాహుకుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: బాహుకుడు రథశాలలో తన గుఱ్ఱాలను కట్టి, తాను తన రథసమీపంలో సేదతీర్చుకొంటూ ఉన్నాడు. అంత దమయంతి, బాహుకుడితో వార్ష్ణేయుడితో వచ్చిన ఋతుపర్ణుడిని చూచి ఆశాభంగం పొంది, ఊరక ఉండక, కేశిని అనే దాసిని పిలిచి 'ఋతుపర్ణుడు అయోధ్యకు రాజు. వార్ష్ణేయుడిని సూతపుత్రుడిగా నేను గుర్తు పట్టాను. మఱి బాహుకుడు ఎవడై ఉండవచ్చును? అతడిపట్ల నాహృదయం సంతోషం పొందుతున్నది. మనం అయోధ్యకు పంపిన పర్ణాదుడికి ప్రత్యుత్తరమిచ్చినవాడు అతడే అయి ఉండవచ్చును! అతడి దగ్గరకు వెళ్ళి అతడి సంగతి సమాచారాలు తెలిసికొని రమ్ము' - అని నియోగించింది. కేశిని బాహుకుడి దగ్గరకు వచ్చి 'అయ్యా! దమయంతి నీ యోగక్షేమాలను అరసి రమ్మని నన్ను పుత్తెంచింది. ఇచటికి

మీరు ఎందుకు వచ్చారు?' - అని అడుగగా ఆమెకు బాహుకుడు ఇట్లా బదులు పలికాడు.

క. 'ప్రియమున దమయంతి పున।
స్స్వయంవరము సేయఁ గడఁగి సకలక్షత్త్రా
న్వయవీరుల రావించిన।
నయనిధి ఋతుపర్ణుఁ డొక్కనాఁటన వేడ్కన్. 185

ప్రతిపదార్థం: ప్రియమునన్= ప్రీతితో; దమయంతి= దమయంతికి; పునః +స్వయంవరము, చేయన్+కడఁగి= తిరిగి స్వయంవరం చేయటానికి పూని; సకల, క్షత్త్ర+అన్వయ, వీరులన్, రావించిన= సమస్త క్షత్రియ వంశాలలోని వీరులను ఆహ్వానించగా; నయనిధి= నీతికి నిధివంటివాడు, అంటే రాజనీతిపరిజ్ఞానం ఎక్కువగా కలవాడు; ఋతుపర్ణుఁడు; వేడ్కన్= కుతూహలంతో; ఒక్కనాఁటన= ఒక్కదినంలోపలే.

తాత్పర్యం: 'ప్రీతితో దమయంతికి తిరిగి స్వయంవరం సంకల్పించారు కదా! అందుకు అందరు క్షత్రియవీరులను ఆహ్వానించి రప్పించారుకదా! ఆ హేతువుచేత రాజనీతినిధి అయిన మహారాజు ఋతుపర్ణుడు వేడుకతో ఒక్కదినంలోనే.

విశేషం: ఈ పద్యానికి గరిమనాభి 'ఒక్కనాఁటన'= 'ఒక్క దినమందే' అనే పదగుంఫనం. కేశిని బాహుకుడి రాకకు అమాయకురాలివలె కారణం అడిగింది. బాహుకుడుకూడా తనకేమీ తెలియనట్లు ప్రత్యుత్తరం ఇచ్చాడు. అతని మాటలలో గల ఎత్తిపొడుపు గమనించదగినట్టిది.

క. వినవె శతయోజనంబులు।
సనుదెంచె నయోధ్యనుండి సరి నిందుల; కా
తని రథసారథినై యే।
నును వచ్చితి నతనితో మనోవేగమునన్.' 186

ప్రతిపదార్థం: అయోధ్యనుండి; ఇందులకు= ఇక్కడికి; సరిన్= సరిగ్గా; శత యోజనంబులు= నూరామడలు; చనుదెంచెన్= వచ్చాడు; వినవె= వినలేదా? నీవు- అంటే ఋతుపర్ణ మహారాజు ఒక్కదినంలో వంద ఆమడల దూరంలో ఉన్న అయోధ్య నుండి ఇచటికి వచ్చినట్లు నీవు వినలేదా?- అని అర్థం; ఆతని= ఆ ఋతుపర్ణుడి; రథసారథిన్+ఐ= తేరు నడిపే సూతుడినై; అతనితోన్= ఆ ఋతు పర్ణునితో; మనస్+వేగమునన్= మనస్సుతో సరితూగే వేగంతో; ఏనును= నేనుకూడ; వచ్చితిన్= అరుదెంచాను.

తాత్పర్యం: ఋతుపర్ణమహారాజు అయోధ్యనుండి నేరుగా ఇచటికి నూరు ఆమడల మేర ఒక దినంలో వచ్చి చేరిన సంగతి నీవు వినలేదా? ఆతడి రథసారథిని నేను. నేనుగూడ ఆతడితోపాటు మనోవేగంతో వచ్చాను.

విశేషం: ఈ పద్యంలో వాచ్యమైన విషయం- బాహుకుడు ఎవరనే ప్రశ్నకు సమాధానం ఋతుపర్ణుడి సారథి అని; కాని ఇందు ధ్వనించిన అంతరార్థం బాహుకుడు తాను నలుడనని సూచించటం. యావత్ప్రపంచంలో ఒక్కదినంలో నూరు ఆమడల దూరానికి రథాన్ని నడపగలవాడు ఎవడు? నలుడు మాత్రమే. ఆ విషయం దమయంతికి అవగతపూర్వమైన భూతార్థం.

వ. అనిన 'మూఁడవవాఁ డెవ్వఁ?' డని యడిగిన, నక్కేశినికి బాహుకుం డిట్లనియె. 187

ప్రతిపదార్థం: అనినన్= అని చెప్పగా; (కేశిని) మూఁడవవాఁడు= మూడవవ్యక్తి; ఎవ్వఁడు+అనినన్= ఎవడని అడుగగా; ఆ+కేశినికి= కేశిని అనే దానికి; బాహుకుండు= బాహుకుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని చెప్పగా విని, కేశిని 'మూడవవ్యక్తి ఎవరు?' అని అడిగింది. ఆ కేశినికి బాహుకుడు ఇట్లా సమాధానం చెప్పాడు.

క. 'నలు రథచోదకుఁ; డతఁ డ ।
త్యలఘుఁడు వార్ష్ణేయ నాముఁ' డనవుడు వాఁడ

న్నలభూపాలకు పోయిన ।
వల నెఱుఁగఁడొక్కొ!' యనిన వాఁ డిట్లనియెన్. 188

ప్రతిపదార్థం: అతఁడు, నలు, రథచోదకుఁడు= నలుడి రథసారథి; అతి+ అలఘుఁడు= మిక్కిలి తేలికగానివాడు- అంటే ఎక్కువ గౌరవించతగినవాడు; వార్ష్ణేయ, నాముఁడు= వార్ష్ణేయుడనే పేరు కలవాడు; అనవుడు= అని చెప్పగా; వాఁడు= అతడు; (ఆ వార్ష్ణేయుడు); ఆ+నల, భూపాలకు, పోయిన వలను= నలమహారాజు వెళ్ళినచోటును; ఎఱుఁగండు+ఒక్కొ= తెలియజాలడా ఏమి?; అనినన్= అని అడుగగా; వాఁడు= ఆ బాహుకుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: 'అతడు (ఆ మూడవవ్యక్తి) ఒకానొకనాడు నలుడి రథసారథి. ఆతడి పేరు వార్ష్ణేయుడు. గౌరవించదగిన వ్యక్తిత్వం కలవాడు' అని బాహుకుడు చెప్పగా విని కేశిని 'అయితే ఆ వార్ష్ణేయుడికి నలుడిజాడ తెలయకుంటుందా?' అని ఎదురుప్రశ్న వేసింది. అప్పుడు బాహుకుడు ఇట్లా పలికాడు.

వ. 'వార్ష్ణేయుండును నలుపుత్త్రుల విదర్భేశ్వరునొద్దఁ బెట్టిపోయి, నడుమ నలురాజ్యభ్రంశంబు విని ఋతుపర్ణుం గొలిచి యుండె; నాతండును నలు నెఱుంగఁడు. 189

ప్రతిపదార్థం: వార్ష్ణేయుండును; నలుపుత్త్రులన్= నలుడి బిడ్డలను; విదర్భేశ్వరు+ ఒద్దన్+ పెట్టిపోయి= విదర్భరాజుకడపెట్టినుతిరిగి వెళ్ళేటప్పుడు; నడుమన్= మార్గమధ్యంలో; నలు, రాజ్య, భ్రంశంబు= నలుడి రాజ్యం పోవటం; విని= తెలిసికొని(ఆకర్ణించి); ఋతుపర్ణున్+కొలిచి+ ఉండెన్= ఋతుపర్ణుడి కొలువులో కుదురుకొన్నాడు; ఆతండును= ఆ వార్ష్ణేయుడును; నలున్+ఎఱుంగఁడు= నలుడిని ఎఱుగడు, అంటే నలుడి జాడలు, ఉనికిపట్టులు అతడికి కూడ తెలియవు అన్నమాట.

తాత్పర్యం: 'వార్ష్ణేయుడు నిషధనుండి నలుడి బిడ్డలను విదర్భకు తీసికొనిపోయి అచట విదర్భరాజుదగ్గర వదలిపెట్టి, తాను వెనుదిరిగిపోతూ, మార్గమధ్యంలో నలుడు రాజ్యాన్ని జూదంలో కోల్పోయిన వార్త తెలిసికొని ఋతుపర్ణుడి కొలువులో చేరాడు. అందువలన వార్ష్ణేయుడికి కూడ నలుడి ఉనికిపట్టులు తెలియవు.

క. **నలుతో నొక్కట నరిగిన ।**
నలినాయతనేత్ర భీమనందన యొండెన్
నలుఁ డొండె నెఱుఁగుఁగా; క ।
న్నలు నొరులకు నెఱుఁగఁ గారణము గలదె మహిన్.' **190**

ప్రతిపదార్థం: నలుతోన్= నలుడితో; ఒక్కటన్+అరిగిన= కలిసి వెళ్ళిన; నలిన+ఆయత, నేత్ర= పద్మాలవలె విశాలమైన కన్నులు కలది; భీమనందన= భీమరాజుగారి కూతురు దమయంతి; ఒండెన్= కాని; నలుఁడు+ఒండెన్= నలమహారాజు కాని; ఎఱుఁగున్, కాక= తెలిసికొని ఉంటారు కాని; ఒరులకున్= తదితరులకు; ఆ+నలున్+ఎఱుఁగన్= నలుడి ఉనికిపట్టులు తెలియటానికి; మహిన్= ఈ భూమిలో; కారణము కలదె= హేతువు ఉన్నదా?

తాత్పర్యం: నలుడి ఉనికిపట్టులు నలుడితోపాటు అడవికి వెళ్ళిన పద్మాలవంటి విశాలనేత్రాలు కలిగిన భీమనందన దమయంతికి తెలియాలి, లేదా ఆ నలుడికే తెలియాలి అంతే కాని, ఇతరులకు తెలియటానికి ఎటువంటి అవకాశాలు లేవుకదా!'

వ. **అనిన విని కేశిని యిట్లనియె.** **191**

తాత్పర్యం: అని చెప్పగా విని, కేశిని ఇట్లా పలికింది.

సీ. **'అడవిలో వస్త్రార్ధహారియై దయలేక ।**
ప్రాణేశ్వరుఁడు దనుఁ బాసి చనిన
నాఁటి వస్త్రార్ధంబు నలినాక్షి యిప్పుడుఁ ।
బరిధానముగఁ బాంసుపటల మలిన

మగుచున్న తనువుతో ననయంబు జడగొన్న ।
యలకావలులతోడ నవనితలము
శయనంబుగా ధర్మచారిణి దమయంతి ।
యనఘవ్రతం బిట్టు లాచరించు

ఆ. **చున్న' దనిన నవిరళోద్గత బాష్పపూ ।**
ర్ణంబు లైన లోచనంబు లెఱుక
వడకయుండ వదనపద్మంబు వాంచి తా ।
నొండువలను సూచుచుండె నలుఁడు. **192**

ప్రతిపదార్థం: అడవిలోన్= వనంలో; వస్త్ర+అర్ధ, హారి+ఐ= సగం చీర హరించినవాడై; దయ, లేక= కనికరం లేక; ప్రాణ+ ఈశ్వరుఁడు= భర్త; తనున్+పాసి= తనను విడిచిపెట్టి; చనిన, నాఁటి, వస్త్రార్ధంబు= వెళ్ళిపోయిన నాటి సగం వస్త్రం; ఇప్పుడున్= నేఁడుకూడా; నలిన+అక్షి= పద్మాలవంటి కన్నులుకల దమయంతి; పరిధానముగన్= కట్టుపుట్టంగా; పాంసు, పటల, మలినము+అగుచున్న, తనువుతోన్= దుమ్ము దూగర చేత మాసిపోతున్న శరీరంతో; అనయంబు= ఎల్లప్పుడు; జడ+కొన్న= చిక్కుముడులు పడిన; అలక+ఆవళులతోడన్= ముంగురుల గుంపుతో; అవనితలము= భూమి పైభాగం; శయనంబుగాన్= పడుకొనేచోటుగా; ధర్మచారిణి= పతివ్రతా ధర్మమున నడిచే దమయంతి; అనఘవ్రతంబు= పాపరహితమైన నోము; ఇట్టులు= ఈ విధంగా, ఆచరించుచున్నది= నెరపుతున్నది; అనినన్= అనిచెప్పగా; అవిరళ+ఉద్గత, బాష్ప, పూర్ణంబులు+ఐన= ఎడతెగకుండ వెల్లువలుగా పైకి ఉబికివస్తున్న కన్నీటిధారలతో నిండినవైన; లోచనంబులు= నేత్రాలు; ఎఱుక, పడక+ఉండన్= తెలియబడకుండ ఉండేటట్లుగా; వదనపద్మంబు= ముఖపద్మం; (పద్మాన్ని పోలిన ముఖం); వాంచి= క్రిందకు వాల్చి; తాను; ఒండు, వలను= వేరొకవైపుకు (దృష్టి మరల్చి); నలుఁడు; చూచుచుండెన్= చూస్తూ ఉండిపోయాడు.

తాత్పర్యం: 'అడవిలో అలనాడు అర్ధాంగి సగంచీరను హరించి కనికరం లేకుండ తనమీదనే ప్రాణాలు పెట్టుకొని తనతోపాటు అడవికి వచ్చిన ఆమెను వీడి, నలుడు వెళ్ళిపోయాడు కదా! నలినాక్షి దమయంతి ఆనాటి సగం చీరనే నేటికీ తనకు కట్టుపుట్టంగా ధరించి ఉన్నది. ఆమెశరీరం దుమ్ముదూగరతో మలినమై ఉన్నది. ఆమె ముంగురులు జడలుగా అల్లుకొనిపోయాయి! భూమిపై పడుకొని ఆమె నిద్రిస్తున్నది. పరమపతివ్రత అయిన దమయంతి ఇంత కఠోరమైన పవిత్రవ్రతం ఆచరిస్తున్నది' అని కేశిని నిందిస్తుంటే నలుడి కన్నులనుండి ఎడతెగని కన్నీటివెల్లువ పెల్లుబికి వచ్చింది. అతడు తన కన్నులు కేశినికి కనిపించకుండ తన వదనపద్మం వంచి వేరొకవైపున చూడసాగాడు.

వ. కేశినియును బాహుకు పలుకులు నాకారంబును దమయంతి కెఱింగించిన, నది యాతని నలుంగా శంకించి 'యింకను వాని కడ కేఁగుము; వాఁడు ఋతుపర్ణు వంటలవాఁడఁటె; పచనసమయంబున వాని చరితం బిమ్ముగా నెఱింగి రమ్మని పంచిన నప్పుడ చని కేశినియు బాహుకునందుల దైవమానుష నిమిత్తాద్భుత క్రియలు సూచి వచ్చి దమయంతి కిట్లనియె. **193**

ప్రతిపదార్థం:కేశినియును= కేశిని కూడ; బాహుకు, పలుకులున్= బాహుకుడి మాటలు; ఆకారంబును= రూపాన్ని; దమయంతికి; ఎఱింగించినన్= తెలుపగా; అది= ఆమె (దమయంతి); ఆతని= ఆ బాహుకుడిని; నలుంగా= నలుడిగా; శంకించి= సందేహించి; ఇంకను= మఱియు; వాని కడకు+ఏఁగుము= ఆతనిఒద్దకు వెళ్ళుము; వాఁడు= అతడు (ఆ బాహుకుడు); ఋతుపర్ణువంటలవాఁడు+అఁటె= ఋతుపర్ణుడి దగ్గర వంటలు చేసేవాడు అని చెపుతారు; పచన సమయంబునన్= వంట చేసేటప్పుడు; వాని, చరితంబు= అతడి ప్రవర్తన; ఇమ్ముగాన్= సంపూర్ణంగా; ఎఱింగి రమ్ము= తెలిసికొని రమ్ము; అని= అని చెప్పి; పంచినన్= నియోగించగా; అప్పుడు+అ= వెనువెంటనే; చని= వెళ్ళి; కేశినియు; బాహుకు+అందుల= బాహుకుడిలోని; దైవ, మానుష, నిమిత్త+అద్భుత, క్రియలు= లోకాతీతమైన, దివ్యాలైన, మనుజ సహజాలైన కారణ విశేషాలు గల ఆశ్చర్యకరాలైన కార్యాలు; చూచివచ్చి= కనుగొని, విచ్చేసి; దమయంతికి= దమయంతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: కేశిని బాహుకుడి మాటలు, రూపం దమయంతికి తెలిపింది. దమయంతి బాహుకుడే నలుడు కావచ్చునని సందేహించి 'ఇంకను ఆతడిని పరీక్షించుము. అతడు ఋతుపర్ణుడి వంటలవాడని చెపుతారు. వంట చేసేటప్పుడు అతడి ప్రవర్తనను సంపూర్ణంగా పరిశీలించి రమ్ము' అని కేశినిని ఆదేశించింది. కేశిని వెంటనే వెళ్ళి తిరిగి వచ్చి బాహుకుడిలో తాను చూచిన లోకాతీతాలు, మనుజసహజాలు అయిన కారణవిశేషాలు గల అద్భుత విషయాలను దమయంతితో ఇట్లా చెప్పింది.

కేశిని యను దూతి దమయంతితో నలుని గుణంబులు సెప్పుట (సం. 3-73-8)

క. 'అతని చరితంబు సెప్పఁగ।
నతిమానుష మపగతప్రయాస మదృష్ట
శ్రుతపూర్వము; పరమార్థమ।
యతనిని వే ల్పనఁగవలయు నంబుజనేత్రా! **194**

ప్రతిపదార్థం: అంబుజ, నేత్రా!= పద్మాలవంటి కన్నులు కలదానా!; అతని, చరితంబు= అతడి ప్రవర్తన (ఆ బాహుకుడి చర్య); చెప్పఁగన్= వర్ణించగా; అతి మానుషము= మనుజ ప్రకృతికి అతీతం, అంటే మానవుల శక్తికి అసాధ్యమైనది; అపగత ప్రయాసము= పోయిన శ్రమకలది (అనాయాసమైనది) సులువుగా అర్థం కానట్టిది; అదృష్టము= పూర్వం చూడబడనిది; అశ్రుత పూర్వము= లోగడ వినబడనిది; పరమ+అర్థము+అ= సత్యమే; అతనిని= ఆ బాహుకుడిని; వేల్పు+ అనఁగవలయున్= దేవతాపురుషుడు అని చెప్పక తప్పదు.

తాత్పర్యం: 'పద్మాలవంటి కన్నులు కలదానా! ఆ బాహుకుడి చర్య వర్ణనాతీతం; అతడి శక్తి లోకోత్తరం, మానవాతీతం, ప్రయాస లేనిది; పూర్వం ఇటువంటిది జరిగినట్లుగా ఎవరు చూడలేదు; పూర్వం ఇటువంటిది జరిగినట్లు చెప్పగా ఎవరు వినలేదు; అయినప్పటికీ పరమసత్యమైనది; అతడిని వేల్పు అని చెప్పక తప్పదు.

సీ. వినవమ్మ! తృణముష్టిఁ గొని వాఁడు వీచుడు ।
నం దగ్ని యుదయించి యతని వంట
లమరునంతకు నింధనము లపేక్షింపక ।
యుడుగక మండుచునుండు; మఱియుఁ
గడఁకతో నంజుళ్ళు గడుగంగ సమకట్టి ।
జల మపేక్షించుడు సంభవిల్లి
కుంభముల్ నిండి దివ్యాంభఃప్రవాహ మ ।
క్షయ మగుచుండుఁ దత్క్షణమ చూడ;

ఆ. నతని కరతలద్వయావమర్దితములై ।
కందియును మహాసుగంధకుసుమ
తతులు దొంటియట్ల తమకంపు విడువక ।
యుండు; నతని తేజ మున్నతంబు.' 195

ప్రతిపదార్థం:వినవమ్మ= అమ్మా దమయంతీ! వినుము; తృణముష్టిన్+కొని= గడ్డితో కూడిన పిడికిలి పూని; వాఁడు= ఆ బాహుకుడు; వీచుడున్= వీచటంతోనే; అందు= అచట; అగ్ని= నిప్పు; ఉదయించి= ఉద్భవించి; అతని, వంటలు+అమరునంతకున్= అతడి వంటలు పూర్తి అయ్యేవరకు; ఇంధనములు= కట్టెలు; అపేక్షింపక= కోరక; ఉడుగక= మానక; మండుచున్+ఉండున్= ప్రజ్వలిస్తూ ఉంటుంది; మఱియున్= ఇంకా; కడఁకతోన్= పూనికతో; నంజుళ్ళు= మాంసాలు; కడుగంగ, సమకట్టి= కడగటానికి

పూనుకొని; జలము+అపేక్షించుడు= నీరు కావాలని అనుకొనగానే; సంభవిల్లి= పుట్టి; కుంభముల్, నిండి= కడవలు నిండి; దివ్య+అంభస్+ ప్రవాహము= దివ్యమైన నీటివెల్లువ; తత్+క్షణము+అ, చూడ= చూస్తే ఆ క్షణంలోనే; అక్షయము+ అగుచుండున్= తరుగకుండ ఉంటుంది; అతని= అతడియొక్క; కరతల, ద్వయ, అవమర్దితములు+ఐ= రెండు చేతులతో పిసుకబడినట్టివై; కందియును= నలిగి నలుపెక్కినవి అయ్యునూ; మహా, సుగంధ, కుసుమ, తతులు= గొప్ప పరిమళం గల పూలగుత్తులు; తొంటియట్ల= మునుపటివలెనే; తమ; కంపు, విడువక= తమ పరిమళాన్ని కోల్పోవక; ఉండున్= ఉంటాయి; అతని, తేజము= అతడి ప్రకాశం; ఉన్నతంబు= గొప్పది.

తాత్పర్యం: అమ్మా దమయంతీ! ఆ బాహుకుడి అద్భుతచర్యలు వర్ణనాతీతం. వినవమ్మా విను! వివరించి చెపుతాను. అతడు గడ్డితో కూడిన పిడికిలిని వీచితే అచట నిప్పు ఉద్భవించి అతడి వంట పూర్తి అయ్యేవరకు కట్టెలతో నిమిత్తం లేకుండా ఆరిపోకుండా అట్లే మండుతూ ఉంటుంది. అంతేకాక, మాంసాలు కడగాలని అతడు తలపోసిన వెంటనే నీరు ఉద్భవించి కడవలు నిండిపోయి దివ్యమైన నీటివెల్లువ నిండుగా పెల్లుబుకుతూనే ఉంటుంది. అతడి చేతుల రాపిడికి నలిగిపోయిన పువ్వులగుత్తులు కందిపోయినప్పటికీ మునుపటి పరిమళాలను వెదజల్లుతూనే ఉంటాయి. అతడి తేజస్సు చాలా గొప్పది.'

విశేషం: 'కంపు'- అనే శబ్దం నన్నయనాటినుండి ఈనాటివరకు అర్థవిపరిణామానికి లోనయింది. నేడు 'కంపు' అంటే దుర్వాసన అనే వ్యవహారమే ఉన్నది. నన్నయనాడు 'కంపు' అంటే పరిమళం (సువాసన) అని అర్థం. నన్నయనాడు అది, దాని- అనేవి స్త్రీ వాచక సర్వనామాలు. ఆమె, ఆమెయొక్క- అనే అర్థాలలో ప్రయుక్తాలు. నేటి నీచార్థం ఆ శబ్దాలకు ఆనాడు లేదు. ఇంధన నిరపేక్షంగా అగ్ని మండటం, సంకల్పమాత్రంచేతనే నీరు ఏర్పడి కడవలు నిండటం, అక్షయ ధారావాహినిగా నీరు ప్రవహించటం - అవి ఆనాడు వ్యాస

మహర్షి ఎట్లా ఊహించి వ్రాశాడో? 170వ పద్య వ్యాఖ్యానం పరికించ వేడికోలు.

వ. అనిన విని దమయంతి వెండియుఁ గేశినిం బంచి బాహుకు వండిన నంజుళ్ళు తెప్పించి యాస్వాదించి, బాహుకునందు నలు లక్షణంబులు గలుగు టెఱింగియు, నూఱడనోపక వానిపాలికిం గొడుకునుం గూఁతునుం గేశినితోడం బుచ్చిన నక్కుమారులం జూచి. 196

ప్రతిపదార్థం: అనిన, విని= అని కేశిని చెప్పగా; ఆలకించి= విని; దమయంతి= దమయంతి; వెండియున్= మరల; కేశినిన్+పంచి= కేశినిని పుత్తెంచి; బాహుకు వండిన= బాహుకుడు వండిన; నంజుళ్ళు= మాంసాలు; తెప్పించి; ఆస్వాదించి= కొద్దిగా రుచిచూచి; బాహుకునందు= బాహుకుడిలో; నలు, లక్షణంబులు= నలుడి గుణాలు; కలుగుట+ ఎఱింగియు= ఉండటం తెలిసికొనియు; ఊఱడన్+ఓపక= తృప్తి చెందక; వానిపాలికిన్= బాహుకుడి దగ్గరకు; కొడుకునున్+కూఁతునున్= కొడుకును కూతురిని; కేశిని తోడన్+ పుచ్చినన్= కేశినితో పంపగా; ఆ+కుమారులన్+చూచి= ఆ బిడ్డలను చూచి. [ఇక్కడ కుమారుని, కుమార్తెను (కుమారుని) అని రెండు అర్థాలు 'కుమారుల' అనుశబ్దంలో అన్వయింపబడ్డాయి.]

తాత్పర్యం: బాహుకుడి అద్భుత చర్యలను కేశిని దమయంతికి వివరించి చెప్పగా విని, దమయంతి మరల కేశినిని పంపి, బాహుకుడు వండిన మాంసాలు తెప్పించి రుచిచూచి, బాహుకుడిలో నలుడి లక్షణాలు ఉండటం గమనించింది. అంతటితో తృప్తి చెందక, ఆతడి దగ్గరకు కేశినిని తోడిచ్చి తన కొడుకును కూతురును పంపించింది. ఆ బిడ్డల్ని చూచి-

ఆ. వశము గాక బాష్పవారి యొల్కుచు నుండఁ।
గొడుకుఁ గూఁతు నెత్తికొని నలుండు
హర్షపులకితంబు లయిన నిజాంకంబు।
లందు వారి నునిచి యాదరమున. 197

ప్రతిపదార్థం: నలుండు; వశము+కాక= తన వశం తప్పి; బాష్పవారి= కన్నీరు; ఒల్కుచున్+ఉండన్= కారుతుంటే; కొడుకున్+కూఁతున్+ఎత్తికొని= కుమారుడిని, కుమార్తెను గారాబంతో ఎత్తుకొని; హర్షపులకితంబులు+ అయిన= సంతోషంతో గగుర్పాటు చెందినవైన; నిజ+అంకంబులందున్= తన ఒడులలో; వారిన్= ఆ బిడ్డలను; ఉనిచి= పెట్టుకొని; ఆదరమునన్= ప్రీతితో.

తాత్పర్యం: తన వశం తప్పి కన్నీరు కారుతుండగా నలుడు, కొడుకును కూతురిని వాత్సల్యంతో ఎత్తుకొన్నాడు; సంతోషంతో గగురుపాటు పొందిన తన ఒడులలో వారిని ఉంచుకొని ఆదరించాడు.

వ. అక్కేశినిం జూచి 'యిక్కుమారు లిద్దఱు నా కొడుకునుం గూఁతునుం బోలిన వీరి నెత్తికొని దుఃఖించితి' నని తన్నేర్పడకుండం బలికి దాని కిట్లనియె. 198

ప్రతిపదార్థం: ఆ+కేశినిన్+చూచి= ఆ కేశినిని చూచి; ఈ+కుమారులు+ ఇద్దఱు= ఈ బిడ్డలు ఇరువురు; నా కొడుకునున్= నా పుత్రుడిని; కూఁతునున్+పోలిన= కూతురిని పోలి ఉండగా; వీరిని= ఈ బిడ్డలను; ఎత్తికొని= కౌగిలించుకొని; దుఃఖించితిన్= పరితపించాను; అని= అనిచెప్పి; తన్ను+ఏర్పడకుండన్+పలికి= తనను గుర్తించకుండ మాటాడి; దానికిన్= ఆ కేశినికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: ఆ కేశినిని చూచి 'ఈ బిడ్డలు నా బిడ్డలను పోలిఉండటంచేత నేను నా బిడ్డలను స్మరించి పరితపించాను. వీరిని ఎత్తుకొని లాలించినందుకు వేరుగా తలపవద్దు'- అని తనను గుర్తించటానికి వీలు కాకుండేటట్లుగా మాటాడి మరియు ఇట్లా చెప్పాడు.

క. 'నీ విట పలుమఱు వచ్చుచుఁ।
బోవుచు నున్కిఁ గని చిత్తముల నొండుగ నన్

భావింతు రితరజనములు ।

గావున రావలవ దింకఁ గార్యార్థినివై. 199

ప్రతిపదార్థం: నీవు+ఇట= నీవు ఇక్కడకు; పలుమఱు= చాలా సారులు; వచ్చుచున్+ పోవుచున్+ఉన్కిన్= వస్తూ, తిరిగిపోతూ, ఉండటం; కని= అరసి; ఇతర, జనములు= ఇతర ప్రజలు; చిత్తములన్= మనస్సులలో; ఒండుగన్= వేరేవిధంగా; నన్= నన్ను; భావింతురు= తలపోస్తారు; కావున= కాబట్టి; కార్య+అర్థినివి+ఐ= నీ పనిని నెరవేర్చు కొనటానికై; ఇంకన్= ఇక; రావలవదు= (నాకడకు) రావద్దు.

తాత్పర్యం: 'కేశినీ! ఇక నీవు ఏ పనిమీదనైనా నా దగ్గరకు రావద్దు. నీవు ఇచటికి పలుమారులు వస్తూ, పోతూ ఉంటే, చూచేవారు వారి మనస్సులలో నన్ను వేరేవిధంగా భావించవచ్చును సుమా!

వ. ఏము దేశాంతరంబున నుండివచ్చిన అతిథులము; నీకు మాతోడి దేమి?' యనినఁ గేశిని గ్రమ్మఱి వచ్చి, బాహుకు మార్గంబంతయు దమయంతికిం జెప్పిన, నది సంతసించి నిజజనని కిట్లనియె. 200

ప్రతిపదార్థం: ఏము= మేము; దేశాంతరంబుననుండి= వేరొక దేశంనుండి; వచ్చిన, అతిథులము= వచ్చిన ఆగంతుకులం; నీకు; మాతోడిది+ఏమి= మాతో ఉండే పనేమి?; అనినన్= అని చెప్పగా; క్రమ్మఱి వచ్చి= తిరిగివచ్చి; కేశిని; బాహుకు, మార్గంబు+అంతయున్= బాహుకుడి వైఖరినంతటిని; దమయంతికిన్+చెప్పిన; అది= ఆమె (దమయంతి); సంతసించి= ప్రీతిచెంది; నిజ, జననికిన్= తన తల్లికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: మేము వేరొకదేశంనుండి వచ్చిన అతిథులం. నీకు మాతో ఏమి పని? పొమ్మ'- అని బాహుకుడు కసరుకొనగా, కేశిని తిరిగివచ్చి దమయంతికి జరిగిన సంగతి వివరించి చెప్పింది. దమయంతి సంతోషించి తన తల్లికడ కేగి ఇట్లా చెప్పింది.

ఉ. 'సందియ మేల? సర్వగుణసంపదఁ జూడఁగ బాహుకుండు భూ వందితుఁడైన నైషధుఁ డవశ్యముఁ దా నగు; నా మనంబు నా నందముఁ బొందుచున్నది ఘనంబుగ; వాఁ డిట వచ్చువాఁడొ? యే నందుల కేఁగుదాననొ? రయంబున నాపని నిశ్చయింపుమా!' 201

ప్రతిపదార్థం: సందియము+ఏల= సందేహం ఎందుకు?; సర్వ, గుణ, సంపదన్= సకల లక్షణాల పెంపులో; చూడఁగన్= అరయగా; బాహుకుండు= బాహుకుడు; తాను; అవశ్యమున్= తప్పకుండ; భూవందితుఁడు+ఐన= భూలోక ప్రజలచేత నమస్కరించబడినవాడైన; నైషధుఁడు= నిషధరాజు; అగున్= అవును; నా మనంబు= నా మనస్సు; ఘనంబుగన్= గొప్పగా; ఆనందమున్= సంతోషాన్ని; పొందుచున్నది; వాఁడు+ఇట= ఆతడు ఇచటికి; వచ్చువాఁడొ= వచ్చువాడవునో?; ఏన్= నేను; అందులకు= అచటికి; ఏగుదాననొ= వెళ్ళేదానినో?; రయంబునన్= వేగంగా; ఆ పని= ఆ కర్తవ్యం; నిశ్చయింపుమా!= నిర్ణయించాలి సుమా!

తాత్పర్యం: 'ఇక సందేహించవలసిన అగత్యమే లేదు. సమస్త సద్గుణసంపదలో పరిశీలించిచూస్తే బాహుకుడు తప్పనిసరిగా భూజనులచేత నమస్కారాలు అందుకొనే నిషధేశ్వరుడైన నలుడే. నా మనస్సు మిగుల ఆనంద తన్మయమైనది. ఆతడు ఇక్కడికి రావటమా? నేను అతడి దగ్గరకు వెళ్ళటమా? సత్వరం ఈ కర్తవ్యాన్ని నిర్ణయించాలి సుమా!'

విశేషం: బాహుకుడు నలుడే అనే నిర్ణయం సులభ సాధ్యమైనదికాదు. దమయంతి పాత్రచిత్రణం మిక్కిలి హృదయంగమమైనది. (1) దమయంతి అతిలోకసౌందర్యవతి (2) సౌందర్యంతోపాటు దమయంతిలో సౌశీల్యం పెనగొనిఉన్నది. (3) సౌందర్య సౌశీల్యాలేకాక దమయంతికి గల తెలివితేటలు నిరుపమానాలు. ఆమె ముందుగానే మగడి ఓటమిని ఊహించి తనబిడ్డలను విదర్భకు పంపింది. పౌరులను వెంటబెట్టుకొని నలుడిని జూదంనుండి మరల్చటానికి యత్నించింది. తదుపరి నలుడితో వనవాసానికి పోవటం,

అరణ్యంలో ఆమె పడినపాట్లు ఆమె పాతివ్రత్యాన్ని చాటునట్టివి. (4) ఆమె ఇంగితజ్ఞానం అనన్యసామాన్యమైనట్టిది. నలుడిని కనుగొనటానికి ఆమె పన్నిన పన్నుగడ అళీక ద్వితీయ స్వయంవర కల్పనం. నలుడి హృదయాన్ని కరిగించి అతడిని ఉద్విగ్నుడిని చేయటానికై బ్రాహ్మణులచేత అనిపించిన ఎత్తిపొడుపు మాటలు. (5) బాహుకవేషధారి అయిన నలుడిని ఆమె గుర్తించిన విధానం ఆమె తెలివితేటలకు, జాగరూకతకు నిదర్శనాలు. బాహుకుడు సుస్పష్టంగా నలుడు కాడు. వార్ష్ణేయుడు ఆతడిని గుర్తించలేకపోయాడు. అతడికి ఒక్కసారి బాహుక సారథ్యాన్ని చూచినపుడు కొంచెం సందేహం కలిగింది. ఆతడు ఊగిసలాడాడే కాని స్థిరనిర్ణయానికి రాలేకపోయాడు. జీవలుడు బాహుకుడిని ద్విపాదజంతువుగానే పరిగణించాడు. ఇక దమయంతి అద్వితీయమేధ బాహుకుడి మాటున అణగిమణగిన నలుడి వ్యక్తిత్వాన్ని గుర్తించగలిగింది. మానవమాత్రుల చర్మచక్షువులు చేయలేని పరిశోధనలో దమయంతి మనోనేత్రం విజయం సాధించింది. (6) దమయంతి పరిశోధన సాంగోపాంగంగా ప్రస్తరించదగ్గది. 1. నలుడి మనస్సుకు వాడిబాణాలవలె నాటే మాటలు విని, పర్ణాదుడికి ఏకాంతంగా బాహుకుడు సమాధానం చెప్పక తప్పిందికాదు. 2. నూరు ఆమడలు ఒక దినంలో రథం నడపగల నేర్పు నలుడికి మాత్రమే ఉన్నది. సుదేవుడు పెట్టిన గడువులో నూరు ఆమడల దూరం రథాన్ని నడిపే బాహుకుడు అయోధ్యనుండి విదర్భ చేరాడుగదా!. 3. నలుడి రథనేమిఘోష దమయంతికి చిరపరిచితం, విదర్భాపురి ఋతుపర్ణుడి రథం చేరగానే దమయంతి నలుడిరథాన్ని గుర్తించగల్గింది. 4. నలపాకం సుప్రసిద్ధం. సంకల్ప మాత్రంచేత నిప్పు, నీరు కల్పించగల శక్తి నలుడికి తప్ప మానవమాత్రులు మరెవ్వరికిని ఉండజాలదు. (ఆ శక్తులు అగ్నివరుణాదులవరాలవలన నలుడికి లభించాయి.) ఆ విషయాన్ని కేశినిచేత దమయంతి రూఢి చేసికొన్నది. 5. నలుడు వండిన నంజుళ్ళ రుచి దమయంతికి అనుభవ ఆమ్రేడితం. 6. పుత్రైషణ జీవకోటికి సహజం. కేశినితోపాటు బిడ్డలను బాహుకుడి దగ్గరకు పుత్తెంచింది. బాహుకుడు వారిని కౌగలించుకొని ఆనందబాష్పతన్మయుడు అయ్యాడు. ఇన్ని పరీక్షలు చేసిన పిమ్మట కురూపి అయిన బాహుకుడే ఒకనాటి అతిలోకసౌందర్యనిధి అయిన

నలుడని దమయంతి నిశ్చయించింది. 7. చిట్టచివరకు బాహుకుడే స్వస్వరూపంతో దమయంతికి ప్రసన్నుడయ్యాడు. ఇక కథ కంచికి పోయింది.

వ. అనిన నది యప్పుడ భీము ననుమతంబున దమయంతియొద్దకు బాహుకు రావించిన. 202

ప్రతిపదార్థం: అనినన్= అని దమయంతి చెప్పగా; అది= దమయంతి తల్లి; అప్పుడు+అ; భీము+అనుమతంబునన్= భీముడియొక్క సమ్మతి చొప్పున; దమయంతి+ఒద్దకు= దమయంతి దగ్గరకు; బాహుకున్= బాహుకుడిని; రావించిన= రప్పించగా.

తాత్పర్యం: అని దమయంతి చెప్పగా విని ఆమెతల్లి భీముడి అనుమతిపొంది దమయంతి దగ్గరకే బాహుకుడిని రప్పించింది.

క. చనుదెంచి యందు దీనా।
నన నవిరళపంకమలిననతగాత్రఁ దప
స్విని నతికృశ దమయంతిం।
గనియె నలుం డుదితబాష్పకణకలిత ముఖిన్. 203

ప్రతిపదార్థం: చనుదెంచి= వచ్చి; అందు= అచట; దీన+ఆననన్= పరితాపం కల ముఖం కలదానిని; అవిరళ, పంక, మలిన, నత, గాత్రన్= ఎల్లప్పుడు తడిసిన దుమ్ముతో మాసి వంగిన దేహం కలదానిని; తపస్వినిన్= నియమాచరణం కలదానిని; అతి కృశన్= మిక్కిలి కృశించినదానిని; ఉదిత బాష్ప, కణ, కలిత, ముఖిన్= ఉద్భవించిన కన్నీటి బొట్టులతో కూడిన మొగం కలదానిని; దమయంతిన్= దమయంతిని; నలుండు= నలుడు; కనియెన్= చూచాడు.

తాత్పర్యం: నలుడు అచటికి చేరి దైన్యం ఉట్టిపడే ముఖం కలదీ, ఎల్లప్పుడు దుమ్ముతో మాసి క్రుంగినదేహం కలదీ, చూపరులకు జాలిగొలిపేదీ, చిక్కి కృశించినదీ, జారే కన్నీటిబొట్టులతో కూడిన మొగం కలదీ- ఐన దమయంతిని చూచాడు.

క. దమయంతి నలుని వికృతాం ।
గముఁ జూచియు నతని నన్యుఁగా వగవక నె
య్యమునను లజ్జను నతిసం ।
భ్రమమున వివశాత్మ యగుచుఁ బతి కిట్లనియెన్. 204

ప్రతిపదార్థం: దమయంతి; నలుని, వికృత+అంగమున్+చూచియున్= నలుడియొక్క వికారమైన దేహాన్ని చూచికూడా; అతనిన్= అతడిని; అన్యున్+కాన్= పరుడిగా; వగవక= చింతించక; నెయ్యమునను= స్నేహంతోనూ; లజ్జనున్= సిగ్గుతోనూ; అతి, సంభ్రమమునన్= మిక్కిలి తత్తరపాటుతో; వివశ+ఆత్మ+అగుచున్= వశం తప్పిన ఆత్మ కలది అవుతూ; పతికి= భర్తకు; ఇట్లు+అనియెన్= ఇట్లా చెప్పింది.

తాత్పర్యం: నలుడిదేహం వికారంగా కనిపించినప్పటికిని అతడిని పరుడిగా ఎంచక, స్నేహంతోనూ, సిగ్గుతోనూ, మిక్కుటమైన తత్తరపాటుతోనూ తనను తాను అదుపులో పెట్టుకొనలేకుండా భర్తతో ఇట్లా చెప్పింది.

వ. 'విజనంబైన విపినంబునందు నలసి నిద్రవోయినదాని నబల నతిసాధ్వి ననువ్రత నగ్నిసన్నిధిఁ బాణిగ్రహణవిధి లబ్ధ యైన దానిం బాసి నలునట్లు నిర్దయులై యరిగినవా రొరు లెవ్వరు లేరు. 205

ప్రతిపదార్థం: విజనంబు+ఐన= జనులు లేనట్టి; విపినంబునందున్= అడవిలో; అలసి, నిద్ర+పోయినదానిన్= బడలి నిద్రించిన దానిని; అబలన్= బలంలేని ఆడుదానిని; అతి సాధ్విన్= మిక్కిలి మంచినడవడి కలదానిని; అనువ్రతన్= సహధర్మచారిణిని; అగ్ని సన్నిధిన్= అగ్నిదేవుడి సమక్షంలో; పాణి, గ్రహణ, విధి, లబ్ధ+ఐన, దానిన్= శాస్త్రీయమైన వివాహపద్ధతిలో పొందబడినదానిని; నలు+అట్లు= నలుడివలె; పాసి= విడిచిపెట్టి; నిర్దయులు+ఐ= దయలేనివారై; అరిగినవారలు= వెళ్ళినవారు; ఒరులు= ఇతరులు; ఎవ్వరు, లేరు= ఎవరూ లేరు.

తాత్పర్యం: 'జనులు లేని అడవిలో అలసి నిదురపోయినదానిని, బలహీనురాలైన ఆడుదానిని, సహధర్మచారిణి అయి తనవెంట అడవికి వచ్చినదానిని, సౌమ్యమైన సత్ప్రవర్తన కలదానిని, అగ్నిసాక్షిగా శాస్త్రీయమైన పద్ధతిలో పెండ్లిచేసికొని చేపట్టినదానిని నలుడివలె కఠినాత్ములై విడిచిపెట్టి వెళ్ళినవారు ఇతరులు మరెవ్వరూ లేరు.

క. సురవరులఁ దొఱఁగి తన్నున్ ।
వరియించితి; నన్నుఁ బుత్త్రవతి నేలొకొ చె
చ్చెర విడిచె? నాతనికి ని ।
ష్కరుణున కే నేమి యెగ్గు గావించితినో? 206

ప్రతిపదార్థం: సురవరులన్= దేవతాశ్రేష్ఠులను; తొఱఁగి= విడిచి; తన్నున్= తననే; వరియించితి= భర్తగా ఎన్నుకొన్నాను; నన్నున్= నన్ను; పుత్త్రవతిన్= సంతానవతిని; ఏల+ఒకొ= ఎందుకో?; చెచ్చెర= శీఘ్రంగా; విడిచెన్= విడిచిపెట్టాడు; ఆతనికిన్= ఆ నలుడికి; నిష్కరుణునకున్= దయలేనివాడికి; ఏను= నేను; ఏమి+ఎగ్గు+కావించితినో= ఎటువంటి అపచారం చేశానో?

తాత్పర్యం: దేవతాశ్రేష్ఠులను విడిచిపెట్టి తననే భర్తగా ఎన్నుకొన్నానుకదా! అటువంటి నన్ను సంతానవతినైన దానిని, శీఘ్రంగా ఎందుకు విడిచిపెట్టినట్లు? నాపట్ల కనికరం లేకపోవటానికి ఆతడికి నేను ఎటువంటి అపచారం చేశానో?

విశేషం: అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యను విడువరాదు. పైగా సంతానవతి అయినభార్యను విడువరాదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. తాను సంతానవతి. ఒకవేళ తనపై ప్రేమ లేకున్నా బిడ్డలపై ప్రేమ ఉండాలికదా! కరుణ ఏమాత్రం లేనట్టి కఠినాత్ముడుగా ఉండటానికి నలుడికి తాను ఎటువంటి అపచారం చేయలేదే? ధర్మశాస్త్రాన్నిబట్టిగాని, మానవ సహజమైన పుత్రప్రేమనుబట్టిగాని కేవలం నిర్దోషిని అయిన తన్ను విడవటం నలుడికి భావ్యం కాదని దమయంతి విన్నవించింది. ఇంతవరకు దమయంతి బాహుకుడితో మధ్యమపురుషలో కాక నలుడినిగురించి ప్రథమపురుషలోనే మాటాడింది. అంతవరకు బాహుకుడే

నలుడని దమయంతికి నిశ్చితాభిప్రాయం ఏర్పడినను, ప్రత్యక్షంగా తాను బాహుకుడిని చూచింది ఇప్పుడే. కావుననే ప్రథమపురుషలో భాషించి అతడి హావభావాలు పసికట్టి, అతడే నలుడని మళ్ళీ నిశ్చయించుకొనటానికి అట్లా మాటాడింది. ఇక తానే నలుడ నని ప్రకటించుకొన వలసిన వంతు బాహుకుడిదే. ఇచట దమయంతి బాహుకుడితో ఎదురుబొదురుగా నిలిచి మాటాడుతున్నా నలుడిగురించి ప్రథమపురుషలో ప్రస్తావించటం గమనించదగిన అంశం.

వ. 'నిన్ను విడువ నోడకుండు' మని పలికిన యప్పలుకు లేల మఱచెనో?' యని శోకతప్తంబైన తన హృదయంబు దడుపుచున్నయదియునుంబోలె బాష్పధారలం గుచమండలంబు దడుపుచునున్న దమయంతిం జూచి శోకాకులుండై నలుం డిట్లనియె. 207

ప్రతిపదార్థం: నిన్నున్= నిన్ను; విడువను= విడిచిపెట్టను; ఓడకుండుము= భయ పడకుము; అని= అంటూ; పలికిన= చెప్పిన; ఆ+పలుకులు= ఆ మాటలు; ఏల= ఎందుకు; మఱచెనో= విస్మరించాడో; అని; శోక, తప్తంబు+ఐన= దుఃఖంచేత తపించ బడిందైన; తన హృదయంబు= తన గుండెను; తడుపుచున్న+అదియున్+పోలె= చల్లార్చుతున్నదా అనేటట్లుగా బాష్పధారలన్= కన్నీటి ప్రవాహములతో; కుచమండలంబు= స్తనములున్న ప్రదేశమును- ఎదను; తడుపుచున్+ఉన్న= తడపుతున్న; దమయంతిన్+చూచి; శోక+ఆకులుండు+ఐ= దుఃఖంచేత పరితపించినవాడై; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: 'నిన్ను నేను ఎన్నటికిని విడిచిపెట్టజాలను, భయపడకుము' అని నాతో పలుమారులు చెప్పాడుకదా! ఆ మాటలు ఎట్లా మరిచిపోయాడో?' - అని ఆమె కన్నీరు కారుస్తూ విలపించింది. ఆమె కార్చిన కన్నీరు స్తనాలపై స్రవించటం చూస్తే, దుఃఖంతో కాగిన హృదయాన్ని ఆమె కన్నీటితో తడుపుతున్నట్లు ఉండింది. ఆ దృశ్యాన్ని చూచి నలుడు దమయంతితో ఇట్లా అన్నాడు.

తే. 'కలిసమావిష్టమతి నయి కష్టవృత్తి।
నట్టి యిడుమలఁ బడితి నే; నవి మదీయ
తపము బలమున, నీ దుఃఖదాహమునను।
నష్టమై పోయెఁ; గలి యిప్డు నన్ను విడిచె. 208

ప్రతిపదార్థం: కలి, సమావిష్ట, మతిన్+అయి= కలిపురుషుడిచేత ఆవహించ బడిన బుద్ధి కలవాడినయి; కష్టవృత్తిన్= కష్టాలు అనుభవించి (కఠిన ప్రవర్తనతో); అట్టి+ ఇడుమలన్= అట్టి కష్టాలను; ఏను= నేను; పడితిన్= అనుభవించాను; అవి= అవన్నియు (అంటే ఆ అగచాట్లు అన్నీ); మదీయ, తపము, బలమునన్= నా తపస్సుయొక్క మహిమవలన; నీ, దుఃఖదాహమునను= నీ పరితాపమనే నిప్పువలనను; నష్టము+ఐ, పోయెన్= నశించిపోయాయి; కలి= కలిపురుషుడు; ఇప్డు= ఇపుడు; నన్నున్; విడిచెన్= నన్ను విడిచిపోయాడు.

తాత్పర్యం: 'నన్ను కలి ఆవహించటంచేత ఆ విధంగా బుద్ధి చెడి అన్ని కష్టాలపాలు కావలసివచ్చింది. ఆ అగచాట్లు అన్నీ నా తపశ్శక్తిచేత, నీ పరితాపమనే నిప్పువలన తొలగిపోయాయి. ఇపుడు నన్ను కలి విడిచిపోయాడు.

విశేషం: (1) దమయంతి ప్రథమపురుషలో భాషించినను బాహుకుడు ఉత్తమపురుషలో మాటాడటం గమనించదగిన అంశం. బాహుకుడికి తాను నలుడనని తనకు తెలిసినట్టి అంశమే కదా! ఆతడికి ఎట్టి సంశయం లేదు. (2) నలోపాఖ్యానంలోని కథా శిల్పంలోని ముఖ్యాంశాలు రెండు. 1. నలుడు కలి సమావిష్టుడై చెందిన చిత్త విభ్రమం, పడినపాట్లు. 2. దమయంతి పరితాపం- సారాంశాలుగా ఇక్కడ ప్రస్తావించబడ్డాయి.

వ. ఏ నిందులకు నీ తదర్థంబ వచ్చితి; నది యట్లుండె; నన్ను ననురక్తు ననువ్రతుఁ దలంపక యన్యాపేక్షంబున స్స్వయంవరంబు రచియించుట యిది కులస్త్రీధర్మంబు గాదు; రాజుల నెల్ల నీ స్వయంవరంబునకు రావించుటం జేసి కాదే ఋతుపర్ణుండు వచ్చె' ననిన వెఱచి కృతాంజలియై దమయంతి యిట్లనియె. 209

ప్రతిపదార్థం: ఏను= నేను; ఇందులకు= ఇచటికి; నీ, తద్+అర్థంబు+అ= నీ సంగతి అరయటం కోసమే (నీకోసమే); వచ్చితిన్= అరుదెంచాను; అది+అట్లుండెె= ఆ విషయం అట్లా ఉండుగాక!; నన్నున్= నన్ను; అనురక్తున్= నీపట్ల ప్రేమకలవాడిని; అనువ్రతున్= సహధర్మచారిని; తలంపక= స్మరించక; అన్య+అపేక్షన్= ఇతరుడిపై కోరికచేత; పునః+స్వయంవరంబు= తిరిగి స్వయంవరం; రచియించుట= కూర్చటం; ఇది= ఈ కార్యం; కులస్త్రీ, ధర్మంబు+కాదు= కులపాలికకు సరైన న్యాయం కాదు; రాజులన్+ ఎల్లన్= రాజులను అందరిని; నీ స్వయంవరంబునకున్; రావించుటన్+చేసి, కాదె= నీ యొక్క స్వయంవరానికి రప్పించటంచేతనే కదా!; ఋతుపర్ణుండు= ఋతుపర్ణుడు; వచ్చెన్; అనినన్= వచ్చినారు అని చెప్పగా; వెఱచి= భయపడి; కృత+అంజలి+ఐ= ఘటించిన నమస్కృతి కలదై (అంటే నమస్కరించినదై); దమయంతి; ఇట్లు+అనియెన్= దమయంతి ఈ విధంగా చెప్పింది.

తాత్పర్యం: నేను ఇచటికి వచ్చింది నీ విషయం తెలిసికొనటంకొరకే. అది అట్లా ఉండనీ! నేను నీమీద ప్రేమకలవాడిని. సహధర్మచారిని. నన్ను విస్మరించి పరపురుషవాంఛతో తిరిగి స్వయంవరం ఏర్పరచటం కులస్త్రీకి ధర్మం కాదు. రాజులందరిని ఆహ్వానించటంచేతనే కదా ఋతుపర్ణమహారాజు ఇప్పుడు విదర్భకు విచ్చేసింది' - అని నలుడు అధిక్షేపించగా, భయపడి దమయంతి నలుడికి నమస్కరించి ఇట్లా పలికింది.

తే. 'నిన్ను రోయంగ విప్రులు నెమ్మి నరిగి।
పలికి రెల్లచో నాచేతఁ బనుపఁబడియ;
యందుఁ బర్ణాదుఁ డను విప్రుఁ డయ్యయోధ్య।
కేఁగి ప్రతివచనంబుల నెఱిఁగె నిన్ను. 210

ప్రతిపదార్థం: నిన్ను, రోయంగన్= నిన్ను వెదకటానికై; నాచేతన్= నాచేత; పనుపన్+ పడి+అ= పంపబడియే; విప్రులు= బ్రాహ్మణులు; నెమ్మిన్+ అరిగి= ప్రీతితో వెళ్ళి; ఎల్లచోన్= అన్నిచోట్ల; పలికిరి= మాటాడినారు; అందున్= వారిలో; పర్ణాదుఁడు+అను విప్రుఁడు= పర్ణాదుడనే బ్రాహ్మణుడు; ఆ+అయోధ్యకు= ఆ అయోధ్యా నగరానికి; ఏఁగి= వెళ్ళి; ప్రతివచనంబులన్= ఎదురుమాటలవలన; నిన్నున్+ఎఱిఁగెన్= నిన్ను తెలిసికొనగలిగాడు.

తాత్పర్యం: 'నిన్ను వెదకటానికై ప్రీతితో నేను పంపగా పలుతావులకు వెళ్ళి పలికిన విప్రులలో, అయోధ్యకు వెళ్ళిన పర్ణాదుడనే బ్రాహ్మణుడు నీ ప్రత్యుత్తరంవలన నిన్ను గుర్తించాడు.

వ. ఆ పర్ణాదువలన ని న్నెఱింగినదానినై ని న్నిట రావించునుపాయంబు దలంచి, యెల్లి దమయంతీ ద్వితీయ స్వయంవరం బగు నని ఋతుపర్ణునందుఁ బ్రకాశింప సుదేవుం డను బ్రాహ్మణుం బుత్తెంచితి. 211

ప్రతిపదార్థం: ఆ, పర్ణాదువలనన్= ఆ పర్ణాదుడనే బ్రాహ్మణుడి వలన; నిన్ను+ఎఱింగిన, దానను+ఐ= నిన్ను తెలిసికొన్న దాననై; నిన్ను+ఇట, రావించు= నిన్ను ఇచటికి రప్పించే; ఉపాయంబు+తలంచి= వెరవును ఆలోచించి; ఎల్లి= రేపు; దమయంతీ ద్వితీయ, స్వయంవరంబు+అగును+ అని= దమయంతికి రెండవ స్వయంవరం జరుగుతుందని; ఋతు పర్ణునందున్= ఒక్క ఋతుపర్ణుడికి మాత్రమే; ప్రకాశింపన్= తెలియజేయటానికై; సుదేవుండు+అను, బ్రాహ్మణున్= సుదేవు డనే విప్రుడిని; పుత్తెంచితిన్= నియోగించాను.

తాత్పర్యం: ఆ పర్ణాదుడివలన నీ ఉనికిపట్టులు తెలిసికొన్నదాననై నిన్ను ఇచటికి రప్పించే ఉపాయం ఆలోచించి, రేపే దమయంతి రెండవ స్వయంవరం అని ఒక్క ఋతుపర్ణుడికి మాత్రమే వార్తను తెలియజేయటానికి సుదేవుడనే బ్రాహ్మణుడిని నియోగించాను.

క. నరవరుఁడు నలుఁడు గా కె।
వ్వరు శతయోజనము లొక్కవాసరమున వ

త్తురు నరు లొరు? లని దీనిం ।

బరికింపఁగఁ గడఁగి యిట్ల వంచితి నధిపా! 212

ప్రతిపదార్థం: అధిపా!= ఓ మహారాజా!; నరవరుఁడు= నరులలో శ్రేష్ఠుడైన; నలుఁడు+కాక= నలుడు తప్ప; ఎవ్వరు; నరులు+ఒరులు= ఇతరమనుజులు; ఎవ్వరు; శతయోజనములు= నూరు ఆమడలు; ఒక్క వాసరమునన్= ఒక్కదినంలో; వత్తురు?= రాగలరు?; అని= అని తలపోసి; దీనిన్+పరికింపఁ గన్= ఈ విషయాన్ని చూడాలని; కడఁగి= పూని; ఇట్లు+అ= ఈ విధంగా; పంచితిన్= ఏర్పాటు చేశాను. (పంపినాను)

తాత్పర్యం: ఓ నలమహారాజా! నరులలో శ్రేష్ఠుడైన నలమహారాజు తప్ప మానవ మాత్రులలో మరెవ్వరు ఒక్కదినంలో నూరుఆమడలమేర దూరంనుండి రాగలరు? అని ఆలోచించి ఈ విధమైన ఏర్పాటు చేశాను.

ఉ. ఏ నతిపాపభావమును నెగ్గుఁ దలంపక యుండునట్లుగా
నానతవైరి! నీ యడుగు లంటఁగ నోపుదు; నట్టిదైన న
న్నీ నలినాప్తుఁ డీ యనలుఁ డీ మృగలాంఛనుఁ డీ సురోత్తముల్
జాను సెడంగ నీ క్షణమ చంపరె! కోపపరీతచిత్తులై.' 213

ప్రతిపదార్థం: ఆనతవైరి!= మిక్కిలి నమస్కరించిన శత్రువులు కలవాడా!; (శత్రువులను జయించినవాడా!;) ఏను= నేను; అతి, పాప, భావమును= మిక్కిలి చెడు ఆలోచనను; ఎగ్గున్= అపచారాన్ని; తలంపక+ఉండునట్లుగాన్= ఆలోచించకుండ ఉండేటట్లుగా; నీ అడుగులు= నీ పాదాలు; అంటఁగన్+ ఓపుదున్= ముట్టగలను- అంటే పాదాలంటి ప్రమాణం చేయగలను; అట్టిది+ఐన= అటువంటిదే అయితే- అంటే నీ పట్ల పాపభావాన్ని అపచారాన్ని తలపోసి ఉన్నట్లయితే; నన్ను; ఈ+నలిన+ ఆప్తుఁడు= ఈ సూర్యుడు; ఈ+అనలుఁడు= ఈ అగ్నిదేవుడు; ఈ; మృగలాంఛనుఁడు= జింకను గుర్తుగాగల ఈ చంద్రుడు; ఈ, సుర+ఉత్తముల్= ఈ దిక్పాలకులు; కోప, పరీత, చిత్తులు+ఐ= ఆగ్రహంతో నిండిన మనస్సులు కలవారై;

జాను+చెడంగన్= శోభ అంతరించేటట్లు; ఈ క్షణము+అ= ఈ క్షణంలోనే; చంపరె!= చంపివేయరా!

తాత్పర్యం: శత్రువులను జయించిన మహావీరుడవైన ఓ నలమహారాజా! నేను ఎటువంటి పాపపు తలంపునుగాని, అపచారాన్నిగాని నీపట్ల తలపోయలేదని నీ పాదాల సాక్షిగా ప్రమాణం చేయగలను. నాలో అటువంటి చెడుతలంపే ఉన్నట్లయితే- ఈ సూర్యుడు, ఈ అగ్నిహోత్రుడు, ఈ చంద్రుడు, ఈ దిక్పాలకులు ఆగ్రహించి, నన్ను ఈ క్షణంలోనే శోభావిహీనగాచేసి చంపివేయరా?'

విశేషం: నలిన+ఆప్తుడు= పద్మాలకు మిత్రుడు, సూర్యుడు. ఇది కవిసమయం. మృగలాంఛనుడు= లేడిని చిహ్నంగా కలవాడు, చంద్రుడు. చంద్రుడిలో గల కళంకం పెక్కు ఉత్ప్రేక్షలకు దారితీసింది. దీన్నికూడ కవిసమయంగా ఎన్నవచ్చును. 'జాను' శబ్దానికి సరైన అర్థం ఇంకను తరచవలసి ఉన్నది. శబ్దరత్నాకరంలో జాను= అందము, సౌందర్యము అనే అర్థాలు ఉన్నాయి. సూర్యరాయాంధ్ర నిఘంటువులో పెక్కు అర్థాలు ఉన్నాయి. 1. సొగసు, సౌందర్యము 2. శోభ 3. విధము 4. విణ.మంజులము, స్పష్టము, అధికము మున్నగు అర్థాలు ఉన్నాయి. నా అభిప్రాయంలో జాను- అంటే పుట్టుకతో వచ్చే తీరుతీయాలు, సహజ సారళ్యమనే అర్థం చెప్పవచ్చు.

వ. అనుచున్న యవసరంబున నఖిలభూతాంతర్గతుం డయిన వాయు భట్టారకుం డెల్లవారలు విన నాకాశంబున నుండి నలున కిట్లనియె.214

ప్రతిపదార్థం: అనుచున్న+ అవసరంబునన్= అని చెప్తున్న సమయంలో; అఖిల, భూత+అంతర్గతుండు+అయిన= సమస్తమైన భూతాలలో లోపల ఉండే వాడయిన; వాయుభట్టారకుండు= పవిత్రుడైన వాయుదేవుడు; ఎల్లవారలు= అందరు; వినన్= ఆలకిస్తుండగా; ఆకాశంబుననుండి= గగనంనుండి; నలునకు; ఇట్లు+అనియెన్= నలుడికి ఈ విధంగా చెప్పాడు.

తాత్పర్యం: అని అంటున్న సమయంలో సమస్తభూతాలలోపల ఉండే వాయుభట్టారకుడు అందరూ వినేటట్లు ఆకాశంనుండి నలుడికి ఇట్లా చాటి చెప్పాడు.

విశేషం: ఈ సృష్టిలోని సమస్త వస్తువులు భూతములే. చేతనాచేతన వస్తువులు సజీవ నిర్జీవ పదార్థాలకు సమష్టి వ్యపదేశం భూతశబ్దం. భట్టారక శబ్దం పూజ్యవాచకం. వాయుభట్టారకుడు అంటే పూజ్యుడైన వాయుదేవుడు అని అర్థం.

చ. 'అమలచరిత్ర నిట్లు దమయంతిఁ బతివ్రతఁ బల్కుదే? నృపో
త్తమ! విను దీనియందు విదితంబగు శీలవిధిన్ సుధాంశుఁడున్
గమలహితుండు నేను నయి కాచితి మొక్కట మూఁడువర్షముల్;
గొమరుగ దీనిఁ జేకొనుము కోమలి నీ కనురక్త' నావుడున్. 215

ప్రతిపదార్థం: నృప+ఉత్తమ!= రాజులలో శ్రేష్ఠుడవైన ఓ నలమహారాజా!; అమల, చరిత్రన్= స్వచ్ఛమైన నడవడి కలిగినదానిని; దమయంతిన్= దమయంతిని; పతివ్రతన్= భర్తయెడ భక్తి కలిగినదానిని; ఇట్లు= ఈ రీతిగా; పల్కుదే= ఆక్షేపిస్తావా?; విను= ఆకర్ణించుము; దీని+అందున్= ఈమెపట్ల; విదితంబు+అగు= తెలియవచ్చిన; శీలవిధిన్= మంచినడవడి తీరుతీయాలవలన; సుధాంశుఁడున్= అమృత కిరణుడైన చంద్రుడున్నూ; కమలహితుండు= పద్మమిత్రుడైన సూర్యుడున్నూ; ఏనున్+అయి= నేనున్నూకలిసి; ఒక్కటన్= కలిసికట్టుగా; మూఁడు, వర్షముల్= మూడు సంవత్సరాలు; కాచితిమి= కాపాడాము; కొమరుగన్= ఒప్పుగ; దీనిన్= ఈమెను (దమయంతిని); చేకొనుము= పరిగ్రహించుము; కోమలి= ఈ సుకుమారి; నీకు+అనురక్త= నీ పట్ల అనురాగం కలిగినట్టిది; నావుడున్= అని పలుకగా.

తాత్పర్యం: 'రాజులలో ఉత్తముడివైన ఓ నలమహారాజా! ఈ దమయంతి నిర్మలమైన ప్రవర్తన కలది. పతివ్రతాశిరోమణి. ఈమెపట్ల అభివ్యక్తమైన సౌశీల్యంచొప్పున సూర్యుడు, చంద్రుడు, నేను కలిసికట్టుగా ఈమెను మూడు సంవత్సరాలు కాపాడాము. ఈమెను నీవు మనసార పరిగ్రహించుము. ఈ కోమలి నీపట్ల అనురాగం కలిగి ఉన్నది'- అని వాయుదేవుడు చాటిచెప్పగా.

క. కురిసె మరుద్వచనానం ।
తరమున సురపుష్పవృష్టి; దడయక మ్రోసెన్
సురదుందుభి నాదంబులు; ।
గరము ప్రసన్నుఁడయి వీచె గంధ వహుండున్. 216

ప్రతిపదార్థం: మరుత్+వచన+అనంతరమునన్= వాయుదేవుడి మాటల పిమ్మట; సురపుష్పవృష్టి= దేవతల పూలవాన; కురిసెన్= కురిసింది; సురదుందుభి నాదంబులు= దేవదుందుభుల నాదాలు; తడయక= వెనువెంటనే; మ్రోసెన్= మ్రోగాయి; గంధవహుండున్= వాయువుకూడా; కరము= మిక్కిలి; ప్రసన్నుఁడు+అయి= సంప్రీతుడై; వీచెన్= వీచాడు.

తాత్పర్యం: వాయుదేవుడి ప్రకటన పిమ్మట దేవతలు పూలవాన కురిపించారు. వెనువెంటనే దేవదుందుభులు మ్రోగాయి. ప్రసన్నుడై వాయుదేవుడు దివ్యసౌరభం వెదజల్లుతూ వీచాడు.

విశేషం: పురాణేతిహాసాలలో దేవతల పుష్పవృష్టి కురియటం, దేవదుందుభులు మ్రోగటం, ఆధునికులు కొందరు నిరర్థకాలైన అతిశయోక్తులుగా నిరసించవచ్చును. వీటిని వాచ్యార్థంలో స్వీకరించే కువిమర్శకులమాట లకేమిగాని, సహృదయులు వీటి ఆంతర్యం ఎరిగి స్వారస్యం ఆస్వాదించగలరు. నలదమయంతుల పునస్సమాగమాన్ని వర్ణించటానికి, పరిమితమైన అర్థాలు గల పదాలకు శక్తిచాలదు. దేవదుందుభుల మ్రోతలు, దేవతల పుష్పవృష్టులు, సుప్రసన్నుడై వాయుదేవుడు వెదజల్లే దివ్యపరిమళాలు సహృదయులకు అనుభవైకవేద్యాలు. అల మతివిస్తరేణ. అలంకారోక్తి కవీంద్రుల మాతృభాష.

వ. ఇ ట్లెల్ల వారికి నాశ్చర్యంబుగా వాయుదేవుండు దన్నెఱింగించి, దమయంతి పతివ్రతాగుణంబులును బతియందుల యకృత్రిమానురాగం బునుం జెప్పిన విని నలుండు పరమ ప్రమోద పరిపూర్ణ హృదయుండై తత్క్షణంబ కర్కోటకుం దలంచి వాని యిచ్చిన పుట్టంబు పైఁబెట్టుకొని నిజరూపంబు దాల్చిన. 217

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; ఎల్లవారికిన్= అందరికి; ఆశ్చర్యంబుగాన్= అచ్చెరువు కొలుపేటట్లుగా; వాయుదేవుండు; తన్ను+ఎఱింగించి= తనను తెలిపి; దమయంతి, పతివ్రతాగుణంబులును= దమయంతియొక్క పతివ్రతా లక్షణాలను; పతి+అందుల= భర్తపట్లగల; అకృత్రిమ+అనురాగంబునున్= సహజమైన, (స్వచ్ఛమైన) ప్రేమను; చెప్పిన; విని= తెలుపగా, ఆకర్ణించి; నలుండు= నలుడు; పరమ, ప్రమోద, పరిపూర్ణ, హృదయుండు+ఐ= మిక్కుటమైన సంతోషంతో నిండిన హృదయం కలవాడై; తద్, క్షణంబు+అ= ఆ క్షణంలోనే; కర్కోటకున్+తలంచి= కర్కోటకుడిని స్మరించి; వాని+ఇచ్చిన, పుట్టంబు= ఆతడు ఇచ్చిన వస్త్రం; పైన్+పెట్టుకొని= పైన ధరించి; నిజ, రూపంబు= అసలు ఆకారాన్ని; తాల్చినన్= ధరించగా.

తాత్పర్యం: ఇట్లా ఎల్లవారికి అచ్చెరువు కలిగేటట్లుగా వాయుదేవుడు తనను తెలియజేసికొని, దమయంతి పతివ్రతా లక్షణాలను, ఆమెకు భర్తపట్ల కల స్వచ్ఛమైన అనురాగాన్ని చెప్పగా విని, నలుడు మిక్కుటమైన సంతోషంతో నిండిన మనస్సుకలవాడై, ఆ క్షణంలోనే కర్కోటకుడిని స్మరించి, ఆతడు ఇచ్చిన వస్త్రాన్ని మీద ధరించగా, నలుడికి తన తొల్లిటి ఆకారం ఏర్పడింది.

విశేషం: కథానిర్వహణం అద్భుతంగా ఉండాలని నాటకలక్షణం. నలదమయంతి కథలో సహజమైన నాటకీయత రాణిస్తూ ఉంటే నన్నయ దానిని పోషించాడు. 'ఎల్లవారికి నాశ్చర్యంబుగా'- అని నన్నయ ధ్వనింపజేసి ప్రసన్న కథాకలితార్థయుక్తిని ప్రదర్శించాడు.

నలుండు నిజరూపంబుతో దమయంతిం గూడుట (సం. 3-75-27)

ఉ. ఆయతబాహుఁ దప్తకనకాంచితవర్ణు మనోజరూపు నిం
ద్రాయితు సూర్యతేజు నిషధప్రభు నన్నలుఁ జూచి పద్మప
త్త్రాయతనేత్ర యప్డు దమయంతి గరంబు ముదంబు నొంది ల
క్ష్మీయుత యయ్యె బంధులకు మిత్త్రులకున్ హృదయప్రియంబుగన్. 231

ప్రతిపదార్థం: ఆయత బాహున్= పొడుగుపాటి చేతులు కలవాడిని, అంటే ఆజానుబాహుడైన వాడిని; తప్త, కనక+అంచిత, వర్ణున్= అగ్నిలో శుద్ధి చేయబడిన మేలిమిబంగారాన్ని పోలిన రంగు కలవాడిని; మనోజ రూపున్ (మనస్+జ+రూపున్)= మన్మథుడివంటి ఆకృతి కలవాడిని; ఇంద్రాయితున్= ఇంద్రుడితో సమానమైనవాడిని; సూర్యతేజున్= సూర్యుడివంటి తేజస్సు కలవాడిని; నిషధప్రభున్= నిషధరాజైన; ఆ+నలున్= ఆ నలుడిని; చూచి= దర్శించి; పద్మ, పత్ర, ఆయత, నేత్ర= తామరపువ్వురేకులవలె విశాలమైన కన్నులు కలదైన; దమయంతి; అప్డు= అపుడు; కరంబు= మిక్కిలి; ముదంబున్+ఒంది= సంతోషాన్ని పొంది; బంధులకున్= చుట్టాలకు; మిత్త్రులకున్= నెచ్చెలులకు; హృదయప్రియంబుగన్= మనస్సుకు ఆనందం కలిగేటట్లు; లక్ష్మీయుత+అయ్యెన్= శోభతో కూడినట్టిదయింది.

తాత్పర్యం: ఆజానుబాహుడు, మేలిమి బంగారు మేనిచాయకలవాడు, మన్మథరూపుడు, ఇంద్రసమానుడు, సూర్యుడి తేజంవంటి తేజం కలవాడు, నిషధప్రభువు అయిన నలుడు సహజస్వరూపంతో కనిపించగా చూచి, తామరపువ్వురేకుల వంటి విశాలమైన కన్నులు కల దమయంతి సంతోషం పొంగిపొరలి శోభిల్లింది. ఆమె చుట్టాలు, మిత్రులు సంతోషించారు.

వ. ఇట్లు సంగతులైన యయ్యిరువురకు విరహ పరితాపంబు తోడన శరీరమలినత్వంబు వాసెఁ, బర స్పరానురాగంబు తోడన విభూషణశ్రీవిశేష విలేపన యోగంబులు విస్తరిల్లె; నంత నంతయు విని భీముండు జాతసస్య యైన వసుధ తోయసంప్రాప్తి నాప్యాయిత యైన ట్లజ్ఞాతచర్యుం డైన తన పతిం బడసి పరమసంతుష్టహృదయయై చంద్రుతోఁగూడిన రోహిణి యుంబోలెఁబతిం గూడి యొప్పుచున్న దమయంతిం జూచి సంతసిల్లి, తన పురంబునం దష్టశోభనంబులు దేవగృహంబులయందు విశేషపూజలు సేయించె; నట్టి మహోత్సవం బెఱింగి ఋతుపర్ణుండు నలునొద్దకు వచ్చి 'నీవు నిఖిలలోక పూజ్యుండ వయ్యును నాయొద్ద బాహుకుం డనంగాఁ

బ్రచ్ఛన్న వృత్తి నున్న నిన్ను నెఱుంగక నీచకర్మంబులయందు నియోగించితి;
దీని క్షమియించునది' యని నలుచేత సత్కృతుండై
యశ్వహృదయోపదేశంబు గొని యయోధ్యకుం జనియె; నిట నలుండును
విదర్భాపురంబున నొక్కమాసంబు నివాసంబు సేసి, విదర్భేశ్వరు వీడ్కొని
దమయంతి నంద పెట్టి, యొక్క రథంబును బదియా ఱేనుంగులును, నేఁ
బది గుఱ్ఱంబులు, నాఱునూఱు కాల్బలంబులుఁ దనకుఁ దోడుగా
నిషధపురంబున కరిగి, పుష్కరుం గని యిట్లనియె. 219

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; సంగతులు+ఐన= కలిసిన; ఆ+ ఇరువురకున్= ఆ ఇద్దరికి; విరహతాపంబుతోడన్+అ= వియోగబాధతోపాటు గానే; శరీర, మలిన త్వంబు= దేహంలోని మురికి; పాసెన్= విడిచింది; పరస్పర+అనురాగంబు తోడన్+అ= ఇరువురిమధ్య ఏర్పడిన ప్రేమతో పాటుగా; విభూషణ, శ్రీ, విశేష, విలేపన, యోగంబులు= ఆభరణ శోభ, అసాధారణమైన మైపూతల చేరిక; విస్తరిల్లెన్= ఒన కూడాయి; అంతన్= అంతట; అంతయు విని= సర్వం తెలిసికొని; భీముండు= భీమరాజు; జాత, సస్య+ఐన= అంకురించిన పంటమొక్కలు కలదైన; వసుధ= భూమి; తోయ, సంప్రాప్తిన్= వర్షపాతంవలన; ఆప్యాయిత+ఐనట్లు= తనివి చెందినదైనట్లు; అజ్ఞాత చర్యుండు+ఐన= తెలియబడనట్టి ప్రవర్తనకలవాడయిన, అంటే అజ్ఞాత వాసంలోఉన్న; తన, పతిన్+పడసి= తన భర్తను పొంది; పరమ, సంతుష్ట, హృదయ+ఐ= మిక్కుటమైన తృప్తిని పొందిన హృదయం కలదై; చంద్రుతోన్+కూడిన, రోహిణియున్+ పోలెన్= చంద్రుడితో సంయోగం చెందిన రోహిణీనక్షత్రం వలె; పతిన్+కూడి= భర్తతో కలిసి; ఒప్పుచున్న= శోభిస్తున్న; దమయంతిన్+చూచి= దమయంతిని చూచి; సంతసిల్లి= సంతోషించి; తన పురంబు నందు= తన నగరంలో; అష్టశోభనం బులు= ఎనిమిది విధాలయిన అలంకారాలు; దేవ, గృహంబుల+ అందున్= కోవెలలలో; విశేషపూజలు= ప్రత్యేకమైన అర్చనలు; చేయించెన్= జరిపించాడు; అట్టి= ఆ విధమైన; మహా+ఉత్సవంబు+ఎఱింగి= గొప్ప పండుగ జరగటం

తెలిసికొని; ఋతుపర్ణుండు;నలు+ఒద్దకు= నలుడి దగ్గరకు; వచ్చి= ఏతెంచి; నీవు; నిఖిలలోక, పూజ్యుండవు+అయ్యును= నీవు అన్ని లోకాలచేత అర్చించదగినట్టివాడివే అయినప్పటికి; నా+ఒద్ద= నా దగ్గర; బాహుకుండు+ అనంగాన్= బాహుకుడు అనే పేరుమీద; ప్రచ్ఛన్న వృత్తిన్+ఉన్న= తెలియబడనిరీతిలో ఉండటంచేత; నిన్నున్+ ఎఱుంగక= నీవు ఎవరో తెలియక; నీచకర్మంబుల+అందున్= అల్పకార్యాలలో; నియోగించితి= నియుక్తుడిగా చేశాను; దీని= నేను చేసినపనిని; క్షమియించునది= మన్నించేది; అని= అనిచెప్పి; నలుచేత; సత్, కృతుండు+ఐ= నలుడిచే గౌరవించ బడినవాడై; అశ్వ, హృదయ+ ఉపదేశంబు+కొని= అశ్వహృదయం అనే విద్యను ఉపదేశం పొంది; అయోధ్యకున్+చనియెన్= అయోధ్యాపురికి వెళ్ళాడు; ఇట= ఇచట; నలుండును; విదర్భాపురంబునన్= విదర్భరాజధానిలో; ఒక్కమాసంబు= ఒకనెల; నివాసంబు+చేసి; విదర్భ+ఈశ్వరు= విదర్భప్రభు వైన భీమరాజును; భీముడను పేరుగల ప్రభువును, వీడ్కొని= వెళ్ళటానికి అనుమతిని గైకొని; దమయంతిన్= దమయంతిని; అందు+అ= అచటనే; పెట్టి= ఉంచి; ఒక్క రథంబును= ఒకతేరును; పదియాఱు+ ఏనుంగులును= పదారు ఏనుగులును; ఏఁబది గుఱ్ఱంబులును= ఏబయి అశ్వాలును; ఆఱునూఱు కాల్బలంబులున్= ఆరువందలమంది భటులును; తనకున్+ తోడుగాన్= తనకు సాయంగా; నిషధ, పురంబునకు+అరిగి= నిషధదేశం రాజధానికి వెళ్ళి; పుష్కరున్+ కని= పుష్కరుడిని చూచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.

తాత్పర్యం: ఈ విధంగా నలదమయంతులకు తిరిగి సమాగమం జరిగింది. ఇరువురికి విరహతాపం పోయింది. అట్లే ఇరువురికి శరీరమాలిన్యం తొలగింది. ఇరువురికి పరస్పరానురాగం ఏర్పడింది. అట్లే ఆభరణశోభ, చందనాదులతో మైపూతలు ఇరువురికి సంక్రమించాయి. పంటమొక్కలు మొలిచిన భూమి వానకురిసినప్పుడు సంతృప్తి చెందినట్లు, అజ్ఞాతవాసంలో ఉన్న భర్తను పొంది, పరమానందభరితురాలై చంద్రునితో కూడిన రోహిణివలె పతితో కలిసి

శోభిల్లుతున్న దమయంతిని చూచి, తండ్రి భీమరాజు తన నగరాన అష్టశోభనాలు, దేవళాలలో ప్రత్యేకపూజలు జరిపించాడు. అటువంటి పండుగ వేడుక తెలిసికొని ఋతుపర్ణమహారాజు నలుడి దగ్గరకు వచ్చి 'నీవు జగత్పరిపూజ్యుడివి. కాని, నాదగ్గర బాహుకుడనే పేరుతో అజ్ఞాతవాసంలో ఉన్నావు కావున, నీవు ఎవరో తెలియక నిన్ను అల్పకార్యాలకు నియోగించాను. నన్ను క్షమించుము' - అని ప్రార్థించాడు. తదుపరి ఋతుపర్ణుడు నలుడిచేత సత్కరించబడినవాడై, అతడి దగ్గరనుండి అశ్వహృదయం అనే విద్యను పొంది అయోధ్యకు వెళ్ళాడు. నలుడు విదర్భరాజధానిలో ఒకనెల నివసించి దమయంతిని అచటనే ఉంచి, తాను ఒక రథం, పదారు ఏనుగులు, ఏబదిగుర్రాలు, ఆరువందలమంది కాలిభటులు తోడుగా నిషధదేశరాజధానికి వెళ్ళి పుష్కరుడిని కలిసికొని ఇట్లా చెప్పాడు.

విశేషం: (1) అష్టశోభనములు= ఎనిమిది విధాలైన అలంకారాలు. 1. నీళ్ళు చల్లటం 2. పందిళ్ళు వేయించటం 3. తోరణాలు కట్టించటం 4. చిత్రాలు వ్రాయించటం 5. జెండాలు నెలకొల్పటం 6. పూర్ణకుంభాలు ప్రతిష్ఠించటం 7. ధూపదీపారాధనలు ఏర్పరచటం 8. నృత్యగీతవాద్యాలు ఏర్పరచటం. (2) ఇరువురికి విరహతాపంతోపాటు శరీర మలినత్వం తొలగింది- అనటం, పరస్పరాభరణాదిక ప్రాప్తి అనురాగంతోపాటూ ఏర్పడటం- అనేచోట సహోక్తి అలంకారం. చంద్రుడితోకూడిన రోహిణి ఉపమానం. నలునితో గూడిన దమయంతి ఉపమేయం. అలంకారం: ఉపమ. జాతసస్య అయిన వసుధ ఉపమానం, నలుడిని పొందిన దమయంతి ఉపమేయం. అలంకారం: ఉపమ.

క. 'దమయంతి రోయిగా జూ।
దము నీతో నాడఁ గడఁగెదను, ధరణీరా
జ్యము నీవు నాకు రోయిడు,।
మమరఁగ జూదంబు నీకు నభిమతమేనిన్. 220

ప్రతిపదార్థం: జూదంబు, నీకున్+అభిమతము+ఏనిన్= జూదం నీకు ఇష్టమైతే; దమయంతి, రోయిగా= దమయంతిని ధనంగా (పణంగా); జూదము; నీతోన్= నీతోడ; ఆడన్+కడఁగెదను= ఆడటానికి పూనుతాను; ధరణీ, రాజ్యమున్= భూరాజ్యాన్ని; ఈవు= నీవు; నాకు; రోయి+ఇడు= ధనం (పణం) గా ఒడ్డుము.

తాత్పర్యం: 'ఓ పుష్కర మహారాజా! నీకు జూదమాడటం ఇష్టమైతే నేను దమయంతిని పణంగా పెట్టి నీతో జూద మాడటానికి సిద్ధంగా ఉన్నాను. నీవు భూరాజ్యాన్ని పణంగా ఒడ్డి నాతో జూదమాడటానికి సంసిద్ధుడవు కమ్ము.

మత్తకోకిల.

వీరభోజ్యము సుమ్ము రాజ్యము వింటె? నీవును నేను దు
ర్వారవృత్తి రథంబు లెక్కి యవంధ్యవిక్రమ మేర్పడన్
భూరివీరరణం బొనర్తము; పోర నోర్చినవాఁడ యి
ద్ధారుణీతలరాజ్యసంపదఁ దాల్చు వీరగుణోన్నతిన్. 221

ప్రతిపదార్థం: రాజ్యము= ప్రభుత్వానికి లోబడినదేశం; వీర, భోజ్యము, సుమ్ము= వీరులచేత అనుభవించదగింది కదా!; వింటె= (అని) వినిఉంటివే!; నీవును, నేను; దుర్వారవృత్తిన్= నీవూ, నేనూ అప్రతిహతశౌర్యంతో; రథంబులు+ఎక్కి= తేరులపై నిల్చి; అవంధ్య, విక్రమము+ఏర్పడన్= వ్యర్థం కానట్టి పరాక్రమం విలసిల్లగా; భూరి, వీర, రణంబు+ఒనర్తము= గొప్పదైన వీరయుద్ధం చేద్దాము; పోరన్+ఓర్చినవాఁడు+అ= యుద్ధంలో గెలిచినవాడే; వీర, గుణ+ఉన్నతిన్= శౌర్యంయొక్క పెంపుచేత (అంటే పరాక్రమాతిశయంచేత); ఈ+ధారుణీ, తల, రాజ్య, సంపదన్= ఈ భూస్థలిపైగల ప్రభుత్వమనే ఐశ్వర్యాన్ని; తాల్చున్= ధరిస్తాడు.

తాత్పర్యం: రాజ్యాన్ని అనుభవించవలసింది వీరులే సుమా! అనే సుభాషితం విన్నావుకదా! కాబట్టి నీవూ నేనూ రథాలను అధివసించి వ్యర్థంగాని పరాక్రమంతో గొప్ప వీరయుద్ధం సల్పుదాం; రమ్ము; యుద్ధంలో గెలిచినవాడే ఈ సమస్త భూరాజ్యాన్ని వీరపురుషుడుగా ఏలుకొంటాడు!

విశేషం: వృత్తలక్షణానికి ఆర. 1.46 విశేషాంశం చూడండి.

వ. ఈ రెంటిలో నీ కెయ్యది యిష్టంబు దానిన కడంగు' మనినం, బుష్కరుండు రణంబునందుఁ బరాజితుండు గావున నలుం దొల్లియు జూదంబున నొడిచిన వాఁడై, యింకను నొడిచి దమయంతిం జేకొని కృతార్థుండ నగుదు నని సంతసిల్లి, 'యేనోటు వడితినేని నఖిలమహీరాజ్యంబు నీయది; నీ వోటువడితేనిదమయంతి నాయది' యని పలికి యొడ్డి నలుతో జూద మాడి యోటువడిన. 222

ప్రతిపదార్థం: ఈ రెంటిలోన్= ఈ రెండింటిలో (అంటే జూదమాడటంలో, యుద్ధం చేయటంలో); నీకు+ఎయ్యది, ఇష్టంబు= నీకు ఏది సమ్మతమో; దానిన్+అ, కడంగుము= దానికే పూనుకొనుము; అనినన్= అని అడుగగా; పుష్కరుండు; రణంబునందున్= యుద్ధంలో; పరాజితుండు= ఓడిపోయిన వాడు; కావున= కాబట్టి; తొల్లియు= మునుపు; జూదంబునన్= జూదంలో; నలున్= నలుడిని; ఒడిచినవాఁడు+ఐ= గెలిచినవాడై; ఇంకను= మరియు; ఒడిచి= గెలిచి; దమయంతిన్= దమయంతిని; చేకొని= పరిగ్రహించి; కృత+అర్థుండను= చరితార్థుడిని; అగుదును+అని= కాగలనని; సంతసిల్లి= సంతోషించి; ఏను= నేను; ఓటుపడితిన్+ఏనిన్= ఓడిపోయినట్లయితే; అఖిల, మహీరాజ్యంబు= సమస్తభూమి ప్రభుత్వం; నీ+అది= నీది; నీవు+ఓటువడితి+ఏని= నీవు ఓడిపోయి నట్లయితే; దమయంతి; నా+అది= దమయంతి నాకు దక్కుతుంది; అని, పలికి= అని చెప్పి; ఒడ్డి= పణం నిర్ణయించి; నలుడితో= నలుడితో; జూదము+ఆడి; ఓటువడినన్= ఓడిపోగా.

తాత్పర్యం: 'జూదమాడటం, యుద్ధంచేయటం ఈ రెంటిలో నీకు ఏది ఇష్టమో దానికే నీవు పూనుకొనుము' అని నలుడు పుష్కరుడిని అడిగాడు. లోగడ పుష్కరుడు నలుడిచేతిలో యుద్ధంలో ఓడినవాడు; జూదంలో నలుడిని ఓడించినవాడు. అందుచేత పుష్కరుడికి నలుడితో జూదమాడి దమయంతిని గెలుచుకొనాలనే ఆశ అంకురించింది. అంత, పుష్కరుడు నలుడితో 'మనం తిరిగి జూదమాడుదాము; నీవు గెలిస్తే ఈ సమస్త భూరాజ్యం నీదే; నేను నెగ్గితే దమయంతి నాది'- అని పణం నిర్ణయించుకొని ఇరువురూ జూదమాడారు. అందులో పుష్కరుడు ఓడిపోయాడు.

క. ఘనముగ జంబూద్వీపం।
బునఁ గలవా రెల్ల నెఱుఁగఁ బుష్కరుచేతం
గొనియెఁ బునర్ద్యూతంబున।
ననఘుఁడు నలుఁ డఖిలరాజ్య మత్యున్నతితోన్. 223

ప్రతిపదార్థం: జంబూ, ద్వీపంబునన్, కలవారు+ఎల్లన్= జంబూద్వీపంలో ఉండే జనులందరు; ఘనముగన్= గొప్పగా; ఎఱుఁగన్= తెలిసికొనేటట్లు; అనఘుఁడు= పాపరహితుడైన; నలుఁడు; పునర్+ద్యూతంబునన్= తిరిగి ఆడిన జూదంలో; పుష్కరుచేతన్= పుష్కరుడి నుండి; అఖిల రాజ్యము= సర్వరాజ్యాన్ని; అతి+ఉన్నతితోన్= మిక్కిలి ఔన్నత్యంతో; కొనియెన్= పరిగ్రహించాడు.

తాత్పర్యం: జంబూద్వీపంలోని ప్రజలందరికి తెలిసేటట్లుగా పుణ్యశీలుడైన నలుడు పుష్కరుడితో రెండవసారి జూదమాడి గెలిచి, సమస్తరాజ్యాన్ని మిక్కిలి గొప్పగా పరిగ్రహించాడు.

వ. ఇట్లు జూదంబునఁ బుష్కరు నోడించి సకల మహీరాజ్యంబును జేకొని నలుండు వాని కిట్లనియె. 224

ప్రతిపదార్థం: ఇట్లు= ఈ విధంగా; జూదంబునన్= జూదంలో; పుష్కరున్+ఓడించి; సకల, మహీరాజ్యంబును= సమస్తభూమండల ప్రభుత్వాన్ని; చేకొని= పరిగ్రహించి; నలుండు; వానికిన్= పుష్కరుడితో; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

తాత్పర్యం: ఈ విధంగా జూదంలో పుష్కరుడిని గెలిచి, సమస్త భూరాజ్యాన్ని పరిగ్రహించిన నలుడు అతడితో ఇట్లా అన్నాడు.

క. 'కలిసంప్రాప్తుఁడనై కడు ।
బలమఱి నీ చేతఁ దొల్లి బలవద్ద్యూత
చ్ఛలజితుఁడ నైతి; నది నీ ।
బల మని గర్వింప వలదు బలవంతుఁడవై. 225

ప్రతిపదార్థం: కలి, సంప్రాప్తుఁడను+ఐ= కలి పురుషుడిచేత ఆవహించబడిన వాడినై; కడు= మిక్కిలి; బలము+అఱి= శక్తి నశించి; నీ చేతన్= నీచేత; తొల్లి= మునుపు; బలవత్+ద్యూత+ఛల, జితుఁడను+ఐతిన్= బలవంతంగా ఆడవలసివచ్చిన జూదంలో మోసంచేత జయించబడ్డాను; అది= అటువంటి నాఓటమి; నీ, బలము+అని= నీ శక్తి అని; బలవంతుఁడవు+ఐ= బలం కలవాడివయి; గర్వింపవలదు= విర్రవీగవద్దు.

తాత్పర్యం: 'మునుపు నేను కలిచేత ఆవహించబడినవాడినై, బలం నశించి, నీచేత బలవంతపు జూదంలో ఓడిపోయాను. అటువంటి నా ఓటమి నీ బలంవలన లభించిన విజయంగా భావించవద్దు; అది నీ బలమనుకొని గర్వంతో విర్రవీగవద్దు.

వ. నీవు నా పితృవ్యపుత్త్రుండవు; ని న్నేద్దియుం జేయనోపఁ బో' మ్మని పుష్కరుని విడిచిపుచ్చి పుష్కలంబయిన రాజ్యంబుతో నలుం డున్నంత. 226

ప్రతిపదార్థం: నీవు; నా పితృవ్యపుత్త్రుండవు= నా పినతండ్రి కుమారుడవు; నిన్ను+ ఏద్దియున్+ చేయన్+ఓపన్= నిన్నేమీ చేయలేను; పొమ్ము= వెళ్ళుము; అని= అని చెప్పి; పుష్కరున్= పుష్కరుడిని; విడిచిపుచ్చి= వదలిపెట్టి; పుష్కలంబు+అయిన= సమృద్ధమైన; రాజ్యంబుతో; నలుండు= నలుడు; ఉన్నంతన్= ఉండగా.

తాత్పర్యం: నీవు నా పినతండ్రి కుమారుడవు. కావున నీకు ఎటువంటి కీడును నేను చేయలేను. పొమ్మ'- అని నలుడు పుష్కరుడిని విడిచిపెట్టి సర్వసమృద్ధమైన రాజ్యాన్ని ఏలుతుండగా.

క. భీమ ప్రస్థాపిత యయి ।
కోమలి దమయంతి పుత్త్రకులుఁ దానును ల
క్ష్మీ మహిమ వెలుఁగుచుండఁగఁ ।
దామరసదళాక్షి వచ్చెఁ దనపతికడకున్. 227

ప్రతిపదార్థం: భీమ, ప్రస్థాపిత+అయి= భీముడిచే బాగుగా ప్రయాణము చేయించ బడినదై (పంపబడినదై); కోమలి, దమయంతి= సుకుమారి అయిన దమయంతి; పుత్త్రకులున్= బిడ్డలు; తానును; లక్ష్మీమహిమ= ఐశ్వర్య ప్రభావం; వెలుఁగుచు+ఉండఁగన్= శోభిల్లుతుండగా; తనపతి కడకున్= తన భర్త అయిన నలుడి దగ్గరకు; తామరస, దళ+అక్షి= పద్మంయొక్క రేకులవలె విశాలాలైన కన్నులు కల దమయంతి; వచ్చెన్= వచ్చింది.

తాత్పర్యం: తండ్రి అయిన భీమమహారాజుచేత పంపబడి, తామరపువ్వు రేకులవంటి కన్నులు కల దమయంతి బిడ్డలు తాను కలిసి, ఐశ్వర్య మహిమతో శోభిల్లుతూ భర్త అయిన నలుడి దగ్గరకు వచ్చింది.

వ. అట్లు తన మనోవల్లభయైన దమయంతింగూడి నలుండు విధి విహితా నేకాచరితమఖుండైశతమఖువిలాసంబుతో సకలరత్నయుతం బైన రత్నగర్భాధిరాజ్యంబు సేసెఁ; గావున నక్షజితుండు నైతి నని వగవవలదు; నీవును దైవమానుషసంపన్నుండ వయి శత్రువుల జయించి సకలమహీ సామ్రాజ్యంబు వడయుదు' వని బృహదశ్వుండు ధర్మరాజునకు నక్షహృదయం బుపదేశించి. 228

ప్రతిపదార్థం: అట్లు= ఆ విధంగా; తన, మనోవల్లభ+ఐన= తన హృదయేశ్వరి అయిన; దమయంతిన్+కూడి= దమయంతితో కలిసి; నలుండు; విధి, విహిత+అనేక+ఆచరిత, మఖుండు+ఐ= శాస్త్రవిధులలో నిర్దేశించబడిన విధంగా ఆచరించబడిన పెక్కుయజ్ఞాలు కలవాడై (అంటే శాస్త్రీయపద్ధతులలో పెక్కుయాగాలు చేసి); శతమఖు, విలాసంబుతోన్= దేవేంద్రుడి వైభవంతో;

సకల, రత్నయుతంబు+ఐన= సమస్త రత్నాలతో కూడి ఉన్న; రత్నగర్భా+ అధిరాజ్యంబు+చేసెన్= భూమండలాన్ని గొప్పగా పరిపాలించాడు: కావునన్; అక్ష, జితుండను+ఐతిని+అని= పాచికలచేత (జూదంలో) ఓడిపోయాను అని; వగవ, వలదు= శోకించకుము; నీవును= నీవుకూడ; దైవ, మానుష, సంపన్నుం డవు+అయి= దైవసాహాయ్యం, మానుషప్రయత్నంతో కూడిన సంపద కలవాడివయి; శత్రువులన్= విరోధుల; జయించి; సకల, మహీ, సామ్రాజ్యంబు= సమస్త భూసామ్రాజ్యం; పడయుదువు= పొందగలవు; అని= అని చెప్పి; బృహదశ్వుండు= బృహదశ్వ మహాముని; ధర్మరాజునకున్; అక్షహృదయంబు= అక్షహృదయం అనే విద్య; ఉపదేశించి= ప్రబోధించి.

తాత్పర్యం: ఆ విధంగా నలుడు తన హృదయేశ్వరి దమయంతిని కూడి శాస్త్రాలలో నిర్దేశించబడినట్లు పెక్కు యాగాలు చేశాడు. దేవేంద్రవైభవంతో సకల రత్నయుతమైన భూమండలాన్ని గొప్పగా పరిపాలించాడు. కాబట్టి, పాచికలలో ఓడిపోయానని దుఃఖించవద్దు. నీవును దైవసాహాయ్యం, పురుషప్రయత్నం మేళవించిన అభ్యుదయంతో విరోధులను జయించి, సకలభూమండల సామ్రాజ్యాన్ని ఏలగలవు- అని బృహదశ్వుడు ధర్మరాజుకు అక్షహృదయం అనే విద్యను ఉపదేశించాడు.

* * *